సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 12+6 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 8

శుక్రవారం 31-3-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'



ప్రాంతాన్నిబట్టి డైట్ ప్లాన్

'అన్నం మానండి. సాయంత్రం చపాతీ తినండి. ఉదయం మిల్లెట్స్ బెటర్..' మధుమేహంతో బాధపడే వారికి ఇలాంటి సూచనలు, సలహాలు సాధారణమే. అయితే వేర్వేరు ఆహారపు అలవాట్లు ఉన్న రోగులందరికీ ఒకే రకమైన డైట్ చార్ట్ సరైనదేనా? అంటే కానేకాదు అంటున్నారు వైద్య నిపుణులు. ప్రాంతాల వారీగా డైట్ చార్ట్ రూపొందించాల్సిందే అంటున్నారు. - IIలో



కస్టమైజ్డ్ డైట్ ప్లాన్

ప్రాంతాన్ని బట్టి ప్లాన్

మధుమేహ రోగులకు కస్టమైజ్డ్ డైట్ ప్లాన్ ఉండాలంటున్న నిపుణులు | ఒకే రకమైన డైట్ చార్ట్ సరికాదని స్పష్టీకరణ | ప్రాంతాల వారీగా ఆహార అలవాట్లు, జీవనశైలి పరిగణనలోకి.. | ట్రాన్స్‌కల్చరల్ డయాబెటిస్ న్యూట్రిషన్ అల్గోరిథమ్ దిశగా అడుగులు | టైప్ 2 డయాబెటిస్, ప్రీడయాబెటిస్ లకు గొప్ప ఉపశమనం!

'అన్నం మానండి, సాయంత్రం చపాతీ తినండి, ఉదయం మిల్లెట్స్ బెటర్..'

మధుమేహంతో బాధపడే వారికి ఇలాంటి సూచనలు, సలహాలు సాధారణమే. అయితే వేర్వేరు ఆహారపు అలవాట్లు ఉన్న రోగులందరికీ ఒకే రకమైన డైట్ చార్ట్ సరైనదేనా? అంటే కానేకాదు అంటున్నారు వైద్య నిపుణులు. ప్రాంతాల వారీగా, జీవనశైలులకు అనుగుణంగా కస్టమైజ్ (కావలసిన విధంగా) డైట్ చార్ట్ రూపొందించాల్సిందే అంటున్నారు. దీని కోసం దేశవ్యాప్తంగా విస్తృత అధ్యయనానికి శ్రీకారం చుట్టారు. ఇందులో వేలాదిగా వైద్యులు, రోగులు భాగం పంచుకోనున్నారు.

సాక్షి, హైదరాబాద్: 'మన దేశపు ఆహారపు అలవాట్లలో ఉన్న విస్తృతమైన వ్యత్యాసాల కారణంగా, మధుమేహాన్ని నియంత్రించడానికి అందరికీ ఒకే రకంగా సరిపోయే డైట్ చార్ట్ లేదని తాజాగా పరిశోధకులు తేల్చారు. దీని ఫలితంగానే ట్రాన్స్‌కల్చరల్ డయాబెటిస్ న్యూట్రిషన్ అల్గోరిథం (టీడీఎన్ఏ) పుట్టింది..' అని చక్కెర వ్యాధి నిపుణులు డాక్టర్ ఒసామా హమ్దీ, పోషకాహార నిపుణులు డాక్టర్ ఇర్ఫాన్ షేక్ చెప్పారు. ఈ టీడీఎన్ఏపై అవగాహన కార్యక్రమాలకు రాష్ట్రంలో శ్రీకారం చుట్టిన సందర్భంగా వారు మాట్లాడుతూ.. టీడీఎన్ఏ అనేది టైప్ 2 డయాబెటిస్, ప్రీడయాబెటిస్‌లకు గొప్ప ఉపశమనంగా మారుతుందని వీరు పేర్కొన్నారు.

ప్రాంతాల వారీగా..

వివిధ ప్రాంతాల ప్రజల విభిన్న ఆహారపు అలవాట్లు, సంస్కృతీ సంప్రదాయాలను అధ్యయనం చేసి ఆయా ప్రాంతాల్లోని రోగుల్లో మధుమేహ నియంత్రణకు అవసరమైన ఆహారపు అలవాట్లను (ఆహార ప్రణాళిక) సూచించేదే టీడీఎన్ఏ. ఈ అల్గోరిథమ్‌ను రూపొందించడానికి, భారతదేశాన్ని ఉత్తర, దక్షిణ, పశ్చిమ, మధ్య, తూర్పు, ఈశాన్య జోన్లుగా విభజించారు. ఆయా ప్రాంతాల ఆహారపు అలవాట్లు పరిగణనలోకి తీసుకుని మధుమేహానికి పరిష్కారాలు అన్వేషించాలనేది ఈ విభజన ఉద్దేశం. ఉదాహరణకు.. కేరళలోని తక్కువ ఆదాయ వర్గాల్లో ఎక్కువగా కనిపించే మధుమేహానికి కారణం.. వీరు ఎక్కువ కార్బోహైడ్రేట్, తక్కువ ప్రోటీన్ తీసుకోవడమట. ఆ ప్రాంతంలో కాసావా (కర్ర పెండలం) ఎక్కువగా తీసుకుంటారు. ఈ కాసావా ప్రోటీన్ ద్వారా కాలేయంలో శరీరానికి తగ్గట్టుగా ఫిల్టర్ కావాలి. అయితే శరీరంలో ఉన్న తక్కువ స్థాయి ప్రోటీన్ల కారణంగా ఇది జరగడం లేదు. ఇది ప్యాంక్రియాస్ (క్లోమ గ్రంథి)లో కాల్షియం ఏర్పడటానికి, అంతిమంగా మధుమేహానికి దారి తీస్తోందని తేల్చారు. ఇలాంటి పలు అధ్యయన ఫలితాల నేపథ్యంలో ప్రాంతాల వారీ డైట్ చార్ట్ (టీడీఎన్ఏ) తయారీ ఆవశ్యకత ఏర్పడింది.

అందరూ చేయాల్సిందిదే..

చక్కెర వ్యాధి పెరగడానికి ప్రధాన కారణాల్లో.. ప్రోటీన్లతో పోలిస్తే కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవడం, ఫాస్ట్ ఫుడ్ అధిక వినియోగం వంటివి ఉన్నాయి. ఈ నేపథ్యంలో మధుమేహులు టీడీఎన్ఏ పాటించడంతో పాటు ఆహారాన్ని నిదానంగా తీసుకోవడం, అర్ధరాత్రి అత్యధిక కేలరీలతో కూడిన ఆహార వినియోగాన్ని తగ్గించడం, ఎక్కువగా ప్రాసెస్ చేసిన కార్బోహైడ్రేట్‌లను మానేయడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం లాంటివి తప్పకుండా చేయాలని వైద్యులు సూచిస్తున్నారు.

మధుమేహం విస్మృతి తెలంగాణలో ఎక్కువ

ఐసీఎంఆర్ (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్) నివేదిక ప్రకారం, గత మూడు దశాబ్దాలుగా దేశంలో మధుమేహంతో బాధపడుతున్న వారి సంఖ్య 150% పెరిగింది. ఇక తెలంగాణ రాష్ట్రంలో మధుమేహ వ్యాధిగ్రస్తుల విస్మృతి 16.6% కాగా, ముంబై (7.5%), చెన్నై (13.5%), బెంగళూరులో 11.7% మేర పెరుగుదల ఉంది. డయాబెటిస్ నియంత్రణలో లేకపోతే పెరిగిన గ్లూకోజ్ స్థాయిలు గుండె జబ్బులు, దృష్టి లోపం, మూత్రపిండాల రుగ్మతలు వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు కారణమవుతాయి. మధుమేహం నియంత్రణలో జీవనశైలిలో మార్పులదే కీలక పాత్ర. అలాగే ప్రత్యేకమైన పోషకాహార సప్లిమెంట్స్ కూడా చాలా అవసరం.

– డాక్టర్ ఇర్ఫాన్ షేక్, మెడికల్ అఫైర్స్ హెడ్, అబాట్ న్యూట్రిషన్

మన దగ్గర రైస్ వినియోగమే సమస్య



డయాబెటిస్ నియంత్రణలో డైట్ అత్యంత ప్రధాన పాత్ర పోషిస్తుంది. అంత మాత్రాన అందరికీ చపాతి/పుల్కా తినేయమని చెప్పేయడం కుదరదు. తరతరాలుగా, ప్రాంతాల వారీగా అనుసరిస్తున్న ఆహారపు అలవాట్లను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలి. ఉదాహరణకు మన దగ్గర రైస్ బాగా తీసుకుంటారు. సాధారణ అన్నం లాగే కాకుండా బిర్యానీ, పులిహోర తదితరాల రూపంలో కూడా రైస్ వినియోగం ఎక్కువగా ఉంటోంది. తద్వారా కార్బోహైడ్రేట్స్ ఎక్కువ అవుతున్నాయి. దీనిని తగ్గించడం/నియంత్రించడానికే డైట్ ప్లాన్‌ను ఇస్తుంటాం. ఉదాహరణకు అన్నం మానలేమనేవారికి పరిమాణం తగ్గించమని, రాత్రి పడుకునే ముందు తినే అలవాటున్నవారికి 7 గంటల కల్లా ముగించమని చెబుతుంటా. ఉదయం పూట ఎక్కువమంది ఇడ్లీ తీసుకుంటారు. కానీ మేం ఇడ్లీ, దోశ బదులు పెసరట్టు తినమంటాం. కాదు కూడదనే ఇడ్లీ ప్రియులకు.. ఇడ్లీ పిండిలో చిక్కుళ్లు, పెసలు, కేరట్ తురుము, రాజ్ మా గింజలు... వంటివి కలుపుకో మంటాం. తద్వారా కార్బ్స్ శాతాన్ని తగ్గించడం, ప్రోటీన్, ఫైబర్‌ని పెంచడానికి ప్రయత్నిస్తాం.

– డా.పద్మనాభ వర్మ, కన్సల్టెంట్ ఎండోక్రైనాలజిస్ట్, ఎస్ఎల్జీ హాస్పిటల్స్, హైదరాబాద్

నియంత్రణే ముఖ్యం..



మధుమేహులు దశాబ్దాలుగా కొనసాగిస్తూ వస్తున్న ఆహారపు అలవాట్లను మానుకుని ఆరోగ్యకరమైన ఆహారం వైపు మళ్లక తప్పదు. అయితే దీనికి కట్టుబడి ఉండే రేటు 38% కంటే తక్కువ. ఈ నేపథ్యంలో రోగుల జీవనశైలి, ఆహారపు అలవాట్ల చరిత్రకు అనుగుణంగా రూపొందించే ప్రత్యేకమైన ఆహార జాబితాయే టీడీఎన్ఏ. బరువు తగ్గడం, గ్లైసెమిక్ నియంత్రణ, నిర్వహణలో ఇది రోగికి తోడ్పడుతుంది

– డాక్టర్ ఒసామా హమ్దీ, మెడికల్ డైరెక్టర్ జోస్లిన్ డయాబెటిస్ సెంటర్

నిరసనలు, ముట్టడి ఇకపై కష్టమే!

కలెక్టర్ కార్యాలయాలకు ఇనుప ముళ్లకంచెలు.. మూడంచెల భద్రత

- జనవరి 5న మాస్టర్‌ప్లాన్‌కు వ్యతిరేకంగా కామారెడ్డి మున్సిపాలిటీలో విలీనమయ్యే గ్రామాల రైతులు తమ కుటుంబ సభ్యులతో సహా భారీ ఎత్తున తరలివచ్చి కలెక్టర్ కార్యాలయం వద్ద బైఠాయించారు. వారంతా కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించడంతో ఉద్రిక్తత ఏర్పడింది. పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట జరిగింది. ఈ ఘటనలో పలువురు గాయపడ్డారు.
- నిజామాబాద్ కలెక్టరేట్‌లో జనవరి 30న నందిపేట గ్రామ సర్పంచ్ సాంబారు వాణి, ఆమె భర్త తిరుపతితో కలసి ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేయగా, పోలీసులు అడ్డుకున్నారు. బిల్లులపై ఉప సర్పంచ్ సంతకాలు పెట్టడంలేదని, దీనితో రూ.2 కోట్లకుపైగా ఆగిపోయాయని వారు ఒంటిపై పెట్రోల్ పోసుకోవడం కలెక్టరేట్‌లో కలకలం రేపింది.
- ఫిబ్రవరి 13న జనగామ కలెక్టరేట్ భవనం పైకెక్కి నిమ్మల నర్సింగరావు, ఆయన భార్య ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించారు. జనగామ మండలం పసరమడ్లకు చెందిన ఈ దంపతులు.. తమ భూమిని తహసీల్దార్ ఇతరులకు అక్రమంగా పట్టా చేశారని ఆరోపిస్తూ ఈ ఘాతుకానికి ఒడిగట్టగా, పోలీసులు చాకచక్యంగా అడ్డుకున్నారు.

- ఇటీవల సంఘటనల నేపథ్యంలో ప్రభుత్వం నిర్ణయం
- కట్టుదిట్టమైన భద్రతలో సమీకృత కలెక్టరేట్ కార్యాలయాలు
- తెలంగాణ ఉద్యమ రోజులను గుర్తుచేస్తున్న ఇనుప కంచెలు

సాక్షిప్రతినిధి, వరంగల్: ఇలా రాష్ట్రవ్యాప్తంగా ఎదురైన సంఘటనలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయాలకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తోంది. తెలంగాణ ఏర్పాటు తర్వాత రాష్ట్రంలో రూ.1,581.62 కోట్లతో 26 కొత్త సమీకృత జిల్లా కలెక్టరేట్, కార్యాలయాల భవన సముదాయాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఈ మేరకు అన్ని కలెక్టరేట్‌లకు ఇంటెలిజెన్స్, స్పెషల్‌బ్రాంచి నివేదికల ఆధారంగా భద్రత చర్యలు చేపడుతున్నారు. ప్రధాన ద్వారం ఎదురుగా, ప్రహరీపైన, చుట్టూ ప్రత్యేక ఇనుప ముళ్లకంచెలను అధికారులు ఏర్పాటు చేస్తుండడంతో సమైక్యాంధ్రలో తెలంగాణ ఉద్యమం నాటి రోజులు గుర్తు చేస్తున్నారన్న చర్చ జరుగుతోంది. కార్యాలయంలోనూ మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు.

నిరసనలను అడ్డుకునేందుకేనా..?

ప్రభుత్వ విధానాలపై కొన్ని వర్గాల ప్రజలు, ప్రతిపక్షాల నుంచి విమర్శలు ఎదురవడం సర్వసాధారణం. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని మార్చుకోవాలనో, ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలనో, ఏకపక్షంగా ఉన్న ప్రభుత్వ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలనో బాధితులు కలెక్టరేట్ల ఎదుట నిరసన కార్యక్రమాలకు పాల్పడుతుంటారు. ఒక్కోసారి కలెక్టరేట్‌ను ముట్టడించి.. లోపలికి చొరబడి సమస్య తీవ్రతను చాటి చెప్పాలనుకుంటారు. దీంతో ఇలాంటి సంఘటనలకు చెక్ పెట్టేందుకు హనుమకొండ, జనగామలతో పాటు తెలంగాణ వ్యాప్తంగా ఎత్తయిన ప్రత్యేక ఇనుప కంచెలను నిర్మిస్తుండడం ప్రతిపక్షాలు, ఆందోళనకారుల్లో హాట్‌టాపిక్‌గా మారింది.



హనుమకొండ కలెక్టరేట్ ప్రహరీ చుట్టూ వేసిన ఇనుప కంచె

తొలిసారి అత్యధిక విద్యుత్ వినియోగం

గురువారం 15,497 మెగావాట్లు నమోదు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఏర్పాటు తర్వాత తొలిసారిగా రాష్ట్రంలో అత్యధిక విద్యుత్ వినియోగం జరిగినట్లు అధికారులు తెలిపారు. వ్యవసాయానికి పగటిపూట త్రీఫేజ్ వినియోగంపై ఆంక్షలు ఎత్తేయడం, ఉష్ణోగ్రతలు పెరగడం, గృహ, వాణిజ్య వాడకం పెరగడంతో గురువారం రాష్ట్రంలో గరిష్ట విద్యుత్ డిమాండ్ 15,497 మెగావాట్లుగా రికార్డు అయినట్లు విద్యుత్ శాఖ అధికారులు వివరించారు. మరో వైపు రబీ పంటలు కీలక దశకు చేరుకుంటుండంతో విద్యుత్‌కు డిమాండ్ పెరిగింది. రాష్ట్రంలో జనవరి 18వ తేదీ నుంచి 13 వేల మెగావాట్లకు తగ్గకుండా ఉన్న డిమాండ్.. ఫిబ్రవరి 10వ తేదీ నుంచి 14వేల మెగావాట్లకు చేరింది. మార్చి నెల 14వ తేదీకి 15,254 మెగావాట్ల అత్యధిక డిమాండ్ నమోదు కాగా.. గురువారం 15,497 మెగావాట్లకు చేరి అత్యధిక విద్యుత్ వినియోగం నమోదైంది. డిమాండ్ మేరకు విద్యుత్‌ను సరఫరా చేయడానికి జెన్‌కో థర్మల్/హైడల్ కేంద్రాల నుంచి 77 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను, సింగరేణి థర్మల్/ సోలార్ కేంద్రాల నుంచి 27 మిలియన్ యూనిట్లను తీసుకుంటున్నారు. మరో 145 మిలియన్ యూనిట్ల వరకు కేంద్ర విద్యుత్ సంస్థలు/ బహిరంగ విపణి నుంచి తీసుకుంటున్నారు. వినియోగంలో 30 శాతానికి పైగా వ్యవసాయ రంగం వాటా ఉండగా.. పారిశ్రామిక రంగంలో వినియోగం 20 మేర శాతం ఉంది.

క్లిక్ అయిన 'ఉమెన్ క్లినిక్'

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కొత్తగా ప్రవేశపెట్టిన ఉమెన్ స్పెషల్ క్లినిక్‌లు క్లిక్ అయ్యాయి. రాష్ట్రంలోని మహిళలంతా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో అమలు చేస్తున్న 'ఆరోగ్య మహిళ' కార్యక్రమానికి విశేషస్పందన లభిస్తోంది. ప్రతి మంగళవారం మహిళలకు మాత్రమే వైద్యపరీక్షలు జరిపేందుకు రాష్ట్రవ్యాప్తంగా వంద 'ఉమెన్ స్పెషల్ క్లినిక్స్'ను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. గత మూడు మంగళవారాల్లో మొత్తం 19 వేల మందికి పైగా మహిళలకు వైద్యపరీక్షలు జరిగాయి. 'మహిళ ఆరోగ్యం- ఇంటి సౌభాగ్యం'అనే లక్ష్యంతో ఈ వైద్యకేంద్రాల్లో మహిళలకు సంబంధించిన 8 ప్రధాన ఆరోగ్య సమస్యలకు పరీక్షలు చేసి, చికిత్స అందిస్తున్నారు. మహిళలు తీరిక లేకనో, భయం కారణంగానో, సరైన అవగాహన లేకనో, సొంతంగా ఆసుపత్రికి వెళ్లలేకనో, ఇతర కారణాలతోనో తమ అనారోగ్య సమస్యలను ఎవరికీ చెప్పుకోలేకపోవడతో వారి ఆరోగ్య సమస్యలు ముదిరి, పెద్ద వ్యాధులకు దారితీస్తున్నాయి. ఇలాంటివారికి 'ఆరోగ్య మహిళ' కార్యక్రమం కొండంత భరోసా ఇస్తోంది.

క్రమంగా పెరుగుతున్న ఆదరణ

ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా ఈ నెల 8న రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు కరీంనగర్‌లో ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత 14వ తేదీ నుంచి క్లినిక్‌లలో ఆరోగ్యపరీక్షలు ప్రారంభమయ్యాయి. మొదటివారం 4,793 మంది మహిళలు పరీక్షలు చేయించుకున్నారు. రెండోవారం 6,328 మంది మహిళలు క్లినిక్‌లకు వచ్చారు. ఓపీ 32 శాతం పెరిగింది. 28న 7,965 మందికి స్క్రీనింగ్ నిర్వహించారు. అంతకుముందు వారంతో పోల్చితే 26 శాతం మంది అధికంగా రికార్డుస్థాయిలో క్లినిక్‌లకు వచ్చారు. మొదటివారం 2,723 నమూనాలు, రెండోవారం 2,792, మూడో వారం 4,727 నమూనాలను సేకరించి తెలంగాణ డయాగ్నోస్టిక్స్‌కు పంపారు. ఫలితాలు 24 గంటల్లోనే సంబంధిత మహిళలకు అందుతున్నాయి.

సద్వినియోగం చేసుకోవాలి: మంత్రి హరీశ్

మహిళల సంపూర్ణ ఆరోగ్యం కోసం అమలు చేస్తున్న 'ఆరోగ్య మహిళ'ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు కోరారు. మహిళలు ప్రధానంగా ఎదుర్కొంటున్న 8 రకాల ఆరోగ్య సమస్యలను గుర్తించి వైద్యం అందిస్తున్నామని చెప్పారు.

ఇప్పటివరకు 19 వేల మందికిపైగా స్క్రీనింగ్

- 28న రికార్డు స్థాయిలో 7,965 మందికి పరీక్షలు
- 100 'ఉమెన్ స్పెషల్ క్లినిక్'ల్లో పరీక్షలు.. ప్రతి మంగళవారం నిర్వహిస్తున్న సర్కారు



ఈ నెల 28న స్క్రీనింగ్ వివరాలు

ఓపీ: 7,965

రొమ్ము కేన్సర్ స్క్రీనింగ్	:	5,425
గర్భాశయ ముఖద్వార కేన్సర్ స్క్రీనింగ్	:	1,463
నోటి కేన్సర్ పరీక్షలు	:	5,423
మూత్రకోశ ఇన్ఫెక్షన్లు	:	654
సూక్ష్మ పోషక లోపాలు	:	1,735
థైరాయిడ్ ప్రొఫైల్స్	:	1,682
విటమిన్ డీ పరీక్షలు	:	1,128
సీబీపీ	:	2,982
పై ఆసుపత్రికి రెఫర్	:	603

మళ్లీ 'స్ట్రీట్ కార్నర్ మీటింగ్స్' షురూ!

- మేలో రాష్ట్రంలోని అన్ని 'పోలింగ్ బూత్'లలో నిర్వహణకు బీజేపీ రెడీ

సాక్షి, హైదరాబాద్: 'స్ట్రీట్ కార్నర్ మీటింగ్స్'కు మళ్లీ బీజేపీ సంసిద్ధమవుతోంది. గత నెల 10వ తేదీ నుంచి నెలాఖరు వరకు నిర్వహించిన తొలివిడత స్ట్రీట్ కార్నర్ భేటీలతో మంచి ఫలితాలు వచ్చాయని భావిస్తోంది. రాష్ట్రంలో పోలింగ్ బూత్‌స్థాయి వరకు 'కమలం పువ్వు గుర్తు'ను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, క్షేత్రస్థాయి వరకు కేడర్‌ను గుర్తించేందుకు స్ట్రీట్‌కార్నర్ మీటింగ్స్ దోహదపడ్డాయని జాతీయ నాయకత్వం సైతం గుర్తించింది. ఈ నేపథ్యంలో మే నెలలో దాదాపు 15 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పోలింగ్‌బూత్ స్థాయిలలో ఈ మీటింగ్స్ పూర్తిచేయాలని రాష్ట్ర నాయకత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో దాదాపు 34 వేల పోలింగ్‌బూత్‌లకు గాను 2-3 పోలింగ్ బూత్‌లను కలిపి ఒక్కో శక్తి కేంద్రాన్ని (మొత్తం 11 వేలకు పైగా శక్తి కేంద్రాలు) ఇదివరకే పార్టీ ఏర్పాటు చేసింది.



ఒక్కో బూత్ పరిధిలోని ఒక్కో పేజీలోని ఓటర్లకు ఒక 'పన్నా ప్రముఖ్'ను కూడా నియమించి, క్షేత్రస్థాయి వరకు ఆకట్టుకునే ప్రయత్నాలు బీజేపీ ముమ్మరం చేసింది.

తొలి స్ట్రీట్‌కార్నర్ మీటింగ్స్ సక్సెస్...

ఇందులో భాగంగా గత నెల నిర్వహించిన స్ట్రీట్‌కార్నర్ మీటింగ్స్‌లో 11 వేల శక్తికేంద్రాలకు గాను 8 వేల శక్తికేంద్రాల్లో పూర్తిస్థాయిలో సమావేశాలు నిర్వహించారు. బీజేపీకి రాజకీయంగా కీలకమైన రానున్న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో... స్ట్రీట్‌కార్నర్ మీటింగ్స్ ద్వారా కిందిస్థాయి వరకు కేడర్‌ను చైతన్యవంతులను చేయడం, పోలింగ్‌బూత్ స్థాయి వరకు పార్టీ యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకోవడంపై దృష్టి పెట్టారు. కేంద్రంలో మోదీ ఆధ్వర్యంలో అమలుచేస్తున్న వివిధ పథకాలు-వాటి ద్వారా వివిధ వర్గాల ప్రజలకు అందుతున్న ప్రయోజనాలు, కేసీఆర్ సర్కార్ వైఫల్యాలు, హామీల అమల్లో వెనకడుగు, తదితరాలను ఎత్తిచూపేందుకు కూడా ఈ మీటింగ్స్‌ను విస్తృతంగా ఉపయోగించుకున్నారు. దీంతో పాటు రాష్ట్రస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు నాయకులు, కార్యకర్తలను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేశారు.

ములుగు మోడల్‌తో మంచిఫలితాలు...

ఫిబ్రవరిలో నిర్వహించిన ఈ మీటింగ్స్‌లలో 'ములుగు మోడల్'ద్వారా మంచి ఫలితాలు వచ్చినట్టుగా నాయకత్వం అంచనా వేస్తోంది. ములుగు నియోజకవర్గంలో ప్రత్యేకించి మండలాల వారీగా పని విభజనతో పాటు ప్రణాళికబద్ధంగా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా అక్కడ మేలైన ఫలితాలు సాధించినట్టుగా పార్టీవర్గాలు చెబుతున్నాయి. ఇప్పుడు అదే మాదిరిగా మే నెలలో అన్ని నియోజకవర్గాల్లోనూ స్ట్రీట్‌కార్నర్ మీటింగ్స్‌తో మంచి ఫలితాలు రాబట్టాలని నాయకత్వం భావిస్తోంది.

అఫిలియేషన్ ప్రక్రియ మొదలు

- ఇంజనీరింగ్ కాలేజీల్లో తనిఖీలకు రంగం సిద్ధం
- ముగ్గురు చొప్పున నిపుణుల ద్వారా పరిశీలన
- కంప్యూటర్ కోర్సుల విషయంలోనే పట్టింపు
- అన్నీ ఉంటేనే అనుమతులు
- ఏప్రిల్ నెలాఖరుకల్లా తనిఖీలు పూర్తి
- సేకరించిన సమాచారాన్ని పరిశీలిస్తున్న వర్సిటీలు



సాక్షి, హైదరాబాద్: ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల అనుబంధ గుర్తింపు ప్రక్రియ మొదలైంది. విశ్వవిద్యాలయాలు ఇప్పటికే కాలేజీల నుంచి సమాచారం సేకరించాయి. వాటిని సంబంధిత నిపుణులు పరిశీలిస్తున్నారు. అత్యధిక కాలేజీలు అనుబంధంగా ఉన్న జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్‌టీయూహెచ్) ఈ ప్రక్రియలో ముందుంది. కాలేజీల నుంచి సేకరించిన సమాచారాన్ని సిబ్బంది కంప్యూటర్లలో నిక్షిప్తం చేస్తున్నారు. దీని ఆధారంగా ప్రతీ కాలేజీకి ముగ్గురు చొప్పున ఫ్యాకల్టీ నిపుణులు వెళ్తారని జేఎన్‌టీయూహెచ్ అధికారులు తెలిపారు. మరోవైపు డిమాండ్ లేని కోర్సుల్లో సీట్లు తగ్గించుకుని, డిమాండ్ ఉన్న వాటిల్లో పెంచుకునేందుకు కాలేజీలు ప్రయత్నిస్తున్నాయి. అయితే, సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ కోర్సుల్లో సీట్లు పూర్తిగా తగ్గించేందుకు అధికారులు ఒప్పుకోవడం లేదు. ఆయా కోర్సుల్లో 30 శాతం సీట్లు ఉండి తీరాలని చెబుతున్నారు. ఈ ఏడాది ఎంసెట్ కౌన్సెలింగ్ మొదలయ్యే నాటికే అఫిలియేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులు భావిస్తున్నారు.


200కు పైగా కాలేజీల్లో తనిఖీలకు సిద్ధం

జేఎన్‌టీయూహెచ్ పరిధిలో 145 వరకూ ఇంజనీరింగ్ కాలేజీలున్నాయి. మరో 70 వరకూ ఫార్మసీ కాలేజీలున్నాయి. వీటిల్లో ప్రధానంగా కంప్యూటర్ సైన్స్, దానికి అనుబంధంగా వచ్చిన కొత్త కోర్సుల విషయంలోనే అధికారులు దృష్టి పెట్టాలని నిర్ణయించారు. సైబర్ సెక్యూరిటీ, డేటాసైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్ వంటి కోర్సుల్లో అవసరమైన ప్రోగ్రామ్స్ ఉన్నాయా? ఫ్యాకల్టీ సరైనది ఉందా? మౌలిక సదుపాయాలు ఏమేర ఉన్నాయి? అనే అంశాలను తనిఖీ బృందాలు నిశితంగా పరిశీలించాలని ఇటీవల జరిగిన సమావేశంలో నిర్ణయించారు. బయోమెట్రిక్ హాజరు విధానాన్ని యూనివర్సిటీలు తప్పనిసరి చేసినా, పలు కాలేజీలు దీన్ని అనుసరించడం లేదు. ఈ ఏడాది నుంచి దీనిని కచ్చితంగా అమలు చేయాలని నిర్ణయించినట్టు జేఎన్‌టీయూహెచ్ అధికారులు తెలిపారు. ఈ అంశాన్ని కూడా పరిశీలనలో భాగం చేయాలని నిర్ణయించారు. దీనివల్ల ఫ్యాకల్టీ ప్రతిభ, ప్రమాణాలు ఎలా ఉన్నాయో తెలుసుకునే వీలుందని చెబుతున్నారు. మిగతా యూనివర్సిటీలు కూడా తనిఖీలకు రంగం సిద్ధం చేస్తున్నాయి.

సదుపాయాలు లేకుండా గుర్తింపు కష్టం

తనిఖీల విషయంలో యూనివర్సిటీలు అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్నాయి. తనిఖీ బృందాలు కాలేజీ యాజమాన్యాలతో మిలాఖత్ అవుతున్నాయని, మౌలిక సదుపాయాలు లేకున్నా అనుమతిస్తున్నారనే విమర్శలున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని కాలేజీలో బోధించే సిబ్బంది వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయడమే కాకుండా, వారి వ్యక్తిగత పాన్ కార్డుల ఆధారంగా ఆదాయ పన్నుశాఖ ద్వారా తనిఖీలు చేయాలనే యోచనలో ఉన్నారు. ఫ్యాకల్టీ కాలేజీలో బోధిస్తున్నాడా? ఎక్కడైనా ఉద్యోగం చేసుకుని, కాలేజీలో ఫ్యాకల్టీగా నమోదు చేసుకున్నాడా అనే అంశాలను పరిశీలించాలని నిర్ణయించారు. ఏప్రిల్ నెలాఖరుకల్లా తనిఖీలు పూర్తి చేయాలని యూనివర్సిటీల అధికారులు భావిస్తున్నారు.

మే రెండో వారంకల్లా పూర్తి చేస్తాం



కాలేజీల అనుబంధ గుర్తింపు ప్రక్రియను మే రెండో వారంకల్లా పూర్తి చేయాలనే ఆలోచనలో ఉన్నాం. కాలేజీల్లో ఫ్యాకల్టీ, వసతులపై డేటా తెప్పించాం. నిబంధనల ప్రకారం మౌలిక వసతులు లేని కాలేజీలు గుర్తింపు తేదీ నాటికి ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పిస్తున్నాం. ప్రతీ కాలేజీకి ముగ్గురు చొప్పున నిపుణులు వెళ్తారు. అన్నీ పరిశీలించి, నిబంధనల మేరకు సరిగా ఉంటేనే గుర్తింపు ఇస్తాం.

– ప్రొఫెసర్ కట్టా నర్సింహారెడ్డి (జేఎన్‌టీయూహెచ్ వీసీ)

దేశవ్యాప్త వ్యాపారంలోకి 'హాకా'

- అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలతో ఒప్పందాలు
- ప్రభుత్వ శాఖలకు అవసరమైన సరుకుల సరఫరా.. కేంద్ర ప్రభుత్వంతోనూ సంప్రదింపులు ప్రారంభం
- రూ.300కోట్ల నుంచి రూ. 35 వేల కోట్ల టర్నోవర్ లక్ష్యం
- ప్రత్యేక దృష్టిసారించిన 'హాకా'యంత్రాంగం



సాక్షి, హైదరాబాద్: రైతులకు విత్తనాలు... ప్రభుత్వ శాఖలకు అవసరమైన స్టేషనరీ, అన్ని రకాల వస్తువులను సరఫరా చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని హైదరాబాద్ అగ్రికల్చరల్ కో-ఆపరేటివ్ అసోసియేషన్ లిమిటెడ్ (హాకా) దేశవ్యాప్త వ్యాపారంలోకి ప్రవేశించాలని కీలక నిర్ణయం తీసుకుంది. తద్వారా రూ.వందల కోట్లున్న దాని టర్నోవర్‌ను వేల కోట్ల రూపాయలకు విస్తరించాలని నిర్ణయించింది. అందుకోసం వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు వేసే టెండర్లలోనూ పాల్గొంటుంది. ఈ మేరకు ఆయా ప్రభుత్వాలతోనూ ఒప్పందాలు చేసుకోవాలని నిర్ణయించింది. తక్కువ కమీషన్‌తోనే భారీగా వ్యాపారం చేయాలన్నది ఉద్దేశం. అంతేకాదు కేంద్ర ప్రభుత్వం నిర్వహించే వివిధ రకాల టెండర్లలోనూ పాల్గొంటుంది. అందుకు సంబంధించి ఇటీవల కేంద్ర ప్రభుత్వానికి కూడా హాకా లేఖ రాసింది.

రూ. 35 వేల కోట్ల టర్నోవర్ లక్ష్యం...

రైతులకు సబ్సిడీపై విత్తనాలు, ప్రభుత్వశాఖలకు అవసరమైన ఏసీలు, ఫ్యాన్లు, కాగితాలు, జిరాక్స్ మెషీన్లు, ప్రింటర్లు, సెల్‌ఫోన్లు, ల్యాండ్‌లైన్ ఫోన్లు, టేబుళ్లు, కుర్చీలు ఇలా వివిధ రకాల మెటీరియల్ మొత్తాన్ని అందించే ఉద్దేశంతో హాకా ఏర్పాటైన సంగతి తెలిసిందే. హాకా నోడల్ ఏజెన్సీగా రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు పాలు, పప్పును కూడా సరఫరా చేస్తుంది. ప్రతీ ఏడాది దీపావళికి టపాకాయలను కూడా హాకా ద్వారానే ప్రభుత్వం వినియోగదారులకు విక్రయిస్తుంది. ప్రభుత్వశాఖలు దీని ద్వారానే వస్తువులను కొనుగోలు చేస్తుంటాయి. మరోవైపు రైతులకు విత్తనాలు కూడా సరఫరా చేయాలి. కానీ ఇటీవల ఆ వ్యాపారం చేయడం లేదు. ప్రస్తుతం ఏడాదికి కేవలం రూ.300 కోట్లకు మించి టర్నోవర్ దాటడం లేదు. దీనివల్ల వచ్చే కమీషన్ అత్యంత తక్కువగా ఉంటోంది. ఫలితంగా హాకాలోని ప్రభుత్వ ఉద్యోగుల జీతాలకు, రోజువారీ ఖర్చులకు మాత్రమే ఆ సొమ్ము సరిపోతోంది. దీంతో ఇక వ్యాపారాన్ని విస్తరించాలని నిర్ణయించారు.


మచ్చా సారథ్యంలో ముందుకు

ప్రభుత్వం ఇటీవల హాకాకు చైర్మన్‌గా మచ్చా శ్రీనివాసరావును నియమించిన సంగతి తెలిసిందే. ఆయన ఆధ్వర్యంలో వ్యాపారాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఏకంగా రూ. 35 వేల కోట్ల టర్నోవర్ లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు హాకా వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం ధాన్యం కొనుగోలు వ్యవహారం మొత్తాన్ని ఎఫ్‌సీఐ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. పత్తిని సీసీఐ, ఇతర పంటలను రాష్ట్రంలో మార్క్‌ఫెడ్ నిర్వహిస్తూ వస్తోంది. ఇకపై ధాన్యం కొనుగోళ్లు చేపట్టడం, పత్తిని కొనుగోలు చేసే అంశాన్ని పరిశీలించడం, వివిధ రాష్ట్రాల్లో నిర్వహించే క్రయ విక్రయాల్లోనూ పాల్గొనడం చేయాలన్నది హాకా ఉద్దేశం.

ఇతర రాష్ట్రాల్లో చేసే వ్యాపారం ఇలా...

ఇతర రాష్ట్రాల్లోనూ ప్రభుత్వ శాఖలకు అవసరమైన స్టేషనరీని సరఫరా చేయాలి. తక్కువ కమీషన్‌కే టెండర్‌ను దక్కించుకోవాలి.

- వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు సరఫరా చేసే గోధుమలు, బియ్యం, పప్పు వంటి వాటిని కూడా హాకా ద్వారానే సరఫరా చేయాలి.
- ఇతర రాష్ట్రాల్లో చేపట్టే వివిధ రకాల పంటల కొనుగోళ్లలో పాల్గొనాలి.
- సాధారణ వినియోగదారులకు అవసరమయ్యే సరుకులను కూడా సరఫరా చేయాలి. తక్కువ ధర, నాణ్యత ఆధారంగా వారిని ఆకట్టుకోవాలి.
- ప్రభుత్వ శాఖలకు ఫర్నిచర్‌ను సరఫరా చేయాలి.
- హాకా సంస్థను పటిష్టం చేయాలి. ఉద్యోగుల సంఖ్యను పెంచాలి.


'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 12+6 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 8

శుక్రవారం 31-3-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




వాల్‌స్ట్రీట్ జర్నల్ విలేకరి అరెస్ట్

'ది వాల్‌స్ట్రీట్ జర్నల్' విలేకరిని రష్యా నిఘా సంస్థ ఎఫ్ఎస్‌బి అరెస్ట్‌చేసింది. - 6లో



ఖర్గే ఇంట గెలిచేనా!

ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేకు సొంత రాష్ట్రంలో ఎన్నికలు సవాల్‌గా మారాయి. - 6లో



'రాహుల్ అనర్హత' గమనిస్తున్నాం

రాహుల్‌గాంధీ లోక్‌సభ సభ్యత్వ రద్దుపై జర్మనీ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి చేసిన ట్వీట్ కాంగ్రెస్, బీజేపీ మధ్య మళ్లీ చిచ్చురేపింది.

- వివరాలు 6లో



రెండు రాష్ట్రాల్లో 'నవమి' ఉద్రిక్తతలు

రామనవమి ఉత్సవాల సందర్భంగా పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి.

- వివరాలు 6లో



అసెంబ్లీలో అశ్లీల వీక్షణం

త్రిపుర శాసనసభలో అధికార బీజేపీ ఎమ్మెల్యే జాదవ్ లాల్‌నాథ్ తన మొబైల్ ఫోన్‌లో అశ్లీల వీడియోలు తిలకిస్తూ దొరికిపోయాడు.

- వివరాలు 6లో



కోతల వేళ శుభవార్త

హెచ్–1బీ వీసాదారుల జీవిత భాగస్వామి అమెరికాలో ఉద్యోగం చేసుకోవచ్చన్న తీర్పు భారతీయ టెకీలకు ఊరట కలిగించింది.

- వివరాలు 6లో

● భద్రాద్రిలో...





నేత్రపర్వం.. సీతారాముల కల్యాణం

శ్రీ సీతారాముల కల్యాణం సందర్భంగా మంగళసూత్రం చూపిస్తున్న అర్చకులు, చిత్రంలో చినజీయర్ స్వామి

శ్రీ సీతారామ కల్యాణాన్ని వీక్షిస్తున్న హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి దంపతులు, ఏపీ స్పీకర్ తమ్మినేని సీతారాం దంపతులు, ఎంపీలు రవిచంద్ర, కవిత, భక్తులు

10లో

● భాగ్యనగరిలో..



గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన శోభాయాత్రకు పోటెత్తిన భక్తులు

15 పేపర్లు అవుట్!

టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీక్ కేసు దర్యాప్తులో కీలక పురోగతి

- ఆరు పరీక్షలకు సంబంధించి 15 పేపర్లు లీకైనట్లు తేల్చిన సిట్
- గ్రూప్–1 ప్రిలిమ్స్ ప్రశ్నపత్రం ఆ ఐదుగురి మధ్యే పంపకం
- ఏఈఈ ఎగ్జామ్స్ పేపర్లు పలువురికి విక్రయం
- మిగతావి పెన్‌డ్రైవ్‌కే పరిమితం

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీక్ కేసు దర్యాప్తులో వెలుగు చూస్తున్న అంశాలు నివ్వెర పరుస్తున్నాయి. మొత్తం ఆరు రకాల పరీక్షలకు సంబంధించి ఏకంగా 15 క్వశ్చన్ పేపర్లు ముందే బయటకు వచ్చినట్లు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తేల్చింది. గ్రూప్–1 పేపర్ లీక్ ఐదుగురికే పరిమితమైందని, ఏఈఈ ప్రశ్నపత్రం పలువురికి విక్రయించారని, మిగతావి పెన్‌డ్రైవ్‌కే పరిమితమైనట్లు స్పష్టమైంది. గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలకు సంబంధించిన పేపర్లు తస్కరించేందుకు కూడా నిందితులు పథకం వేసినట్లు బయటపడింది.

అన్నీ మాస్టర్ ప్రశ్నపత్రాలే..


ఈ స్కామ్‌లో సూత్రధారులుగా ఉన్న కమిషన్ కార్యదర్శి మాజీ పీఏ ప్రవీణ్ కుమార్, నెట్‌వర్క్ అడ్మిన్ రాజశేఖర్‌రెడ్డితో పాటు 13 మంది నిందితులను పోలీసులు వివిధ కోణాల్లో విచారించారు. గతేడాది అక్టోబర్ మొదలు గత నెల ఆఖరి వారం వరకు సాగిన ఈ లీకేజ్ వ్యవహారంపై కీలక ఆధారాలు సేకరించారు. గ్రూప్–1 ప్రిలిమ్స్ పేపర్‌ను ప్రవీణ్.. సురేష్, రమేష్‌లకు కూడా ఇచ్చాడు. రాజశేఖర్‌రెడ్డి.. షమీమ్‌కు, న్యూజిలాండ్‌లో ఉండే తన సమీప బంధువు ప్రశాంత్ రెడ్డికి ఇచ్చాడు. ఈ ఐదుగురికి మినహా మరెవరికీ ఈ ప్రశ్నపత్రం చేరినట్లు ఇప్పటివరకు ఆధారాలు లభించలేదని సిట్ అధికారులు చెబుతున్నారు. గత నెల 5న జరిగిన



ఏఈఈ పరీక్ష పత్రాలు నీలేష్, గోపాల్, ప్రశాంత్, రాజేంద్రకుమార్ ఖరీదు చేశారని తేల్చారు. వీరి ద్వారా మరికొందరికి చేరే అవకాశాలు తక్కువని చెప్తున్న అధికారులు.. ఆ కోణంలోనూ దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ప్రవీణ్ పెన్‌డ్రైవ్‌లో మొత్తం ఆరు పోస్టులకు సంబంధించిన పరీక్షల పత్రాలు ఉన్నట్లు గుర్తించారు. గ్రూప్–1 ప్రిలిమ్స్,

మిగతా 2వ పేజీలో ▶

ఆ 15 ప్రశ్నపత్రాల జాబితా ఇది...



1. గ్రూప్–1 జనరల్ స్టడీస్
2. ఏఈఈ సివిల్ ఇంజనీరింగ్
3. ఏఈఈ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్
4. ఏఈఈ మెకానికల్ ఇంజనీరింగ్
5. డీఏఓ జనరల్ స్టడీస్
6. డీఏఓ మేథమెటిక్స్
7. జనరల్ స్టడీస్ డిప్లొమా ఏఈ
8. సివిల్ ఇంజనీరింగ్ డిప్లొమా ఏఈ
9. మెకానికల్ ఇంజనీరింగ్ డిప్లొమా ఏఈ
10. ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ డిప్లొమా ఏఈ
11. మెకానికల్ ఇంజనీరింగ్ డిప్లొమా ఏఈ పేపర్-2
12. సివిల్ ఇంజనీరింగ్ డిప్లొమా ఏఈ పేపర్-2
13. టీపీబీఓ ఒకేషనల్ జనరల్ స్టడీస్ పేపర్-1
14. టీపీబీఓ ఇంటర్మీడియెట్ ఒకేషనల్ పేపర్-2
15. జూనియర్ లెక్చరర్స్ ఎగ్జామ్

ఆ ఆరు పరీక్షలపై దృష్టి

- రద్దయిన, వాయిదా పడిన పరీక్షల నిర్వహణకు టీఎస్‌పీఎస్సీ చర్యలు
- ఇప్పటికే గ్రూప్–1, ఏఈఈ పరీక్షల తేదీలు ఖరారు చేసిన కమిషన్ 2లో

'మార్గదర్శి' అక్రమాలు నిజం!



నిధుల మళ్లింపు, అక్రమ డిపాజిట్లు, అక్రమ పెట్టుబడులు వాస్తవమే

సీఐడీ దర్యాప్తులో అంగీకరించిన చార్టర్డ్ అకౌంటెంట్ శ్రావణ్

ప్రతి ఏటా బ్యాలెన్స్ షీట్లో వందల కోట్ల చెక్కులు; నగదు

ఆ తరవాత చెక్కులేమయ్యాయనే ప్రస్తావనే ఉండదు; నగదూ అంతే

- నిజానికివి సంస్థలో లేకున్నా... ఖాతాల్లో మాత్రం చూపిస్తూ కొనసాగింపు
- అప్పటికే అవి ఇతర సంస్థల్లోకి... లేదా ఇతర ఖాతాల్లోకి మళ్లింపు
- సంస్థలో లేని ఆస్తుల్ని చూపిస్తూ చిట్‌దారులకు నమ్మకం కలిగించే యత్నం
- ఫ్యూచర్ సబ్‌స్క్రిప్షన్స్‌గా వచ్చిన మొత్తాల కోసం ప్రత్యేక ఖాతాలూ లేవు
- చట్టాలను తుంగలో తొక్కి హైదరాబాద్ ప్రధాన కార్యాలయానికి తరలింపు
- అలా డిపాజిట్లు సేకరిస్తూ ఆర్‌బీఐ నిబంధనలకు తూట్లు పొడుస్తున్న రామోజీ
- ఈ రికార్డులు పరిశీలించకుండానే ఆడిట్ సర్టిఫికెట్ ఇస్తున్న బ్రహ్మయ్య అండ్ కో

సాక్షి, అమరావతి: ప్రతి ఏటా మార్చి 31న రూపొందించే బ్యాలెన్స్‌షీట్‌లో... చెల్లించాల్సిన బకాయిలు, ఇతర అప్పులకు సమానంగా తమ వద్ద వందల కోట్ల రూపాయలు చెక్కుల రూపంలో, మరికొన్ని వందల కోట్ల రూపాయలు నగదు రూపంలో ఉన్నట్లు చూపిస్తున్నారు. వాటిని తమ ఆస్తులుగా పేర్కొంటున్నారు. మరి ఆ చెక్కుల్ని తదుపరి కాలంలో ఎప్పుడైనా డిపాజిట్ చేయాలి కదా? ఆ నగదును సంస్థ అవసరాల కోసం ఖర్చు చేయాలి కదా? విచిత్రమేంటంటే అందులో పేర్కొన్న చెక్కుల్లో ఒక్క చెక్కు కూడా తరువాతి కాలంలో సంస్థ ఖాతాలోకి వచ్చిన దాఖలాలు ఉండటం లేదు. నగదు పరిస్థితి కూడా అంతే!!. అంటే ఆ చెక్కులు గానీ, ఆ నగదు గానీ వాస్తవంగా కంపెనీ దగ్గర ఉన్నవి కావన్న మాట!!. వాటిని

మిగతా 5వ పేజీలో ▶

న్యూస్‌రీల్

8న రాష్ట్రానికి ప్రధాని!



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఏప్రిల్ 8న రాష్ట్రానికి రానున్నట్లు బీజేపీ వర్గాలు వెల్లడించాయి. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు, సికింద్రాబాద్-తిరుపతి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభిస్తారని, ఇతర కార్యక్రమాల్లోనూ పాల్గొంటారని ఆ వర్గాలు వెల్లడించాయి.

- వివరాలు 2లో

గవర్నర్ కోటా ఎమ్మెల్సీపై ఆశావహుల నజర్



రాష్ట్ర శాసనమండలిలో రెండు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ అవుతుండటంతో బీఆర్ఎస్ నేతల్లో ఆశలు మొదలయ్యాయి. ఇప్పటికే పలువురు ఆశావహులు ప్రయత్నాలు మొదలుపెట్టారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఇతర పార్టీ పెద్దలను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు.

- వివరాలు 2లో

చమురు తగ్గినా.. పెట్రోల్ రేటు తగ్గించరేం?



- కార్పొరేట్ మిత్రుల ఖజానా నింపేందుకే మోదీ సర్కారు ప్రయత్నం: మంత్రి కేటీఆర్
- సెస్సుల రూపంలో ప్రజల నుంచి రూ. 30 లక్షల కోట్లు కొల్లగొట్టారు

- పెరిగిన పెట్రో ధరలతో సంక్షోభంలో ప్రజా రవాణా
- వంటగ్యాస్ తరహాలో పెట్రో ధరలు పెంచేసే కుట్ర
- ఈ దోపిడీని ఆపకుంటే గుణపాఠం తప్పదని హెచ్చరిక
- కేంద్రానికి కేటీఆర్ బహిరంగ లేఖ

సాక్షి, హైదరాబాద్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం.. అంతర్జాతీయ ముడి చమురు ధరలతో సంబంధం లేకుండానే దేశంలో పెట్రోల్ ధరను పెంచుతూ పోతోందని, తన కార్పొరేట్ మిత్రుల ఖజానాను నింపుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీ రామారావు ఆరోపించారు. పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలతో సామాన్యులు ఇబ్బంది పడుతున్నారని, భారీగా పెరిగిన డీజిల్ ధరతో ప్రజారవాణా వ్యవస్థ సంక్షోభం

మిగతా 2వ పేజీలో ▶

తెలంగాణలో ఆ దిక్కుమాలిన పార్టీ ఎందుకు?: కేటీఆర్

2లో

కేసీఆర్‌ను ఎందుకు భరించాలి?

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి ట్వీట్



బావి వద్ద సహాయక చర్యలు చేపడుతున్న అధికారులు

ఇండోర్ ఆలయంలో విషాదం

బావి పైకప్పు కూలి 14 మంది భక్తులు మృతి

- మృతుల్లో 10 మంది మహిళలే..
- ప్రమాదంపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి
- మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు.. క్షతగాత్రులకు రూ.50 వేలు ఎక్స్‌గ్రేషియా

- వివరాలు 6లో

కోరం లేకున్నా.. బడ్జెట్ ఆమోదమే!

నేటితో ముగియనున్న మునిసిపాలిటీల ఆర్థిక సంవత్సరం

- కొత్త బడ్జెట్ల ఆమోదానికి శుక్రవారం ఒక్కరోజే గడువు
- 37 పాలకమండళ్లలో అవిశ్వాస నోటీసులు – 29 చోట్ల కోర్టు స్టే



సాక్షి, హైదరాబాద్: చాలా మునిసిపల్ పాలకమండళ్లకు పలువురు సభ్యులు అవిశ్వాస నోటీసులు ఇవ్వడంతో బడ్జెట్ సమావేశాలకు కోరం కరువైంది. కోరం లేకున్నా మునిసిపల్ బడ్జెట్లు ఆమోదం పొందుతున్నాయి. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో 2023–24 వార్షిక బడ్జెట్ల ఆమోదానికి శుక్రవారం ఒక్కరోజే గడువు మిగిలి ఉంది. రాష్ట్రంలోని 128 మునిసిపాలిటీలు, 13 కార్పొరేషన్లకుగాను ఇప్పటికే మూడోవంతు పట్టణ

మిగతా 2వ పేజీలో ▶



ఎలా విడదీస్తారో అర్థం కావడం లేదు!

టోల్ పెంపు నేటి అర్ధరాత్రి నుంచే..

5.5 శాతం మేర పెంచిన జాతీయ రహదారుల సంస్థ

- గతేడాదితో పోలిస్తే కాస్త తక్కువగానే మోత
- గత ఏడాది కాలంలో చార్జీలతో రూ.1,820 కోట్లు వసూలు
- ఈసారి అది రూ. 2 వేల కోట్లను దాటే అవకాశం

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా జాతీయ రహదారులపై ఉన్న టోల్ ప్లాజాల్లో చార్జీల పెంపు శుక్రవారం అర్ధరాత్రి నుంచి అమల్లోకి రానుంది. రోడ్ల నిర్వహణకు సంబంధించి ఏటా ఏప్రిల్ ఒకటి నుంచి చార్జీల పెంపును ఆనవాయితీగా తీసుకున్న జాతీయ రహదారుల అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ).. ఈసారి కూడా కొత్త చార్జీలను సిద్ధం చేసింది. గతేడాది వివిధ కేటగిరీల వాహనాలకు సంబంధించి 8 శాతం నుంచి 15 శాతం వరకు ధరలు పెంచగా.. ఈసారి వాహనదారులపై కాస్త దయతలిచి 5.50 శాతంలోపే పెంపును పరిమితం చేసింది. విజయవాడ రహదారిలోని పంతంగి టోల్ ప్లాజాను ఉదాహరణగా తీసుకుంటే.. గతేడాది కారు/జీపు/వ్యాన్ కేటగిరీలో చార్జీని రూ.80 నుంచి రూ.90కి అంటే రూ.10 పెంచగా... ఈసారి రూ.90 నుంచి రూ.95కు అంటే రూ.5 మాత్రమే పెంచింది. ఇక గతేడాది టోల్ ధరలు

మిగతా 5వ పేజీలో ▶



పంతంగి టోల్‌ప్లాజా వద్ద చార్జీల వివరాలివీ.. (రూ.లలో)

	సింగిల్ జర్నీ		రిటర్న్ జర్నీ		నెల పాసు	
	పాత	కొత్త	పాత	కొత్త	పాత	కొత్త
కారు/జీపు/వ్యాన్ లైట్ వెహికిల్స్	90	95	135	140	2,965	3,120
లైట్ కమర్షియల్, మినీ బస్ తదితర..	140	150	210	220	4,685	4,930
బస్సు, ట్రక్కు	290	305	435	460	9,685	10,195
హెవీ వెహికల్స్	560	590	845	885	18,740	19,720

ఉదయం అర్చకత్వం ఆ తర్వాత కాయకష్టం

- కూలీలు, ఆటోడ్రైవర్లుగా అర్చకులు
- ధూప దీప నైవేద్య పథకం పూజారుల దీనావస్థ.. నెలల తరబడి డబ్బులు రాక.. పూట గడవక ప్రత్యామ్నాయ పనులకు

- వివరాలు 2లో

క్లుప్తంగా...

మందుల ధరల పెంపుపై హరీశ్ ఫైర్



సాక్షి, హైదరాబాద్: మందుల ధరల పెంపుపై వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. బీజేపీ పాలనలో అచ్చే దిన్ కాదు.. సామాన్యుడు చచ్చేదిన్ అని ఆయన గురువారం ట్విట్టర్‌లో వ్యాఖ్యానించారు. ప్రజల ప్రాణాలు కాపాడే ఔషధాల ధరలు 12 శాతం పెంచాలని కేంద్రం నిర్ణయించడం దారుణమని విమర్శించారు. జ్వరం, ఇన్ఫెక్షన్లు, బీపీ, చర్మ వ్యాధులు, ఎనీమియా తదితర చికిత్సల్లో వినియోగించే మందుల తోపాటు పెయిన్ కిల్లర్లు, యాంటీ బయాటిక్స్, యాంటీ ఇన్ఫెక్టివ్స్ వంటి 800కు పైగా నిత్యావసర మందుల ధరలు పెంచితే, అది పేద, మధ్య తరగతి ప్రజలకు భారంగా మారుతుందని వ్యాఖ్యానించారు.

విచారణ పూర్తి కాకుండానే మళ్లీ పరీక్షల షెడ్యూలా?

బీఎస్పీ అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ ట్వీట్



సాక్షి, హైదరాబాద్: పేపర్ లీకేజీ కేసులో సిట్ విచారణ పూర్తి కాకుండానే మళ్లీ పరీక్షల షెడ్యూల్ ప్రకటించడంపై బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ అభ్యంతరం వ్యక్తం చేశారు. కమిషన్ తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోకుండానే, చిన్నపావులను అరెస్టు చేసి, పెద్ద తిమింగలాల ను వదిలేసి.. మళ్లీ టీఎస్‌పీఎస్సీ ఎగ్జామ్ షెడ్యూలు ప్రకటించిందని ఆక్షేపించారు. ఈ అనుమానితుల కనుసన్నల్లో మళ్లీ ఎగ్జామ్స్ పారదర్శకంగా జరుగుతాయని ఎలా నమ్మగలమని ట్విట్టర్ వేదికగా ప్రశ్నించారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్, కమిషన్ సభ్యులను మార్చిన తర్వాతే షెడ్యూల్ విడుదల చేయాలని కొంతకాలంగా ప్రవీణ్ డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే.

పేపర్ లీకేజీపై 'విద్యార్థి ఉద్యమాల కమిటీ'

చైర్మన్‌గా మల్లు రవి



సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారంలో అన్ని వర్గాలతో కలిసి పోరాటం చేయాలని టీపీసీసీ నిర్ణయించింది. ఈ మేరకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు, ఇతర భాగస్వామ్య సంస్థలతో కలిసి ఉద్యమ కార్యాచరణ రూపొందించేందుకు ప్రత్యేక కమిటీని నియమించింది. టీపీసీసీ అధ్యక్షుడు, ఎంపీ రేవంత్ రెడ్డి ఆదేశాలతో ఏర్పాటు చేసిన ఈ కమిటీకి చైర్మన్‌గా మాజీ ఎంపీ, టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి, కన్వీనర్లుగా యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి, ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్, సభ్యులుగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు మానవతా రాయ్, బాలలక్ష్మి, మల్లాది పవన్‌లను నియమిస్తున్నట్టు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.మహేశ్ కుమార్ గౌడ్ గురువారం వెల్లడించారు.

ప్రశ్నిస్తే విద్యార్థులపై కేసులా?: వైఎస్ షర్మిల



సాక్షి, హైదరాబాద్: న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని అడిగిన వారిపై కేసులు పెట్టి అరెస్టులకు పాల్పడటం సీఎం కేసీఆర్ రాచరిక పాలనకు నిదర్శనమని వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ధ్వజమెత్తారు. గురువారం ఆమె ట్విట్టర్ వేదికగా టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకులపై ఉద్యమిస్తున్న ఓయూ, కేయూ విద్యార్థులపై సర్కార్ చేపడుతున్న అణచివేత చర్యలను ఖండించారు. లీకుల వెనుక పాలకుల హస్తం లేకపోతే సిట్‌తో కాకుండా సీబీఐతో దర్యాప్తు చేయించాలన్నారు. పోటీపరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగులకు సహాయంగా రూ.50 వేలు ప్రకటించాలని డిమాండ్ చేశారు.

సోషల్ మీడియా సమాచారాన్ని నమ్మొద్దు

జేఈఈ పరీక్షలపై ఎన్టీఏ స్పష్టీకరణ

సాక్షి, అమరావతి: జేఈఈ పరీక్షలపై సోషల్ మీడియాలో వచ్చే 'ఇన్ సైడర్'(ఎన్టీఏ వర్గాల నుంచి అందిన సమాచారం అంటూ) పేరుతో వచ్చే సమాచారాన్ని నమ్మొద్దని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) విద్యార్థులకు సూచించింది. పరీక్షలకు సంబంధించిన సిటీ ఇంటిమేషన్ తదితర అంశాలపై తప్పుడు సమాచారం ఇస్తున్నాయని పేర్కొంది. 'జేఈఈ(మెయిన్స్) 2023 సెషన్ 2కు సంబంధించిన సిటీ ఇంటిమేషన్ స్లిప్, అడ్మిట్ కార్డ్ విడుదల తేదీపై సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో వీడియోలు ప్రసారం అవుతున్నాయని మా దృష్టికి వచ్చింది. అవి ఫేక్. విద్యార్థులను తప్పుదారి పట్టించేలా ఉన్నాయి. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఇలాంటి వీడియోలను నమ్మొద్దు' అని గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. జేఈఈ(మెయిన్స్) పరీక్షకు సంబంధించిన అధికారిక సమాచారం కోసం ఎన్టీఏ వెబ్‌సైట్‌ను చూడాలని సూచించింది. సిటీ ఇంటిమేషన్ స్లిప్, అడ్మిట్ కార్డ్ విడుదల తేదీలు ఎన్టీఏ వెబ్‌సైట్‌లో, పబ్లిక్ నోటీసు ద్వారా మాత్రమే ప్రకటిస్తామని స్పష్టం చేసింది. మరింత స్పష్టత కోసం 011-40759000 నంబరులో సంప్రదించవచ్చని తెలిపింది. లేదా Sfeemain@nta.ac.inకు ఈ–మెయిల్ చేయవచ్చని వివరించింది.



➤ ఆటో తోలుతున్న ఈ వ్యక్తి పేరు పురాణం దివాకర శర్మ. ఖమ్మం జిల్లా నేలకొండపల్లికి చెందిన ఈయన స్థానిక శ్రీ వైద్యనాథ స్వామి దేవాలయ అర్చకులు. ధూప దీప నైవేద్య పథకం కింద ఆయన ఈ ఆలయ పూజారిగా పనిచేస్తున్నారు. కానీ ఆ పథకం కింద ఇవ్వాల్సిన రూ.6 వేలు ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి. నాలుగు నెలలుగా స్తంభించిన ఆ మొత్తంలో అతి కష్టమ్మీద ఒక నెల వేతనం మాత్రమే తాజాగా విడుదలైంది. గతేడాది కూడా ఇలాగే కొన్ని నెలలు నిలిచిపోయింది. దీంతో కుటుంబ పోషణ భారం కావడంతో ఉదయం దేవాలయం మూసేసిన తర్వాత ఇదిగో ఇలా అద్దె ఆటో తీసుకుని నడుపుకొంటున్నారు. ఒక్కోసారి రాత్రి దేవాలయం మూసేసిన తర్వాత గ్రామీణులకు కోలాటంలో శిక్షణ ఇస్తూ వారిచ్చిన ఫీజు తీసుకుని రోజులు గడుపుతున్నారు.

ఉదయం అర్చకత్వం ఆ తర్వాత కాయకష్టం

- కూలీలు, ఆటోడ్రైవర్లుగా అర్చకులు
- ధూప దీప నైవేద్య పథకం పూజారుల దీనావస్థ
- నెలల తరబడి డబ్బులు రాక... పూట గడవక ప్రత్యామ్నాయ పనులకు...

సాక్షి, హైదరాబాద్: అంతగా ఆదాయం లేని చిన్న దేవాలయాల నిర్వహణకు ప్రభుత్వం ప్రారంభించిన ధూపదీపనైవేద్య పథకం గందరగోళంగా మారింది. దేవాలయంలో పూజాదికాలకు కావాల్సిన వస్తువులు(పడితరం) కొనేందుకు రూ.2 వేలు, ఆలయ అర్చకుడి కుటుంబ పోషణకు రూ.4 వేలు.. వెరసి రూ.6 వేలు ప్రతినెలా చెల్లించాల్సి ఉండగా, నిధుల లేమి సాకుతో ఆ మొత్తాన్ని ఆర్థిక శాఖ విడుదల చేయటం లేదు. పెద్ద దేవాలయాల్లో పని చేస్తున్న అర్చకులకు ట్రెజరీ నుంచి వేతనాలు అందుతున్నాయి. ఆ దేవాలయం నుంచి వచ్చే ఆదాయాన్ని దేవాదాయ శాఖ తీసేసుకుంటోంది. కానీ చిన్న దేవాలయాలకు అంతగా ఆదాయం లేకపోవటంతో ధూప దీప నైవేద్య పథకం నిధులపైనే ఆధారపడాల్సి వస్తోంది. గతేడాది కొన్ని నెలల పాటు వేతనం ఇవ్వక, ఆ దేవాలయాలు, వాటి అర్చకుల కుటుంబాలను ఆగమాగం చేసిన అధికారులు ఆ తర్వాత ఎట్టకేలకు కొద్ది నెలలు సక్రమంగానే విడుదల చేశారు. మళ్లీ డిసెంబరు నుంచి నిధులు విడుదల చేయటం లేదు. నాలుగు నెలలు వరసగా ఆగిపోగా, గత నెల ఒక నెల మొత్తం విడుదల చేశారు. మిగతావి అలాగే పెండింగులో ఉన్నాయి.

మహానేత డాక్టర్ వైఎస్ హయాంలో పథకం ప్రారంభం

మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా, ఆదాయం లేని దేవాలయాల్లో నిత్య పూజలకు ఆటంకం కలగొద్దన్న సదాశయంతో 2007లో ఈ పథకాన్ని ప్రారంభించారు. అప్పట్లో అర్చకులకు గౌరవ వేతనం రూ 1500, పూజా సామగ్రికి రూ.1000 చొప్పున విడుదల చేసేవారు. 1750 దేవాలయాల్లో ఈ పథకం అమలవుతుండగా, తెలంగాణ ఆవిర్భావం తర్వాత 2018లో 3645 ఆలయాలకు విస్తరింపజేస్తూ చెల్లించే మొత్తాన్ని రూ.6 వేలకు పెంచారు. దేవాలయాల సంఖ్య, వేతన మొత్తం పెరిగినా.. నిధుల విడుదల మాత్రం సక్రమంగా లేకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 3645 దేవాలయాలకు సంబంధించి ప్రతినెలా రూ. 2,18,70000 మొత్తం విడుదల కావాల్సి ఉండగా, నిధుల సమస్య పేరుతో ఆర్థిక శాఖ ఆ మొత్తాన్ని దేవాదాయ శాఖకు అందించటం లేదు.

ఎన్ని ఇబ్బందులో..

ఓ దేవాలయ నిర్వహణకు నెలకు రూ.2 వేల నిధులు ఏమాత్రం సరిపోవటం లేదు. ఇక పూజారి కుటుంబ పోషణకు రూ.4 వేలు కూడా చాలటం లేదు. అయినా సరిపుచ్చుకుందామంటే ఆ నిధులు క్రమం తప్పకుండా అందటం లేదు. ధూపదీపనైవేద్యం అర్చకుల్లో బ్రాహ్మణేతరులు కూడా ఉన్నారు. వీరు పూర్తిగా ఆలయంపై ఆధారపడుతున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు వస్తున్నాయన్న పేరుతో ఆలయానికి దాతలు అడపాదడపా ఇచ్చే సాయం కూడా ప్రస్తుతం తగ్గిపోయిందనేది అర్చకుల మాట. దీంతో గత్యంతరం లేక చాలా మంది అర్చకులు ఇతర పనులు చేసుకుంటున్నారు. కొందరు ఆటో నడుపుతుంటే, మరికొందరు ఉపాధి హామీ పనులు, ఇతర కూలీ పనులకు వెళ్తున్నారు.



కూలీ పనులకు వెళ్తున్నాం

"నేను కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలం నాగల్‌గావ్ ఆలయంలో ధూపదీపనైవేద్య పథకం అర్చకునిగా పనిచేస్తున్నాను. ఆ రూపంలో రావాల్సిన గౌరవ వేతనం సరిగా రావటం లేదు. ఆ వచ్చే మొత్తం కూడా కుటుంబ పోషణకు సరిపోక నా భార్యతో కలిసి మిగతా సమయంలో ఉపాధి హామీ పథకం పనులకు, ఇతరుల పొలాల్లో పనులకు కూలీలుగా వెళ్తున్నాం." – సంగాయప్ప అర్చకుడు

నిధులు పెంచాలి, క్రమం తప్పకుండా ఇవ్వాలి



"గ్రామాల్లో ఉన్న దేవాలయాల్లో నిత్య పూజలు చేస్తూ పూజాదికాల్లో ఉంటున్న ధూపదీపనైవేద్య పథకం అర్చకుల పరిస్థితి దారుణంగా మారింది. ఆ పథకం కింద ఇచ్చే మొత్తాన్ని ప్రస్తుత మార్కెట్ ధరల పట్టికను అనుసరించి పెంచాల్సి ఉంది. ఆ మొత్తాన్ని క్రమం తప్పకుండా ఇవ్వాలి" – వాసుదేవ శర్మ, ధూపదీపనైవేద్య పథకం అర్చకుల రాష్ట్ర అధ్యక్షులు

గవర్నర్ కోటా ఎమ్మెల్సీపై ఆశావహుల నజర్

- మే నెలాఖరులో పూర్తికానున్న ఇద్దరు ఎమ్మెల్సీల పదవీకాలం
- మరోసారి చాన్స్‌పై ఫారూఖ్, రాజేశ్వర్‌రావుల దృష్టి
- కొత్తవారికి అవకాశం వస్తుందన్న ఆశలో పలువురు బీఆర్‌ఎస్ నేతలు
- మైనారిటీ వర్గాలకు ప్రాధాన్యం.. ఒక మహిళకు చాన్స్!
- అభ్యర్థులపై కసరత్తు చేస్తున్న సీఎం కేసీఆర్
- నేడు ముగ్గురు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకారం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనమండలిలో రెండు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ అవుతుండటంతో బీఆర్‌ఎస్ నేతల్లో ఆశలు మొదలయ్యాయి. ఇప్పటికే పలువురు ఆశావహులు ప్రయత్నాలు మొదలుపెట్టారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఇతర పార్టీ పెద్దలను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. గవర్నర్ కోటాలో శాసనమండలికి ప్రాతినిధ్యం వహిస్తున్న డి.రాజేశ్వర్‌రావు, ఫారూఖ్ హుస్సేన్‌ల ఆరేళ్ల పదవీ కాలం ఈ ఏడాది మే 27న ముగియనుంది. ఈ స్థానాల్లో సభ్యుల పేర్లను గవర్నర్‌కు ప్రతిపాదించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ నెల 9న జరిగిన రాష్ట్ర మంత్రివర్గ భేటీలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులను సిఫార్సు చేస్తారనే సంకేతాలు వెలువడినా చివరి నిమిషంలో వాయిదా పడినట్టు తెలిసింది.

మళ్లీ అవకాశం కోసం..

పదవీకాలం పూర్తి చేసుకోనున్న డి.రాజేశ్వర్‌రావు, ఫారూఖ్ హుస్సేన్ ఇద్దరూ మైనారిటీ వర్గానికి చెందిన నేతలే కావడంతో.. మళ్లీ అదే కేటగిరీకి చెందిన వారికి పదవులు దక్కుతాయనే ప్రచారం బీఆర్‌ఎస్‌లో జరుగుతోంది. డి.రాజేశ్వర్‌రావు రెండుసార్లు కాంగ్రెస్ నుంచి, ఒకసారి బీఆర్‌ఎస్ నుంచి ఎమ్మెల్సీగా నామినేట్ అయ్యారు. ఫారూఖ్ హుస్సేన్ కూడా ఒకసారి కాంగ్రెస్, మరోసారి బీఆర్‌ఎస్ నుంచి శాసనమండలిలో అడుగుపెట్టారు. మరోసారి గవర్నర్ కోటాలో ఎంపికయ్యేందుకు ఈ ఇద్దరూ ఆసక్తి చూపుతున్నట్టు తెలిసింది.

రెండింటిలో ఒక మహిళకు చాన్స్

శాసనమండలిలో 40మంది సభ్యులు ఉండగా అందులో ముగ్గురే మహిళలు. ఎమ్మెల్యే కోటాలో ఎన్నికైన సత్యవతి రాథోడ్ మంత్రిగా పనిచేస్తుండగా, స్థానిక సంస్థల కోటాలో కల్వకుంట్ల కవిత, పట్టభద్రుల కోటాలో సురభి వాణీదేవి ఎమ్మెల్సీలు ఉన్నారు. ఈ నేపథ్యంలో గవర్నర్ కోటాలో నామినేట్ చేసే ఇద్దరిలో ఒక మహిళకు చాన్స్ ఇచ్చే అవకాశం ఉన్నట్టు తెలిసింది. మైనారిటీ వర్గానికి చెందిన మహిళను గవర్నర్ కోటాలో నామినేట్ చేయాలనే యోచనలో ఉన్న కేసీఆర్ అభ్యర్థి ఎంపిక కోసం కసరత్తు చేస్తున్నట్టు పార్టీ వర్గాలు చెప్తున్నాయి. ఇంతకుముందు గవర్నర్ కోటా ఎమ్మెల్సీగా పాడి కౌశిక్‌రెడ్డి పేరును ప్రభుత్వం సిఫార్సు చేసినా గవర్నర్ తమిళిసై ఆమోదించలేదు. దీనితో ఈసారి గవర్నర్ కోటా అభ్యర్థుల ఎంపికలో కేసీఆర్ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నట్టు సమాచారం. మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, విద్యావేత్త, తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేసిన ఘంటా చక్రపాణి పేర్లు కూడా కేసీఆర్ పరిశీలనలో ఉన్నట్టు తెలిసింది. ఏప్రిల్ రెండోవారంలో కేబినెట్ సమావేశం నిర్వహించి గవర్నర్ కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులను సీఎం ఖరారు చేయనున్నట్టు సమాచారం.

నేడు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకారం

ఎమ్మెల్యే కోటాలో ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికైన ముగ్గురు ఎమ్మెల్సీలు శుక్రవారం ఉదయం 9.30కు శాసనమండలి చైర్మన్ చాంబర్‌లో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీలుగా ఉన్న కుర్మయ్యగారి నవీన్‌కుమార్, వి.గంగాధర్‌గౌడ్, ఎలిమినేటి కృష్ణారెడ్డి ఆరేళ్ల పదవీకాలం గురువారంతో పూర్తయింది. వీరిలో కుర్మయ్యగారి నవీన్‌కుమార్ రెండోసారి ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికకాగా.. మిగతా రెండు స్థానాల్లో కవి, గాయకుడు దేశపతి శ్రీనివాస్, చల్లా వెంకట్రామిరెడ్డి ఎంపికయ్యారు.

చమురు తగ్గినా.. పెట్రోల్ రేటు తగ్గించరేం?

▶ మొదటి పేజీ తరువాయి

అంచుకు చేరిందని విమర్శించారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి మంత్రి కేటీఆర్ గురువారం బహిరంగ లేఖ రాశారు. వివరాలు ఆయన మాటల్లోనే..

"కేంద్ర ప్రభుత్వ వైఫల్యంతో గత 45 ఏళ్లలో ఎన్నడూ లేని స్థాయికి ద్రవ్యోల్బణం పెరిగింది. 2013లో ఒక బ్యారెల్ ముడి చమురు ధర 110 డాలర్లుగా ఉన్న సమయంలో భారత్‌లో లీటరు పెట్రోల్ ధర రూ.76 మాత్రమే. ప్రస్తుతం బ్యారెల్ ముడి చమురు ధర 66 డాలర్లకు తగ్గినా పెట్రోల్ ధర లీటర్‌కు రూ.110 రూపాయలుగా ఉంది. దేశంలో పెట్రోల్ ధరల పెంపునకు కారణం ముడి చమురు కాదు. మోదీ నిర్ణయించిన చమురు ధర లేనని విషయం మరోమారు రుజువైంది. పెట్రోల్, డీజిల్ ధరలను అమాంతం పెంచి సామాన్యుల నడ్డి విరుస్తున్న కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజలకు వెంటనే క్షమాపణ చెప్పాలి.

ప్రజలను మభ్యపెడుతున్నారు

అంతర్జాతీయ ముడి చమురు ధరలను సాకుగా చూపడం, రష్యా– ఉక్రెయిన్ యుద్ధం పేరు చెప్పడం తదితర చర్యలతో మోదీ ప్రభుత్వం దేశ ప్రజలను మభ్య పెడుతోంది. రష్యా నుంచి అతి తక్కువ ధరకు ముడి చమురు దిగుమతి చేసుకుని.. అదే చమురును శుద్ధిచేసి తిరిగి విదేశాలకు కేంద్ర ప్రభుత్వం అమ్ముకుంటోంది. దీంతో ఒకటి రెండు ఆయిల్ కంపెనీలు అడ్డగోలుగా లబ్ధిపొందగా.. ప్రభుత్వానికి వచ్చే విండ్ ఫాల్ పన్నుకు కూడా కేంద్రం గండికొట్టింది. కార్పొరేట్ కంపెనీలకు లబ్ధి చేకూరుస్తూ దేశ ప్రజలను పెట్రోల్ పేరిట మోదీ ప్రభుత్వం దోపిడీ చేస్తోంది. 2014 నుంచి తెలంగాణ వంటి రాష్ట్రాలు ఒక్క రూపాయి వ్యాట్ పెంచకున్నా కేంద్రం మాత్రం సెస్సుల రూపంలో రూ.30 లక్షల కోట్లను ప్రజల జేబుల నుంచి కొల్లగొట్టింది.

గ్యాస్‌లా పెంచేస్తారా?


పెట్రోల్‌ను జీఎస్టీ పరిధిలోకి తేవాలని కొందరు కేంద్ర మంత్రులు చేస్తున్న ప్రకటనలు అనుమానాలు కలిగించేలా ఉన్నాయి. వంట గ్యాస్‌ను జీఎస్టీ పరిధిలో చేర్చి సిలిండర్ ధరను రూ.400 నుంచి రూ.1,200కు కేంద్రం పెంచింది. మరోవైపు ధరల పెరుగుదల అంశం పార్లమెంటులో చర్చకు రాకుండా కేంద్రం కుట్రలు చేస్తోంది. దోపిడీని ఆపకుంటే బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు.." అని తన లేఖలో మంత్రి కేటీఆర్ హెచ్చరించారు.

తెలంగాణలో ఆ దిక్కుమాలిన పార్టీ ఎందుకు?: కేటీఆర్

తెలంగాణకు పసుపు బోర్డు, రైల్వేకోచ్ ఫ్యాక్టరీలను మంజూరు చేసే అవకాశం లేదని పార్లమెంటు వేదికగా మరోమారు కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసిందని.. గుజరాతీ బాసుల చెప్పులు మోసే దౌర్భాగ్యులను ఎనుకున్న ఫలితమిదని కేటీఆర్ ట్విట్టర్‌లో మండిపడ్డారు. "ఏపీ పునర్విభజన చట్టంలో ఇచ్చిన హామీలను మోదీ ప్రభుత్వం విస్మరించడంపై తెలంగాణకు చెందిన వెన్నెముక లేని నలుగురు బీజేపీ ఎంపీలను బాధ్యులను చేయాలి. కోచ్ ఫ్యాక్టరీ, పసుపుబోర్డు, మెట్రో రెండోదశ, ఐటీఐఆర్ ప్రాజెక్టు, గిరిజన వర్సిటీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా.. ఇవేవీ ఇవ్వం.. ఇవ్వం అంటూ ప్రధాని ప్రకటనలు చేస్తున్నారు. ప్రధాని ప్రాధాన్యతలలో తెలంగాణ ఊసే లేనప్పుడు.. తెలంగాణ ప్రజల ప్రాధాన్యత క్రమంలో ప్రధాని ఎందుకు ఉండాలి, తెలంగాణలో ఆ దిక్కుమాలిన పార్టీ ఎందుకు?" అని కేటీఆర్ విమర్శించారు.

కేసీఆర్‌ను ఎందుకు భరించాలి?

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి ట్వీట్



సాక్షి, హైదరాబాద్: 'అసలు కేసీఆర్ తన పార్టీ నుంచే తెలంగాణను తొలగిస్తే, ఆయనను ఈ రాష్ట్రం నుంచి ఎందుకు తొల గించకూడదు?' అంటూ గురువారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ గురువారం ట్వీట్ చేశారు. 'ముఖ్యమంత్రి ప్రధాన బాధ్యతల్లో ప్రజలకు చోటివ్వనపుడు, నిన్ను ఎందుకు భరించాలి? సహించాలి?' అని ట్వీట్‌లో పేర్కొన్నారు. ఉద్యమకారులకు పార్టీలో చోటివ్వం, దళితులకు మూడెకరాలు ఇవ్వం.. దళితులకు ముఖ్యమంత్రి పదవి ఇవ్వం.. ఖాళీలు న్నా ఉద్యోగాలను భర్తీ చేయం.. నిరుద్యోగ భృతి ఇవ్వం.. డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వం.. దళితబంధును అర్హులకు ఇవ్వం.. పంచాయతీ, మున్సిపాలిటీలకు నిధులు ఇవ్వం.. ప్రకటనలే తప్ప ఆలయాలకు సైతం నిధులు ఇవ్వం.. అని సంజయ్ వ్యంగ్యంగా ట్వీట్ చేశారు.

8న రాష్ట్రానికి ప్రధాని!

- అభివృద్ధి పనులు ప్రారంభించే అవకాశం... పరేడ్ గ్రౌండ్స్‌లో బహిరంగ సభకు హాజరు!
- నేటి నడ్డా పర్యటన రద్దు



సాక్షి, హైదరాబాద్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఏప్రిల్ 8న రాష్ట్రానికి రానున్నట్టు బీజేపీ వర్గాలు వెల్లడించాయి. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు, సికింద్రాబాద్–తిరుపతి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభిస్తారని, ఇతర కార్యక్రమాల్లోనూ పాల్గొంటారని తెలిపాయి. శంకుస్థాపన కార్యక్రమం గతంలో రెండుసార్లు వాయిదా పడడంతో దీనిని అధికారికంగా ప్రకటించే విషయంలో రైల్వే, ఇతర అధికారులు ఆచితూచి స్పందిస్తున్నారు. పార్టీ నేతలు మాత్రం మోదీ కార్యక్రమం ఖరారైనట్టే చెబుతున్నారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే బహిరంగ సభలోనూ ప్రధాని ప్రసంగిస్తారని అంటున్నారు. సభకు ఏర్పాట్లు, ప్రధాని పర్యటన విజయవంతం చేయడంపై అంతర్గతంగా పార్టీలో కసరత్తు సాగుతోంది. ఇటీవల ఢిల్లీలో జరిగిన సమావేశంలో తెలంగాణలో కాషాయ జెండాను ఎగురవేస్తామనే ధీమాను మోదీ వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీజేపీని ప్రజలు ఆదరిస్తున్నారని, పార్టీ కార్యక్రమాలకు మంచి స్పందన లభిస్తోందని, అధికారంలోకి వచ్చేందుకు పరిస్థితులు సానుకూలంగా ఉన్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో మోదీ రాష్ట్ర పర్యటనకు రాజకీయంగా ప్రాధాన్యత ఏర్పడిందని రాష్ట్ర ముఖ్య నేతలు చెబుతున్నారు.

అన్నీ వర్చువల్‌గానే..

బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా రాష్ట్ర పర్యటన రద్దయింది. శుక్రవారం సంగారెడ్డిలో జిల్లా పార్టీ కార్యాలయ ప్రారంభానికి నడ్డా రావాల్సి ఉంది. కానీ పర్యటన రద్దు కావడంతో ఢిల్లీ నుంచే వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. భూపాలపల్లి, వరంగల్, జనగామ, మహబూబాబాద్ జిల్లా పార్టీ కార్యాలయాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో నూతనంగా నిర్మించిన పార్టీ కార్యాలయాలను కూడా నడ్డా వర్చువల్‌గానే ప్రారంభిస్తారు. అక్కడి నుంచే కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. సంగారెడ్డిలో జరిగే కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, పార్టీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, జాతీయ ప్రధాన కార్యదర్శులు తరుణ్ చుగ్, సునీల్ బన్సల్ తదితరులు హాజరుకానున్నారు. ఇలావుండగా సాయంత్రం 5.30 గంటలకు హైదరాబాద్ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర పదాధికారులు, జిల్లా అధ్యక్షులు, జిల్లా ఇన్‌చార్జిల సమావేశం జరుగుతుందని బీజేపీ ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

ఆ ఆరు పరీక్షలపై దృష్టి

- రద్దయిన, వాయిదా పడిన పరీక్షల నిర్వహణకు టీఎస్‌పీఎస్సీ చర్యలు
- ఇప్పటికే గ్రూప్–1, ఏఈఈ పరీక్షల తేదీలు ఖరారు చేసిన కమిషన్
- మిగతా పరీక్షలకు త్వరలో తేదీలు ప్రకటించేందుకు కసరత్తు

సాక్షి, హైదరాబాద్: ప్రశ్నపత్రాల లీకేజీ నేపథ్యంలో రద్దయిన, వాయిదా పడిన అర్హత పరీక్షలను మళ్లీ నిర్వహించడంపై టీఎస్‌పీఎస్సీ దృష్టి పెట్టింది. ఈ వార్షిక సంవత్సరంలో 26 ఉద్యోగ ప్రకటనలు జారీ చేసిన కమిషన్, ఏడు పరీక్షలను నిర్వహించగా ఇందులో నాలుగు రద్దయ్యాయి. రెండు పరీక్షలను చివరి నిమిషంలో వాయిదా వేశారు. కాగా ఇప్పటికే గ్రూప్–1 పరీక్ష నిర్వహణ తేదీని ప్రకటించిన కమిషన్.. రెండ్రోజుల క్రితం అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ) పరీక్షల తేదీలను కూడా వెల్లడించింది. మిగతా నాలుగు పరీక్షలకు అతి త్వరలో తేదీలను ప్రకటించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తోంది.

తేదీల సర్దుబాటు ..

ఆ ఆరు పరీక్షలకు కొత్తగా ప్రశ్నపత్రాల రూపకల్పన, పరీక్ష కేంద్రాల ఎంపిక, హాల్‌టికెట్ల జారీ తదితర ప్రక్రియను తిరిగి చేపట్టాల్సి ఉండగా.. ఈ మేరకు చర్యలను టీఎస్‌పీఎస్సీ వేగవంతం చేసింది. పరీక్షల తేదీలను ఖరారు చేసేందుకు వీలుగా.. వీటితో పాటు ఇతర పరీక్షల తేదీల సర్దుబాటు చేపట్టింది. ఈ క్రమంలోనే వచ్చేనెల 4వ తేదీన నిర్వహించాల్సిన హార్టికల్చర్ ఆఫీసర్ అర్హత పరీక్షను జూన్ 17కు వాయిదా వేసింది. గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షను జూన్ 11న నిర్వహించనున్నట్లు ఇప్పటికే ప్రకటించింది. ఏఈఈ పరీక్షలను మే నెల 8, 9, 21 తేదీల్లో నిర్వహించనున్నట్లు బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించిన సంగతి తెలిసిందే. మిగతా నాలుగు పరీక్షలు కూడా మే నెలాఖరులోగా పూర్తి చేసే లక్ష్యంతో ప్రణాళికను తయారు చేస్తోంది.

అభ్యర్థుల ఆందోళన నేపథ్యంలో..

ఒకసారి పరీక్ష రాసిన అభ్యర్థి మళ్లీ అదే పరీక్ష రాయాలంటే కష్టమే. పరీక్షకు తిరిగి పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాల్సిందే. అయినా ఆశించిన ఫలితం రాకపోవచ్చనేది అభ్యర్థుల ప్రధాన ఆందోళన. ఈ నేపథ్యంలోనే ఎక్కువ జాప్యం చేయకుండా వీలైనంత త్వరగా పరీక్షలు నిర్వహించాలని టీఎస్‌పీఎస్సీ భావిస్తోంది.

టీఎస్‌పీఎస్సీ రద్దు చేసిన, వాయిదా వేసిన పరీక్షల వివరాలు...

పరీక్ష	రద్దు/వాయిదా
గ్రూప్–1 ప్రిలిమినరీ	రద్దు
అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్	రద్దు
డివిజినల్ అకౌంట్స్ ఆఫీసర్	రద్దు
అసిస్టెంట్ ఇంజనీర్	రద్దు
టౌన్‌ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీర్	వాయిదా
వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్	వాయిదా

15 పేపర్లు అవుట్!

▶ మొదటి పేజీ తరువాయి

అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ), అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ) టౌన్ ప్లానింగ్ బిజినెస్ ఓవర్సీర్ (టీపీబీఓ), జూనియర్ లెక్చరర్ (జేఎల్), డిస్ట్రిక్ట్ అకౌంట్స్ ఆఫీసర్ (డీఏఓ) పేపర్లు పెన్‌డ్రైవ్‌లో ఉన్నాయని, ఇవన్నీ మాస్టర్ క్వశ్చన్ పేపర్లని సిట్ అధికారులు చెప్తున్నారు. వీటిల్లో ఆయా ప్రశ్నలతో పాటు సమాధానాలు కూడా ఉంటాయి. ఈ కారణంగానే గ్రూప్–1 ప్రిలిమ్స్ ప్రశ్నపత్రాలు తీసుకున్నవారు, ఏఈ పేపర్‌ను ఖరీదు చేసిన వారు.. సిద్ధం కావడం తేలికైంది.

గ్రూప్–1 మెయిన్స్ పేపర్లు కొట్టేసేందుకూ ప్లాన్

గ్రూప్–1, ఏఈ మినహా మిగిలినవి ప్రవీణ్ వద్దే ఉండిపోయాయని, ఖరీదు చేసే వాళ్ల కోసం ప్రయత్నాలు జరుగుతుండగానే స్కామ్ వెలుగు చూసిందని సిట్ అధికారులు పేర్కొంటున్నారు. ప్రవీణ్, రాజశేఖర్‌లు గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలకు సంబంధించిన పేపర్లు కూడా కస్టోడియన్ కంప్యూటర్ నుంచి తస్కరించాలని పథకం వేశారని, ఈ మేరకు షమీమ్, సురేశ్, రమేశ్, ప్రశాంత్‌రెడ్డిలకు సమాచారం ఇచ్చారని ఓ ఉన్నతాధికారి చెప్పారు.

8 గంటల పాటు విచారణ

పోలీసు కస్టడీలో ఉన్న ముగ్గురు నిందితులు షమీమ్, సురేశ్, రమేశ్‌లను సిట్ పోలీసులు రెండోరోజు గురువారమూ 8 గంటల పాటు ప్రశ్నించారు. ఎల్బీ నగర్, సైదాబాద్, ఉప్పల్ ప్రాంతాల్లోని వారి వారి ఇళ్లకు వెళ్లి ఆధారాల కోసం సోదాలు చేశారు. గ్రూప్–1 ప్రిలిమ్స్‌కు సంబంధించి మాస్టర్ ప్రశ్నపత్రాల కాపీలు స్వాధీనం చేసుకున్నారు. కస్టోడియన్ శంకరలక్ష్మి వాంగ్మూలం గురువారం మరోసారి నమోదు చేశారు. విదేశంలో ఉన్న ప్రశాంత్‌రెడ్డిపై లుక్ అవుట్ సర్క్యులర్ జారీ చేశారు.

కోరం లేకున్నా.. బడ్జెట్ ఆమోదమే!

▶ మొదటి పేజీ తరువాయి

పాలకమండళ్లు సమావేశాలు నిర్వహించి రాబోయే వార్షిక బడ్జెట్లకు ఆమోదం తెలిపాయి. అయితే ఈసారి పురపాలికల్లో అవిశ్వాసాల రగడ మొదలవడంతో చాలా మునిసిపాలిటీల్లో ఈ ప్రక్రియ ఆలస్యమైంది. మునిసిపల్ చట్టసవరణకు గవర్నర్ ఆమోదం తెలపకపోవడంతో మూడేళ్ల పదవీకాలం పూర్తయిన మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో ఫిబ్రవరిలో అవిశ్వాసాల ప్రక్రియ సాగింది. ఇందులో భాగంగా జగిత్యాల మునిసిపల్ చైర్‌పర్సన్ ఏకంగా రాజీనామా కూడా చేశారు. సీఎం కేసీఆర్ ప్రాతినిథ్యం వహిస్తున్న గజ్వేల్‌తోపాటు హుజూరాబాద్, వికారాబాద్, తాండూర్, యాదగిరిగుట్ట, ఆలేరు, చండూరు, జనగాం, దమ్మాయిగూడెం, జవహర్‌నగర్ కార్పొరేషన్, చౌటుప్పల్, నాగార్జునసాగర్, ఇబ్రహీంపట్నం తదితర 37 మున్సిపల్ పాలకమండళ్లకు సంబంధించి అవిశ్వాస తీర్మానం నోటీసులు ఇచ్చారు. అవిశ్వాస ప్రతిపాదనల గడువును మూడేళ్ల పదవీకాలం నుంచి నాలుగేళ్లకు పెంచిన సవరణ చట్టం గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉంది. ఈ క్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్‌లే హైకోర్టును ఆశ్రయించి 29 చోట్ల స్టే తెచ్చుకున్నారు. మిగతా మునిసిపాలిటీలకు సంబంధించి కూడా ఎలాంటి పురోగతి లేదు. ఈ పరిస్థితుల్లో శుక్రవారం ముగియనున్న పాత ఆర్థిక సంవత్సరంలో వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టి ఆమోదించాల్సిన తప్పనిసరి పరిస్థితి ఏర్పడింది.

కోరంతో సంబంధం లేకుండా ఆమోదం

అవిశ్వాస తీర్మానం నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో మునిసిపల్ చైర్‌పర్సన్లు నిర్వహించే బడ్జెట్ సమావేశాలకు సభ్యులు హాజరుకాని పరిస్థితి నెలకొంది. ఇటీవల కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో బడ్జెట్ సమావేశం కోరం లేక తొలిరోజు వాయిదా పడింది. మరుసటిరోజు కోరంతో సంబంధం లేకుండా సమావేశాన్ని నిర్వహించి బడ్జెట్‌ను ఆమోదించారు. అదేజిల్లాకు చెందిన కొత్తపల్లి మునిసిపాలిటీలో అవిశ్వాస నోటీసు ఇవ్వకపోయినా, సరిపడా సభ్యులు రాలేదు. అయినా కోరంతో సంబంధం లేకుండా మరుసటిరోజు బడ్జెట్ ఆమోదించారు.

అభివృద్ధిని అడ్డుకునే కుట్రల్లో భాగమే..

రాష్ట్రంలోని మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో జరుగుతున్న అభివృద్ధిని అడ్డుకునే కుట్రల్లో భాగమే 'అవిశ్వాసాలు'. నాలుగేళ్ల పదవీకాలం వరకు అవిశ్వాస తీర్మానానికి ఆస్కారం లేకుండా చేసిన సవరణ చట్టానికి గవర్నర్ ఆమోదించకపోవడంతో ఈ గందరగోళం నెలకొంది. బడ్జెట్ ఆమోదానికి కోరంతో సంబంధం లేదు. తొలిరోజు కోరం లేకుండా వాయిదా పడితే, మరుసటి రోజు ఏకపక్షంగా ఆమోదించే అధికారం సభకు ఉంటుంది.

– వెనిరెడ్డి రాజు, మునిసిపల్ చాంబర్స్ చైర్మన్



1988 నుండి విద్యార్థుల
విజయానికి
కట్టుబడి ఉన్నాము
Aakash
+ BYJU'S
JEE (Adv.) 2021 IISc Bangalore 58 AIR
Anmol Arichwal
4 Year Classroom
NEET (UG) 2021 720/720 AIIMS Delhi 1 AIR
Mrinal Kutteri
2 Year Classroom
JEE (Adv.) 2020 MIT USA 1 AIR
Chirag Falor
4 Year Classroom
NEET (UG) 2022 715/720 AIIMS Delhi 2 AIR
Vatsa A Batra
2 Year Classroom
JEE (MAIN) 2023 Session-1 100 Percentile Overall
Dhruv Sanjay Jain
4 Year Classroom
NEET (UG) 2022 715/720 AIIMS Delhi 3 AIR
Hrishikesh N Gangule
2 Year Classroom
JEE (Adv.) 2022 ALL INDIA RANK (Female) IIT Bombay 1 AIR
Tanishka Kabra
4 Year Classroom
NEET (UG) 2021 720/720 AIIMS Delhi 1 AIR
Tanmay Gupta
2 Year Classroom
NEET (UG) 2021 720/720 AIIMS Delhi 1 AIR
Karthika G Nair
2 Year Classroom
ఓమ్నీ ఛానెల్ లెర్నింగ్
ప్రణాళికాబద్ధంగా రూపొందించిన స్టడీ మెటీరియల్
క్రమరీతిలో పరీక్షలు మరియు మూల్యాంకనం
MEDICAL (NEET)
Audi Prep- Audiobook for NEET
Know Your NCERT
NCERT Maps-NEET
NEET Challenger App
ENGINEERING (JEE/EAMCET)
JEE Challenger App
Focused Revision Program
JEE Archive, Video Solution
Skull Crusher Quiz
Aakash EAMCET Test Series
FOUNDATION(Class 8-10)*
Activity Based Learning
Quizzes & Workshops
Experiment based videos
Flash Cards & Lecture PPTs
2022లో NEET మరియు JEEలో
93,500+ ర్యాంకర్లు
భారతదేశం అంతటా
300+ కేంద్రాలు
5000+
నిపుణులైన అధ్యాపకులు
Our Students Selected in Top Medical & Engineering Colleges from Telangana Branches (Classroom Programs)
NEET-UG 2022
Yash Sethi Maulana Azad Medical College, New Delhi
Rumaisa Zainab Khan JIPMER, Puducherry
Thrishala Arrabelly. JIPMER, Puducherry
Bharat Goel AIIMS, New Delhi
Yaramada Manopreeth Reddy AIIMS, Bhubaneswar
Rekha S Parida AIIMS, Bhubaneswar
Medha Harshini AIIMS, Nagpur
and many more...
JEE (Main & Advanced) 2022
Aasritha Chekoti IIT, Madras
Steve Austin Samuel A IIT, Bombay
Asaduddin Ahmed Ahmed IIT, Pallakad
T Naga Sai Balaji IIT, Madras
Gouthami Berelli IIT, Pallakad
Akash Reddy Kontham IIT, Guwahati
Jishnu Manglam IIT, Kharagpur
and many more...
Though every care has been taken to publish the result correctly, yet Aakash Educational Services Ltd. shall not be responsible for inadvertent error, if any.
అడ్మిషన్లు జరుగుచున్నవి
90% వరకు స్కాలర్‌షిప్ పొందండి*
తక్షణ ప్రవేశం మరియు స్కాలర్‌షిప్ పరీక్ష కోసం హాజరు అవ్వండి. ఉచితంగా నమోదు చేసుకోవడానికి, iacst.aakash.ac.in ని సందర్శించండి లేదా QR కోడ్‌ని స్కాన్ చేయండి
*T&C apply.
Crash Courses
NEET / JEE / EAMCET 2023
Hurry! Batches filling fast
లాంగ్ టర్మ్ / XII ఉత్తీర్ణులైన బ్యాచ్‌లు
NEET / JEE / EAMCET 2024
12 Branches in Telangana
HYDERABAD
(Himayat Nagar): 8800013001
(Kondapur): 8800897955
(Kothapet): 8800013004
(Kukatpally): 8800013003
(Shaikpet): 8800013006
(S R Nagar): 8800013002
(Trimulgherry): 8800013009
KARIMNAGAR: 8800013007
WARANGAL: 8800013016
NIZAMABAD: 8800857521
Scan code to locate the nearest centre
Aakash BYJU'S Information Centre: Mancherial: 9311374585 | Bhupalpally: 9311734474.
Two more Aakash BYJU'S Branches in Hyderabad now Suchitra: 8800948902 & Habsiguda: 8800950201
Andhra Pradesh Branches: Kadapa: 8800898028, Kakinada: 8800789546 , Kurnool: 8800013008, Nellore: 8800012982, Rajahmundry: 8800012983, Tirupati: 8800013010, Vijayawada: 8800013015, VISAKHAPATNAM: Dwarka Nagar: 8800013011, Gajuwaka: 8800013012, Madhurawada: 8800548130. Aakash BYJU'S Branch now in Guntur: 8800971868. Aakash BYJU'S Information Centre: Ongole: 9311324089 | Vizianagaram: 8448799006
Download Aakash App
GET IT ON Google Play
Download on the App Store
CALL (TOLL-FREE)
1800-102-2727
VISIT
aakash.ac.in
Aakash BYJU'S

ఎవరైతే తమ సాక్ష్యాల మీద స్థిరంగా ఉంటారో; మరియు ఎవరైతే తమ నమాజులను కాపాడుకుంటారో; ఇలాంటి వారంతా సగౌరవంగా స్వర్గ వనాలలో ఉంటారు.

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, మార్చి, 31

ఎన్నికల కర్ణాటకం

రానున్న 2024 లోక్‌సభ ఎన్నికల కురుక్షేత్రం ఎలా ఉండనుంది? దానికి ట్రైలర్ లాంటి ఈ ఏటి తొలి భారీ ఎన్నికల పోరు కర్ణాటక చూస్తే సరి. అందుకు ఇప్పుడు రంగం సిద్ధమైంది. కీలక దక్షిణాది రాష్ట్రాల్లో ఒకటైన కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలు ఒకే విడతలో రానున్న మే 10న జరుగుతాయని కేంద్ర ఎన్నికల సంఘం బుధవారం ప్రకటించేసరికి వేడి మరింత పెరిగింది. 224 స్థానాలున్న కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలు వివిధ కారణాల రీత్యా ప్రతి పార్టీకీ కీలకమే. దక్షిణాదికి ముఖద్వారం లాంటి కన్నడ కోటపై పట్టు బిగించడం బీజేపీకి ముఖ్యం. జీఎస్డీపీలో 8వ ర్యాంక్‌లో ఉన్న ఈ పెద్ద ధనిక రాష్ట్రంలో గెలవడం ద్వారా పుంజుకోవడం కాంగ్రెస్‌కు కీలకం. గత ఎన్నికల్లో మూడో స్థానంలో నిలిచినా కాంగ్రెస్‌తో జట్టు కట్టి, ఏడాది పాటు సీఎం పీఠంపై తమవాణ్ణి కూర్చోబెట్టుకున్న జేడీ–ఎస్ తన ప్రాసంగికతను నిరూపించుకోవడానికి ఈ ఎన్నికలు ప్రధానం. వెరసి, ఈసారి మతం, కులం, అవినీతి ప్రధానాంశాలు కానున్న కర్ణాటక ఎన్నికల సమరం అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది.

కాంగ్రెస్, జనతాదళ్– సెక్యులర్ (జేడీ–ఎస్) పార్టీలు ఇప్పటికే అభ్యర్థుల తొలి విడత జాబితా విడుదల చేసి ప్రచారంలో దూసుకుపోతుంటే, బీజేపీ ఏప్రిల్ మొదటి వారానికి జాబితాతో సిద్ధమవుతుందట. నిజానికి కర్ణాటకలో బీజేపీ తొలి విజయం ఈనాటిది కాదు. 2008లోనే స్వతంత్ర ఎమ్మెల్యేలతో కలసి, ఆ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వ పీఠంపై కూర్చుంది. దక్షిణాదిన అదే తొలి బీజేపీ సర్కార్. అప్పట్లో ఒకరికి ముగ్గురు ముఖ్యమంత్రులు (యెడియూరప్ప, సదానంద్ గౌడ, జగదీశ్ షెట్టర్) మారారు. ఇక, 2018లో ప్రజాతీర్పు విస్పష్టంగా లేక, హంగ్ అసెంబ్లీ ఏర్పడడంతో ఎన్నికల అనంతర విన్యాసాలు మరింత రంజుగా సాగాయి. ఆ ఎన్నికల్లో అతి పెద్ద పార్టీగా బీజేపీ అవతరించింది. దేవెగౌడ సారథ్యంలోని జేడీ(ఎస్)– కాంగ్రెస్ పార్టీల ఎన్నికల అనంతర పొత్తు పెట్టుకున్నాయి. అతి పెద్ద పార్టీగా బీజేపీ పక్షాన ప్రభుత్వ ఏర్పాటుకు ముందుకొచ్చిన యెడియూరప్ప గద్దెనెక్కారు కానీ, తగినంత మెజారిటీ లేక విశ్వాస పరీక్షకు పది నిమిషాల ముందు పక్కకు తప్పుకోవాల్సి వచ్చింది.

ఆపైన దేవెగౌడ కుమారుడు కుమారస్వామి సీఎంగా జేడీ (ఎస్)– కాంగ్రెస్‌ల ప్రభుత్వం ఏర్పాటైంది. తీరా 'ఆపరేషన్ కమలం–2' ద్వారా 16 మంది ఎమ్మెల్యేలను బీజేపీ తన వైపు తిప్పుకుంది. అలా ఆ సంకీర్ణ సర్కార్ 14 నెలలకే కుప్పకూలింది. మళ్ళీ యెడియూరప్ప అధికారంలోకి వచ్చారు. తీరా రెండేళ్ళకే ఊహించని పరిణామాలతో యెడియూరప్ప ఆ పీఠం బసవరాజ్ బొమ్మైకి కట్టబెట్టారు. అలా 2018 నుంచి అయిదేళ్ళలో నాలుగు విడతల్లో ముగ్గురు సీఎంలుగా వచ్చారు. అసమర్థ పాలన, 40 శాతం కమిషన్ అవినీతి ముద్ర పడేసరికి కాషాయపార్టీ సతమతమవుతోంది. కర్ణాటకలో 7 శాతం ఎస్టీలు, 17 శాతం ఎస్సీలు, 14 శాతం లింగాయత్‌లు, 11 శాతం ఒక్కళిగలని లెక్క. అందుకే, కాంగ్రెస్ 'అహింద' (మైనారిటీలు, వెనుకబడిన వర్గాలు, దళితుల) ఓటుబ్యాంక్‌పై ఆధారపడుతుంటే, దాన్ని ఢీ కొనడానికి బీజేపీ సోషల్ ఇంజనీరింగ్‌కు దిగింది. ఓబీసీ కింద ముస్లిమ్‌లకిస్తున్న 4 శాతం కోటాను తొలగించి, రాష్ట్రంలో బలమైన ఓటుబ్యాంకైన లింగాయత్‌లు, ఒక్కళిగలకు పంచింది. ఎస్సీలకు 15 నుంచి 17 శాతానికీ, ఎస్టీలకు 3 నుంచి 7 శాతానికీ రిజర్వేషన్‌ను పెంచింది.

రిజర్వేషన్లలో తాజా మార్పు తమకు కలిసొస్తుందని బీజేపీ భావిస్తుంటే, కోటా తొలగింపుపై ముస్లిముల్లో, ఎస్సీల్లో అంతర్గత కోటాపై బంజారాల్లో వెల్లువెత్తుతున్న నిరసన ఆ పార్టీకి తలనొప్పి. తాజా ఎన్నికల సర్వేల్లో సీ–ఓటర్ లాంటివి కాంగ్రెస్ ఘనవిజయం ఖరారంటే, 'జీ' లాంటివి కాంగ్రెస్, బీజేపీల మధ్య పోరు నువ్వా, నేనా అన్నట్టు ఉంటుందంటున్నాయి. అంచనాలెలా ఉన్నా బీజేపీ ఈ ఎన్నికల్ని ఆషామాషీగా తీసుకోవట్లేదు. గత 3 నెలల్లో 7సార్లు మోదీ కన్నడసీమలో పర్యటించడమే అందుకు ఉదాహరణ. మోదీతో పాటు అమిత్ షా, పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డా, గత ఎన్నికల్లో 'టిప్పు సుల్తాన్ వర్సెస్ హనుమాన్' అంటూ భావోద్వేగాలు రెచ్చగొట్టిన యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ సహా పలువురు దిగ్గజాలు తాజా ఎన్నికల ప్రచారానికి దిగుతున్నారు.

మొత్తం 5.24 కోట్ల ఓటర్లున్న కర్ణాటకలో తొలిసారి ఓటుహక్కు వచ్చినవారు నిరుటితో పోలిస్తే 9.17 లక్షలు పెరిగారు. అలాగే, 80 ఏళ్ళు పైబడిన దాదాపు 1.5 లక్షల మందికీ, దివ్యాంగులు 5.6 లక్షల మందికీ తొలిసారిగా ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకొనే వీలు కల్పిస్తున్నారు. ఓటింగ్ శాతం పెంచడానికీ, పట్టణ ఓటర్లలో నిరాసక్తతను తగ్గించడానికీ ఇలాంటి చర్యలని అధికారిక కథనం. అయితే, ఇప్పటికే ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై అనుమానాలు తొలగని అనేక పార్టీలు... ఇక ఇంటి నుంచే ఓటింగ్ అనేది అధికారిక యంత్రాంగ దుర్వినియోగానికి దారి తీస్తుందని ఆందోళన చెందుతున్నాయి. ఆ భయాందోళనల్ని బాపాల్సిన బాధ్యత ఎన్నికల సంఘానిదే.

ఎవరి బలాబలాలు ఎలా ఉన్నా ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడానికి చాలా ముందు నుంచే ప్రతి పార్టీ యాత్రలు, ప్రచారం మొదలెట్టేసింది. ఓటర్లకు డిజిటల్ వాచీలు, రైస్ కుక్కర్ల లాంటి కానుకల పంపిణీ యథేచ్ఛగా సాగుతోంది. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి రావడానికి ముందే రూ. 80 కోట్ల పైగా నగదు చిక్కింది. ఇప్పుడే ఇలా ఉంటే, రేపు ప్రజలు తిరుగులేని తీర్పు ఇస్తే తప్ప ఎన్నికల అనంతరం ఎలా ఉంటుందో ఊహించవచ్చు. ఓట్ల కోసం కోట్లు కుమ్మరిస్తున్న పార్టీలు... ఎన్నికలయ్యాక ఎమ్మెల్యేల బేరసారాలకూ అదే పంథా అనుసరిస్తే ఆశ్చర్యం లేదు. అలా జరిగితే మరోసారి ప్రజాస్వామ్యం పరిహాసం పాలవుతుంది. ఇటీవలి అనేక ఎన్నికల లాగే కర్ణాటకలోనూ ఫలితాల అనంతరమే అసలు నాటకం మొదలుకావచ్చు. దాని కోసం మే 13 దాకా ఆగాల్సిందే!

ప్రజాస్వామ్యానికి పరీక్షా సమయం

విశ్లేషణ



ఎస్.వై. ఖురేషీ

న్యాయమూర్తి శిక్ష విధిస్తూ ఇచ్చిన తీర్పుపై సంతకం పెట్టిన వెంటనే 'అనర్హత' అమల్లోకి వచ్చేస్తుందని మాజీ అటార్నీ జనరల్ ఒకరు అన్నారు. విద్వేషపూరిత రాజకీయాలు పెచ్చరిల్లుతున్న ఈ తరుణంలో రెండేళ్ల జైలుశిక్ష పడగల ఐపీసీ సెక్షన్ 153(ఎ), సెక్షన్ 505 పరీక్షకు ఎంతమంది రాజకీయ నేతలు నిలబడగలరు? ఈ రెండు సెక్షన్లూ దేని గురించో తెలుసా? మతం, భాషల ఆధారంగా సమాజంలో శత్రుత్వాన్ని పెంపొందించడం! కాబట్టి, కొంతమంది ఎంపీలను ఎంపిక చేసుకుని మరీ సభ్యత్వాలను రద్దు చేసే ప్రయత్నం ఎందుకు? ప్రజాస్వామ్యం పచ్చగా ఉండాలంటే ప్రతిపక్షం తప్పనిసరి అన్నది గుర్తుంచుకోవాలి. పరువునష్టం కేసుల విషయంలో చట్టాలను సమీక్షించేందుకు ఇదే సరైన తరుణం.

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వం రద్దయిపోయింది. న్యాయపరంగా, రాజకీయంగా దీని పరిణామాలు ఎలా ఉండనున్నాయన్న ప్రశ్నలు చాలామందిలో తలెత్తుతున్నాయి. రాజకీయ వర్గాల్లో ఇప్పటికే చలామణీలో ఉన్న ప్రశ్నలతోపాటు సభ్యత్వ రద్దుతో రాగల ముఖ్యమైన సరికొత్త సందేహాలకు సమాధానాలు వెతికే ప్రయత్నం చేద్దాం. స్థూలంగా చెప్పాలంటే, దేశ పార్లమెంటరీ ప్రజాస్వామ్యం భవిష్యత్తు ఏమిటన్నది తరచిచూద్దాం.

సూరత్‌లోని మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి మార్చి 23న పరువునష్టం దావా కేసులో రాహుల్ గాంధీకి రెండేళ్ల జైలుశిక్షతోపాటు రూ.15,000 జరిమానా విధించారు. ఇండియన్ పీనల్ కోడ్ సెక్షన్ 499, 500ల కింద దోషిగా నిర్ధారించారు. శిక్ష అమలును నెల రోజుల పాటు స్తంభింపజేసి, హైకోర్టును ఆశ్రయించేందుకు వీలుగా బెయిల్ ఇచ్చారు. అయితే న్యాయమూర్తి తీర్పు వెలువరించిన మరుసటి రోజే లోక్‌సభ కార్యాలయం రాహుల్ గాంధీ సభ్యత్వం రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. దీనిపై దేశవ్యాప్తంగా కాంగ్రెస్ కార్యకర్తలు ఆందోళనలకు దిగిన విషయం తెలిసిందే. ఇందుకు బదులు కాంగ్రెస్ నేతలు శిక్ష రద్దును కోరుతూ హైకోర్టును ఆశ్రయించి ఉండాల్సింది. ఈ సమస్యకు పరిష్కారం న్యాయస్థానాల్లోనే లభిస్తుంది కానీ వీధుల్లో కాదు.

హైకోర్టులు శిక్షను నిలిపివేయడం లేదా రద్దు చేయడం వల్ల మాత్రమే రాహుల్ గాంధీ మళ్లీ లోక్‌సభ సభ్యుడు కాగలరు. 2013 నాటి లిలీ థామస్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం ఏదైనా ఒక కేసులో శిక్ష ప్రకటించిన వెంటనే లోక్‌సభ సభ్యత్వం దానంతటదే రద్దయిపోతుంది. అప్పటి నుంచి ఇప్పటివరకూ ఆర్జేడీ నేత లాలూ ప్రసాద్ యాదవ్ సహా దాదాపు 20 మంది తమ సభ్యత్వాలను కోల్పోయిన విషయం ప్రస్తావనార్హం.

లోక్‌సభ కార్యాలయం తొందరపాటు?

రాహుల్ గాంధీ సభ్యత్వం రద్దు చేసే విషయంలో లోక్‌సభ కార్యాలయం తొందరపడిందా? మాజీ అటార్నీ జనరల్ ఒకరు చెప్పిన దాని ప్రకారం, లోక్‌సభ కార్యాలయానికి ఇంతకు మించిన ప్రత్యామ్నాయం లేదు. న్యాయమూర్తి శిక్ష విధిస్తూ ఇచ్చిన తీర్పుపై సంతకం పెట్టిన వెంటనే 'అనర్హత' అమల్లోకి వచ్చేస్తుందని తెలిపారు. అయితే లక్షద్వీప్ ఎంపీ విషయంలో ఇందుకు విరుద్ధంగా జరిగిన విషయాన్ని ఆయన ప్రస్తావించలేదు.

హత్యాయత్నం చేశాడన్న ఆరోపణలపై కేరళ కోర్టు ఒకటి మహమ్మద్ ఫైజల్‌కు పదేళ్ల జైలు శిక్ష విధించింది. రెండు రోజుల తరువాత ఆయన పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేస్తూ లోక్‌సభ సెక్రటేరియట్ నోటిఫికేషన్ జారీ చేసింది. లక్షద్వీప్ నియోజకవర్గ ఉప ఎన్నిక నిర్వహించనున్నట్లు ఎన్నికల కమిషన్ 2023 జనవరి 18న ప్రకటించింది కూడా. అయితే వారం రోజుల తరువాత కేరళ హైకోర్టు



మహమ్మద్ ఫైజల్ శిక్షపై స్టే విధించింది. దీంతో సుప్రీంకోర్టు ఉప ఎన్నికను కూడా తాత్కాలికంగా నిలిపివేసింది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, జనవరి 25 నుంచి మార్చి 29వ తేదీ వరకూ మహమ్మద్ ఫైజల్ లోక్‌సభ సభ్యత్వాన్ని పునరుద్ధరించకపోవడం! ఉన్నత న్యాయస్థానం శిక్షపై స్టే విధించిన వెంటనే లోక్‌సభ్య సభ్యత్వం దానంతటదే పునరుద్ధరింపబడుతుందా, లేదా అన్న స్పష్టత మాజీ అటార్నీ జనరల్ ఇవ్వలేకపోయారు. (అయితే, సుప్రీంకోర్టులో ఈ కేసు విచారణకు వచ్చేందుకు కొన్ని గంటల ముందు ఫైజల్ సభ్యత్వాన్ని పునరుద్ధరించిన విషయం తెలిసిందే.)

చట్టాల్లోని ఈ లోపం ఎంపిక చేసిన వారిపై వేగంగా చర్యలు తీసుకునేందుకు అవకాశం కల్పిస్తుందన్న వాదన ఉంది. కోర్టుల తీర్పుల అమలును ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేయడం కోర్టు ధిక్కారం కిందకు రాదా? 2018లో ఎన్నికల కమిషన్, లోక్ ప్రహరీ మధ్య జరిగిన ఒక కేసులో సుప్రీంకోర్టు తీర్పునిస్తూ... అప్పీలు పెండింగ్‌లో ఉండి ఉన్నత న్యాయస్థానాలు శిక్షపై స్టే విధిస్తే, శిక్ష పరిణామంగా అమల్లోకి వచ్చే సభ్యత్వ రద్దు పనిచేయదని విస్పష్టంగా తెలిపింది.

రాహుల్ కేసులో ఎన్నో సందేహాలు...

రాహుల్ గాంధీపై సూరత్ మేజిస్ట్రేట్ కోర్టులో దాఖలైన కేసుపై ఎన్నో సందేహాలున్నాయి. కేసు పిటిషనర్ గత ఏడాదే హైకోర్టు నుంచి విచారణపై ఎందుకు స్టే తెచ్చుకున్నారన్నది ఒక ప్రశ్న. దీని ఫలితంగా కేసు విచారణ దాదాపు 12 నెలల పాటు ఆలస్యమయ్యేందుకు పిటిషనర్ కారణమయ్యారు. అదనపు సాక్ష్యాలేవీ వెలుగులోకి రాని నేపథ్యంలో ఈ ఏడాది స్టే ఎత్తేయించుకునేందుకు ఏ రకమైన పరిణామాలు కారణమయ్యాయన్నదీ అస్పష్టమే. పైగా ఈ ఏడాది ఫిబ్రవరిలో సూరత్ కోర్టు మేజిస్ట్రేట్ ఎందుకు మారారు?

కర్ణాటకలోని కోలార్‌లో రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు క్రిమినల్ డిఫమేషన్ కిందకు వస్తాయా? లేక సివిల్ డిఫమేషన్ పరిధిలోకా? 2019 ఏప్రిల్ 13న ఎన్నికల ర్యాలీ సందర్భంగా రాహుల్ అన్నది ఇదీ: ''ఒక చిన్న ప్రశ్న... ఈ దొంగలందరి ఇంటిపేర్లు మోదీ, మోదీ, మోదీ అనే ఎందుకుంది? నీరవ్ మోదీ, లలిత్ మోదీ, నరేంద్ర మోదీ...'' ఈ వ్యాఖ్య పైనే పరువు నష్టం కేసుల్లో గరిష్ఠంగా విధించగల రెండేళ్ల జైలు శిక్ష విధించవచ్చా? పార్లమెంటు సభ్యత్వం రద్దయ్యేందుకు కనీసం రెండేళ్ల జైలు శిక్ష పడాలన్నది ఇక్కడ కాకతాళీయమేనా?

అన్నింటికంటే ముఖ్యంగా మనలాంటి దేశంలో, విద్వేషపూరిత రాజకీయాలు పెచ్చరిల్లుతున్న ఈ తరుణంలో రెండేళ్ల జైలుశిక్ష పడగల ఐపీసీ సెక్షన్ 153(ఎ), సెక్షన్ 505 పరీక్షకు ఎంతమంది రాజకీయ నేతలు నిలబడగలరు? ఈ రెండింటిలో దేని కిందనైనా శిక్ష పడితే ప్రజా ప్రాతినిధ్య చట్టం సెక్షన్ 8 కింద చట్టసభల సభ్యత్వం రద్దయిపోతుంది. ఈ రెండు సెక్షన్లూ దేని గురించో తెలుసా? మతం, భాషల ఆధారంగా సమాజంలో శత్రుత్వాన్ని పెంపొందించడం! కాబట్టి, కొంతమంది ఎంపీలను ఎంపిక చేసుకుని మరీ వారి సభ్యత్వాలను రద్దు చేసే ప్రయత్నం ఎందుకు? అధికార పక్షంలో ఉంటూ పైన చెప్పిన సెక్షన్ల పరిధిలోకి రాగలవారిని చూసీచూడనట్లు వదిలేయడం ఎందుకు? అధికార పక్షం స్వయంగా చెబుతున్నట్లుగా చట్టం అందరికీ సమానమే, అందరూ చట్టం ముందు సమానులే కావాలి కదా?

సమీక్షకు ఇదే తరుణం...

నా దృష్టిలో పరువునష్టం కేసుల విషయంలో చట్టాలను సమీక్షించేందుకు ఇదే సరైన తరుణం. యునైటెడ్ కింగ్‌డమ్, యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా, శ్రీలంక తదితర దేశాల్లో ఇప్పటికే పరువు నష్టం దావాల 'డీక్రిమినలైజేషన్' జరిగింది. ఆయా దేశాల్లో ఇప్పుడు పరువు నష్టం అనేది క్రిమినల్ నేరం కాదు. భారత్ కూడా ఇదే పద్ధతిని అనుసరించాలి.

చివరిగా ఇకపై ఇలాంటి వ్యవహారాలు తగిన పద్ధతి ఆధారంగా న్యాయస్థానాల ద్వారా మాత్రమే జరగాలి. సభ్యత్వ రద్దుపై తీర్పు అనేది వీధుల్లో చర్చించే అంశం కానే కాదు. రాహుల్ లోక్‌సభ సభ్యత్వ రద్దు తాలూకు రాజకీయ పరిణామాలు ఇప్పుడిప్పుడే నెమ్మదిగా తెలుస్తున్నాయి. ఇవి ఎక్కడికి దారితీస్తాయన్నది వేచి చూడాల్సిన అంశం. ఇంకో ఏడాదిలో సాధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో దీనికి మరింత ప్రాధాన్యం ఏర్పడుతోంది. న్యాయపరంగా లేదా రాజకీయాల్లో ఫలితాలు ఎలా ఉన్నప్పటికీ అందరూ అంగీకరించాల్సిన విషయం ఒకటి ఉంది... ప్రజాస్వామ్యం పచ్చగా ఉండాలంటే ప్రతిపక్షం తప్పనిసరి అన్నది అందరూ గుర్తుంచుకోవాలి. ప్రతిపక్షాలను చంపేసే ప్రయత్నాలకు ఫుల్‌స్టాప్ పడాల్సిందే!

వ్యాసకర్త కేంద్ర మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్

('ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

అదే గొప్పతనం



శ్రీరాముడిని ఆయన జీవితం పర్ఫెక్టుగా ఉన్నందుకు మనం పూజించడం లేదు; కానీ ఆయన్ని సూపర్‌స్టార్ చేసినదేమంటే, ఉన్న పరిస్థితులకు సాధ్యమైనంత అత్యుత్తమమైన పద్ధతిలో స్పందించగలగడం!

– జగ్గీ వాసుదేవ్, ఆధ్యాత్మిక బోధకుడు

వ్యక్తిపూజ



ఒకప్పుడు పీవీ నరసింహారావు పార్థివ దేహాన్ని కాంగ్రెస్ పార్టీ హెడ్ క్వార్టర్‌లోకి తేకుండా గేట్లు మూసేసిన బానిసలు, ఇప్పుడు రాహుల్ గాంధీకి తమ బంగళాలను వాడుకొమ్మని చెబుతున్నారు. వ్యక్తిపూజ అనేది వారి నరనరాల్లో ఉంది.

– కపిల్ కొమిరెడ్డి, రచయిత

చిరు మేలు



అవును, చిరు ధాన్యాల్లో ఉండే అత్యధిక పీచుదనం వల్ల అవి మధుమేహానికి మంచివి. పీచు జీర్ణక్రియను నెమ్మదిగా జరిగేట్టు చేస్తుంది. దీని ఫలితంగా, చక్కెర రక్తంలోకి నెమ్మదిగా కలుస్తుంది. దానివల్ల ఉన్నట్టుండి రక్తంలో చక్కెర పెరిగే రిస్కు తగ్గుతుంది.

– వి. మోహన్, డయబెటాలజిస్ట్

పట్టుకోలేక...



దేశంలోని ప్రతి సీసీ టీవీకి అమృత్ పాల్ సింగ్ (ఖలిస్తాన్ వేర్పాటువాద నాయకుడు) ఫోజులు ఇవ్వడం పూర్తయ్యేదాకా పంజాబ్ పోలీసులు, అజిత్ దోవల్ బలగాలు వేచి ఉంటున్నాయి. అప్పటిదాకా పట్టుకునేట్టు లేరు.

– హర్తోష్ సింగ్ బాల్, సంపాదకుడు

అప్పుడే కాపాడగలం



మీరు ప్రజాస్వామ్యాన్ని కాపాడాలనుకుంటే, సత్యాన్ని పరిశోధించి ప్రచురించే సంస్థలను గౌరవించే నాయకులకు ఓటేయండి. తమకు నచ్చిన సత్యాన్ని ఎన్నుకోవడం కాకుండా, ఏ ప్రభుత్వాన్నయినా ఎన్నుకునే హక్కు జనానికి ఉందని చెప్పే పార్టీకి ఓటేయండి.

– యువల్ నోవా హరారీ, చరిత్రకారుడు

సారాంశం

సరికొండ చలపతి

వారికి పరీక్ష.. వీరికి పాలిటిక్స్

కథలన్నీ అనగనగాతో ప్రారంభం కాకపోవచ్చు, ఓ లీకేజీతో స్టార్టయి... పాలిటిక్స్‌తో మహాభారత కథ రేంజ్‌కు పెరగవచ్చు. మనం ఇప్పుడు అనగనగా ఓ ఊరుతో మొదలుపెడదాం... ఆ ఊరిలో ఓ ఆసామికి పాలిటిక్స్‌పై ఇంట్రెస్టు. ఎన్నటికయినా సర్పంచ్ కాకపోతానా అని ఆశ. అయితే ఆ ఊరిలో అలా ఆశపడేవారు చాలామందే ఉన్నారు. కాకపోతే ఎలా కావడమో తెలియదు. సమయం కోసం ఎదురు చూస్తున్నారు.

ఓ రోజు ఆ ఆసామి నుదుటన విభూతి రేఖలు, చెవిలో వెంట్రుకలు పెట్టుకుని కనిపించాడు. అది చూసి ఆ ఊరి వాళ్లు ఇదేమిటని అడిగితే ఓ పట్టాన జవాబు చెప్పలే. రహస్యంగా ఉంచాడు. కానీ రహస్యం ఆగుతుందా..? రెండు రోజుల్లోనే ఆ నోటా ఈ నోటా అసలు విషయం బయటికి వచ్చింది.

'ఓ స్వాములోరు ఓ గాడిదను మథుర నుంచి తెచ్చారు. అది వసుదేవుడు కాళ్లు పట్టుకున్న గాడిద సంతతికి చెందింది. దాని చుట్టూ ప్రదక్షిణలు చేసి ఆ గాడిద వెంట్రుక చెవిలో పెట్టుకుంటే పుణ్యం వస్తది... ఆ వెంటనే అధికారం వస్తదని ఆ స్వామి చెప్పాడు. అసలే సర్పంచ్ పదవిపై కన్నేసిన మనోడు మరుక్షణం ఆ పని చేసేశాడు. ఈసారి అధికారం మనదే అన్న ధీమాతో తిరుగుతు న్నాడు....'

ఈ రహస్యం క్రమంగా బహిరంగమైంది. అధికారానికి దగ్గరి మార్గం అందరికీ తెలిసింది. రాజకీయాలపై, పదవులపై ఆసక్తి ఉన్నవారు పోలోమని దాని చుట్టూ చేరారు. మూడు ప్రదక్షిణలు చేయడం, వెంట్రుక పీకి చెవిలో పెట్టుకోవడం.. ఇది క్రమేణా చుట్టుపక్కల ఊర్లకు చేరింది. అందరూ క్యూ కట్టారు. పక్కనే విభూతి షాపులు వెలిశాయి. స్నానానికి ఏర్పాట్లు జరిగాయి. అంతా ఓ జాతరలా తయారయ్యింది. అధికారం కోసం ప్రయత్నం చేస్తున్న వారి హడావిడి చూసి అధికారంలో ఉన్న వాళ్లు అలర్ట్ అయ్యారు. ఇదేదో మన పదవి మీదికొచ్చే విషయం లాగా ఉందని భావించి... మందీమార్బలంతో చుట్టుముట్టేశారు. తలో చేయి వేయడం, వెంట్రుకలు పీకడంతో, రాజకీయాలు, పదవులేమో గానీ..



ఆ గాడిద చచ్చూరుకుంది.

ఇప్పుడచ్చంగా టీఎస్‌పీఎస్సీ పరిస్థితి ఇలాగే ఉన్నట్టుంది.

....

ఏ సిట్యుయేషన్ వదిలేయకపోవడమే కదా రాజకీయం అంటే! దీనికి విపక్షం, అధికార పక్షం అన్న తేడా ఉండదు. ఎక్కడానికి వారు, దిగకుండా ఉండడానికి వీరు. ఏ అంశం, ఏ అవకాశం అయినా పర్లేదు.

....

అందుకే కొద్ది రోజులుగా టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ మీద ప్రతిపక్షాలకూ, అధికార పక్షాలకూ ఓ యుద్ధం నడుస్తోంది. ఒకరిపై ఒకరు కత్తులు దూస్తున్నారు. పేపర్లు, సోషల్ మీడియా అంతా విమర్శల బాణాలు కురుస్తున్నాయి. ప్రతిపక్షాలకు నోటీసులు, విచారణకు రమ్మంటూ ఫర్మానాలు.. మీ పార్టీ సభ్యుడు కారణం కాదా అంటూ అధికార పక్షం నుంచి పంచ్‌లు, ఆధారాలు.. లీకేజీకి ప్రభుత్వము, మంత్రులే బాధ్యులంటూ ప్రతిపక్షాల దీక్షలు, రాజీనామా చేయాలంటూ ధర్నాలు.. కావల్సినంత మసాలా దొరికింది. ఇది క్రమంగా రాజకీయ క్రీడగా మారింది. మరోవైపు బురద కడిగే పనిలో సిట్.

....

ఈ రణంలోనూ తెగిపడుతోంది నిరుద్యోగుల ఆశలే.. వారి భవిష్యత్తే.

....

ఏ వైరి పక్షమూ నష్టపోయింది లేదు. లాభం కోసం ప్రయత్నం తప్ప.

పొలం, బంగారం తాకట్టు పెట్టి కోచింగ్ తీసుకుని, నాలుగు ఎక్కువ మార్కుల కోసం నిద్రాహారాలు మాని, సర్కారు కొలువుకు ఇదే చివరి అవకాశం అని ఉన్న చిన్న ఉద్యోగాలు మానేసి తపస్సు చేస్తున్న యువత కష్టం అంతా ఈ రాజకీయ రంగమార్తాండుల వీరంగం ముందు చిన్నబోతోంది.

బాగా ట్రెండ్ అయిన ఈ విశ్లేషణ చూడండి..

ఇక్కడ ఆందోళనకరమైన విషయం ఏమిటంటే.. హ్యాకింగ్‌లు, అర్ధరాత్రి చోరీలు అక్కర్లేదు. కొంచెం ప్లాన్‌చేస్తే అక్కడ పనిచేసే ఉద్యోగులు ఎవరైనా ప్రశ్నపత్రాలు చోరీచేసే అవకాశం టీఎస్‌పీఎస్సీలోనే ఉంది.. ఇంకో ముఖ్యమైన విషయం.. లీక్ చేసిన వాళ్లు ఆర్థికంగా బలమైన వాళ్లు, ఇలాంటి విషయాల్లో ఆరితేరినవారు కాదు కనుకే ఇది బయటపడింది. సైలెంట్‌గా డబ్బులు వసూలు చేసుకోగలిగినా, ఏ పొలిటీషియన్నో, బడాబాబులో చేసున్నా... ఇది ఎప్పటికీ బయటకివచ్చే ఛాన్సే ఉండేది కాదు. నిద్రాహారాలు మాని చదివినవారు మా రాత ఇంతే అని సరిపెట్టుకునేవారు. అలా బయటకి రానివి ఎన్ని ఉన్నాయో తెలియదు.

....

30 లక్షల మంది అభ్యర్థులు, లక్షలమంది వారి కుటుంబ సభ్యులు ఆశలు పెట్టుకున్న టీఎస్‌పీఎస్సీలో.. ఇలా పెన్‌డ్రైవ్ పెట్టి అలా పేపర్‌లు బయటకి తీసుకెళ్లగలిగే పరిస్థితి ఉండడం అన్యాయం. ఇద్దరు వ్యక్తుల స్వభావంపై ఫలితాలు ఆధారపడి ఉండడం అన్యాయం. స్వయంగా మంత్రి, చైర్మన్‌లే వ్యక్తులపై వేలు చూపడం మన నిస్సహాయత్వాన్ని, పలు జీవితాలను శాసించగలిగే వ్యవస్థ డొల్లతనాన్ని చూపుతోంది.

....

ఈ కామెంట్ చూడండి..

"నేను నా ఫ్రెండ్స్, ఉదయం టిఫిన్ చేయకుండా మధ్యాహ్నం సాయిబాబా టెంపుల్‌లో భోజనం చేస్తూ, రాత్రి సమయంలో ఒక పులిహోర ప్యాకెట్ తింటూ, స్టడీ హాల్లో ఉంటూ, వారానికి ఒకసారి కేటరింగ్ సర్వీస్ చేసి ఫీజు కట్టుకుని చదివాం.. చివరకు ఇలా అయ్యింది. ఏ నమ్మకంతో మళ్లీ ప్రిపేర్ అవ్వాలి"... ఇది నిఖార్సయిన మచ్చుతునక.

...ఇప్పుడు చేయాల్సింది ఈ నమ్మకాన్ని నిలబెట్టడమే. దీన్ని రాజకీయ క్రీడ చేయడం కాదు... పైన కథలో చెప్పుకున్నట్లు దొరికింది కదా అని.. ఉన్న వెంట్రుకలు పీకి ఓ వ్యవస్థను, అనేక నిరుద్యోగుల ఆశలను చంపడం కాదు... ఇలా కళ్లనిండా ఆశలు నింపుకొని, కంటినిండా నిద్ర పోకుండా రాత్రింబవళ్లూ చదువుతున్న నిరుద్యోగుల్లో మళ్లీ ఆసక్తి నింపడం, ఆశలు వెలిగించడం! ప్రతిపక్షం నుంచైనా.. అధికారపక్షం నుంచైనా అందరూ కోరుకునేది ఇదే!

చరిత్రంతా చేదు జ్ఞాపకాలే..

ఒక్క ఉద్యోగం తల రాత మారుస్తుంది. తరతరాల దారిద్ర్యాన్ని తీరుస్తుంది. ఎన్నో తరాలకు అక్షరాస్యత అందిస్తుంది. ముఖ్యంగా అట్టడుగు వర్గాల జీవితాలను అకస్మాత్తుగా మార్చగలిగేది ఉద్యోగమే. అదీ పై స్థాయి సర్కారీ కొలువైతే కాసింత పవర్ కూడా.. కానీ, ఉద్యోగ నియామకాల్లో అనేకసార్లు అధికార పక్షాల, వ్యవస్థల నిర్లక్ష్యమే కనిపిస్తుంది. తరచూ దేశంలో ఏదో ఒక చోట స్కూల్ బోర్డ్ పరీక్షల్లో, యూనివర్సిటీ పరీక్షల్లో, ఉద్యోగ పరీక్షల్లో ఏదో ఒక పేపర్ లీకేజీ బయటపడుతూనే ఉంది.

పేపర్లను ముద్రించే ప్రెస్‌ల సిబ్బంది నుంచి ప్రభుత్వ అధికారులు, అధ్యాపకుల దాకా చాలా మంది లీకేజీలకు కారకులుగా ఉంటున్నారు. లక్షలు, కోట్లలో సొమ్ము చేతులు మారుతోంది. అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం.. గత ఏడేళ్లలో వివిధ రాష్ట్రాల్లో 70కి పైగా ప్రశ్నపత్రాల లీకేజీలు బయటపడ్డాయి. ఏకంగా కోటిన్నర మందికిపైగా విద్యార్థులపై తీవ్ర ప్రభావం పడింది.

ఇటీవలే అస్సాంలో పదో తరగతి సైన్స్‌సబ్జెక్టు ప్రశ్నపత్రం లీకైంది. ప్రశ్నపత్రం దొరికినవాళ్లు కేవలం రూ.200 నుంచి రూ.3 వేల రేటుతో అమ్ముకుంటూ వెళ్లారు. మరి కొందరు వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేసు కున్నారు. పదో తరగతి ప్రశ్నపత్రాలనే చూస్తే.. గత ఏడేళ్లలో పశ్చిమ బెంగాల్‌లో పదిసార్లు (మెయిన్, సప్లిమెంటరీ కలిపి)... బిహార్‌లో ఆరుసార్లు లీకయ్యాయి

తమిళనాడులో 2022లో పదో తరగతితోపాటు 12వ తరగతి (ఇంటర్) ప్రశ్నపత్రాలు లీకయ్యాయి. ఉద్యోగ పరీక్షల లీకేజీలో రాజస్థాన్ రికార్డునే సృష్టించింది. అక్కడ 2015 – 2022 మధ్య ఏకంగా 14 పోటీ పరీక్షల పేపర్లు లీకయ్యాయి. ఇందులో యూజీసీ నెట్, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు పరీక్ష వంటివీ ఉండటం గమనార్హం. చివరిసారిగా గత డిసెంబర్‌లో సీనియర్ ప్రభుత్వ టీచర్ పోస్టుల భర్తీకి సంబంధించి జనరల్ నాలెడ్జ్ ప్రశ్నపత్రం లీకవడంతో పరీక్షను రద్దు చేశారు.

పేపర్ల లీకేజీలో గుజరాత్ కూడా పోటీ పడుతోంది. ఆ రాష్ట్రంలో గత ఏడేళ్లలో 14 పరీక్షల పేపర్లు లీకయ్యాయి.

2017 – 2022 మధ్య యూపీలో ఎనిమిది పేపర్ లీకేజీ ఘటనలు జరిగాయి. తమిళనాడు, మధ్యప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, బిహార్, హరియాణా... ఏ రాష్ట్రం దీనికి మినహాయింపు కాదు.

అప్పుడే సార్థకత!

సృష్టిలోని 84 లక్షల జీవరాశుల్లో మానవ జన్మ ఉత్తమమైనది బుద్ధి, ఆలోచన, వాక్కు కలిగిన మానవుడు మిగతా జీవుల కంటే ఉత్తముడు, ఉన్నతుడు. నిజానికి మిగిలిన జీవుల నుంచి మనిషిని వేరుచేసినవి ఈ లక్షణాలే. నిద్ర, ఆహార, మైథునాలకే పశుపక్ష్యాదులు పరిమితమవుతాయి. మనిషి కూడా కేవలం వాటికే పరిమితమైననాడు మానవ జన్మకు సార్థకత ఉండదు. అందుకే మంచి ఆలోచనతో సత్కర్మలు చేస్తూ దైవ కృపకు పాత్రులు కావాలి.

మానవుడితో సహా భూమి మీద జన్మించిన ప్రాణులన్నీ ఆయువు తీరిపోగానే మృతి చెందాల్సిందే. జీవం లేని దేహం తిరిగి పంచ భూతాల్లో కలిసిపోతుంది. పాపపుణ్యాల ఆధారంగా జీవుడికి మరో జన్మ ప్రాప్తిస్తుంది.

మానవ జీవన ప్రమాణం నూరేళ్లయినా నిండు జీవితం గడిపే భాగ్యం అందరికీ దక్కడం లేదు. వారి వారి కర్మల ఆధారంగా ఆయుః ప్రమాణాలు నిర్ణయింపబడతాయి. కలియుగంలో జన్మించిన మానవులు పాపకర్మల మూలంగా ఆయువును క్షీణింపజేసుకుంటూ అకాల మరణం పొందుతున్నారు.



ఒకప్పుడు మహర్షులు, మహానుభావులు తమ ఆయువును వృద్ధి చేసుకోగలిగే వాళ్ళు. మరి కొందరు మృత్యువునే జయించారు. దశరథుడు, రాముడు, రావణుడు వంటివారు ఆయుష్షును పెంచుకోగా... పరశురాముడు, హనుమంతుడు వంటివారు మృత్యుంజయులయ్యారు.

భగవంతుడు జగన్నాటక సూత్రధారి. జనులంతా అతని నాటక రంగంలో పాత్రధారులు. తనకు నచ్చినట్టు ప్రవర్తించిన వాళ్లను ఆయువు తీరగానే దేవుడు తనలో కలుపుకొంటాడు. అక్రమ రీతిలో ప్రవర్తించిన వాళ్ళను తగువిధంగా శిక్షిస్తాడు.

మానవుడై జన్మించిన వారు పురుషార్థాలైన ధర్మార్థ కామ మోక్షాలను సంపాదించాలి. ధర్మ మార్గాన్ని వదలకుండా అర్థ సంపాదన చేసి, ధర్మ విరుద్ధం కాని కామాన్ని అనుభవించి, మోక్ష యత్నం చేసి విముక్తులవ్వాలి. పురుషార్థాల ముఖ్యోద్దేశం ఇదే.

మానవుడెలాగూ మృత్యువును జయించ లేడు. కనీసం ఉత్తమ నడవడిక, ఆధ్యాత్మిక భావ చైతన్యంతో మంచి మార్గంలో నడవడానికి ప్రయత్నించాలి. భగవంతుని ఆజ్ఞకు బద్ధులై ఆయన అనుగ్రహం పొందేలా ప్రవర్తించడం మానవుని కర్తవ్యం. అనివార్యమైన మృత్యువు ఎవరిని ఎప్పుడు ఆహ్వానిస్తుందో తెలియదు. కాలహరణం చేయకుండా సత్కార్యాలను చేసి భగవంతుని కృపకు పాత్రులు కావడం వల్లనే మానవజన్మకు సార్థకత చేకూరుతుంది.

– అమ్మాజీ ఉమామహేశ్వర్

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** శు.దశమి రా.1.55 వరకు, తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** పుష్యమి రా.2.05 వరకు, తదుపరి ఆశ్లేష, **వర్జ్యం:** ఉ.8.23 నుండి 10.09 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.24 నుండి 9.15 వరకు, తదుపరి ప.12.29 నుండి 1.17 వరకు, **అమృతఘడియలు:** సా.6.59 నుండి 8.45 వరకు; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 6.00, **సూర్యాస్తమయం:** 6.08.

క్లుప్తంగా...


తిరుమంజనంలో సేద తీరుతున్న సీతారామ లక్ష్మణ సమేత హనుమంతుల వారు

శ్రీవారి ఆలయంలో ఘనంగా శ్రీరామనవమి ఆస్థానం

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో గురువారం శ్రీరామనవమి ఆస్థానాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి 9 నుంచి 10 గంటల నడుమ ఆలయంలోని బంగారువాకిలి చెంత శ్రీరామనవమి ఆస్థానం వేడుకగా జరిగింది. ఉదయం సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి తోమాలసేవ, అర్చన ఏకాంతంగా నిర్వహించారు. అనంతరం ఆలయంలోని రంగనాయకుల మండపంలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు శ్రీసీతారామలక్ష్మణ సమేత హనుమంతులవారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, ఈవో ఎ.వి.ధర్మారెడ్డి, ఆలయ డిప్యూటీ ఈవో రమేష్‌బాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు. గురువారం సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు శ్రీరాముడు తన భక్తుడైన హనుమంతునిపై తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. పెద్దసంఖ్యలో భక్తులు హనుమంతవాహన సేవలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

ఏపీలో 4 రోజులు తేలికపాటి వానలు

సాక్షి, విశాఖపట్నం: ఏపీలో మరో నాలుగు రోజులు తేలికపాటి వర్షాలు కురవనున్నాయి. కొద్దిరోజులుగా రాష్ట్రంలో చెదురుమదురుగా వానలు పడుతున్నాయి. ప్రస్తుతం ఉత్తర ఛత్తీస్‌గఢ్ నుంచి దక్షిణ తమిళనాడు వరకు విదర్భ, కర్ణాటకల మీదుగా ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. దీని ప్రభావంతో ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ గురువారం తెలిపింది. అదే సమయంలో గంటకు 30–40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు కూడా వీస్తాయని, కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులు సంభవిస్తాయని పేర్కొంది. అక్కడక్కడ పిడుగులు పడే అవకాశం ఉందని తెలిపింది. గురువారం పార్వతీపురం మన్యం జిల్లా బలిజపేటలో 2.6 సెంటీమీటర్లు, అన్నమయ్య జిల్లా నూతనకల్వలో 2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.



ఒంటిమిట్టలో మార్మోగిన రామనామ స్మరణ

ఒంటిమిట్ట: ఆంధ్రా భద్రాద్రిగా విరాజిల్లుతున్న వైఎస్సార్ జిల్లాలోని ఒంటిమిట్ట శ్రీకోదండ రామస్వామి ఆలయంలో గురువారం శ్రీరామనవమి సందర్భంగా రామనామ స్మరణ మార్మోగింది. ఆలయ టీటీడీ డిప్యూటీ ఈవో నటేష్‌బాబు ఆధ్వర్యంలో రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి సతీసమేతంగా శ్రీకోదండరామస్వామికి ప్రభుత్వ లాంఛనాలతో పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. శ్రీరామనవమి కావడంతో ఆలయానికి భక్తులు పోటెత్తారు.

'మార్గదర్శి' అక్రమాలు నిజం!

▶ మొదటి పేజీ తరువాయి

అప్పటికే వేరే సంస్థల ఖాతాల్లోకో, ఇతరత్రా అవసరాలకో మళ్లించేశారు. కానీ... అవన్నీ తమ వద్దే ఉన్నట్లుగా తప్పుడు బ్యాలెన్స్‌షీట్ ద్వారా మభ్యపెడుతున్నారు. తమ సంస్థ తగిన ఆస్తులతో బలంగానే ఉన్నదని ఒక వైపు చిట్లు వేస్తున్న చిట్‌దారులను, మరో వైపు నియంత్రణ సంస్థలను నమ్మిస్తున్నారు. ఇదీ.. రామోజీరావు నడిపిస్తున్న 'మార్గదర్శి'అసలు కథ. మార్గదర్శి సంస్థను ఆడిట్ చేస్తున్న ఆడిటింగ్ సంస్థల ప్రతినిధి నేరుగా దర్యాప్తు సంస్థ ఎదుట అంగీకరించిన వాస్తవం. ఇదే కాదు. తనిఖీలకు అడుగడుగునా అడ్డుపడుతున్న మార్గదర్శిలో... ఎక్కడ ఏ సోదా జరిపినా నివ్వెరపోయే నిజాలే వెలుగుచూస్తున్నాయి. వాస్తవాలను బయటకు వెల్లడించకపోవటం ద్వారా... చిట్లు వేస్తున్నవారికి తమ సొమ్ము ఎంత భద్రంగా ఉందో, లేదో కూడా తెలియని పరిస్థితి సృష్టిస్తున్నారు. అంతేకాదు.. డిపాజిట్లు తీసుకోవటాన్ని నిషేధించినా సరే... వాటిని ఇతరత్రా రూపాల్లో తీసుకుంటూ నిబంధనలకు తూట్లు పొడుస్తూనే ఉన్నారు. తాజాగా హైదరాబాద్‌లోని మార్గదర్శి ఆడిటింగ్ సంస్థ బ్రహ్మయ్య అండ్ కో కంపెనీలో సీఐడీ జరిపిన తనిఖీల్లో వెల్లడైన పలు అక్రమాలు బయటపడ్డాయి.

చార్టర్డ్ అకౌంటెంట్‌కు 14 రోజుల రిమాండ్

మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్యాంకు లావాదేవీలు, రికార్డుల నిర్వహణలో పలు అవకతవకలున్నట్లు మార్గదర్శి చిట్స్‌కు ఆడిటర్‌గా వ్యవహరిస్తున్న బ్రహ్మయ్య అండ్ కో ప్రతినిధి సీఐడీ విచారణలో వెల్లడించారు. దాంతో బ్రహ్మయ్య అండ్ కో సీఏ కుదరవల్లి శ్రావణ్‌ను సీఐడీ అధికారులు అరెస్టు చేసి గురువారం విజయవాడలోని న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా కోర్టు ఆయనకు 14 రోజుల రిమాండ్ విధించింది. చిట్‌ఫండ్ చట్టానికి విరుద్ధంగా... చందాదారుల సొమ్మును తరలించటం, మ్యూచువల్ ఫండ్స్‌లోను, షేర్లలోనూ అక్రమంగా పెట్టుబడులు పెట్టడం, ఆర్‌బీఐ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ డిపాజిట్లు సేకరించడం చేసినట్లు ఇప్పటికే సీఐడీ అధికారులు గుర్తించి కేసు నమోదు చేశారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగానే బ్రహ్మయ్య అండ్ కో సంస్థ రికార్డులను తనిఖీ చేసి, ఆ సంస్థ సీఏ శ్రావణ్‌ను విచారించారు. మార్గదర్శి ఖాతాలు సవ్యంగానే ఉన్నాయని ఏటా ఆడిట్ నివేదిక ఇస్తున్న ఈ సంస్థ... అసలు మార్గదర్శి చిట్స్ ఖాతాలు, రికార్డులు, లావాదేవీలను సమగ్రంగా పరిశీలించకుండానే ఈ నివేదిక ఇస్తున్నట్లు సదరు చార్టర్డ్ అకౌంటెంట్ వెల్లడించటం గమనార్హం.

ఇలాంటి డిపాజిట్లు ప్రమాదకరమే?

■ చిట్లు వేసేవారిలో కొందరు చిట్‌ను పాడుకుంటారు కానీ... ఆ డబ్బును తీసుకోవటానికి అవసరమైన ష్యూరిటీలను కంపెనీకి సబ్‌మిట్ చేయలేరు. మరికొందరైతే రకరకాల కారణాల వల్ల పాడుకున్న మొత్తాన్ని తీసుకోకుండా భవిష్యత్తులో తాము చెల్లించాల్సిన చిట్ మొత్తానికి సంబంధించి దాన్ని సదరు చిట్‌ఫండ్ సంస్థ వద్దే వదిలిపెడతారు. ఇంకొందరైతే ఓ రెండు మూడు నెలలు ఉన్నపుడు చిట్‌ను పాడుకుని... ఆ మిగిలిన నెలల ఫ్యూచర్ చిట్ సబ్‌స్క్రిప్షన్ మొత్తాన్ని సంస్థ దగ్గరే వదిలేస్తారు. అయితే ఏ చిట్‌ఫండ్ సంస్థయినా తమ ప్రతి బ్రాంచి కార్యాలయంలోనూ... అక్కడి చిట్టీలకు సంబంధించిన ఫ్యూచర్ సబ్‌స్క్రిప్షన్ మొత్తాన్ని జమ చేసేందుకు ప్రత్యేకంగా రెండో బ్యాంకు ఖాతాను నిర్వహిస్తుండాలి. కానీ మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థ ఏ ఒక్క బ్రాంచిలోనూ ఇలా ఫ్యూచర్ సబ్‌స్క్రిప్షన్ మొత్తాన్ని డిపాజిట్ చేయడానికి వేరే బ్యాంకు ఖాతా తెరవలేదు. అన్నిచోట్ల నుంచీ ఆ మొత్తాన్ని హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయానికి తరలిస్తోంది. దానికి 4–5 వడ్డీ చెల్లిస్తోంది. ఇది అనధికారికంగా డిపాజిట్లు వసూలు చేయటమే. చట్టవిరుద్ధంగా వసూలు చేస్తున్న ఈ డిపాజిట్లను గనక ఏ ఆర్‌బీఐనో జప్తు చేస్తే..? చిట్‌దారుల పరిస్థితి అగమ్య గోచరంగా మారే ప్రమాదం ఉంది. అయినా సరే మార్గదర్శి వసూలు చేస్తున్న అక్రమ డిపాజిట్లు సక్రమమేననే రీతిలో బ్రహ్మయ్య అండ్ కో సంస్థ నివేదిక ఇవ్వటం విస్మయం కలిగించేదే!!.

■ ఇక మార్గదర్శి చిట్‌ఫండ్స్ తమ ఆదాయ, వ్యయాల ఖాతాలు, ఆస్తి, అప్పుల ఖాతాలు, తమ పెట్టుబడులు వివరాలను బహిర్గతం చేయటం లేదు. గోప్యంగా ఉంచుతోంది. ఇది చిట్‌ఫండ్ చట్టానికి విరుద్ధం. అయినా సరే బ్రహ్మయ్య అండ్ కో ఇది పట్టించుకోకుండా అంతా సక్రమంగానే ఉందని ఆడిట్ నివేదిక ఇచ్చేస్తోంది.

అక్రమాలు వాస్తవమే: బ్రహ్మయ్య సంస్థ సీఏ శ్రావణ్

మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచి కార్యాలయాల్లో రికార్డులను వ్యక్తిగతంగా పరిశీలించకుండానే ఆడిట్ నివేదిక జారీ చేస్తున్నామని బ్రహ్మయ్య అండ్ కో సీఏ కుదరవల్లి శ్రావణ్ విచారణలో అంగీకరించారు. మార్గదర్శి చిట్స్ ఆదాయ–వ్యయాలు, ఆస్తి– అప్పులకు సంబంధించిన ఎలాంటి వివరాలనూ ఆయన సీఐడీ అధికారులకు చెప్పలేకపోయారు. ఒక్కో బ్రాంచి బ్యాంకు ఖాతాల్లో అప్పుడప్పుడు చూపిస్తున్న వందల కోట్ల రూపాయాలు ఎక్కడి నుంచి వచ్చాయి? ఆ తరువాత అవి ఎక్కడికి మాయమయ్యాయి? అనేది ఆయన ఏమాత్రం చెప్పలేకపోయారు. ఆ వివరాలేవీ తనకు తెలియవని ఆయన అంగీకరించారు.


హాజరైన జీ-20 దేశాల ప్రతినిధులు

స్థిరమైన ఆర్థిక నగరాల నిర్మాణం

- సామర్థ్యం నిర్మాణంపై వర్క్‌షాపులో జీ-20 దేశాల సమర్పణ

సాక్షి, విశాఖపట్నం: భవిష్యత్తులో స్థిరమైన ఆర్థిక నగరాల నిర్మాణంపై జీ-20 దేశాల ప్రతినిధులు తమతమ వ్యూహాలను సమర్పించారు. విశాఖపట్నంలో జరుగుతున్న జీ-20 దేశాల రెండో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వర్కింగ్ గ్రూపు (ఐడబ్ల్యూజీ) సమావేశాల్లో మూడోరోజైన గురువారం 'సామర్థ్య నిర్మాణం'పై వర్క్‌షాపును ఇండియన్ ప్రెసిడెన్సీ, ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంకులు సంయుక్తంగా నిర్వహించాయి. ఈ సదస్సులో జీ-20 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఇందులో పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఫైనాన్సింగ్‌లలో అంతర్జాతీయ ఉత్తమ పద్ధతులను చర్చించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. స్థానిక ప్రభుత్వాలు సమగ్ర, స్థిరమైన నగరాల కోసం అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు ఆర్థిక సాయం చేయడానికి అవసరమైన సామర్థ్యాలపై దృష్టిసారించారు. వర్క్‌షాపు మొదటి సెషన్‌లో భారత్ సహా సింగపూర్, దక్షిణ కొరియా, రష్యా, చైనా, యూరోపియన్ కమిషన్ నిపుణులు తమ దేశాల్లో అవలంబిస్తున్న ఉత్తమ పద్ధతులను ప్రదర్శించారు. సింగపూర్‌లోని నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఏజెన్సీ మాజీ డిప్యూటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, డైరెక్టర్ జనరల్ అహ్ తువాన్‌లోహ్.. సింగపూర్ విధానాలు, సమ్మిళిత, స్థిర నగరాలను నిర్మించే వ్యూహాలను సమర్పించారు.

పోలవరం తాజా అంచనాలు ఆమోదించాలి

- అడ్‌హాక్‌గా రూ.10 వేల కోట్లు మంజూరు చేయాలి
- ఏపీకి రావాల్సిన బకాయిలు విడుదల చేయాలి
- రీసోర్స్ గ్యాప్ ఫండింగ్ రూ.36,625 కోట్లు ఇవ్వాలి
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఏపీ సీఎం జగన్ వినతి


ఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఏపీ సీఎం జగన్

సాక్షి, న్యూఢిల్లీ: పోలవరం ప్రాజెక్టు అంచనాలను టెక్నికల్ అడ్వయిజరీ కమిటీ (టీఏసీ) నిర్ధారించిన రూ.55,548 కోట్లకు వెంటనే ఆమోదం తెలపాలని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు. పోలవరం ప్రాజెక్టును వేగవంతంగా ముందుకు తీసుకెళ్లడానికి అడ్‌హాక్‌గా రూ.10 వేల కోట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర అంశాలపై కేంద్రంతో చర్చించేందుకు బుధవారం ఢిల్లీకి వచ్చిన ఆయన గురువారం ఉదయం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి అందాల్సిన నిధులు, బకాయిల అంశాలతో పాటు ప్రత్యేక హోదా అంశాలపై సుమారు అర గంట పాటు చర్చించారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి డయాఫ్రం వాల్ ప్రాంతంలో చేయాల్సిన మరమ్మతులకు దాదాపు రూ.2,020 కోట్లు ఖర్చు చేయాల్సి ఉందని, ఈ నిధులనూ వెంటనే విడుదల చేయాలని కోరారు. పోలవరం ప్రాజెక్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం సొంతంగా ఖర్చు చేసిన రూ.2600.74 కోట్లను సత్వరమే రీయింబర్స్ చేయాలన్నారు. సీఎం జగన్ ఇంకా ప్రస్తావించిన అంశాలు ఇలా ఉన్నాయి.

■ రుణాల విషయంలో రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం విధించిన ఆంక్షలు సరికాదు. వీటి విషయంలో పునరాలోచన చేయాలి. ప్రస్తుత ప్రభుత్వ తప్పు లేకున్నా, రుణాలపై కేంద్రం ఆంక్షలు విధించింది. నిబంధనల ప్రకారం ఇచ్చిన రుణ పరిమితిని కూడా తగ్గించారు. 2021–22లో రూ.42,472 కోట్ల రుణ పరిమితి కల్పించి, తదుపరి కాలంలో రూ.17,923 కోట్లకు కుదించారు. ఈ విషయంలో కేంద్రం సానుకూల నిర్ణయం తీసుకోవాలి.

■ ఉపాధి హామీ పనులకు సంబంధించి రాష్ట్రానికి ఇవ్వాల్సిన బకాయిలు సుమారు రూ.2,500 కోట్లు వెంటనే మంజూరు చేయాలి.

■ 2014 జూన్ నుంచి 2017 జూన్ వరకు సరఫరా చేసిన విద్యుత్‌కు సంబంధించి తెలంగాణ డిస్కంల నుంచి ఏపీ జెన్‌కోకు రూ.7,058 కోట్లు రావాల్సి ఉంది. ఈ డబ్బును వెంటనే ఇప్పించాలి.

■ 2014–15 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రాష్ట్రానికి రీసోర్స్ గ్యాప్ ఫండింగ్ కింద రూ.36,625 కోట్లు పెండింగులో ఉన్నాయి. వీటిని విడుదల చేయాలి.

■ రాష్ట్ర విభజన సమయంలో ప్రత్యేక హోదా ఇస్తామని పార్లమెంట్ సాక్షిగా కేంద్రం హామీ ఇచ్చింది. ఈ దృష్ట్యా రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలి.

తాడేపల్లి చేరుకున్న సీఎం జగన్

సాక్షి, అమరావతి: ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన రెండు రోజుల ఢిల్లీ పర్యటనను ముగించుకుని గురువారం తిరిగి తాడేపల్లికి చేరుకున్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కలిసేందుకు ఈ నెల 29న మధ్యాహ్నం ఢిల్లీకి వెళ్లారు. బుధవారం రాత్రి అమిత్‌షాను కలిశారు. గురువారం ఉదయం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అనంతరం ఢిల్లీ నుంచి బయలుదేరి మధ్యాహ్నం 3 గంటలకు తాడేపల్లిలోని నివాసానికి చేరుకున్నారు.

మార్నింగ్ వాక్.. చిన్నారులతో క్రికెట్

'పీపుల్స్ మార్చ్'లో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఆటవిడుపు


ఏఎంసీ మైదానంలో వాకింగ్ చేస్తున్న భట్టి

బెల్లంపల్లి: సీఎల్పీ నేత భట్టి విక్రమార్క గురువారం పీపుల్స్ మార్చ్ పాదయాత్రకు విరామం ఇచ్చి వాకర్స్, క్రీడాకారులతో కలిసి మార్నింగ్ వాక్ చేశారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రకు కొనసాగింపుగా చేపట్టిన పాదయాత్ర బుధవారం రాత్రి మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి చేరుకుంది. రాత్రి స్థానిక ఏఎంసీ క్రీడా మైదానంలో భట్టి బస చేశారు. మార్నింగ్ వాకింగ్ అనంతరం యువకులు, చిన్నారులతో భట్టి సరదాగా క్రికెట్ ఆడారు. తర్వాత కాంగ్రెస్ శ్రేణులు, స్థానికులతో మాట్లాడారు. సింగరేణిలో ఉద్యోగ ఖాళీల భర్తీ, కారుణ్య నియమకాల గురించి ఆరా తీశారు. లక్షల రూపాయలు లంచం ఇస్తే తప్ప కారుణ్య ఉద్యోగాలు రావడం లేదని స్థానికులు ఆయన దృష్టికి తెచ్చారు. రూ.6 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు ముడుపులు చెల్లించుకోవాల్సి వస్తోందని తెలిపారు. మెడికల్ బోర్డులో కోట్ల రూపాయల దందా జరుగుతోందని పేర్కొన్నారు. మైనింగ్ డిప్లొమా, ఉన్నతవిద్య అభ్యసించిన యువకులు ఉద్యోగాలు రాక ఆవేదన చెందుతున్నారని చెప్పారు. అనంతరం భట్టి మాట్లడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

స్తంభానికి కట్టి.. కత్తితో పొడిచి..

వేధిస్తున్న వ్యక్తిని హతమార్చిన యువతి


మృతుడు శ్రీనివాస్(ఫైల్)

ఏటూరునాగారం: పెళ్లి చేసుకోమని వెంటపడుతుంటే సహించింది. లైంగిక దాడి చేశాడని పోలీసు కేసు పెట్టింది. జైలుకెళ్లి వచ్చాక కూడా వేధిస్తుండటంతో విసిగిపోయింది. స్తంభానికి కట్టేసి కత్తితో పొడిచి చంపి పోలీసులకు లొంగిపోయిందొక యువతి. ములుగు జిల్లా ఏటూరునాగారంలో గురువారం వెలుగు చూసిన ఈ సంఘటనపై పోలీసులు అందించిన వివరాలివి. రాంటెంకి శ్రీనివాస్ (32)కు గతంలో వివాహమైంది. భార్య అతని నుంచి విడాకులు తీసుకోవడంతో ఒంటరిగా ఉంటున్నాడు. స్థానికంగా ఉండే సంగీత అనే యువతికి తల్లిదండ్రుల్లేకపోవడంతో అమ్మమ్మ వద్ద ఉంటోంది. సంగీత, శ్రీనివాస్‌లు గతంలో గుడుంబా వ్యాపారం చేసేవారు. ఏడాదికాలంగా శ్రీనివాస్‌తో సంగీత మాట్లాడడం లేదు. అయినా అతను తరచూ రాత్రివేళ సంగీత ఇంటికి వచ్చి తలుపులు కొట్టేవాడు. గతంలో తనపై లైంగిక దాడి చేశాడని శ్రీనివాస్‌పై సంగీత కేసు పెట్టగా జైలుకు కూడా వెళ్లొచ్చాడు. అయినప్పటికీ తనను వివాహం చేసుకోవాలని వెంటపడుతున్నాడని సంగీత పలుమార్లు పెద్ద మనుషులు, బంధువులకు కూడా చెప్పింది. ఈ క్రమంలో బుధవారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో సంగీత ఇంటికి వచ్చిన శ్రీనివాస్ తలుపులు కొట్టాడు. దీంతో విసిగిపోయిన ఆమె బయటికి వచ్చి శ్రీనివాస్‌ను దోమతెర, ప్లాస్టిక్ వైర్‌తో షెడ్డుకు ఉన్న సిమెంట్ స్తంభానికి కట్టేసి కత్తితో నాలుగైదు సార్లు పొడిచింది. చనిపోయాడని నిర్ధారించుకుని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి జరిగిన విషయం చెప్పింది. నిందితురాలు లొంగిపోవడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కష్టాల్లో 'బలగం' మొగిలయ్య

- రెండు కిడ్నీలు ఫెయిల్.. బీపీ, షుగర్‌తో ఇతర అవయవాలపైనా ప్రభావం
- కనిపించని రెండు కళ్లు.. ఆపరేషన్‌కు డబ్బుల్లేక దీనంగా వేడుకోలు


తంబూర- బుర్రతో మొగిలయ్య దంపతులు

బలగం సినిమా చివరాంకంలో 'తోడుగా మాతోడుండి.. నీడగా మాతో నడిచి.. నువ్వెక్కాడెల్లినావు కొంరయ్యా..'అంటూ పాటపాడి అందరినీ కదిలించిన గాయకులు మొగిలయ్య, కొమురమ్మ దంపతులు. ఇప్పుడు మొగిలయ్య రెండు కిడ్నీలు చెడిపోయి.. రెండు కళ్లు కనిపించక మంచానికే పరిమితమయ్యాడు. వరంగల్ జిల్లా దుగ్గొండి మండల కేంద్రానికి చెందిన బుడగజంగాల కళాకారులైన ఈ దంపతులకు వారసత్వంగా వచ్చిన తంబూర, దిమ్మస తప్ప మరే ఇతర ఆస్తిపాస్తులు లేవు. రెండేళ్ల క్రితం కరోనా బారిన పడ్డ మొగిలయ్య ఏడాది క్రితం ఉన్నట్టుండి ఓరోజు కళ్లు తిరిగి పడిపోయాడు. ఆస్పత్రికి తీసుకెళ్తే రెండు కిడ్నీలు పాడయ్యాయని డాక్టర్లు చెప్పారు. అప్పటినుంచి వారానికి మూడు రోజులు వరంగల్ ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్నాడు. వైద్యం కోసం ఇప్పటివరకు రూ.14 లక్షల వరకు ఖర్చయ్యాయి. రూ.10 లక్షల వరకు అప్పు చేశారు. బలగం డైరెక్టర్ వేణు కొంత సాయం చేసినా సరిపోని పరిస్థితి. మొగిలయ్య డయాలసిస్ చేయించుకుంటున్న సమయంలోనే బలగం సినిమాలో అవకాశం వచ్చింది. 'బీపీ, షుగర్ పెరగడంతో రెండు కళ్లు కనిపించడంలేదు. ఆపరేషన్ చేయాలని, రూ.3 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారు. కానీ, చేతిలో చిల్లిగవ్వ కూడా లేదు. మనసున్న మారాజులు ఆదుకోవాలి'అని కొమురమ్మ వేడుకుంటోంది.

– వరంగల్ డెస్క్

ఆర్థికసాయం చేయదల్చిన వారు
పస్తం కొమురమ్మ
బ్యాంక్ అకౌంట్ నంబర్: 62306309034
స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, దుగ్గొండి, వరంగల్ జిల్లా
ఐఎఫ్‌ఎస్సీ కోడ్ : SBIN0020655
గూగుల్‌పే నంబర్: 90590 98236
ఫోన్‌పే నంబర్ : 91772 54408

'మండల్' సిఫార్సుల అమలుకు మరో ఉద్యమం: జాజుల


అథవాలేకు సమస్యలు వివరిస్తున్న జాజుల

సాక్షి, న్యూఢిల్లీ: మండల్ కమిషన్ సిఫార్సులను వెంటనే అమలు చేయాలన్న డిమాండ్‌తో జాతీయ స్థాయిలో మరో ఉద్యమం చేపడతామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. గురువారం ఢిల్లీలో కేంద్ర సామాజిక న్యాయ శాఖ సహాయ మంత్రి రాందాస్ అథవాలే, సీపీఎం, సీపీఐ జాతీయ కార్యదర్శులు సీతారాం ఏచూరి, డి.రాజాలతో జాజుల బృందం భేటీ అయింది. అనంతరం తెలంగాణ భవన్‌లో జాజుల మీడియాతో మాట్లాడుతూ.. ఆయా నేతలకు పది డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశామన్నారు. రిజర్వేషన్లు పెంచాలనే ఆలోచనలో కేంద్రం ఉందని, బీసీల ఆదాయ పరిమితిని కూడా రూ.12 లక్షలకు పెంచాలని భావిస్తున్నట్లు రాందాస్ చెప్పారని వివరించారు. బీసీ సంఘం డిమాండ్ల పరిష్కారం కోసం ప్రత్యేక ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని సీతారాం ఏచూరి హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ కార్యనిర్వాహక అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బీసీ విద్యార్థి సంఘం కేంద్ర అధ్యక్షుడు తాటికొండ విక్రమ్, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కనకాల శంకరం తదితరులు పాల్గొన్నారు.

టోల్ పెంపు నేటి నుంచే..

▶ మొదటి పేజీ తరువాయి

అమల్లోకి వచ్చాక కొత్తగా ఐదు ప్రాంతాల్లో టోల్‌గేట్లు అందుబాటులోకి వచ్చాయి.

పెరగనున్న ఆదాయం

గత ఆర్థిక సంవత్సరంలో టోల్‌ప్లాజాల ద్వారా కేంద్ర ప్రభుత్వానికి రూ.1,820 కోట్లు సమకూరాయి. ఈసారి దేశవ్యాప్తంగా మరిన్ని టోల్‌గేట్లు అందుబాటులోకి రావడం, ధరల పెంపు నేపథ్యంలో టోల్ వసూళ్లు రూ.2 వేలకోట్లను దాటిపోతాయని అంచనా.

ఫాస్టాగ్‌తో కచ్చితమైన ఆదాయం

గతంలో టోల్‌గేట్ల వద్ద నిర్వాహకులు భారీగా అక్రమాలకు పాల్పడటంతో.. వాహనాల నుంచి వసూలు చేసిన మొత్తంలో దాదాపు 25 శాతం పక్కదారి పట్టేదన్న ఆరోపణలు ఉన్నాయి. దీనితో ప్రభుత్వ ఖజానాకు చేరే మొత్తం తక్కువగా కనిపించేది. ఫాస్టాగ్ అమల్లోకి వచ్చాక అక్రమాలకు తెరపడి, ప్రతి రూపాయి లెక్కలోకి వస్తోంది. దీనితో గత మూడేళ్లుగా టోల్ వసూళ్లు భారీగా పెరుగుతున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 98.6 శాతం వాహనాలు ఫాస్టాగ్‌ను వినియోగిస్తున్నాయి.

చిల్లకల్లు టోల్‌ప్లాజాలో..

- కార్, జీప్ సింగిల్ ట్రిప్పు రూ.100 నుంచి రూ.105కు, రిటర్న్ జర్నీ రూ.150–రూ.160, నెల పాస్ రూ.3,350–రూ.3,520కు పెంచారు.
- లైట్ కమర్షియల్ వాహనాలకు సింగిల్ ట్రిప్పు రూ.160 నుంచి రూ.165కు, రిటర్న్ జర్నీ రూ.240–రూ.250, నెలపాస్ రూ.5,290–రూ.5,560కు..
- బస్సు, ట్రక్కులకు సింగిల్ ట్రిప్పు రూ.330–రూ.345, రిటర్న్ జర్నీ రూ.490–రూ.515, నెలపాస్ రూ.10,940–రూ.11,495కు..
- హెవీ వెహికల్స్ సింగిల్ ట్రిప్పు రూ.635–రూ.665, రిటర్న్ జర్నీ రూ.955–రూ.1,000, నెలపాస్ రూ.21,170–రూ.22,240కు సవరించారు.

జాతీయ రహదారి 765 మీద కడ్తాల్ వద్ద..

- కార్లు, జీపులకు సింగిల్ ట్రిప్పు రూ.45, రిటర్న్ జర్నీ రూ.65, నెల పాస్ రూ.1,495కు..
- లైట్ వెహికల్స్ సింగిల్ ట్రిప్పు రూ.75, రిటర్న్ జర్నీ రూ.110, నెలపాస్ రూ.2,420కు..
- బస్సు ట్రక్కులకు సింగిల్ ట్రిప్పు రూ.150, రిటర్న్ జర్నీ రూ.230, నెల పాస్ రూ.5,070
- హెవీ వెహికల్స్ సింగిల్ ట్రిప్పు రూ.290, రిటర్న్ జర్నీ రూ.435, నెలపాస్ రూ.9,675కు పెంచారు.

జాతీయ రహదారి 167పై మహబూబ్‌నగర్ జిల్లా మున్ననూర్ టోల్ ప్లాజా..

- కార్లు, జీపుల సింగిల్ ట్రిప్పు రూ.45, రిటర్న్ జర్నీ రూ.65, నెలపాస్ రూ.1,475కు పెంచారు.
- లైట్ వెహికల్ సింగిల్ ట్రిప్పు రూ.70, రిటర్న్ జర్నీ రూ.105, నెలపాస్ రూ.2,385కు..
- బస్సులు, ట్రక్కుల సింగిల్ ట్రిప్పు రూ.150, రిటర్న్ జర్నీ రూ.225, నెలపాస్ రూ.4,995
- భారీ వాహనాలకు సింగిల్ ట్రిప్పు రూ.285, రిటర్న్ జర్నీ రూ.430, నెలపాస్ రూ.9,540గా నిర్ధారించారు.

జాతీయ రహదారి 163 చిట్యాల టోల్‌ప్లాజా వద్ద

- కార్లు, జీపులకు సింగిల్ ట్రిప్పు రూ.65, రిటర్న్ జర్నీ రూ.95, నెలపాస్ రూ.2,110కు పెంచారు.
- లైట్ వెహికల్స్ సింగిల్ ట్రిప్పు రూ.100, రిటర్న్ జర్నీ రూ.155, నెల పాస్ రూ.3,410కు..
- బస్సు/ట్రక్కులకు సింగిల్ ట్రిప్పు రూ.215, రిటర్న్ జర్నీ రూ.320, నెలపాస్ రూ.7,145కు..
- హెవీ వెహికల్స్‌కు సింగిల్ ట్రిప్పు రూ.410, రిటర్న్ జర్నీ రూ.615, నెలపాస్ రూ.13,645కు పెంచారు.

విజయవాడ రోడ్డులోని కొర్లపహాడ్ ప్లాజాలో

కార్లు, జీపులు సింగిల్ జర్నీ చార్జి రూ.120 నుంచి రూ.125కు.. రిటర్న్ జర్నీ రూ.180 నుంచి రూ.200కు.. నెల పాస్ రూ.4,025 నుంచి రూ.4,225కు..

- లైట్ కమర్షియల్ వాహనాలకు సింగిల్ ట్రిప్ రూ.190–రూ.200, రిటర్న్ జర్నీ రూ.285–రూ.300, నెలపాస్ రూ.6,385–రూ.6,710..
- బస్సు, ట్రక్కులకు సింగిల్ ట్రిప్ రూ.395–రూ.415, రిటర్న్ జర్నీ రూ.595–రూ.625, నెలపాస్ రూ.13,240–రూ.13,910కు..
- ఓవర్ సైజ్డ్ వెహికల్స్ సింగిల్ ట్రిప్ రూ.765 నుంచి రూ.805కు, రిటర్న్ జర్నీ 1,150–రూ.1,210, నెలపాస్ రూ.25,540–రూ.26840కు సవరించారు.

క్లుప్తంగా

ఫెర్రీలో మంటలు.. 31 మంది మృతి

మనీలా: ఫిలిప్పీన్స్‌లో గురువారం ఫెర్రీలో అగ్ని ప్రమాదం సంభవించి 31 మంది చనిపోగా మరో ఏడుగురు గల్లంతయ్యారు. ఎంవీ లేడీ మేరీ జాయ్‌–3 అనే ఫెర్రీ సుమారు 250 మంది ప్రయాణికులతో బుధవారం సాయంత్రం తీర ప్రాంత నగరం జంబొయాంగా నుంచి సులు ప్రావిన్స్‌లోని జోలో పట్టణం వైపు బయలు దేరింది. మార్గమధ్యంలో అర్ధరాత్రి సమయంలో బసిలాన్ ప్రావిన్స్‌కు సమీపంలో మంటలు చెలరేగాయి. కొందరు మంటల్లో సజీవదహనం కాగా మరికొందరు భయాందోళనలతో నీళ్లలో దూకారు. మొత్తం 31 మృతదేహాలను సహాయ సిబ్బంది గుర్తించారు. మరో ఏడుగురి జాడ తెలియాల్సి ఉంది. గాయపడిన 23 మందిని ఆస్పత్రులకు తరలించారు. ఫెర్రీని బసిలాన్ తీరానికి తీసుకువచ్చారు. గాలింపు, సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ప్రమాదానికి కారణాలపై దర్యాప్తు చేపట్టినట్లు అధికారులు చెప్పారు. దీవుల సముదాయం ఫిలిప్పీన్స్‌లో ఇటువంటి ఘటనలు సర్వసాధారణం.

అసెంబ్లీలో అశ్లీల వీక్షణం

త్రిపురలో బీజేపీ ఎమ్మెల్యే నిర్వాకం



అగర్తలా: త్రిపుర శాసనసభలో అధికార బీజేపీ ఎమ్మెల్యే జాదవ్ లాల్‌నాథ్ తన మొబైల్ ఫోన్‌లో అశ్లీల వీడియోలు తిలకిస్తూ దొరికిపోయాడు. అసెంబ్లీ ప్రతిష్టను మంటగలిపిన జాదవ్ లాల్‌నాథ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. త్రిపుర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో బుధవారం ఆయన సభలో పోర్న్ వీడియోలు చూస్తున్నట్లుగా వీడియో క్లిప్ ఒకటి బయటకు వచ్చింది. ఇది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. జాదవ్ లాల్‌నాథ్ గత ఎన్నికల్లో ఉత్తర త్రిపుర జిల్లాలోని బాగ్‌బస్సా నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా విజయం సాధించారు. తనపై వచ్చిన ఆరోపణలపై స్పందించారు. సభలో ఉండగా తన ఫోన్‌కు కాల్ వచ్చిందని, వెంటనే ఫోన్ తెరపై అశ్లీల వీడియోలు ప్రత్యక్షమయ్యాయని అన్నారు. వెంటనే వాటిని క్లోజ్ చేశానని తెలిపారు. అసెంబ్లీలో ఫోన్ వాడొద్దన్న సంగతి తనకు తెలుసని చెప్పారు. పవిత్రమైన అసెంబ్లీలో పోర్న్ వీడియోలు చూడడం సిగ్గుచేటని, బీజేపీ ఎమ్మెల్యే జాదవ్ లాల్‌నాథ్‌పై కఠిన చర్యలు చేపట్టాలని త్రిపుర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బిరాజిత్ సిన్హా డిమాండ్ చేశారు. 2012లో కర్ణాటక అసెంబ్లీలో ముగ్గురు బీజేపీ ఎమ్మెల్యేలు ఫోన్‌లో అశ్లీల దృశ్యాలు చూస్తూ దొరికిపోయిన సంగతి తెలిసిందే.

ఖర్గే ఇంట గెలిచేనా!



- కాంగ్రెస్ అధ్యక్షుడికి అగ్నిపరీక్షగా మారిన కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలు
- పార్టీని ఏకతాటిపై నడపడంలో సమర్థత చాటుకున్న వైనం
- రాహుల్‌పై అనర్హత వేటుకు నిరసనగా విపక్షాలను కలుపుకొని వెళ్లడంలోనూ విజయం

ఎస్.రాజమహేంద్రారెడ్డి

మల్లికార్జున ఖర్గే.. ది గ్రాండ్ ఓల్డ్ పార్టీ కాంగ్రెస్ కొత్త బాస్. గాంధీల ఇంటి పార్టీలాంటి కాంగ్రెస్‌కు గాంధీయేతరులు అధ్యక్షుడు కావడం విశేషం. ఆ పదవికి ఎంపిక కావడమే ఆయన సమర్థతకు నిదర్శనం. అంతగా పట్టులేని ఈశాన్య రాష్ట్రాల్లో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఖర్గే తన ప్రభావాన్ని అంతగా చూపెట్టలేకపోయినప్పటికీ పార్టీని ఏకతాటిపై నడపడంలో తన సమర్థతను చాటాడనే చెప్పుకోవాలి. రాహుల్ గాంధీపై అనర్హత వేటు సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు ముక్త కంఠంతో నిరసన గళాన్ని వినిపించడంలోనూ ఖర్గే తన నాయకత్వ గరిమను రుజువు చేసుకున్నారు. అనర్హత వేటుకు నిరసనగా విపక్షాలన్నింటినీ ఒకే వేదికపై మోహరించడంలోనూ విజయం సాధించారు. పార్లమెంట్‌లో అదానీ వ్యవహారంపైనా, పార్లమెంట్ బయట అనర్హత వేటు పైనా సామూహిక నిరసనలకు కాంగ్రెస్ పార్టీ ఖర్గే సారథ్యంలోనే నాయకత్వ బాధ్యతను భుజాని కెత్తుకుంది. ఈ నేపథ్యంలోనే కర్ణాటక అసెంబ్లీ పోరుకు నగారా మోగింది. వచ్చే ఏడాది జరుగనున్న సార్వత్రిక ఎన్నికలకు ముందు ఖర్గేకు ఇది అసలు సిసలైన పరీక్ష. ఒకరకంగా అగ్నిపరీక్ష. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడిగా తన సొంత రాష్ట్రమైన కర్ణాటకలో పార్టీని మళ్లీ గద్దెనెక్కించడం ఇప్పుడు ఆయన ముందున్న ప్రధాన, ఏకైక లక్ష్యం. ఇంట గెలిచి రచ్చ గెలవమన్నారు. ఇంటి పోరులో గెలుస్తారో లేదో మే 13న(కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెల్లడయ్యే రోజు) తేలనుంది. ఖర్గే హీరోనో లేక జీరోనో అదే రోజు కర్ణాటకతోపాటు దేశానికీ తెలుస్తుంది.

ఇప్పటికే తొలి విజయం

నిజానికి చాలా రోజుల తర్వాత కాంగ్రెస్ పార్టీ ఎన్నికల పోరుకు పూర్తి సన్నద్ధతతో బరిలోకి దిగడం ఇదే మొదటిసారి. ఎన్నికల సంఘం కర్ణాటక ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించడానికి ఓ వారం రోజుల ముందే కాంగ్రెస్ 124 మంది అభ్యర్థులతో తొలి జాబితాను విడుదల చేసింది. నిత్యం అంతర్గత పోరుతో తలమునకలై ఉండే కాంగ్రెస్ పార్టీకి ఇది శుభ పరిణామం. తొలి జాబితాను ఎలాంటి భేదాభిప్రాయాలు లేకుండా సామరస్యపూర్వక వాతావరణంలో ప్రకటించడం కచ్చితంగా ఖర్గే వ్యవహార శైలికి అద్దం పడుతుంది. మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ప్రస్తుత పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ మధ్య ఉన్న చిరకాల భేదాభిప్రాయాలు ఈ ఎన్నికల్లో కర్ణాటక కాంగ్రెస్‌కు పెద్ద తలనొప్పిగా మారడం ఖాయమనుకున్నారు. ఎన్నికల వేళ పార్టీ వ్యవహారాలను చక్కదిద్దడంలో నిష్ణాతుడిగా పేరుగాంచిన ఖర్గే, ఏఐసీసీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన నాటినుంచే వీరిద్దరి సంఘర్షణపై ఓ కన్నేసి ఉంచారు. సరిగ్గా షెడ్యూల్ ప్రకటించే సమయానికి ఇద్దరి మధ్య రాజీ కుదిర్చి తొలి విజయాన్ని నమోదు చేసుకున్నారు. మే 10న జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయభేరీ మోగిస్తే ఆ క్రెడిట్ అంతా ఆయనదే అవుతుంది.

జేడీ(ఎస్)తో పొత్తుకు విముఖత

ఒకే గొడుగు కింద వైరి వర్గాల ఘర్షణ ఏ స్థాయిలో ఉంటుందో ఖర్గేకు అనుభవపూర్వకంగా తెలుసు. తొమ్మిదిసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన ఖర్గే ఒక్కసారి కూడా కర్ణాటక ముఖ్యమంత్రి కాలేకపోయారు. అవకాశాలు రాక కాదు, అవకాశాలు తలుపుతట్టినా అంతర్గత పోరును తట్టుకొని నిలబడలేకపోయారు. ఒక్కసారి కాదు, ఏకంగా మూడుసార్లు ఆయన నుంచి ముఖ్యమంత్రి పదవి తృటిలో చేజారిపోయింది. 1999లో ఎస్.ఎం.కృష్ణ, 2004లో ఎన్.ధరమ్ సింగ్, 2013లో సిద్ధరామయ్య నుంచి ఎదురైన గట్టి పోటీని ఎదుర్కోలేకపోయారు. 2004లో మిశ్రమ ఫలితం వచ్చినప్పటికీ సంకీర్ణ ప్రభుత్వానికి సారథ్యం వహించే అవకాశం వచ్చింది. దాదాపు ఖాయమైపోయిందనుకున్న తరుణంలో జేడీ(ఎస్) అధినేత దేవెగౌడ అభ్యంతరం చెప్పడంతో తన సహచరుడైన మరో సీనియర్ నాయకుడు ధరమ్‌సింగ్ ముఖ్యమంత్రి కావడానికి సహకరించారు. ఈ అనుభవం వల్లే జేడీ(ఎస్)తో ఎన్నికల పొత్తుకు ఖర్గే విముఖంగా ఉన్నారు. ఎన్నికల తర్వాత సంకీర్ణం తప్పని పరిస్థితి ఎదురైనా జేడీ(ఎస్)తో దోస్తీ కలలోని మాట అని ఖర్గే ఈపాటికే సుస్పష్టంగా చెప్పేశారు. ఈ మేరకు సోనియా గాంధీ, రాహుల్ గాంధీని సైతం ఒప్పించినట్లు వినికిడి.

మది దోచిన సర్వేలు

కింగ్ అయ్యే అవకాశం మూడుసార్లు చేజారిన ఖర్గే ఈసారి కింగ్‌మేకర్ కావాలన్న కృత నిశ్చయంతో ఉన్నారు. ఇంటి గెలిచి చూపించి, రచ్చ గెలుపు మీద ఇనుమడించిన ఉత్సాహంతో దృష్టి సారించాలని ఆశిస్తున్నారు. ఇటీవలి కొన్ని సర్వేల ఫలితాలు ఖర్గే మనసు దోచాయి. ఇండియాటుడే నిర్వహించిన 'మూడ్ ఆఫ్ ద నేషన్' సర్వేలో కర్ణాటకలో జనవరిలో లోక్‌సభ ఎన్నికలు జరిగి ఉంటే 28 సీట్లకు కాంగ్రెస్ 17 సీట్లను దక్కించుకొనేది అని ఆ సర్వే సారాంశం. కర్ణాటక ఎన్నికల నగారా మోగిన రోజే ఏబీపీ–సీ ఓటర్ సర్వే కాంగ్రెస్‌కే విజయాన్ని కట్టబెట్టింది. ఆ పార్టీకి 115–127 సీట్లు వస్తాయంది. 224 అసెంబ్లీ స్థానాలున్న కర్ణాటక అసెంబ్లీలో 117 స్థానాలంటే సంకీర్ణం జోలికెళ్లకుండా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయొచ్చు. ఈ సర్వే ఖర్గే మనసు దోచి ఉంటుంది. ఇక కర్ణాటక ప్రజల మనసులు దోచడానికి ఖర్గే వ్యూహాలు సిద్ధం చేసుకోవాలి.

కోతల వేళ శుభవార్త

- హెచ్‌–1బీ వీసా హోల్డర్ల జీవిత భాగస్వాములు అమెరికాలో ఉద్యోగం చేసుకోవచ్చు
- అమెరికా జడ్జి తీర్పు



వాషింగ్టన్: ఆర్థిక సంక్షోభ భయాలతో అమెరికాలో టెక్ కంపెనీలు హెచ్‌–1బీ వీసాదారులను ఉద్యోగాల నుంచి తొలగిస్తున్న తరుణంలో వారి జీవిత భాగస్వామి అమెరికాలో ఉద్యోగం చేసుకోవచ్చని అమెరికా న్యాయమూర్తి ఒకరు తీర్పు చెప్పారు. దీంతో అమెరికాలో టెక్నాలజీ రంగంలో ఉద్యోగాలు పోయి ఆర్థిక అనిశ్చితిని ఎదుర్కొంటున్న వేలాది మంది భారతీయ టెకీలకు పెద్ద ఊరట లభించినట్లయింది. అమెరికాలో ప్రత్యేక ఉపాధి, నైపుణ్య వృత్తుల్లోకి తీసుకునేందుకు అక్కడి కంపెనీలు నాన్ ఇమిగ్రెంట్ హెచ్‌–1బీ వీసాలతో భారత్‌వంటి దేశాలకు చెందిన విదేశీ నిపుణులకు కొలువులు కల్పిస్తున్న విషయం విదితమే. అయితే ఇలా ఏటా వేలాదిగా తరలివస్తున్న హెచ్‌–1బీ వీసాదారులు, వారి భాగస్వాముల కారణంగా స్థానిక అమెరికన్లు ఉద్యోగాలు సాధించలేకపోతున్నారని సేవ్ జాబ్స్ యూఎస్‌ఏ అనే సంస్థ వాషింగ్టన్‌లోని జిల్లా కోర్టులో దావా వేసింది. హెచ్‌–1బీ వీసాదారుల జీవితభాగస్వాములూ జాబ్ కార్డ్ సాధించి ఉద్యోగాలు చేసేందుకు వీలు కల్పిస్తున్న ఒబామా కాలంనాటి నిబంధనలను కొట్టేయాలని సంస్థ కోరింది. ఈ దావాను అమెజాన్, ఆపిల్, గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి బడా కంపెనీలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఇప్పటికే అమెరికా ప్రభుత్వం హెచ్‌–1బీ వీసాదారుల దాదాపు లక్ష మంది జీవితభాగస్వాములకు పని చేసుకునేందుకు అనుమతులు ఇచ్చింది. ఈ కేసును మార్చి 28వ తేదీన జిల్లా మహిళా జడ్జి తాన్య చుత్కాన్ విచారించారు. 'అమెరికా ప్రభుత్వం పూర్తి బాధ్యతతోనే వారికి వర్క్ పర్మిట్ ఇచ్చింది. వీరితోపాటే వేర్వేరు కేటగిరీల వారికీ తగు అనుమతులు ఇచ్చింది. విద్య కోసం వచ్చే వారికి, వారి జీవిత భాగస్వామికి, వారిపై ఆధారపడిన వారికి హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం ఉపాధి అనుమతులు కల్పించింది. విదేశీ ప్రభుత్వాధికారులు, అంతర్జాతీయ సంస్థల అధికారులు, ఉద్యోగుల జీవితభాగస్వాములకూ అనుమతులు ఉన్నాయి' అంటూ సేవ్ జాబ్స్ యూఎస్‌ఏ పిటిషన్‌ను జడ్జి కొట్టేశారు. అయితే తీర్పును ఎగువ కోర్టులో సవాల్ చేస్తామని సంస్థ తెలిపింది.

అభినందనీయం

'ఉద్యోగాలు పోయి కష్టాల్లో ఉన్న హెచ్‌–1బీ హోల్డర్ల కుటుంబాలకు ఈ తీర్పు ఎంతో సంతోషాన్ని ఇచ్చింది. వలసదారుల హక్కుల సమానత్వ వ్యవస్థ సాధనకు ఇది ముందడుగు' అని వలసదారుల హక్కులపై పోరాడే భారతీయ మూలాలున్న అమెరికా న్యాయవాది అజయ్ భుటోరియా వ్యాఖ్యానించారు. గత ఏడాది నవంబర్ నుంచి చూస్తే గూగుల్, మైక్రోసాఫ్ట్, ఫేస్‌బుక్, అమెజాన్‌సహా అమెరికాలోని చాలా ఐటీ కంపెనీలు దాదాపు 2,00,000 మంది ఉద్యోగులను తొలగించాయని 'ది వాషింగ్టన్ పోస్ట్' తన కథనంలో పేర్కొనడం తెల్సిందే. ఇలా ఉద్యోగాలు పోయిన వారిలో 30–40 శాతం మంది భారతీయ ఐటీ నిపుణులే కావడం విషాదం.

'దహీ'పై వెనక్కి తగ్గిన ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ

కర్డ్‌తోపాటు ప్రాంతీయ భాషను వాడుకోవచ్చంటూ మళ్లీ ఉత్తర్వులు



చెన్నై/బెంగళూరు: పెరుగు ప్యాకెట్లపై ఇంగ్లిష్ 'కర్డ్'కు బదులుగా హిందీలోని 'దహీ' ముద్రించాలన్న ఆదేశాలు వివాదాస్పదం కావడంతో ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ) వెనక్కి తగ్గింది. కర్డ్‌ను కొనసాగిస్తూనే పక్కనే సమానార్థం .. తెలుగులో అయితే పెరుగు, కన్నడలో మొసరు, తమిళమైతే తాయిర్ అని ప్రాంతీయ భాషను ముద్రించవచ్చని స్పష్టతనిస్తూ గురువారం సవరణ ఉత్తర్వులు జారీ చేసింది. పెరుగు ప్యాకెట్లపై కర్డ్‌కు బదులుగా హిందీ సమానార్థం 'దహీ'ని ముద్రించాలంటూ ఈ నెల 10వ తేదీన ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ రాష్ట్ర ప్రభుత్వాలను కోరింది. తమిళనాడు కో ఆపరేటివ్ మిల్క్ ప్రొడ్యూసర్స్ ఫెడరేషన్ 'ఆవిన్' బ్రాండ్‌తో, కర్ణాటక మిల్క్ ఫెడరేషన్(కేఎంఎఫ్) నంది బ్రాండ్‌తో పెరుగును విక్రయిస్తున్నాయి. ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ ఆదేశాలపై తమిళనాడు సీఎం స్టాలిన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలపై హిందీని బలవంతంగా రుద్దేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఎప్పటిలాగానే తమిళ 'తాయిర్'నే వాడుతామని, 'దహీ' అని మాత్రం వాడబోమంటూ రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐకి సమాధానమిచ్చింది. అధికార డీఎంకే పార్టీ 'నహీ టు దహీ' అంటూ ఆన్‌లైన్ ఉద్యమాన్ని ప్రారంభించింది. 'దహీ' వివాదంపై తమిళనాడు బీజేపీ విభాగం అభ్యంతరం తెలిపింది. కర్ణాటక ప్రభుత్వ అధీనంలోని కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ (కేఎంఎఫ్) నందిని బ్రాండ్‌తో తీసుకువస్తున్న పెరుగు ప్యాకెట్లపై హిందీ దహీ పక్కన బ్రాకెట్లలో కన్నడ (మొసరు) ముద్రించాలంటూ ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ ఇచ్చిన మార్గదర్శకాలపై రాష్ట్ర మాజీ సీఎం కుమారస్వామి మండిపడ్డారు. ఈ చర్య కన్నడిగుల ఆత్మగౌరవాన్ని దెబ్బకొట్టడమేనన్నారు. దీంతో ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ తాజాగా సవరణ ఉత్తర్వులిచ్చింది.

పాకిస్తాన్‌లో హిందూ డాక్టర్ కాల్చివేత

ఇస్లామాబాద్: పాకిస్తాన్‌లోని కరాచీ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డెరెక్టర్, ప్రముఖ కంటి వైద్యుడు, హిందూ మతస్తుడైన డాక్టర్ బీర్బల్ జినానీని దుండగులు గురువారం తుపాకీతో కాల్చి చంపారు. కరాచీ సమీపంలోని ల్యారీ ఎక్స్‌ప్రెస్ రహదారిపై కారులో వెళ్తుండగా దుండుగులు ఘాతుకానికి పాల్పడ్డారు. పాకిస్తాన్‌లో హిందువులే లక్ష్యంగా దాడులు పెరిగిపోతున్నాయి. మార్చి నెలలో ఇది రెండో హత్య కావడం గమనార్హం. ఇటీవలే పాకిస్తాన్‌లోని హైదరాబాద్ పట్టణంలో హిందూ మతానికి చెందిన ధరమ్‌దేవ్ రాఠీ అనే వైద్యుడిని ముష్కరులు పొట్టనపెట్టుకున్నారు.

ఆర్మీ హెలికాప్టర్లు ఢీకొని..9 మంది మృతి

ఫోర్ట్‌కాంప్‌బెల్(అమెరికా): కెంటకీలో అమెరికా ఆర్మీకి చెందిన రెండు బ్లాక్ హాక్ హెలికాప్టర్లు ఢీకొన్న ఘటనలో 9 మంది సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. ఫోర్ట్ కాంప్‌బెల్‌కు 30 మైళ్లదూరంలో బుధవారం రాత్రి 9.30 గంటల సమయంలో ఘటన చోటుచేసుకుంది. 101 ఎయిర్‌బోర్న్ డివిజన్‌కు చెందిన హెచ్‌హెచ్‌–60 బ్లాక్ హాక్ హెలికాప్టర్లు రెండూ రాత్రి వేళ జరుగుతున్న రోజువారీ శిక్షణ సమయంలో ప్రమాదానికి గురికావడంపై దర్యాప్తు జరుగుతోందని అధికారులు తెలిపారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో కొంత అటవి, కొంతమైదానం ఉన్నాయని కెంటకీ గవర్నర్ ఆండీ చెప్పారు.



పార్లమెంట్ లోపల పనులను పర్యవేక్షిస్తున్న ప్రధాని మోదీ


పార్లమెంట్ నూతన భవనాన్ని సందర్శించిన ప్రధాని

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి మోదీ గురువారం సాయంత్రం పార్లమెంట్ నూతన భవనాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ప్రధాని మోదీ అక్కడ వివిధ విభాగాలు కొనసాగుతున్న పలు పనులను తనిఖీ చేశారు. నిర్మాణంలో పాల్గొంటున్న సిబ్బందితో మాట్లాడారు. పార్లమెంట్‌లోని ఉభయసభల్లో కల్పించే వివిధ సదుపాయాలను ఆయన పరిశీలించారు. అత్యాధునిక హంగులతో రూపుదిద్దుకుంటున్న పార్లమెంట్ భవనానికి ప్రధాని మోదీ 2020 డిసెంబర్‌లో శంకుస్థాపన చేశారు. గత నవంబర్‌కే ఇది పూర్తి కావాల్సి ఉండగా వివిధ కారణాలతో ఆలస్యమైంది. దీనిని మరికొద్ది రోజుల్లో ప్రారంభించే అవకాశాలున్నాయి.

ఇండోర్ ఆలయంలో విషాదం

బావి పైకప్పు కూలి 14 మంది భక్తులు మృతి

ఇండోర్: మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నగరంలో పండుగపూట విషాద ఘటన చోటుచేసుకుంది. బావి పైకప్పు కూలి 14 మంది ప్రాణాలు కోల్పోయారు. శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా స్థానిక పటేల్‌నగర్‌లోని బేలేశ్వర్ మహాదేవ్ ఝులేలాల్ ఆలయంలో పూజా కార్యక్రమాలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కొందరు భక్తులు బావిపై కట్టిన స్లాబ్‌పై నిలబడి ఉండగా అది హఠాత్తుగా కూలింది. సుమారు 35 మంది బావిలో పడిపోయారు. వెంటనే రంగంలోకి దిగిన అధికారులు సాయంత్రం వరకు 19 మందిని కాపాడగలిగారు. మరో 14 మంది చనిపోయినట్లు కలెక్టర్ ఇళయ రాజా చెప్పారు. వీరిలో 10 మంది మహిళలే ఉన్నారు. విశాలమైన పురాతన బావిపై స్లాబ్ వేసి, దానిపై ఆలయం నిర్మించినట్లు స్థానికులు తెలిపారు. ఎక్కువ సంఖ్యలో జనం చేరడంతో అది కూలిందన్నారు. ఆలయంలో ప్రమాదంపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున, క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున అందజేస్తామని సీఎం ప్రకటించారు. బావిలోని నీటిని పూర్తిగా తోడేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. గల్లంతైన వారిలో చిన్నారులు కూడా ఉన్నట్లు ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. దీంతో, అక్కడి పరిస్థితిని సీఎం చౌహాన్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.



బావి వద్ద సహాయక చర్యలు చేపట్టిన దృశ్యం

సిద్దరామయ్యపై యడ్డీ కుమారుడు పోటీ?



బెంగళూరు: కర్ణాటకలో కాంగ్రెస్ దిగ్గజ నాయకుడు సిద్ధరామయ్య మే 10న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీపడనున్న వరుణ నియోజకవర్గం నుంచి బీజేపీ తరఫున బి.ఎస్. యడియూరప్ప కుమారుడు బరిలో దిగుతారని ప్రచారం జరుగుతోంది. తన కుమారుడు బి.వై. విజయేంద్ర వరుణ నియోజకవర్గం నుంచి పోటీ పడే అవకాశాలను కొట్టి పారేయలేమని యడియూరప్ప చెప్పడంతో రాజకీయంగా ఈ స్థానంపై ఆసక్తి పెరిగింది. మైసూరు జిల్లాలో ముఖ్య నియోజకవర్గాల్లో ఒకటైన వరుణకి ప్రస్తుతం సిద్దరామయ్య కుమారుడు యతీంద్ర ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈసారి ఎన్నికల్లో వరుణ నుంచి సిద్ధరామయ్య పోటీ చేస్తున్నట్టు కాంగ్రెస్ అధికారికంగా ప్రకటించింది. సిద్దరామయ్యపై మీ కుమారుడు విజయేంద్ర పోటీ పడతారా అని గురువారం యడియూరప్పని విలేకరులు ప్రశ్నించగా ''దీనిపై చర్చలైతే సాగుతున్నాయి. వరుణలో నెగ్గడం సిద్ధరామయ్యకు అంత సులభం కాదు. మేము మంచి అభ్యర్థినే నిలబెట్టి గట్టి పోటీ ఇస్తాం. చూద్దాం ఏమవుతుందో'' అని వ్యాఖ్యానించారు. దీనిపై సిద్ధరామయ్య స్పందిస్తూ తనపై ఎవరు పోటీకి దిగినా పట్టించుకోనని అన్నారు. యడియూరప్ప పోటీకి దిగినా స్వాగతిస్తామని కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షుడు డి.కె. శివకుమార్ పేర్కొనడం విశేషం.

అమృత్‌పాల్ కోసం డ్రోన్‌తో గాలింపు

హోషియార్‌పూర్: వివాదాస్పద సిక్కు మత బోధకుడు అమృత్‌పాల్ సింగ్ జాడ కోసం పంజాబ్ పోలీసులు వేట ముమ్మరం చేశారు. గురువారం డ్రోన్‌ను రంగంలోకి దించారు. హోషియార్‌పూర్ జిల్లాలోని మర్నాయిన్ గ్రామంలో, చుట్టుపక్కల ప్రాంతాల్లో డ్రోన్‌తో గాలింపు చర్యలు చేపట్టారు. రెండు రోజుల క్రితం ఇదే గ్రామంలో కొందరు అనుమానితులు తమ కారును వదిలేసి పారిపోయారు. వారిలో అమృత్‌పాల్ ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. కాగా, తాను ఎక్కడికీ పారిపోలేదని, త్వరలోనే ప్రపంచం ఎదుటకు వస్తానని అమృత్‌పాల్ వెల్లడించాడు. ఈ మేరకు గురువారం మరో వీడియో తెరపైకి వచ్చింది. చావంటే తనకు భయం లేదని ఆ వీడియోలో వ్యాఖ్యానించాడు.

'రాహుల్' పరిణామాలను గమనిస్తున్నాం

న్యూఢిల్లీ: రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వం రద్దుపై అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్ మధ్య కొనసాగుతున్న రగడ ముదిరింది. 'రాహుల్‌కి వ్యతిరేకంగా కోర్టు తీర్పు, అనర్హత వేటు తదనంతర పరిణామాలను గమనిస్తున్నాం. లోక్‌సభ సభ్యత్వం రద్దు చేయడం సమంజసమేనా? అనేది పై కోర్టులో తేలుతుంది' అని జర్మనీ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ఒకరు మీడియాతో అన్నారు. దీనికి కాంగ్రెస్ నేతలు కృతజ్ఞతలు తెలిపారు. దీనిపై బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మన దేశ అంతర్గత వ్యవహారాల్లోకి విదేశీ శక్తులను కాంగ్రెస్ ఆహ్వానిస్తోందని కేంద్ర న్యాయ శాఖ మంత్రి కిరణ్ రిజిజు ట్వీట్‌చేశారు. ఈ ట్వీట్‌పై కాంగ్రెస్ నేత పవన్ ఖేరా స్పందించారు. 'అసలైన వ్యవహారాన్ని ఎందుకు పక్కదారి పట్టిస్తున్నారు? అదానీపై రాహుల్ లేవనెత్తిన ప్రశ్నలకు ప్రధాని సమాధానం ఇవ్వడంలేదు. ప్రజల దృష్టిని మళ్లించడం కాదు, మేము అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పండి'' అని డిమాండ్ చేశారు.

మోదీపై ఆప్ దేశవ్యాప్త పోస్టర్ ప్రచారం

న్యూఢిల్లీ: ప్రధాని మోదీకి వ్యతిరేకంగా ఆప్ గురువారం నుంచి దేశవ్యాప్త ప్రచారం ప్రారంభించింది. మోదీ హటావో, దేశ్ బచావో అనే నినాదంతో ప్రాంతీయ భాషల్లో ముద్రించిన పోస్టర్లు, బ్యానర్లను దేశవ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్నట్లు ఆప్ జాతీయ కన్వీనర్ గోపాల్ రాయ్ చెప్పారు. ప్రధాని మోదీ, బీజేపీ ఇచ్చిన అమలు కాని హామీల గురించి ప్రజలకు తెలియజెప్పడమే తమ ఉద్దేశమన్నారు. హామీలను నెరవేర్చకపోగా, ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందన్నారు. ఈ మేరకు ఇప్పటికే పోస్టర్లు, బ్యానర్లను 22 రాష్ట్రాల్లో ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. దేశవ్యాప్తంగా విద్యార్థులకు కూడా అవగాహన కల్పించేందుకు ఏప్రిల్ 10వ తేదీ నుంచి అన్ని యూనివర్సిటీల్లోనూ ఇటువంటి పోస్టర్లు, బ్యానర్లనే ఏర్పాటు చేస్తామన్నారు.

గద్దె దించేందుకు ఢిల్లీకి పోదాం

- ఐక్యంగా ముందుకు సాగుదాం
- ధర్నా సందర్భంగా విపక్షాలకు మమత పిలుపు

కోల్‌కతా: ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్న బీజేపీని గద్దె దించేందుకు విపక్ష పార్టీలన్నీ ఢిల్లీ దిశగా కదంతొక్కాలని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మరోమారు పిలుపునిచ్చారు. మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం, గృహ, ప్రజాపనులు తదితర పథకాలకు రాష్ట్రానికి కేంద్ర నిధుల మంజూరులో పశ్చిమబెంగాల్ రాష్ట్రాన్ని తీవ్రంగా నిర్లక్ష్యంచేస్తూ మోదీ సర్కార్ సవతి తల్లి ప్రేమ చూపిస్తోందని మమత ఆగ్రహం వ్యక్తంచేశారు. నిధుల విడుదలలో కేంద్రం వివక్షను నిరసిస్తూ బుధవారం నుంచి కోల్‌కతాలోని రెడ్‌రోడ్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద మమత ధర్నా చేస్తున్న విషయం విదితమే. ఈ ధర్నాలో గురువారం మమత మాట్లాడారు. బ్రిటిష్ ప్రభుత్వాన్ని భారతపాలన నుంచి తొలగించేందుకు 80 ఏళ్ల క్రితం సింగపూర్‌లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ 'ఢిల్లీ చలో' పిలుపునివ్వడం తెల్సిందే. ఇదే తరహాలో.. 'నేడు మనం బీజేపీని అధికార పీఠం నుంచి పక్కకు నెట్టేసేందుకు ఐక్యంగా ఢిల్లీకి బయల్దేరదాం. ఔర్ ఏక్ బార్ ఢిల్లీ చలో' అంటూ విపక్ష పార్టీలకు మమత పిలుపునిచ్చారు. 'కేంద్ర దర్యాప్తు సంస్థల దాడులు, తప్పుడు కేసులు, బెదిరింపుల ద్వారానే బీజేపీ కేంద్రంలో పాలన సాగించగలుగుతోంది. అన్ని పార్టీలు అవినీతిమయమంటూ తనను మాత్రం సత్యరుషిలా అభివర్ణించుకుంటోంది. వచ్చే పార్లమెంట్ ఎన్నికలు బీజేపీకి, దేశ పౌరులకు మధ్య పోరు. ధరాభారం నుంచి పేదలను కాపాడాలంటే బీజేపీని అధికారం నుంచి పక్కనబెట్టాల్సిందే. బీజేపీ దుశ్శాసనుడు, దుర్యోధనుడిలా తయారైంది' అని మమత అన్నారు.

సోమవారం చెన్నైలో విపక్షాల భేటీ

న్యూఢిల్లీ: దేశంలో సామాజిక న్యాయం అమలు తీరుతెన్నులపై చర్చించడానికి కాంగ్రెస్‌తోపాటు 20 ప్రతిపక్ష పార్టీల నేతలు సోమవారం తమిళనాడు రాజధాని చెన్నైలో భేటీ కానున్నారు. డీఎంకే చీఫ్ స్టాలిన్ ఈ సమావేశం నిర్వహించనున్నారు. జార్ఖండ్ ముక్తి మోర్చా(జేఎంఎం) చీఫ్ హేమంత్ సోరెన్, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్, ఎస్పీ చీఫ్ అఖిలేశ్‌యాదవ్, నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఫరూక్ అబ్దుల్లా, బీఆర్ఎస్ నాయకుడు కె.కేశవరావు, సీపీఎం నేత సీతారాం ఏచూరి, సీపీఐ నాయకుడు డి.రాజా, ఆమ్ ఆద్మీ పార్టీ ముఖ్య నేత సంజయ్ సింగ్, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నుంచి డెరెక్ ఓ బ్రియన్ తదితరులు పాల్గొంటారు. మరికొన్ని పార్టీల నుంచి ప్రతినిధులు పాల్గొనే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇది రాజకీయ సమావేశం కాదని, సామాజిక అంశంపై చర్చించడానికి జరుగుతున్న భేటీ అని విపక్ష నేతలు వెల్లడించారు.

నిఘా ఆరోపణలతో వాల్‌స్ట్రీట్ జర్నల్ విలేకరి అరెస్ట్

అమెరికా ఆదేశాలతో పనిచేస్తున్నాడని రష్యా ఆరోపణ



మాస్కో: ఉక్రెయిన్ యుద్ధంతో బద్ధశత్రువులుగా తయారైన అమెరికా, రష్యాల సంబంధాలు మరింత క్షీణించే పరిణామం ఒకటి సంభవించింది. రష్యాలో విలేకరిగా విధులు నిర్వర్తిస్తున్న అమెరికాకు చెందిన అంతర్జాతీయ వార్తాపత్రిక 'ది వాల్‌స్ట్రీట్ జర్నల్'కు చెందిన ఇవాన్ గెర్ష్‌కోవిచ్‌ను రష్యా నిఘా సంస్థ ఫెడరల్ సెక్యూరిటీ సర్వీస్(ఎఫ్‌ఎస్‌బీ) అరెస్ట్‌చేసింది. రహస్య పత్రాలను సేకరించేందుకు ప్రయత్నించాడని అతనిపై అభియోగాలు మోపింది. 'అమెరికా ఆదేశాలతోనే నిషేధిత ప్రాంతంలోని తమ సైనిక పారిశ్రామికవాడలోని ఒక సంస్థకు చెందిన రహస్య పత్రాలను సేకరించడంలో ఇవాన్ బిజీగా ఉన్నాడు. అందుకే అరెస్ట్ చేశాం' అని ఎఫ్‌ఎస్‌బీ గురువారం ప్రకటించింది. వాల్‌స్ట్రీట్ జర్నల్ మాస్కో బ్యూరోలో కరస్పాండెంట్‌గా పనిచేసే ఇవాన్ ఉక్రెయిన్, రష్యా, ఇతర సోవియట్ యూనియన్ దేశాల్లో వార్తల కవరేజీ విధులు నిర్వర్తిస్తున్నాడు. రష్యా మోపిన నేరం రుజువు అయితే గరిష్ఠంగా 20 సంవత్సరాల జైలు శిక్ష పడే అవకాశం ఉంది. తమ విలేకరి అరెస్ట్‌ను వార్తాసంస్థ తీవ్రంగా ఖండించింది. కోల్డ్ వార్ తర్వాత అమెరికా రిపోర్టర్‌ను రష్యా అరెస్ట్‌చేయడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఇవాన్‌ను ఏ తేదీలో అరెస్ట్‌చేసిందీ ఎఫ్‌ఎస్‌బీ వెల్లడించలేదుగానీ ఉరాల్ పర్వతాల దగ్గర్లోని ఎకటిన్‌బర్గ్ నగరంలో అతడిని అరెస్ట్‌చేసినట్లు తెలుస్తోంది. ఖైదీల పరస్పర మార్పిడిలో భాగంగా జైళ్లలో ఉన్న రష్యా ఆయుధ మధ్యవర్తి విక్టర్ బౌట్‌ను, డబ్ల్యూఎన్‌బీఏ స్టార్ బ్రిట్నీ గ్రీనర్‌ను రష్యా, అమెరికాలు మార్చుకున్న విషయం విదితమే.



హౌరా నగరంలోని కాజీపారాలో వాహనాలు, వస్తువులకు నిప్పుపెట్టిన దృశ్యం

బెంగాల్, మహారాష్ట్రల్లో 'నవమి' ఉద్రిక్తతలు

- దుకాణాలు ధ్వంసం, వాహనాలకు నిప్పు
- పోలీసులకు గాయాలు

న్యూఢిల్లీ/హౌరా: రామనవమి ఉత్సవాల సందర్భంగా పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. బెంగాల్‌లోని హౌరా నగరంలోని కాజీపారా ప్రాంతంలో గురువారం సాయంత్రం రామనవమి ర్యాలీ విషయమై రెండు వర్గాల మధ్య గొడవ మొదలైంది. రెచ్చిపోయిన దుండగులు వాహనాలకు నిప్పుపెట్టారు. పలు ఆటోలు, దుకాణాలను ధ్వంసం చేశారు. పోలీసులు లాఠీచార్జితో పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. పలువురిని అరెస్ట్ చేశారు. మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో కిరాద్‌పురా రామాలయం వద్ద రెండు వర్గాల మధ్య ఘర్షణను నివారించేందుకు పోలీసులు టియర్ గ్యాస్, ప్లాస్టిక్ బుల్లెట్‌లను ప్రయోగించడంతోపాటు కాల్పులు కూడా జరిపారు. సుమారు 500 మందితో కూడిన గుంపు పోలీసులపైకి రాళ్లు రువ్వారు. పెట్రోల్ బాంబులు విసిరారు. ఈ సందర్భంగా 10 మంది పోలీసులు సహా 12 మంది గాయపడ్డారు. బుధవారం రాత్రి ఇదే ప్రాంతంలో సంఘ విద్రోహ శక్తులు 13 వాహనాలకు నిప్పుపెట్టాయి. రాజధాని ఢిల్లీలోని జహంగీర్‌పురిలో శ్రీరామ్‌భగవాన్ ప్రతిమ యాత్రకు పోలీసులు అనుమతివ్వలేదు. అయితే, కొందరు నిషేధాజ్ఞలు ధిక్కరిస్తూ యాత్ర నిర్వహించారు. గత ఏడాది ఇక్కడే హనుమాన్ జయంతి వేడుక రోజు పెద్ద ఎత్తున అల్లర్లు జరిగాయి. గుజరాత్‌లోని వడోదరాలో రెండు రామనవమి ర్యాలీలపై దుండగులు రాళ్లు రువ్వారు. అయితే, ఎవరూ గాయపడలేదని పోలీసులు చెప్పారు.

సాక్షి హైదరాబాద్

శుక్రవారం । 31 । మార్చి । 2023



కుక్కల కట్టడికి.. లెక్కల తిప్పలు!

నగరంలో ఇటీవల వీధి కుక్కలదాడులు పెరిగిన నేపథ్యంలో వాటిని అరికడతామని అధికారులు చెబుతున్నారు. కానీ అది అంత ఈజీ కాదని పలువురు వెటర్నరీ నిపుణులు చెబుతున్నారు. -8లో



ఆహారపు అలవాట్లే.. ఆరోగ్య నిర్ణేతలు

ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో ఆహారపు అలవాట్లే ప్రధానమని మహిళారోగ్య నిపుణులు అన్నారు. గురువారం తాజ్ డెక్కన్ హోటల్‌లో 'ఆయుర్వేద –న్యూట్రిషనల్ సైన్స్–ఆరోగ్యం' అంశంపై చర్చ జరిగింది. -8లో

పరీక్షలు రాసిన విద్యార్థులకు వండర్ లా ప్రత్యేక వినోదం

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని ప్రసిద్ధ అమ్యూజ్‌మెంట్ పార్క్ వండర్‌లా ఈ విద్యా సంవత్సరంలో తమ 10, 11, 12వ తరగతి బోర్డు పరీక్షలకు హాజరైన విద్యార్థుల కోసం ప్రత్యేక వినోదాన్ని అందిస్తోంది. అంతేకాకుండా తమ ఒరిజినల్ హాల్ టిక్కెట్లను చూపడం ద్వారా విద్యార్థులు ప్రవేశ టికెట్ల పై 35% రాయితీని కూడా ఇస్తున్నట్టు సంస్థ ప్రతినిధులు తెలిపారు.

శోభాయమానం..

అట్టహాసంగా శ్రీరామనవమి యాత్ర

అబిడ్స్/జియాగూడ/అఫ్జల్‌గంజ్:

శ్రీరామనవమి శోభాయాత్ర గురువారం వైభవంగా సాగింది. వేలాదిమంది రామభక్తులు జైశ్రీరామ్ నినాదాలతో హోరెత్తిస్తూ శోభాయాత్రలో పాల్గొన్నారు. సీతారామ్‌బాగ్ ఆలయం నుంచి భాగ్యనగర్ శ్రీరామ నవమి ఉత్సవ సమితి, ధూల్‌పేట ఆకాష్‌పురి హనుమాన్ ఆలయం నుంచి ఎమ్మెల్యే రాజాసింగ్ శోభాయాత్ర నిర్వహించారు. అప్పర్ ధూల్‌పేట్ నుంచి బీఆర్ఎస్ నాయకులు ఆనంద్‌సింగ్ ఆధ్వర్యంలో శ్రీరామనవమి పాల్కి యాత్ర చేపట్టారు. మూడు యాత్రలు మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ ముందు నుంచి సాగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు కాషాయ జెండాలతో శోభాయాత్రలో పాల్గొన్నారు. సీతారామ్‌బాగ్ టెంపుల్ నుంచి భాగ్యనగర్ శ్రీరామనవి ఉత్సవ సమితి అధ్యక్షుడు డాక్టర్ భగవంతరావు ఆధ్వర్యంలో శోభాయాత్రను ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా కాశీ పీఠాధిపతి జగద్గురు శంకరాచార్య స్వామి, నరేంద్రనంద్ సరస్వతిజీ మహారాజ్, క్రాంతికారి శ్రీసంత్ బోమారామ్‌జీ మహారాజ్‌లు సీతారామ్‌బాగ్ టెంపుల్‌లోని సీతారామచంద్ర లక్ష్మణులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ద్రౌపతి గార్డెన్ వద్ద ఊరేగింపు ప్రారంభానికి ముందు మొదటిసారి సీతారాముల కల్యాణం చేపట్టారు.





బేగంబజార్ ఛత్రి చౌరస్తాలో సెల్‌ఫోన్ టార్చ్‌లు వేయించి అఖండ భారత దేశ ఏర్పాటుకు ప్రమాణం చేయిస్తున్న ఎమ్మెల్యే రాజాసింగ్


అఖండ హిందూ దేశ స్థాపనకు కృషి..

అఖండ హిందూదేశ స్థాపన కోసం ఏ త్యాగానికైనా సిద్ధమని గోషామహల్ ఎమ్మెల్యే టి.రాజాసింగ్ పేర్కొన్నారు. బేగంబజార్ చౌరస్తాలో గురువారం ఆయన ప్రసంగించారు. 100 కోట్ల మంది హిందువులు ఉన్న భారతదేశంలో హిందువులంతా ఏకమై అఖండ హిందూదేశంగా మార్చేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. దేశం అఖండ హిందూదేశంగా మారితే ఢిల్లీ రాజధాని ఉండబోదని, కాశీ, మధురా, అయోధ్యనగరాలు ఉంటాయన్నారు. సిద్ధిఅంబర్‌బజార్ చౌరస్తాలో ఆయన మాట్లాడారు. తనను చంపడానికి ఎంతో మంది ప్రయత్నిస్తున్నారని, తాను హిందుత్వం కోసం ప్రాణాలైనా అర్పిస్తానన్నారు. రాజకీయం లేకున్నా హిందూదేశం కోసం పోరాటం చేస్తానన్నారు. తనకు జైలు జీవితం కొత్త కాదన్నారు. రెండురోజుల క్రితం తన కుమారుడిని కిడ్నాప్ చేస్తామని కొంతమంది ఫోన్‌లో బెదిరించారన్నారు. హిందుత్వం కోసం పోరాటం చేసే తనను చంపితే ఆ బాధ్యతను తన కొడుకు నడిపిస్తాడని రామభక్తులకు కొడుకును పరిచయం చేశారు.

సనాతన ధర్మ పరిరక్షణ కోసం..

సుల్తాన్‌బజార్: శోభాయాత్ర సందర్భంగా హనుమాన్ వ్యాయామశాల స్టేడియంలో జరిగిన బహిరంగ సభకు శ్రీకాశి సుమేర్ పీఠాధీశ్వర్ యతి సామ్రాట్ అనంత్ శ్రీవిభూషిత్ జగద్గురు శంకరాచార్య స్వామి నరేంద్రనంద సరస్వతిజీ మహారాజ్ హాజరై ప్రసంగించారు. ప్రపంచ పటంలో పాకిస్తాన్ లేకుండా చేయడమే కాదు అఖండ భారత స్థాపన కోసం కృషి చేయాలన్నారు. పాకిస్తాన్, శ్రీలంక, బంగ్లాదేశ్‌లతో పాటు వివిధ దేశాలుగా ఉన్న రాజ్యాలన్నింటినీ శ్రీరామచంద్రప్రభు పాలించాడని గుర్తు చేశారు. నాటి ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా చైనా భారత భూభాగాన్ని కబ్జా చేయడమే కాకుండా, దేశం ముక్కలైందన్నారు. మరో 15 ఏళ్లలో అఖండ భారతదేశంగా అవతరిస్తుందని అన్నారు. సనాతన ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సంత్ బోమారాంజీ మహారాజ్ పిలుపునిచ్చారు. కమిటీ ప్రతినిధులు డాక్టర్ భగవంతరావు, గోవింద్ రాఠి పాల్గొన్నారు.







లంగర్‌హౌస్ త్రివేణి సంగంలో..





శోభాయాత్రలో నృత్యాలు చేస్తున్న యువత



న్యూస్‌రీల్

భానుడు భగభగ @ 40 డిగ్రీలు

సాక్షి, సిటీబ్యూరో: మహానగరంలో భానుడు భగ్గుమంటున్నాడు. రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో నగరవాసులు తల్లడిల్లుతున్నారు. భానుడి ప్రతాపంతో మధ్యాహ్నం గడపదాటేందుకు భయపడిపోతున్నారు. రోడ్లపై వెళ్తున్న వాహనదారులు, చిరు వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారు. శ్రీరామనవని పండగ సందర్భంగా ఆలయాలకు వెళ్లిన భక్తులు ఎండతో ఉక్కిరిబిక్కిరయ్యారు. కాగా, రాగల రెండు రోజులు ఎండలు ఇదే మాదిరిగా ఉంటాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. గురువారం సాధారణ గరిష్ట ఉష్ణోగ్రతలు 37.4 డిగ్రీలు ఉండగా, పలుచోట్ల 40 డిగ్రీల చేరువలో నమోదయ్యాయి. తిరుమలగిరిలో అత్యధికంగా 39.6 డిగ్రీలు, గచ్చిబౌలిలో 39.3, కుర్మగూడలో 39.1 డిగ్రీలు నమోదైంది. అదేవిధంగా జూబ్లీహిల్స్‌లో 38.9, అత్తాపూర్‌లో 38.7, రెడ్‌హిల్స్, బాలాజీనగర్‌లో 38.4, మారుతీనగర్, గణాంకభవన్, అడ్డగుట్టలో 38.3, మియాపూర్లో 38.2, వెస్ట్ మారేడ్‌పల్లిలో, షేక్‌పేట ఎల్బీనగర్‌లో 381, విరాట్‌నగర్, గోల్కొండ, న్యూనాగోల్, ఐఎస్ సదన్‌లో 38.0 డిగ్రీలున్నాయి.

నేడు ఆరెకటిక కులస్తుల రాష్ట్ర స్థాయి సమావేశం

లిబర్టీ: ఆరెకటిక కులస్తుల సమస్యలను చర్చించుదుకు ఈ నెల 31న రాష్ట్రస్థాయి సమావేశం ఏర్పాటు చేశామని ఆరెకటికల అభివృద్ధి సంఘం అధ్యక్షుడు భూంపల్లి అశోక్ తెలిపారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు.గురువారం ఆయన సంఘం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సంప్రదాయ వృత్తిని నమ్ముకొని జీవిస్తున్న ఆరెకటికలు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో తీవ్రంగా వెనుకబాటుకు గురవుతున్నారన్నారు. 31న జరిగే సమావేశంలో ఆరెకటికల సమస్యలపై సమగ్రంగా చర్చించి భవిష్యత్ పోరాట కార్యాచరణను రూపొందిస్తామన్నారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల నుంచి ఈ సమావేశంలో ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.

లీకేజీలపై కెమెరా కన్ను

- అందుబాటులో సరికొత్త ఆధునిక సాంకేతిక పరికరం
- యంత్రం పనితీరును పరిశీలించిన ఎండీ దానకిశోర్



సాక్షి, సిటీబ్యూరో: భూగర్భ జలమార్గాల్లో 'కాలుష్య మూలాలు, లీకేజీ'లను తక్షణమే గుర్తించి సత్వరమే సమస్యను పరిష్కరించే విధంగా సరికొత్త ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించేందుకు జలమండలి సిద్ధమవుతోంది. ఇటీవల మాదాపూర్‌లోని వడ్డెరబస్తీ, మెలార్‌దేవ్‌పల్లిలోని మొఘల్‌కాలనీలో నీటి కలుషిత ఘటనలపై ప్రజల నుంచి నిరసన వ్యక్తమైంది. ప్రజల నిరసనలను ఎదుర్కొన్న జలమండలి రోడ్డు, పైప్‌లైన్ తవ్వకుండానే నీటి కాలుష్య మూలాలు, లీకేజీలను తక్షణం గుర్తించి సరిచేసేందుకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానం కలిగిన ట్రెంచ్‌లెస్ టెక్నాలజీ కెమెరా క్విక్ ఇన్‌స్పెక్షన్ వాటర్ పొల్యూషన్ సిస్టం(క్యూఐడబ్ల్యూపీఎస్) యంత్రాన్ని ఇప్పటికే మారేడ్‌పల్లి, సికింద్రాబాద్, ఎస్ఆర్ నగర్, జూబ్లీహిల్స్, సోమాజిగూడ తదితర ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా వినియోగిస్తోంది. సమయం ఆదాతో పాటు సత్ఫలితాలు ఇస్తుండటంతో ఈ యంత్రం పనితీరును పరిశీలించిన వాటర్ బోర్డు ఎండీ దానకిశోర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే ఈ యంత్రాల కొనుగోలుకు మొగ్గు చూపుతున్నట్లు తెలిసింది.

సవాల్‌గా మారిన మూలాల గుర్తింపు

నీటి మార్గాల్లో కాలుష్య మూలాలు, లీకేజీలను గుర్తించడం జలమండలికి ప్రధాన సవాలుగా తయారైంది. సంస్కరణలో భాగంగా వివిధ చర్యలు చేపడుతున్న నీటి కాలుష్య ఫిర్యాదుల వెల్లువ మాత్రం ఆగడం లేదు. నిత్యం కస్టమర్ కేర్ సగటున 150 నుంచి 200 ఫిర్యాదులు అందడం సర్వసాధారణమైంది. నీటి కాలుష్య మూలాలు, లీకేజీలు గుర్తించే ప్రక్రియలో రోడ్ల కిలోమీటర్ల పొడవున కోత, పనుల జాప్యంతో పరిస్థితి సైతం చేయిదాటి సమస్యలు తప్పడం లేదు.

ఇక కెమెరా కన్నుతో చెక్

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన కెమెరా కన్ను కాలుష్య మూలాలు, లీకేజీలు తక్షణం గుర్తించడం సులభతరం చేయనుంది. ఇక రోడ్లను కిలోమీటర్ల పొడవు తవ్వాల్సిన అవసరం ఉండదు. క్విక్ ఇన్‌స్పెక్షన్ వాటర్ పొల్యూషన్ సిస్టం ద్వారా పైప్‌లైన్‌లో అంతర్గత స్థితి, విస్తరించిన కాలుష్యం, వాటర్ లైన్ల బ్లాక్‌లు, పైప్‌లైన్ పగుళ్లు, నీటిలో మునిగిన వాల్వ్‌ల దృశ్యాలను ద్వారా ఈజీగా గుర్తించవచ్చు. బ్యాటరీతో నడిచే ఈ యంత్రానికి 120 మీటర్ల పొడవైన పైపు, దానికి లైట్‌తో కూడిన ఒక కెమెరా ఉంటుంది. పైన మానిటర్ ఉంటుంది. ఈ యంత్రం పైపునకు ఉన్న కెమెరాను సంబంధిత వాటర్ పైపులైన్, మ్యాన్‌హోల్‌లోకి పంపిస్తారు. ఈ యంత్రాన్ని ఆపరేట్ చేసే సిబ్బందిపై నుంచి మానిటర్ ద్వారా అంతర్గత పరిస్థితిని పర్యవేక్షిస్తారు. వీడియో సైతం రికార్డు అవుతోంది. తక్షణమే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకునేందుకు వీలుంటుంది.

'సీసీసీ' నుంచి శోభాయాత్ర పర్యవేక్షణ



బషీర్‌బాగ్‌లోని సీసీసీ నుంచి శోభాయాత్ర పర్యవేక్షిస్తున్న కొత్వాల్ సీవీ ఆనంద్

సాక్షి, సిటీబ్యూరో: శ్రీరామ నవమి శోభాయాత్రం నేపథ్యంలో గురువారం నగరంపై పోలీసు విభాగం డేగకన్ను వేసింది. ప్రధాన ఊరేగింపు మార్గాలతో పాటు ఆ చుట్టపక్కల ప్రాంతాలు, ఇతర రహదారుల పర్యవేక్షణకు ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఆయా చోట్ల ఇప్పటికే ఉన్న ట్రాఫిక్, కమ్యూనిటీ సీసీ కెమెరాలకు తోడు తాత్కాలిక ప్రాతిపదికన అదనంగా అవసరమైన కెమెరాలు అందుబాటులోకి తీసుకువచ్చారు. శోభాయాత్ర జరిగే రూట్‌లో ప్రతి అణువూ రికార్డు అయ్యేలా చర్యలు తీసుకుంటూ సీసీ, పీటీజెడ్, వైఫై తదితర ఆధునిక కెమెరాలు ఏర్పాటయ్యాయి. 739 తాత్కాలికంగా కెమెరాలు ఏర్పాటు చేసిన నగర పోలీసులు వీటిని బషీర్‌బాగ్‌లోని పోలీసు కమిషనరేట్‌లోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో(సీసీసీ), బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లతో(ఐసీసీసీ) అనుసంధానించారు. నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్, అదనపు సీపీ విక్రమ్ సింగ్ మాన్ పరిస్థితుల్ని ఆద్యంతం పర్యవేక్షించారు.

సొంత వాహనాలే.. సో బెటర్..

గ్రేటర్‌లో 78 లక్షలు దాటిన వాహనాలు

- సుమారు 50 లక్షల వరకు బైక్‌లే..
- జీవితకాల పన్ను, త్రైమాసిక పన్నుల్లోనూ టాప్
- రూ.3,600 కోట్లకు పైగా ఆదాయం



సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌లో సొంత వాహనాల సంఖ్య భారీగా పెరిగింది. ఇప్పటి వరకు సుమారు 78 లక్షల వాహనాలు నమోదయ్యాయి. కోటిన్నరకు చేరుకున్న నగర జనాభాలో సగానికిపైగా వాహనాలు ఉన్నాయి. బైక్‌ల సంఖ్య బాగా పెరిగింది. ఆ తర్వాత వ్యక్తిగత కార్ల వినియోగం కూడా బాగానే నమోదైంది. ఈ ఆర్థిక సంవత్సరం ఆర్టీఏ గణాంకాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా సుమారు కోటి 53 లక్షల వాహనాలు నమోదు కాగా, అందులో సగానికి పైగా గ్రేటర్ హైదరాబాద్‌కు చెందినవే కావడం గమనార్హం. ఉద్యోగ, వ్యాపార అవసరాల దృష్ట్యా నగరవాసులకు సొంత వాహనం తప్పనిసరిగా మారింది.

ఈ మూడేళ్లలోనే..

కోవిడ్ కాలంలో ప్రజారవాణా స్తంభించిన సమయంలో మొదలైన వాహనాల కొనుగోళ్లు అప్పటి నుంచి అదే ఒరవడిలో కొనసాగుతున్నట్లు రవాణా అధికారులు అంచనా వేస్తున్నారు. వాటిలోనూ బైక్‌లే పెద్ద సంఖ్యలో ఉన్నాయి. మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి వర్గాల్లో కార్ల వినియోగం పెరిగింది. సాధారణంగా ప్రతి సంవత్సరం లక్ష నుంచి 1.25 లక్షల వరకు వాహనాలు కొత్త వాహనాలు వచ్చి చేరుతాయి. మూడేళ్లుగా ఏటా సుమారు 2 లక్షల వరకు కొత్త వాహనాలు నమోదవుతున్నాయి. ఈ మూడేళ్లలోనే వాహనాల సంఖ్య 72 లక్షల నుంచి 78 లక్షలకు పెరిగినట్లు ఆర్టీఏ అధికారులు తెలిపారు.

తప్పనిసరిగా సొంత బండి..

- సొంత బండి ప్రతి ఇంటికీ తప్పనిసరిగా మారింది. రోజురోజుకూ నగరం విస్తరిస్తోంది. అవుటర్‌ను దాటి పెరిగింది. కానీ ఇందుకు తగినట్లుగా ప్రజారవాణా సదుపాయాలు మాత్రం విస్తరించలేదు. దీంతో నగరానికి దూరంగా ఉండి, ఉద్యోగ, ఉపాధి, వ్యాపార అవసరాల కోసం రాకపోకలు సాగించేవాళ్లు సొంత వాహనాలను ఏర్పాటు చేసుకుంటున్నారు.
- గతంలో ఘట్‌కేసర్, హయత్‌నగర్, మియాపూర్, బీహెచ్ఈఎల్, కీసర వంటి దూరప్రాంతాల నుంచి నగరానికి వచ్చేవారు సిటీ బస్సులపై ఆధారపడేవాళ్లు. కానీ ఇప్పుడు శివార్ల నుంచి కూడా ఎక్కువ మంది సొంత వాహనాల్లోనే నగరానికి వస్తున్నారు.
- ప్రతిరోజూ సుమారు 4 లక్షల మందికి మెట్రో రైలు సేవలు అందజేస్తున్నప్పటికీ మెట్రో మార్గాలకు ఫీడర్ సర్వీసులు లేకపోవడం వల్ల సొంత వాహనాలపైనే మెట్రో స్టేషన్లకు రాకపోకలు సాగించాల్సి వస్తోంది.

మొబైల్ ఫోన్ ఉన్నట్లే బైక్..

- ఇప్పుడు ప్రతి మనిషికి ఒక మొబైల్ ఫోన్ అనివార్యమైంది. అదేవిధంగా యువతలో 80 శాతం మందికి బైక్ కూడా తప్పనిసరిగా మారింది. చదువు, ఉద్యోగ, వ్యాపార అవసరాలతో నిమిత్తం లేకుండా ఒక వయస్సుకు రాగానే పిల్లలకు బండి కొనివ్వడాన్ని తల్లిదండ్రులు గొప్పగా భావిస్తున్నారు. రవాణాశాఖలో నమోదైన 78 లక్షల వాహనాల్లో సుమారు 50 లక్షల వరకు బైక్‌లే కావడం ఇందుకు నిదర్శనం.
- కుటుంబ అవసరాల కోసం బస్సులు, రైళ్ల కంటే సొంత వాహనాలను ఎక్కువగా వినియోగిస్తున్నారు. దీంతో ప్రస్తుతం నగరంలో 23 లక్షలకు పైగా వ్యక్తిగత కార్లు నమోదయ్యాయి.
- ఆటోరిక్షాలు, క్యాబ్‌లు, సరుకు రవాణా వాహనాలు, స్కూల్ బస్సులు, ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులు తదితర కేటగిరీలకు చెందినవి సుమారు 5 లక్షల వరకు ఉన్నాయి.

పెరిగిన ఆర్టీఏ ఆదాయం..



ఈ ఏడాది రవాణాశాఖ లక్ష్యాన్ని మించి ఆదాయాన్ని ఆర్జించింది. కొత్తవాహనాలపైన జీవితకాల పన్ను రూపంలో, రవాణా వాహనాలపైన త్రైమాసిక పన్నుల రూపంలో ఎక్కువ మొత్తంలో ఆదాయం లభించింది. సుమారు 2.17 లక్షల వాహనాల నుంచి బకాయి ఉన్న రూ.230 కోట్ల త్రైమాసిక పన్ను వసూళ్ల కోసం ఆర్టీఏ చేపట్టిన ప్రత్యేక తనిఖీలు సత్ఫలితాలు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. కోవిడ్ కాలం నుంచి పెండింగ్‌లో ఉన్న అనేక వాహనాల నుంచి పన్నులు వసూలు చేశారు. పన్నులు, ఫీజులు తదితర రూపాల్లో ఈ ఆర్థిక సంవత్సరం రాష్ట్రవ్యాప్తంగా రూ.6,285 కోట్ల ఆదాయం లభించగా అందులో ఒక్క గ్రేటర్ హైదరాబాద్ నుంచి రూ.3,600 కోట్లకు పైగా రాబడి వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు.

ఆస్తిపన్ను చెల్లింపునకు నేడే చివరి రోజు

- రాత్రి 11 గంటల వరకు పనిచేయనున్న సీఎస్‌సీలు
- ఆన్‌లైన్ ద్వారా అర్ధరాత్రి వరకు..



సాక్షి, సిటీబ్యూరో: శుక్రవారంతో ముగియనున్న ఈ ఆర్థిక సంవత్సరం(2022–23) ఆస్తిపన్ను చెల్లించాల్సిన వారి సదుపాయార్థం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంతోపాటు అన్ని సర్కిళ్లలోని సిటిజన్ సర్వీస్ సెంటర్లు(సీఎస్‌సీ) రాత్రి 11 గంటల వరకు పనిచేయనున్నాయి. ఆన్‌లైన్ ద్వారా అర్ధరాత్రి 12గంటలలోపు చెల్లించవచ్చని జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేశ్‌కుమార్ పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం జీహెచ్ఎంసీ ఆస్తిపన్ను వసూళ్లు గణనీయంగానే జరుగుతున్నప్పటికీ, పెరిగిన దుబారా ఖర్చులు.. ముఖ్య ప్రజాప్రతినిధులు, అధికారుల ఆడంబరాలు, వివిధ ప్రాజెక్టుల పనులు తదితరమైన వాటితో ఎన్ని కోట్ల రూపాయలు వసూలవుతున్నా ఖజానా పరిస్థితి లోటుగానే ఉంటోంది. గతంలో రూ.వెయ్యికోట్లు వసూలు కావడమే గగనమనుకున్న పరిస్థితి నుంచి ఏటికేడు టార్గెట్‌ను పెంచుతున్నారు. 2022–23 ఆర్థిక సంవత్సర టార్గెట్ రూ.2వేల కోట్లు కాగా, ఫిబ్రవరి నెలాఖరు వరకు రూ.1,514 కోట్లు వసూలయ్యాయి. మార్చినెల ఒకటోతేదీ నుంచి 30వ తేదీ సాయంత్రం వరకు దాదాపు రూ.88 కోట్లు వసూలయ్యాయి. వెరసీ రూ.1,602 కోట్లు వసూలయ్యాయి. చివరి రోజు గరిష్ట వసూళ్లు చేసేందుకు సీఎస్‌సీలను 11 గంటల వరకు తెరచి ఉంచనున్నారు. ఆన్‌లైన్ ద్వారా అర్ధరాత్రి 12గంటలలోపు చెల్లించవచ్చు. ప్రజలు ఈ సదుపాయాన్నీ వినియోగించుకోవాల్సిందిగా జీహెచ్ఎంసీ కోరుతోంది. ఇప్పటికే వివిధ రూపాల్లో, వివిధ మార్గాల్లో ఎక్కువే వసూలు చేశారు. చివరి రోజు దాదాపు రూ.100 కోట్ల వసూలు ఆశలున్నా.. కష్టమేననే అభిప్రాయాలున్నాయి. గతేడాది రూ.1,495 కోట్ల ఆస్తిపన్ను వసూలు కాగా, చివరి ఒక్కరోజు దాదాపు రూ.94 కోట్లు వసూలయ్యాయి.

నమోదవుతున్న కేసుల్లో సైబర్ నేరాలే అధికం

- డీజీపీ అంజనీకుమార్

బంజారాహిల్స్: ప్రస్తుతం నమోదవుతున్న కేసుల్లో సైబర్ నేరాలే ఎక్కువగా ఉంటున్నాయని రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్ అన్నారు. జూబ్లీహిల్స్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో ఐటీ విభాగానికి చెందిన 41 మంది జ్యుడీషియల్ ఆఫీసర్లు, 100 మంది పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు సైబర్ నేరాలు, సైబర్ చట్టాలపై నిర్వహించిన గురువారం జరిగిన శిక్షణ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీజీపీ మాట్లాడుతూ న్యాయ రంగంలో సైబర్ సంసిద్ధతను పొందాల్సిన అవసరం ఉందన్నారు. సైబర్ నేరస్తులు విసురుతున్న సవాళ్లను మంచి పరిజ్ఞానంతో ఎదుర్కోడానికి ఏజెన్సీలు, న్యాయవ్యవస్థ ముందుకు రావాలని సూచించారు. సైబర్ క్రైం, డేటా పాయింట్లు, పరిశోధన, విధానపరమైన అవసరాలు, పరిష్కారాలు, దేశంలో ఇప్పటికే ఉన్న సైబర్ చట్టాలు తదితర అంశాలపై శిక్షణ కొనసాగింది. సైబర్ నేరాలు, సైబర్ చట్టాలను శిక్షణలో పాఠ్యాంశాలుగా చేర్చారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ డైరెక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ జ్యుడీషియల్ ఆఫీసర్ సామర్థ్యాలు పెంపొందించడం, సైబర్ నేరాల కేసులను మరింత సమర్థవంతంగా, ప్రభావవంతంగా పరిశోధించేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ డీజీ బెనహర్ మహేష్ దత్ ఎక్కా, సీఐడీ అదనపు డీజీ మహేష్‌భగవత్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న డీజీపీ అంజనీకుమార్

కుక్కల కట్టడికి.. లెక్కల తిప్పలు!

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్‌లో ప్రదీప్ అనే నాలుగేళ్ల బాలుడు కుక్కలబారిన పడి మృతి చెందడంతో రాష్ట్రవ్యాప్తంగా వీధికుక్కలను అరికడతామని అధికారులు చెబుతున్నప్పటికీ అది అంత ఈజీ కాదు. కుక్కల జీవితచక్రం మేరకు.. కుక్క పిల్లలకు 8నెలల వయసు నిండేటప్పటికి, పునరుత్పత్తి సామర్థ్యం వస్తుంది. ఒకవైపు సంతాన నిరోధక ఆపరేషన్లు(స్టెరిలైజేషన్లు) చేసినా.. మరోవైపు ఎన్నోరెట్లు పెరిగే సంతతితో ఏడాది, రెండేళ్లలో కాదుకదా ఎన్నేళ్లలో కుక్కలన్నింటికీ స్టెరిలైజేషన్లు చేయగలరో ఎవరూ కచ్చితంగా చెప్పలేకపోతున్నారు. తగిన జాగ్రత్తలతో మసలుకోవడం వల్ల కుక్కకాట్ల బారినపడకుండా ఉండవచ్చు కానీ.. కుక్కల సంతతినే అరికట్టడం సాధ్యం కాదని వెటర్నరీ నిపుణులు చెబుతున్నారు.

ప్రకటనలు అమలయ్యేనా..?
జీహెచ్ఎంసీలో కుక్కల నివారణకు స్టెరిలైజేషన్లు పెంచి కుక్కలను తగ్గిస్తామని మేయర్ పేర్కొన్నారు. కానీ.. జీహెచ్ఎంసీ లెక్కల మేరకే నగరంలో 5,70,729 కుక్కలుండగా, ఈ సంవత్సరం ఫిబ్రవరి 16 వరకు 4,01,089 కుక్కలకు స్టెరిలైజేషన్లు చేశారు. మిగతా 1,66,640 కుక్కలకు సైతం ముమ్మరంగా స్టెరిలైజేషన్లు చేసేసి కుక్కల సంతతి తగ్గిస్తామని, అందుకు ఆధునిక పద్ధతులు అవలంభిస్తామని మేయర్ సెలవిచ్చారు. కానీ.. స్టెరిలైజేషన్లు చేయాల్సిన వాటిల్లో పునరుత్పత్తి సామర్థ్యం ఉన్నవి ఏడాదికి రెండుసార్లు పిల్లల్ని పెట్టగలవనే విషయాన్ని మరచిపోయారు.

కుక్కల సంఖ్య పెరుగుతోందిలా..
- స్టెరిలైజేషన్లు జరగాల్సిన 1,66,640 కుక్కల్లో ఆడకుక్కలు దాదాపు 75వేలు ఉన్నాయనుకున్నా, అవి ఏడాదికి రెండు పర్యాయాలు పిల్లల్ని పెడతాయి.
- ఒక్కో విడతలో కనీసం నాలుగు పిల్లల్ని పెట్టినా ఏడాది గడిచే సరికి దాదాపు 6 లక్షల కుక్క పిల్లలు పుడతాయి. వీటిల్లో సగమే బతికినా 3 లక్షలుంటాయి. వాటిల్లో ఆడకుక్కలు లక్షన్నరగా అంచనా వేసుకుంటే ఏడాది తిరిగే సరికి వాటి వల్ల మళ్లీ ఇదే లెక్కన కుక్కల సంతతి పెరుగుతుంది.
- స్టెరిలైజేషన్ల స్పీడ్‌ను బట్టి అందుకు అనుగుణంగా కుక్కల సంతతిలో పెరుగుదల తగ్గవచ్చునేమో కానీ పూర్తిగా అరికట్టడం అసాధ్యం.

వీధికుక్కల నివారణ అంత ఈజీ కాదు
- లెక్క తేలినా.. వెటర్నరీ డాక్టర్లు, సదుపాయాలూ కష్టమే..
- కుక్కకాట్లకు గురికాకుండా జాగ్రత్తలే శరణ్యం
- దత్తత.. మచ్చిక చేసుకోవడం మార్గమంటూ అభిప్రాయాలు

ఎంత సమయమో..?
జీహెచ్ఎంసీలో ప్రస్తుతం సంవత్సరానికి 60వేల స్టెరిలైజేషన్లు చేసేందుకు సదుపాయాలున్నాయి. వీటిని రెట్టింపు చేసినా వీధికుక్కలన్నింటికీ స్టెరిలైజేషన్లు చేసేందుకు ఎంత సమయం పడుతుందో జీహెచ్ఎంసీ అధికారులు సైతం చెప్పలేకపోతున్నారు. కుక్కల సంఖ్య, స్టెరిలైజేషన్ కేంద్రాలు, వెటర్నరీ డాక్టర్లు తదితరమైన వాటి అంచనాలతో.. వివిధ లెక్కలతో కుస్తీ పడుతున్నారు. తగినంత మంది డాక్టర్లు, సదుపాయాలు ఏమేరకు సమకూరుతాయో తెలియని అయోమయంలో ఉన్నారు.

మచ్చికతోనే మేలు..
కేవలం స్టెరిలైజేషన్ల వల్లే కుక్కల బెడద తగ్గదని, కుక్కల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకుంటే అవి విశ్వాసంగానే ఉంటాయని డాగ్ లవర్స్ చెబుతున్నారు. ఎవరో ఒకరు వాటిని దత్తత తీసుకోవాలని సూచిస్తున్నారు.

డీవార్మింగ్, మాస్ వ్యాక్సినేషన్లు మేలు..



స్టెరిలైజేషన్లతో కుక్కల సంతతి పూర్తిగా అరికట్టడం అసాధ్యం. కరవకుండా ఉండేందుకు కుక్కలకు డీవార్మింగ్ చేస్తే ఇరిటేషన్ తగ్గుతుంది. తద్వారా కరిచే అవకాశాలు తగ్గుతాయి. పోలియో తరహాలో కుక్కలన్నింటికీ మాస్ వ్యాక్సినేషన్ చేయడం వల్ల కరిచినా ర్యాబిస్ సోకకుండా ఉంటుంది. దీన్ని వేసవి, వర్షాకాల సీజన్ల ఆరంభంలో రెండు పర్యాయాలు చేస్తే మంచిది. జీహెచ్ఎంసీతోపాటు పశుసంవర్ధకశాఖ, ప్రైవేట్ వెటర్నరీ కేంద్రాల సమన్వయతో ఈ పని చేయాలి. ఎండాకాలంలో వీధికుక్కల సమస్యలు ఎక్కువగా ఉంటాయి. ఆయా ప్రాంతాల్లో ఆహారం, నీటి సదుపాయం ఉండేలా చూస్తే వీధి కుక్కలకు ఆకలి దప్పుల బాధలుండవు.

– డాక్టర్ పి.వెంకటేశ్వర్‌రెడ్డి, చీఫ్ వెటర్నరీ ఆఫీసర్(రిటైర్డ్), జీహెచ్ఎంసీ.

కుక్కలను వధిస్తే శిక్షలు..



బతకడానికి మనుషులకున్నట్లే జంతువులకూ హక్కులున్నాయి. కుక్కలను చంపితే చట్టపరమైన శిక్షలు తప్పవు. చిన్నారులకు కుక్కలపై అవగాహన కల్పించాలి. రాళ్లతో కొట్టడం, వాటిని భయపెట్టడం వంటివి చేయకుండా వాటి సానుభూతి ఉండేలా ప్రేరేపించాలి.

– అభిషేక్ గౌతం, ఎనిమల్ యాక్టివిస్ట్, హైదరాబాద్.

ఆహారపు అలవాట్లే..ఆరోగ్య నిర్ణేతలు

- వెల్లడించిన మహిళారోగ్య నిపుణులు
- ఆయుర్వేదం– న్యూట్రిషనల్ సైన్స్‌పై చర్చ



సాక్షి, సిటీబ్యూరో: వయసుతో సంబంధం లేని చురుకుదనం ఆరోగ్యాలను అందుకోవడంలో ఆహారపు అలవాట్లే ప్రధానమని పలువురు మహిళారోగ్య నిపుణులు స్పష్టం చేశారు. ఆల్మండ్ బోర్డ్ ఆఫ్ కాలిఫోర్నియా ఆధ్వర్యంలో గురువారం తాజ్ డెక్కన్ హోటల్‌లో 'ఆయుర్వేద –న్యూట్రిషనల్ సైన్స్–ఆరోగ్యం' అంశంపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా గత దశాబ్దకాలంలో భారతీయ ఆహార అభిరుచిలో వస్తోన్న మార్పులపై ప్యానలిస్ట్‌లు చర్చించారు. విదేశీ వంటకాలపై వ్యామోహంతో అల్ట్రా ప్రాసెస్డ్, హై కేలరీ ఫుడ్స్ వినియోగం పెరిగిందన్నారు. స్నాక్స్‌కు బదులుగా సంప్రదాయ, రుచికరమైన బాదాములు, మిల్లెట్స్, ఉసిరికాయ, రెడ్ రైస్ వంటివి తీసుకోవాల్సిందిగా సూచించారు. మన నమ్మకాలు, ఆయుర్వేద సూత్రాలతో సమకాలీన న్యూట్రిషనల్ సైన్స్ ఏకీభవిస్తున్న వైనాన్ని విశ్లేషించారు. వటడ/బాద్మా / వత్మా అని పేర్కొనే బాదాముల వల్ల 'వత', 'పిత్త' 'కఫ' దోషాలు తగ్గుతాయని ఆయుర్వేదం చెబుతోందని, ఇటీవల డేవిడ్ సీ నీమన్ నిర్వహించిన అధ్యయన ఫలితాల ప్రకారం, బాదాముల వల్ల మజిల్ రికవరీతో పాటు వ్యాయామాల అలసట కూడా తగ్గుతుందని వెల్లడైందన్నారు. ఈ నేపథ్యంలో ఆయుర్వేద విజ్ఞానాన్ని సమకాలీన న్యూట్రిషనల్ సైన్స్‌తో జోడించడం తప్పనిసరిగా స్పష్టం చేశారు. చక్కటి ఆరోగ్య నిర్వహణకు ఆరోగ్యవంతమైన ఆహారపు అలవాట్లు పాటించడం తప్పదని తేల్చి చెప్పారు. కార్యక్రమంలో ఆయుర్వేద నిపుణురాలు డాక్టర్ నిఖిత కోహ్లీ, న్యూట్రిషన్–వెల్‌నెస్ కన్సల్టెంట్ షీలా కృష్ణస్వామి ఫిట్‌నెస్ ట్రైనర్ కిరణ్ డెంబ్లాలు పాల్గొన్నారు.

దేశంలో కార్పొరేట్ పాలన

ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అనురాధ



మాట్లాడుతున్న అనురాధ

కవాడిగూడ: దేశాన్ని తొమ్మిదేళ్లుగా పాలించేది ప్రధాని మోదీ కాదని.. అదానీ, అంబానీల కార్పొరేట్ శక్తులని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అనురాధ అన్నారు. ప్రధాని నరేంద్రమోదీని అడ్డం పెట్టుకొని అదానీ, అంబానీ వారి సంపదను పెంచుకునేందుకు కార్మిక హక్కులను కాలరాస్తున్నారన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, కొత్తగూడెంలో ఏప్రిల్ 2, 3 తేదీల్లో నిర్వహించనున్న ఐఎఫ్‌టీయూ తెలంగాణ రాష్ట్ర 2వ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ గురువారం ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కార్మికులకు రక్షణగా ఉన్న కార్మిక చట్టాలను సవరించి కార్పొరేట్ శక్తులకు సానుకూలం చేస్తున్నారని ఆరోపించారు. ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ విధానాల ఫలితంగా ప్రభుత్వ రంగ సంస్థల్లో వంద శాతం విదేశీ ప్రత్యేక పెట్టుబడులకు (ఎఫ్‌డీఐ) చట్టబద్ధత కల్పిస్తుందన్నారు. పాత పెన్షన్ విధానాన్ని రద్దు చేసి నూతన పెన్షన్ విధానాన్ని తీసుకువస్తుందన్నారు. త్యాగాలు చేసిన సాధించుకున్న కార్మిక హక్కులను కాపాడుకోవడానికి కార్మిక లోకం ఉద్యమించాలని పిలుపునిచ్చారు.



కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్‌పై దాడి

పథకం ప్రకారమే దాడి చేశారని పోలీసులకు ఫిర్యాదు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు కార్పొరేటర్‌పై పలువురు దాడిచేసిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. కార్పొరేటర్ కుమార్ యాదవ్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక శ్రీ కోదండ సీతారామస్వామి దేవస్థానంలో సాంస్కృతిక కార్యక్రమాల్లో భాంగా గురువారం ఉదయం ఉదయం హరేరామ హరేకృష్ణ బృందం సంకీర్తన కార్యక్రమం నిర్వహిస్తుండగా పట్లోళ్ల ధీరజ్, పట్లోళ్ల ఆదిత్య అక్కడికి వచ్చి సంకీర్తల కార్యక్రమం ఎవరు నిర్వహించమన్నారంటూ మైకులు, స్పీకర్ వైరింగ్ తొలగించారు. దీంతో కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ కలగజేసుకొని సాంస్కృతిక కార్యక్రమాలను ఎందుకు అడ్డుకున్నారని ప్రశ్నించడంతో అతడిని అసభ్య పదజాలంతో దూషించారు. పక్కనే ఉన్న గ్రామపెద్దలు కలగజేసుకోవడంతో వారు వెళ్లిపోయారు. తిరిగి ఉదయం 8.30 గంటల సమయంలో పట్లోళ్ల అమర్ సేన్ రెడ్డి, ధీరజ్, ఆదిత్య, మనోహర్ రెడ్డి మరోసారి ఆలయానికి వచ్చి నువ్వు ఎవడివిరా ఇక్కడ పెత్తనం చెలాయించేది అంటూ బూతులు తిడుతూ దాడి చేశారు. తనపై పథకం ప్రకారం దాడి చేశారని, గ్రామపెద్దలు అడ్డురావడంతో తనను తాను కాపాడుకోగలిగానని కార్పొరేటర్ తెలిపారు. నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

రేపు దివ్యాంగులకు దావత్ ఎ ఇఫ్తార్



సాక్షి,సిటీబ్యూరో: నగరంలోని ఈడెన్ గార్డెన్‌లో శనివారం దివ్యాంగులకు ప్రత్యేకంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసినట్లు ఐఐసీడీ సంస్థ వైస్ ప్రెసిడెంట్ ఖలీలుర్రహ్మాన్ తెలిపారు. గురువారం ఆయన సంస్థ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ..రంజాన్ మాసంలో నగరంలో నిర్వహిస్తున్న ఇఫ్తార్ విందుల్లో దివ్యాంగులను పట్టించుకోవడం లేదన్నారు. ఈ నేపథ్యంలో వారికి ఇఫ్తార్ విందు ఇచ్చేందుకు ఐడియల్ ఇన్ఫర్మేషన్ సెంటర్ ఫర్ డిజేబుల్డ్ (ఐఐసీడీ) సంస్థ ముందుకు వచ్చిందన్నారు. సంస్థ ఆధ్వర్యంలో నగరంలో బధిరులు, అంధుల కోసం స్పెషల్ స్కూల్ నిర్వహిస్తున్నామన్నారు. శనివారం ఏర్పాటు చేసిన విందుకు సుమారు 300మంది దివ్యాంగులు హాజరుకానున్నట్లు తెలిపారు.

డా.నాగేశ్వర్‌రెడ్డికి రోటరీ 'చరక' పురస్కారం



సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన ప్రముఖ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్, ఏఐజీ ఆసుపత్రుల చైర్మన్ డా.నాగేశ్వర్‌రరెడ్డికి చెన్నైలోని రోటరీ క్లబ్ ఆఫ్ గిండీ పురస్కారం లభించింది. వైద్య రంగంలో నిష్ణాతులకు అందించే చరక పురస్కారాన్ని ఆయనకు రోటరీ క్లబ్ అందజేసింది. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు ఎస్.రమేష్‌బాబు మాట్లాడుతూ వైద్య సేవల ద్వారా డా.నాగేశ్వర్‌రెడ్డి ఎన్నో ప్రతిష్టాత్మక పురస్కారాలను అందుకుని అంతర్జాతీయంగా పేరొందారని కొనియాడారు. ఆయన తాము అందించిన పురస్కారాన్ని స్వీకరించడం తమకు గర్వకారణంగా భావిస్తున్నామన్నారు. సన్మాన గ్రహీత డా.నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ 3 దశాబ్దాలుగా వ్యాధులపై పోరాటం, స్వచ్ఛమైన నీటిని అందించడం, రుతుక్రమ సమయంలో ఆరోగ్యం తదితర కార్యక్రమాలతో రోటరీ క్లబ్ ఆఫ్ గిండీ ఆరోగ్య పరిరక్షణలో తన వంతు పాత్ర పోషిస్తోందన్నారు. ఆ క్లబ్ అందించిన పురస్కారం ఆరోగ్యరంగంలో కృషిని కొనసాగించే దిశగా తనకు మరింత స్ఫూర్తినిస్తుందని తెలిపారు.

నగరంలో నేడు

- వకుళ చిత్ర షష్టి పూర్తి వేడుక సాయంత్రం 5.30 గంటలకు రవీంద్రభారతి సమావేశ మందిరంలో జరుగుతుంది.
- 2020 ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం మధ్యాహ్నం 2.30 గంటలకు నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం డా. ఎన్టీఆర్ కళా మందిరంలో జరుగుతుంది.
- రామాయణ కల్పవృక్షం మూడు రోజుల ఫెస్టివల్ సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8.45 గంటలకు మాదాపూర్‌లోని సీసీఆర్‌టీ క్యాంపస్‌లో జరుగుతుంది.

మక్కా, రాయల్ మసీదుల్లో ఏర్పాట్లు పూర్తి

సాక్షి,సిటీబ్యూరో: ప్రభుత్వ పర్యవేక్షణలో ఉన్న మక్కా, రాయల్ (పబ్లిక్ గార్డెన్స్) మసీదుల్లో రంజాన్ మాసం సందర్భంగా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి మహ్మద్ ఇల్యాస్ అహ్మద్ తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఇందుకుగాను ప్రత్యేక నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని తాత్కాలిక షెడ్లు ఏర్పాట్లు చేశామన్నారు. మక్కా మసీదులో వజూ చేసుకునేందుకు వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేశామన్నారు. ఆయా మసీదులకు ప్రతిరోజూ వేల సంఖ్యలో భక్తులు వస్తారని, వీరికి ఇఫ్తార్ కోసం ప్రభుత్వం తరఫున ఖర్జూరాలు కూడా అందజేస్తున్నట్లు తెలిపారు. రెండు మసీదుల్లో మహిళలు నమాజ్ చేసుకోవడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. మసీదులోని వజూ ఖానాలు మరుగుదొడ్ల శుభ్రతకు ప్రత్యేక సిబ్బందిని నియమించామని ఆయన వివరించారు.

నీటి సంపులో పడి బాలుడి మృతి



అంకిత్ (ఫైల్)

కుత్బుల్లాపూర్: నీటి సంపులో పడి ఓ బాలుడు మృతి చెందిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది.. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..బీహార్‌కు చెందిన హన్స్‌లాల్ బైటా కుటుంబంతో సహా నగరానికి వలస వచ్చి దేవరయాంజాల్‌లో ఉంటూ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం అతడి భార్య ఆరోగ్యం సరిగా లేకపోవడంతో అతని ఇద్దరి పిల్లలు ప్రియాంక (05), అంకిత్ (03) లను ఇంటి వద్దే వదలి కండ్లకోయలోని సీఎంఆర్ ఆస్పత్రికి వెళ్లారు. ఇంటి ముందు ఆడుకుంటున్న అంకిత్ ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి పోయాడు. తమ్ముడు కనిపించకపోవడంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలిస్తున్న ప్రియాంక ఏడుపు విని అక్కడికి వచ్చిన రామకృష్ణ అనే వ్యక్తి నీటి సంపులో పడిన బాలుడిని గుర్తించి బయటికి తీసి ఆర్కే ఆస్పత్రికి తరలించాడు. పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. బాలుడి తండ్రి హన్స్‌లాల్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ వెబ్‌సైట్లకు భద్రత కరువు

- డార్క్ వెబ్‌లో అన్ని రాష్ట్ర ప్రభుత్వ వెబ్‌సైట్ల పాస్‌వర్డ్‌లు
- ఇదే రహస్య సమాచారం చౌర్యానికి ప్రధాన కారణం
- 503 శాతం పెరిగిన రాన్సమ్‌వేర్ దాడులు
- గతేడాది సైబర్ దాడుల్లో మూడో స్థానంలో ప్రభుత్వ సంస్థలు
- సెక్యూరిటీ ఇంక్, ఇవంతి సంయుక్త పరిశోధనలో వెల్లడి



సాక్షి, సిటీబ్యూరో: ప్రజల వ్యక్తిగత సమాచారం మాత్రమే కాదు.. ప్రభుత్వ వెబ్‌సైట్లకు కూడా భద్రత లేకుండా పోయింది. దేశంలోని 10 శాతం కంటే రాష్ట్ర ప్రభుత్వ వెబ్‌సైట్లకు సాధారణ భద్రతా ప్రొటోకాల్ అయిన సెక్యూర్ సాకెట్స్ లేయర్ (ఎస్ఎస్ఎల్) కూడా లేదంటే డేటా భద్రత అర్థమైపోతుంది. ఈ లొసుగుల కారణంగానే హ్యాకర్లు, సైబర్ నేరస్తులు అత్యంత సులభంగా సైబర్ దాడులకు పాల్పడుతూ.. సున్నితమైన సమాచారాన్ని తస్కరిస్తున్నారని సైబర్ సెక్యూరిటీ సర్వీసెస్ కంపెనీలైన సెక్యూరిన్, ఇవంతి సంయుక్త పరిశోధన వెల్లడైంది. దేశంలోని అన్ని రాష్ట్ర ప్రభుత్వాల డొమైన్‌లలో సైబర్ డేటా భద్రతపై పరిశోధన చేసిన ఈ సంస్థలు.. ప్రస్తుత భద్రతా పద్ధతుల్లో అనేక సెక్యూరిటీ లోపాలు ఉన్నట్లు గుర్తించింది.

నివేదికలోని పలు కీలకాంశాలివే..
- ప్రస్తుతం ఇంటర్నెట్‌లో వందలాది అత్యంత సున్నితమైన ప్రొటోకాల్‌లు ఉన్నాయి. 293 సెక్యూరిటీ షెల్ ప్రొటోకాల్ (ఎస్ఎస్‌హెచ్), 67 ఫైల్ ట్రాన్స్‌ఫర్ ప్రొటోకాల్ (ఎఫ్‌టీపీ)లు ఇంటర్నెట్‌లో లీకై ఉన్నాయి. అంతేకాకుండా అన్ని రాష్ట్ర ప్రభుత్వాల డొమైన్‌ల పాస్‌వర్డ్‌లతో కూడిన 700కు పైగా ఆధారాలు డార్క్ వెబ్‌లో బహిరంగంగా ఉన్నాయి. దీంతో ఆయా డొమైన్లు ఫిషింగ్ దాడులు, ఆధారాల దుర్వినియోగం వంటి హానికి గురవుతున్నాయి.
- 2019 నుంచి ప్రపంచవ్యాప్తంగా రాన్సమ్‌వేర్ ఎక్స్‌పోజర్‌కు సంబంధించిన 537 రాన్సమ్‌వేర్ దాడులు జరిగాయి. గతంతో పోలిస్తే ఈ దాడులు 503 శాతం మేర పెరిగాయి. గతేడాది దేశంలో అత్యధిక సంఖ్యలో ప్రభుత్వ సంస్థలపై సైబర్ దాడులు జరిగాయి. అత్యధికంగా దాడులు జరిగిన సంస్థల్లో ప్రభుత్వ సంస్థలది మూడో స్థానం కావడం గమనార్హం. సైబర్ భద్రతా స్థితిని అర్థం చేసుకోవడంతో పాటు నిరంతరం పటిష్టం, లోపాలను సరిదిద్దుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పరిశోధన వెల్లడించింది.
- ప్రాథమిక సైబర్ భద్రత అనేది పటిష్టంగా లేనప్పుడు, ప్రభుత్వాలకు, సంస్థలకు సైబర్ దాడులు చాలా హాని కలిగిస్తాయని ఇవంతి చీఫ్ ప్రొడక్ట్ ఆఫీసర్ శ్రీనివాస్ ముక్కామల అన్నారు. సంస్థలు, ప్రభుత్వాలు సైబర్ రక్షణను పెంచుకునేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

స్టార్ ఆస్పత్రిలో సరికొత్త మోకాలి మార్పిడి శస్త్ర చికిత్స



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో వినూత్న మోకాలి మార్పిడి శస్త్ర చికిత్స అందుబాటులోకి వచ్చింది. ఈ విషయాన్ని బంజారాహిల్స్‌లోని స్టార్ హాస్పిటల్ వైద్యులు తెలిపారు. ఆసుపత్రిలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో సర్జరీ వివరాలను వెల్లడించారు. కీళ్ల సమస్యలు, గాయం కారణంగా నొప్పి, వైకల్యంతో బాధపడుతున్న రోగులకు తుది ఎంపికగా మోకాలి మార్పిడి అవసరం అవుతుందన్నారు. ఆ సందర్భంలో వెలిస్ టెక్నాలజీ ఆధారంగా చేసే ఈ రోబోటిక్ సహాయక అధునాతన సర్జరీ ద్వారా ఖచ్చితమైన ఫలితాలను అందుకోవచ్చునని ఆసుపత్రికి చెందిన జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డా.నీలం వి.రమణారెడ్డి పేర్కొన్నారు.

బంగారం పట్టివేత

శంషాబాద్: ఓ ప్రయాణికుడు అక్రమంగా తరలిస్తున్న బంగారాన్ని శంషాబాద్ ఎయిర్‌పోర్టులో గురువారం కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. దుబాయ్ నుంచి మస్కట్ మీదుగా నగరానికి వచ్చిన ప్రయాణికుడి కదలికలను అనుమానించిన అధికారులు అతడిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అతడి వద్ద 224 గ్రాముల బంగారం బయటపడింది. బంగారం విలువ రూ. 13.72 లక్షలు ఉంటుందని అధికారులు నిర్ధారించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

దోపిడీ లేని రాజ్యాన్ని స్థాపించాలి

లిబర్టీ: అసమానతలు దోపిడీ, అణిచివేతలు లేని రాజ్యస్థాపన జరగాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు డి.కుమారస్వామి అన్నారు. పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన శ్రీరామ నవమి వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మనిషిని మనిషిగా చూడటంతో పాటు దోపిడీ, పీడన లేని రామ రాజ్యాన్ని స్థాపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నవ్య, సాయి, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లు నిర్మిస్తుంటే అడ్డంకులు సృష్టిస్తున్నారు

- పోలీసులకు బధిర దంపతుల ఫిర్యాదు
- కేసు నమోదు చేసిన పోలీసులు

బంజారాహిల్స్: ఫిలింనగర్ దుర్గా భవానీనగర్‌లో తాము ఇల్లు కట్టుకుంటుండగా పక్కనే ఉండే వ్యక్తి అడ్డంకులు సృష్టిస్తూ దుర్భాషలాడుతున్నాడని, తమకు న్యాయం చేయాలని పేదలైన బధిర దంపతులు బంజారాహిల్స్ పోలీసులను వేడుకున్నారు. బాధితుడు నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. దుర్గా భవానీనగర్‌కు చెందిన నరేష్ రెక్కల కష్టంతో పైసా పైసా పోగు చేసుకొని ఇల్లు కట్టుకుంటుండగా పక్కనే ఉన్న వరికుప్పల అంజయ్య అనే వ్యక్తి రోజూ ఆటంకాలు కలిగిస్తూ తిడుతున్నాడని, దాడి చేసేందుకు తమపై బండరాయి కూడా విసిరాడని ఆరోపించాడు. అతడి దురుసు ప్రవర్తనపై బస్తీ కమిటీ పెద్దల దృష్టికి కూడా తీసుకెళ్లామన్నారు. వరికుప్పల అంజయ్య, ఆయన కుమారుడు తమను చంపుతామని కత్తులు తీసుకొని తమ ఇంటి ముందు తిరుగుతున్నారని, తమకు ప్రాణహాని ఉందని వారిపై చర్యలు తీసుకోవాలని నరేష్ తన ఫిర్యాదులో కోరాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్ఫూర్తిదాయకంగా సైకిల్‌థాన్

లక్డీకాపూల్: నెక్లెస్‌రోడ్‌లోని థ్రిల్ సిటీలో జరుగుతున్న సైకిల్‌థాన్ గురువారం విజయవంతంగా ముగిసింది. సాధుమార్గి జైన్ సమతా యువ సంఘం, భగవాన్ మహావీర్ కల్యాణ మహోత్సవం సందర్భంగా డ్రగ్స్, అహింసా కార్యక్రమాలపై ప్రజల్లో చైతన్యం కలిగించే రీతిలో సైకిల్‌థాన్ నిర్వహించారు. ఏడేళ్ల బాలబాలికల నుంచి 78 ఏళ్ల వృద్ధుల వరకు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన జెన్‌కో డీసీపీ ముత్యంరెడ్డి మాట్లాడుతూ.. పాఠశాలలకు వెళ్లే పిల్లలలో పెరుగుతున్న మద్యపానం, పొగాకు, డ్రగ్స్ వినియోగం, వాటి వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. సైకిల్‌థాన్ స్ఫూర్తిదాయకంగా జరిగిందని, ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహించి అవగాహన కల్పించడంలో యువ సంఘ్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. రవీంద్ర నేతృత్వంలో హైదరాబాద్ సైక్లిస్టుల గ్రూప్(హెచ్‌సీజీ) ఈ సైకిల్‌థాన్‌కు మద్దతుగా నిలిచింది. నో మోటార్ డే - సైకిల్ టు వర్క్ నినాదంతో ప్రజలను ప్రోత్సహించే విధంగా ఈ ఈవెంట్ జరిగిందని నిర్వాహకులు తెలిపారు.

కాంగ్రెస్‌లో భారీ చేరికలు


పార్టీలో చేరుతున్న వారికి కండువాలు వేస్తున్న డీసీసీ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి

ఫిలింనగర్: ఖైరతాబాద్ నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజాదరణ రోజురోజుకూ పెరుగుతున్నదని బడుగు, బలహీన వర్గాల వారు పార్టీకి మద్దతుగా నిలబడేందుకు ముందుకు వస్తున్నారని ఖైరతాబాద్ కాంగ్రెస్ డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ సి.రోహిణ్‌రెడ్డి అన్నారు. ఫిలింనగర్‌లోని అంబేడ్కర్ నగర్ బస్తీలో నిర్వహించిన హాథ్ సే హాథ్ జోడో అభియాన్‌లో భాగంగా ఆయన డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాటూరి రమేష్‌తో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఇందులో భాగంగా వివిధ పార్టీల నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరగా వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. మహిళలు పెద్ద సంఖ్యలో విచ్చేసి తమ మద్దతును ప్రకటించారు.

మద్యం తాగి డ్రైవింగ్ చేసిన ముగ్గురికి జైలు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 32 మందిని నాంపల్లిలోని నాల్గవ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. ఇందులో ముషీరాబాద్‌కు చెందిన మహ్మద్ ఇబ్రహీం మద్యం మోతాదు 262 నమోదు కాగా ఆయనకు మూడు రోజుల జైలు శిక్ష విధించారు. బేగంపేటకు చెందిన రాజ నర్సింహకు మూడు రోజుల జైలు, అంబర్‌పేటకు చెందిన వి.సురేష్‌కు నాలుగు రోజుల జైలు శిక్ష విధించారు. వీరిద్దరూ మద్యం తాగి వాహనం నడుపుతూ రెండుసార్లు పట్టుబడ్డారు. అలాగే బంజారాహిల్స్‌కు చెందిన ప్రతీక్ అనే వాహనదారుడికి బీఏసీ 257 ఎంజీ నమోదు కాగా ఆయన డ్రైవింగ్ లైసెన్స్‌ను ఏడాది పాటు రద్దు చేస్తూ తీర్పునిచ్చారు. రాజేంద్రనగర్‌కు చెందిన గౌతం రెండుసార్లు మద్యం తాగి డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడగా ఆరు నెలల పాటు డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేశారు. మిగతా 27 మందికి రూ. 2100 చొప్పున జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.



కమనీయం..కల్యాణం

- భక్తిశ్రద్ధలతో శ్రీరామనవమి
- కనుల పండువగా సీతారాముల కల్యాణోత్సవం
- తిలకించి తరించిన భక్తులు

బంజారాహిల్స్: శ్రీరామనవమి వేడుకలు గురువారం ఖైరతాబాద్, బంజారాహిల్స్ నియోజకవర్గ పరిధిలో అంగరంగ వైభవంగా జరిగాయి. ఆలయాలు, కాలనీలు, అపార్ట్‌మెంట్లలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికలపై శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు విచ్చేసి వేడుకలను తిలకించారు. అభిజిత్ లగ్నంలో జగన్మాత సీతమ్మ మెడలో శ్రీరామచంద్రుడు మాంగల్యధారణ చేస్తున్న ఘట్టాన్ని తిలకించిన భక్తులు పులకించిపోయారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సీతారాములకు పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించి కల్యాణ ఘట్టంలో పాల్గొన్నారు. బంజారాహిల్స్ రోడ్ నం.14లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం, శ్రీనగర్ కాలనీలోని వెంకటేశ్వర కల్యాణ మండపం, ఎన్బీటీ నగర్‌లోని అయ్యప్ప ఆలయంలో భక్తజన సందోహం శ్రీరామ నామస్మరణ చేస్తుండగా అర్చకులు కల్యాణ క్రతువును పూర్తి చేశారు. పలుచోట్ల కల్యాణ మూర్తులను ఊరేగింపుగా మండపాలకు తీసుకొచ్చారు. మధ్యాహ్నం 12 గంటలకు సీతారాముల వారి శిరస్సులపై జీలకర్ర బెల్లం ఉంచి మంత్రోచ్ఛరణ చేసిన ఘట్టంలో మహిళాభక్తులు వేల సంఖ్యలో పాల్గొన్నారు. రహమత్‌నగర్, బోరబండ, వెంగళరావునగర్ డివిజన్లలో శ్రీరామనవమిని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.


ఎమ్మార్సీ కాలనీ అభయాంజనేయ ఆలయంలో సీతారాముల కల్యాణం


సోమాజిగూడలో రాముల వారి కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే దానం నాగేందర్


యూసుఫ్‌గూడలో..


ఎన్బీటీనగర్ అయ్యప్ప గుడిలో సీతారాముల కల్యాణంలో మేయర్ విజయలక్ష్మి


హిమాయత్‌నగర్‌లో స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్, నవీన దంపతులు


ఆనంద్‌నగర్‌లో సీతారాముల కల్యాణ మహోత్సవం


గౌరీశంకర్ కాలనీలో నవమి వేడుకల్లో పాల్గొన్న ఖైరతాబాద్ కాంగ్రెస్ నాయకురాలు పి.విజయారెడ్డి


గౌరీశంకర్ కాలనీ రామాలయం వద్ద సీతారాములకు తలంబ్రాలు పోస్తున్న అర్చకులు


ఖైరతాబాద్ డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద..


నందినగర్ ఆంజనేయ ఆలయంలో...


ఎన్బీటీ నగర్ రామాలయంలో జరిగిన వేడుకల్లో ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ రోహిణ్‌రెడ్డి


కార్మికనగర్ ఆలయంలో నవీన్‌యాదవ్


వెంకటేశ్వరనగర్‌లో సీతారాముల కల్యాణంలో.. కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి


శ్రీనగర్ కాలనీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవమూర్తులను పల్లకీలో తీసుకొస్తూ..


హేమావతినగర్‌లో ఆలయంలో.. పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పి. విష్ణువర్ధన్‌రెడ్డి


వెంగళరావునగర్ సాయిబాబా ఆలయంలో...


జీటీఎస్ ఆలయంలో పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ దేదీప్య విజయ్


వినాయకనగర్ పర్వతాంజనేయ ఆలయంలో.. మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

తొలగిన అడ్డంకులు..త్వరలో పనులు

- ఎన్‌బీటీనగర్‌లో మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
- జీహెచ్ఎంసీకి స్థలం అప్పగించిన రెవెన్యూశాఖ అధికారులు
- హాల్ నిర్మాణ అంచనా వ్యయం రూ. 6 కోట్లు
- 2015లోనే సీఎం శంకుస్థాపన
- అడ్డంకులు తొలగిపోవడంతో స్థానికుల హర్షం


స్థలంలో చుట్టూ ఫెన్సింగ్ వేస్తున్న జీహెచ్ఎంసీ అధికారులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలో మరో భారీ ప్రాజెక్ట్ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ లభించింది. ఎన్‌బీటీ నగర్ అయ్యప్ప గుడి వెనుకాల షేక్‌పేట మండలం సర్వే నెం.403/పీలో ఉన్న 1.22 ఎకరాల స్థలంలో మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అనుమతులు మంజూరయ్యాయి. ప్లాన్ కూడా సిద్ధం చేశారు. ఈ విశాలమైన, ఖరీదైన స్థలం ఇప్పటిదాకా షేక్‌పేట మండల రెవెన్యూ పరిధిలో ఉండగా.. షేక్‌పేట తహసీల్దార్ దీనిని ఈ నెల 3న జీహెచ్ఎంసీ సర్కిల్ 18 అధికారులకు అప్పగించారు. రెండు రోజుల క్రితమే జీహెచ్ఎంసీ సర్కిల్ 18 టౌన్ ప్లానింగ్ అధికారులు తమ ఆధీనంలోకి తీసుకుని చుట్టూ ఫెన్సింగ్ వేశారు.

- 2015 జూన్ 5న ముఖ్యమంత్రి కేసీఆర్ ఇక్కడ మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. అదే సమయంలో ఈ భవన నిర్మాణం కోసం కోటి రూపాయలు మంజూరు కూడా చేశారు. అయితే స్థల వివాదం తదితర కారణాల వల్ల నిర్మాణ పనులకు ఆటంకం ఏర్పడింది.
- మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తాను ప్రాతినిధ్యం వహిస్తున్న బంజారాహిల్స్ డివిజన్‌కు ఓ భారీ ప్రాజెక్ట్ తీసుకురావాలనే ఉద్దేశంతో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని గత కొన్నేళ్లుగా సంబంధిత అధికారులతో సంప్రదింపులు, సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఎట్టకేలకు విలువైన ఈ స్థలాన్ని రెవెన్యూశాఖ జీహెచ్ఎంసీకి అప్పగించేలా చేయగలిగారు.
- దీంతో ఇక్కడ మల్టీపర్పస్ నిర్మాణ పనులకు అడ్డంకులు పూర్తిగా తొలగిపోయి అనుమతులు కూడా మంజూరయ్యాయి. తాజా అంచనా ప్రకారం ఈ నిర్మాణ పనులకు సుమారుగా రూ. 6 కోట్లు ఖర్చు కానున్నట్టు తెలుస్తోంది.
- ఈ నిర్మాణం పూర్తైతే ఎన్‌బీటీనగర్‌తో పాటు చుట్టూ పక్కల బస్తీవాసులకు తక్కువ ఖర్చుతోనే శుభకార్యాలు నిర్వహించుకొనేందుకు అవకాశం ఏర్పడుతుంది. గ్రౌండ్ ప్లస్ 2 అంతస్తులతో నిర్మించనున్న ఈ హాల్ డిజైన్ కూడా ఆధునిక సౌకర్యాలతో రూపొందించారు.
- త్వరలోనే నిర్మాణ పనులు చేపట్టేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ఎన్‌బీటీ నగర్‌లో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు జరుగుతుండగా, ఇక్కడ మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్ నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో ఈ ప్రాంత రూపురేఖలు మారిపోనున్నాయి.
- ఇలా ఉండగా, మల్టీ పర్పస్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సంబంధించి ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా అప్పట్లోనే శంకుస్థాపన చేయడం, నిధులు కూడా కేటాయించిన నేపథ్యంలో జీహెచ్ఎంసీ అధికారులు ఈ భవనాన్ని అద్భుతంగా నిర్మించాలని తలపెట్టారు. ఎన్నో అడ్డంకులను తొలగించుకుని అనుమతులు పొందించిన ఈ భవన నిర్మాణం ఎన్‌బీటీనగర్‌కు ప్రత్యేకం.

పబ్లిక్ టాయిలెట్ లేక అవస్థలు

- రహమత్‌నగర్ చౌరస్తాలో మూతపడ్డ రెండు టాయిలెట్లు
- తెరిపించాలని స్థానికుల విజ్ఞప్తి

రహమత్‌నగర్: రహమత్‌నగర్ కూడలిలో పబ్లిక్ టాయిలెట్ మూతపడటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల సౌకర్యార్థం స్థానిక గ్రంథాలయం పక్కన 2013లో పబ్లిక్ టాయిలెట్‌ను ఏర్పాటు చేశారు.కొన్నేళ్ల వరకు కొనసాగిన టాయిలెట్‌ను ఆ తర్వాత మూసివేశారు. రాంకీ సంస్థ ఆధ్వర్యంలో తాజాగా మరో స్మార్ట్ టాయిలెట్‌ను ఇదే ప్రాంతాంలో ఏర్పాటు చేశారు. దీనిని నిర్వహణకు ఎవరు ముందుకు రాక పోవడంతో నేటికీ తెరిచిన పాపాన పోలేదు. దీంతో నిత్యం జన సమూహంతో కిటకిటలాడే ఈ ప్రాంతంలో పబ్లిక్ టాయిలెట్ లేక పోవడంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. దానికి తోడు గ్రంథాలయంలో తరచూ ప్రభుత్వ కార్యక్రమాలు కొనసాగుతుంటాయి. ఆయా కార్యక్రమాలకు హాజరయ్యే సిబ్బంది కూడా మూత్రశాలలు అందుబాటులో లేక ఎన్నో అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా స్థానిక కార్పొరేటర్, జీహెచ్ ఎంసీ అధికారులు స్పందించి రహమత్‌నగర్ చౌరస్తాలో పబ్లిక్ టాయిలెట్‌ను తెరిపించి ప్రజలు అవస్థలను తొలగించాలని కోరుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్తా ..



రహమత్‌నగర్ కూడలిలో పబ్లిక్ టాయిలెట్ అవసరం ఎంతో ఉంది. జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి సమస్యను మరోసారి తీసుకెళ్తా. మూతపడ్డ పబ్లిక్ టాయిలెట్‌ను తెరిపించి ప్రజల అవస్థలను తొలగిస్తా.
సీఎస్ రెడ్డి, కార్పొరేటర్



మూసి ఉన్న టాయిలెట్లు

నేత్రపర్వం.. సీతారాముల కల్యాణం

ఉదయం 9:30 గంటల నుంచే పెళ్లిసందడి | శాస్త్రోక్తంగా కన్యావరణం, వరపూజ.. మధ్యాహ్నం 12:39 గంటలకు మాంగల్యధారణ | ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి


పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు తెస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి దంపతులు. చిత్రంలో కనుమూరి బాపిరాజు తదితరులు


గురువారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో శ్రీరామనవమిని పురస్కరించుకొని హిందూవాహిని, శ్రీరామ సేన ఆధ్వర్యంలో నిర్వహించిన శోభాయాత్ర

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి సీతారాముల కల్యాణం కన్నుల పండుగగా జరిగింది. కొత్తగూడెం జిల్లా భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి దేవాలయం గర్భగుడిలోని మూల విరాట్టులకు గురువారం ఉదయం 8 గంటల సమయంలో శాస్త్రోక్తంగా లఘు కల్యాణం నిర్వహించారు. 9:30 గంటల తర్వాత లక్ష్మణ సమేత సీతారాముల ఉత్సవ విగ్రహాలను ఆలయం నుంచి పల్లకీ లో బయటికి తీసుకొచ్చారు. భాజాభజంత్రీలు, కోలాటం, సంప్రదాయ నృత్యాలు, భక్తుల జయజయ ధ్వానాల మధ్య మిథిలా స్టేడియంలోని కల్యాణ మండపానికి చేర్చారు. అక్కడ సీతారామ లక్ష్మణులకు వేంచేపు చేసి, విశ్వక్సేన పూజ నిర్వహించారు. పుణ్యాహవచన మంత్రాలను జపిస్తూ కల్యాణ వేడుకకు ఉపయోగించే స్థలం, వస్తువులు, ప్రాంగణం, వేడుకలో పాల్గొనే వారిని సంప్రోక్షణ చేశారు.

అభిముఖంగా జానకీరాములు

కల్యాణ మండపంలో శ్రీరాముడు వెండి సింహాసనంలో ఆసీనులవగా.. శ్రీయోద్వాహం అనంతరం అప్పటివరకు మండపంలోనే ఉన్న సీతమ్మ తూర్పు ముఖంగా బయల్దేరి కల్యాణ మండపంలో ప్రదక్షిణ చేసి శ్రీరాముడికి ఎదురుగా వెండి గజాసనంపైకి చేరుకున్నారు. ద్వాదశ దర్భలతో సీతమ్మకు యోక్త్రాబంధనం చేశారు. శ్రీరాముడు గృహస్థ ఆశ్రమంలోకి ప్రవేశిస్తున్నాడని తెలుపుతూ యజ్ఞోపవీత ధారణ చేశారు. తర్వాత సీతారాముల వంశగోత్రాల ప్రవరలు చదివారు. ఎక్కడైనా శ్రీరాముడిది వశిష్ట గోత్రం, సీతమ్మది గౌతమ గోత్రంగా చెబుతారు. కానీ భద్రాచలంలో మాత్రం శ్రీరాముడి గోత్రాన్ని అచ్యుత, సీతమ్మ వారిది సౌభాగ్య గోత్రంగా చెబుతూ ఈ కార్యక్రమాన్ని పూర్తి చేశారు.

ఆభరణాలతో వరపూజ

రామదాసు చేయించిన చింతాకు పతకం సీతమ్మకు, పచ్చలహారం రామయ్యకు అలంకరించారు. లక్ష్మణుడికి రామమాడ ధరింపజేశారు. ప్రత్యేకంగా తయారు చేసిన వస్త్రాలను సీతారాములకు ధరింపజేసి.. తేనె, పెరుగు కలిపిన మధుపర్కం నివేదన చేశారు. పెళ్లి తంతు నిర్వహించే ఆచార్య, బ్రహ్మ, అర్చక స్వాములు శ్రీరాముడికి పాదప్రక్షాళన చేశారు. కన్యాదానాన్ని పురస్కరించుకుని భూ, గోదానాలతో కూడిన మహాసంకల్ప క్రతువును నిర్వహించారు. సుముహూర్తానికి ముందు ఐదు నిమిషాల పాటు చూర్ణికలు పఠించారు. అభిజిత్ లగ్నం ముహూర్తం 11:59 గంటల సమయం కాగానే అర్చక స్వాములు వధూవరులైన సీతారాముల ఉత్సవమూర్తుల శిరస్సులపై జీలకర్ర, బెల్లం పెట్టారు. తర్వాత శ్రీరామదాసు చేయించిన మూడు బొట్లు ఉన్న మంగళసూత్రానికి పూజలు నిర్వహించారు. ఈ సమయంలో చిన జీయర్ స్వామి సుమారు 28 నిమిషాల పాటు ప్రసంగించారు. మధ్యాహ్నం 12:29 గంటల సమయంలో సీతమ్మకు మాంగల్యధారణ జరిగింది. తర్వాత వెండి పాత్రల్లో ఉంచిన ముత్యాల తలంబ్రాలను సీతారాములపై పోశారు. అనంతరం గోటితో ఒలిచిన తలంబ్రాలతో వేడుక నిర్వహించారు. తాత్కాలిక నివేదన చేసి, సీతమ్మ చీరకు, రామయ్య పంచెతో కలిపి బ్రహ్మముడి వేశారు. తర్వాత వానర మాయురం (బంతులాట) వేడుక, సంప్రదాయాన్ని కొనసాగిస్తూ గోదాదేవి-శ్రీరంగనాథుల లఘు కల్యాణం నిర్వహించారు. మంగళహారతి అనంతరం సీతారాములను పల్లకీలో ఊరేగిస్తూ ఆలయంలోకి తీసుకెళ్లారు.

లక్షమందికి పైగా..

సీతారాముల కల్యాణం కనులారా చూసేందుకు సుమారు లక్ష మంది భక్తులు భద్రాచలం తరలివచ్చారు. బుధవారం రాత్రి నుంచే టెంపుల్ టౌన్‌లో వీధులన్నీ భక్తులతో కిటకిటలాడాయి. స్వచ్ఛంద సంస్థల వారు మంచినీళ్లు, మజ్జిగ, అన్నదానం నిర్వహించారు. ట్రాఫిక్ నియంత్రణ విషయంలో ప్రత్యేక ప్రణాళిక లేకపోవడంతో.. కల్యాణం ముగిసిన తర్వాత భద్రాచలం పట్టణం, గోదావరి వంతెనపై గంటల తరబడి ట్రాఫిక్‌జాం అయింది. ఎండలో భక్తులు ఇబ్బందిపడ్డారు.

నేడు పట్టాభిషేకం

శ్రీరామనవమి అనంతరం శుక్రవారం మిథిలా స్టేడియంలో పన్నెండేళ్లకు ఓసారి వచ్చే పుష్కర పట్టాభిషేక మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేశారు.

మంత్రి చేతుల మీదుగా..

సీతారాముల కల్యాణంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. అనంతరం టీటీడీ, శృంగేరి పీఠం, చినజీయర్‌స్వామి, శ్రీరంగం దేవస్థానం ప్రతినిధులతోపాటు మంత్రి అజయ్, ఎమ్మెల్యే పొదెం వీరయ్య, శ్రీరామదాసు పదోతరం వారసుడైన కంచర్ల శ్రీనివాసరావు, తూము నర్సింహదాసు వంశస్తులు పట్టువస్త్రాలు సమర్పించారు. వేడుకల్లో హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయతోపాటు ఎంపీలు కవిత, వద్దిరాజు రవిచంద్ర, ఏపీ స్పీకర్ తమ్మినేని సీతారాం హాజరయ్యారు.

శ్రీరామ పట్టాభిషేకంలో పాల్గొననున్న గవర్నర్

సాక్షి, హైదరాబాద్: శ్రీరామ పట్టాభిషేక మహోత్సవంలో పాల్గొనేందుకు రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ గురువారం రాత్రి 11.45 గంటలకు రైలులో భద్రాచలానికి బయలుదేరి వెళ్లారు. శుక్రవారం ఉదయం కొత్తగూడెం రైల్వే స్టేషన్‌కు చేరుకుని భద్రాద్రి శ్రీ రామ మందిరంలో జరిగే శ్రీరామ పట్టాభిషేక వేడుకల్లో తమిళిసై హాజరుకానున్నారు. స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించనున్నారు. ఈ కార్యక్రమంలో రాజ్‌భవన్ అధికారులు, సిబ్బంది కూడా పాల్గొననున్నారు.


వేములవాడలో శ్రీ సీతారాముల కల్యాణానికి వచ్చిన శివసత్తులు, జోగినులు

రాజన్న సన్నిధిలో రామయ్య కల్యాణం

- తరలివచ్చిన లక్షన్నర మంది భక్తులు
- రాజన్నతో శివపార్వతులు, జోగినులు, హిజ్రాల పెళ్లి

వేములవాడ: సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం శ్రీ సీతారామచంద్ర స్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. మహాజాతరను తలపించేలా దాదాపు లక్షన్నరకు పైగా భక్తులు హాజరయ్యారు. భక్తులు భారీగా తరలిరావడంతో బుధవారం రాత్రంతా దర్శనాలకు అనుమతించారు. మున్సిపాల్టీ తరఫున చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి దంపతులు, ఎమ్మెల్యే రమేశ్‌బాబు, కమిషనర్ అన్సారీ, కౌన్సిలర్లు, అధికారులు స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ప్రభుత్వం పక్షాన ఈవో కృష్ణప్రసాద్, ఆలయ అర్చకులు పట్టువస్త్రాలను అందజేశారు. ఉదయం 10 గంటలకు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు ఉత్సవమూర్తులను మేళతాళాలతో వేదికపైకి తీసుకొచ్చారు. వేదమూర్తుల మంత్రోచ్ఛరణల మధ్య స్వామి వారి కల్యాణం మూడు గంటలపాటు వైభవంగా సాగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన శివపార్వతులు నెత్తిన జీలకర్ర, చేతిలో త్రిశూలం పట్టుకుని అక్షింతలు చల్లుకుంటూ రాజన్నను వివాహమాడారు. కల్యాణం అనంతరం భక్తులకు స్వామి దర్శనానికి అవకాశం కల్పించారు.

రాములోరి కల్యాణానికి సీఎం ఎందుకెళ్లలేదు?

సాక్షి, హైదరాబాద్: భద్రాచల సీతారాముల కల్యాణానికి సీఎం కేసీఆర్ ఎందుకు వెళ్లలేదో సమాధానం చెప్పాలని లేదా హిందువులకు క్షమాపణలు చెప్పాలని విశ్వహిందూ పరిషత్ డిమాండ్ చేసింది. భద్రాద్రిపై సీఎంకు ఎందుకంత వివక్ష అని నిలదీసింది. సంప్రదాయాన్ని సీఎం పాటించకపోవడం హిందువులను అవమానించడమేనని వీహెచ్‌పీ నేతలు సురేందర్ రెడ్డి, పండరినాథ్, పగుడాకుల బాలస్వామి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



డైనోసార్లకే.. సారు!

విమానమంత పొడవు.. కొంచెం అటూఇటుగా 4 అంతస్తుల ఎత్తు.. 57 టన్నుల బరువు.. ఇది టిటనోసార్.. ఈ భూప్రపంచం ఇప్పటివరకూ చూసిన అతి పెద్ద డైనోసార్.. దీని ముందు అంతటి టీ రెక్స్ కూడా జుజుబీనే.. ఎప్పుడో పది కోట్ల ఏళ్ల కింద భూమ్మీద తిరుగాడిన ఈ టిటనోసార్ అస్థి పంజరాన్ని లండన్‌లోని నేచురల్ హిస్టరీ మ్యూజియంలో ప్రదర్శనకు పెట్టారు.

ఆరు డైనోసార్ల ఎముకలతో...

2010లో అర్జెంటీనాలోని ఓ రైతు తన పొలంలో పెద్ద ఎముకను గుర్తించాడు. శాస్త్రవేత్తలు తవ్వకాలు జరపడంతో.. క్రెటాషియస్ కాలానికి చెందిన 6 టిటనోసార్లకు చెందిన 280 ఎముకలు బయటపడ్డాయి. వాటిలో బాగున్న వాటిని కలిపి ఒక పూర్తిస్థాయి టిటనోసార్ అస్థిపంజరాన్ని సిద్ధం చేశారు. దీనికి 'పటగోటిటన్ మయోరమ్'గా పేరుపెట్టారు.


- ఈ డైనోసార్ అస్థి పంజరంలోని తొడ ఎముక ఒక్కటే 8 అడుగుల పొడవు, 500 కిలోలకుపైగా బరువు ఉండటం గమనార్హం. మొత్తం టిటనోసార్ ఎముకలను లండన్‌కు తరలించేందుకు రెండు విమానాలు కావాల్సి వచ్చాయి. దీన్ని నేచురల్ హిస్టరీ మ్యూజియంలో మార్చి 31 నుంచి వచ్చే ఏడాది జనవరి వరకు ప్రదర్శించనున్నారు.

రోజుకు 130 కిలోల ఆకులు, కొమ్మలు..

- శాస్త్రవేత్తలు చెప్పిన వివరాల మేరకు.. ఈ టిటనోసార్ పొడవు 121 అడుగులు, ఎత్తు 40 అడుగులు, బరువు 57 టన్నులకుపైగా ఉంటుందని అంచనా. భూమ్మీద తిరుగాడిన అత్యంత బరువైన, పెద్దదైన జంతువు ఇదే.
- ఇది శాఖాహారి. రోజుకు 130 కిలోలకుపైగా చెట్ల ఆకులు, కొమ్మలను తినేస్తుంది.
- ఒకసారికి 40 వరకు గుడ్లను పెడుతుంది. అయితే మాంసాహార డైనోసార్లు, ఇతర జంతువులు, ప్రమాదాల కారణంగా ప్రతి వంద టిటనోసార్ పిల్లల్లో ఒక్కటే పూర్తిస్థాయి వరకు ఎదుగుతుందని అంచనా.
- అంతపెద్ద డైనోసార్ అయినా.. గుడ్డులోంచి బయటికి వచ్చేప్పుడు బరువు నాలుగైదు కిలోలు మాత్రమే. కానీ ఎదిగే వేగం చాలా ఎక్కువ. పుట్టాక రెండు నెలల్లోనే ఏకంగా 40–50 కిలోల వరకు పెరుగుతాయట. ఇదే మనుషులకు అయితే పది పదిహేనేళ్లు పడుతుంది మరి.
- ఆరున్నర కోట్ల ఏళ్ల కింద భూమిని గ్రహశకలం ఢీకొట్టడంతో డైనోసార్లు అంతరించిపోయాయి. ప్రస్తుతం ప్రదర్శనకు పెట్టిన అతిభారీ డైనోసార్.. అంతకు మరో మూడున్నర కోట్ల ఏళ్ల ముందు బతికినది కావడం విశేషం. – సాక్షి, సెంట్రల్ డెస్క్



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.



'పారదర్శకతతో పథకాలు
అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా
సంక్షేమం అందుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 12+6 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 8

శుక్రవారం 31-3-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

మహా భాగ్యనగరంలో

సరికొత్త నగల లోకం

వేగ శ్రీ గోల్డ్ & డైమండ్స్



బంగారు మనసున్న
వజ్ర సమాన కీర్తికాంతులు గల

శ్రీ బాలయ్య బాబు గారి

శుభాకాంక్షలతో..

ప్రముఖ నటి

ప్రగ్యా జైస్వాల్ గారిచే

నేడే బ్రహ్మాండమైన ప్రారంభం

తేది: 31-03-2023
సమయం: మ॥ గం. 12:45 ని॥లకు

ప్రజలందరికీ
ఇదే మా సాదర స్వాగతం

VEGA SRI
GOLD & DIAMONDS

Vision - 99665 47998

FREE 1 GRAM GOLD COIN ON JEWELLERY PURCHASE WORTH RS. 2 LAKHS
OFFER VALID TILL APRIL 10TH, 2023*
*T&C Apply

1 GRAM

దివిలోనైనా... భువిలోనైనా... వేగశ్రీ తోడుంటే.. వివాహం వైభోగం అవుతుంది.

పెద్దమ్మతల్లి గుడి మెయిన్ గేట్ ఎదురుగా, రోడ్ నెం. 36, జూబ్లీహిల్స్, హైదరాబాద్.

Call: 91000 97424, 91001 14283

ఫ్యాషన్



● ఇటీవల జరిగిన లాక్మే ఫ్యాషన్ వీక్‌లో ఖాదీ కలనేత డిజైన్స్

కలర్స్, కట్స్, ప్రింట్లు, డిజైన్లు
ఫ్యాషన్ ప్రపంచంలో కొత్తదనాన్ని తీసుకురావడానికి
డిజైనర్లు ఎప్పుడూ ప్రయత్నిస్తుంటారు.
ప్రాంతీయ డిజైన్ల నుంచి
అంతర్జాతీయ బ్రాండ్స్ వరకు
రీసెంట్ లుక్స్ కోసం
శోధన ఉంటూనే ఉంటుంది.
జాతీయ, అంతర్జాతీయ వేదికల మీద
ఇటీవల జరుగుతున్న ఫ్యాషన్ వీక్స్
వేటిని పరిచయం చేస్తుందో తెలుసుకుందాం.

సౌకర్యమే స్టైల్





● సౌకర్యం... మదర్ – డాటర్ సమ్మర్ కలెక్షన్



● లండన్ డిజైనర్ స్టయిన్ గోయా సృష్టి



● మిలన్ ఫ్యాషన్ వీక్‌లో ఇక్కత ర్యాప్ డ్రెస్

ఆర్గానిక్ ఫ్యాబ్రిక్‌కే అగ్రస్థానం



దేశీయ, అంతర్జాతీయ డిజైన్స్ చూస్తే ఫ్యాషన్ రంగంలో ఎప్పుడైనా బ్రైట్ కలర్స్, కొత్త ప్రింట్స్, కొత్త కట్స్‌కి అధిక ప్రాధాన్యమిస్తారు. అయితే, ఏ వయసు వాళ్లు వాటిని ఎలా ధరిస్తున్నారు అనేది కూడా ముఖ్యమే. ఇప్పుడు ఫ్యాషన్ రంగాన్ని మాత్రం కరోనా ముందు–కరోనా తర్వాత అని విభజించి చూడచ్చు. ప్రజల ధోరణిలో కూడా మార్పు వచ్చింది. ఇప్పుడు సౌకర్యంగా దుస్తులు ధరించడానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఆర్గానిక్ ఫ్యాబ్రిక్స్, కంఫర్ట్ డ్రెస్సింగ్, బ్రైట్ కలర్స్... ఇవి ప్రపంచం మొత్తం కరోనా ఫ్రీ టైమ్‌లో తీసుకున్న నిర్ణయాలు అనేది దేశీయ, అంతర్జాతీయ ఫ్యాషన్ వీక్‌ల ద్వారా తెలుస్తోంది. ముఖ్యంగా రసాయనాలు లేని సస్టేయినబుల్ ఫ్యాబ్రిక్‌కే అగ్రస్థానం. పార్టీలకు కూడా ఆర్గానిక్ ఫ్యాబ్రిక్‌నే ఇష్టపడుతున్నారు. ఇప్పుడు ఏ పెద్ద బ్రాండ్ తీసుకున్నా ఆర్గానిక్ ఫ్యాబ్రిక్ డిజైన్స్ విరివిగా వచ్చేశాయి. కట్స్, ప్రింట్లు, కలర్ కాంబినేషన్స్ కూడా అలాగే ఎంచుకుంటున్నారు. దీంతో మేం కూడా సౌకర్యవంతమైన డిజైన్స్‌కే ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తున్నాం.

– హేమంత్ సిరి, ఫ్యాషన్ డిజైనర్, హైదరాబాద్

వారసత్వ డిజైన్లు

ఆర్గానిక్ ఫ్యాబ్రిక్, సౌకర్యవంతమైన డిజైనింగ్ తర్వాత స్థానిక హస్తకళ డిజైన్స్‌కి అవకాశాలు బాగా పెరిగాయి. సంప్రదాయ కళలను బాగా ఇష్టపడుతున్నారు. దీంతో మరుగున పడిపోయిన వారసత్వ కళలు తిరిగి జీవం పోసుకుంటున్నాయి. జాతీయ, అంతర్జాతీయ డిజైనర్లు కూడా తమ స్థానిక హస్తకళల డిజైన్స్‌ని విస్తృతంగా మార్కెట్లోకి తీసుకువస్తున్నారు.

మనదైన ప్రభావం

ఫ్యాషన్ ప్రపంచంపై భారతదేశం ప్రభావం గురించి ఆలోచించినప్పుడు రితూకుమార్, సబ్యసాచి, మనీష్ మల్హోత్రా.. వంటి ప్రఖ్యాత డిజైనర్ల డిజైన్లు, తలపాగాలు కనిపిస్తుంటాయి. అలాగే, గ్లోబల్ టెక్స్‌టైల్ గురించి చూసినప్పుడు భారతదేశంలోని కుటుంబాలలో తల్లులు, బామ్మలు ధరించే చీరల థీమ్‌ను తమ డిజైన్స్‌లో తీసుకుంటున్నారు. ఆర్గానిక్, సస్టెయినబుల్ ఫ్యాబ్రిక్‌కు ఎక్కువ ప్రాధాన్యమిస్తున్నారు. ఇటీవల జరిగిన మిలన్, ప్యారిస్, మన లాక్మే ఫ్యాషన్ వీక్‌లను గమనిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది. పదిహేడవ శతాబ్దం నుండి నేటి వరకు పాశ్చాత్య ఫ్యాషన్ ట్రెండ్‌పై భారతదేశ ప్రభావం ఉందని తెలుస్తోంది. అలాగే, అంతర్జాతీయ డిజైనర్ల నుంచి మనవాళ్లు స్ఫూర్తి పొందే విషయాల్లో ఫ్యాబ్రిక్స్ ఎంపికలోనూ, సంప్రదాయ డిజైన్స్‌లోనూ అధిక ప్రాధాన్యత ఇస్తున్నారనేది వాస్తవం.

ఇన్నోవేటర్

వారి గౌరవం కోసం

లేచి బాత్‌రూమ్‌కు సెకన్‌లో
చేరుకోగలిగే సాధారణ మనుషులకు...
బాత్‌రూమ్‌కు చేరడం పెద్ద అవస్థగా
ఉండే దివ్యాంగుల బాధ అర్థం కాదు.
కాలకృత్యాల కోసం మరొకరిపై ఆధారపడటం
దివ్యాంగులను తీవ్ర ఇబ్బంది పెట్టే ప్రధానాంశం.
అందుకే కోయంబత్తూరుకు చెందిన శ్రుతి
సెల్ఫ్ క్లీనింగ్ బ్యాగ్స్ ఉన్న
వీల్ చైర్‌ను ఆవిష్కరించింది.



● శ్రుతి



● శ్రుతి ఆవిష్కరించిన వీల్ ఛైర్

‘ఈ వీల్‌చైర్ కొన్న ఒక దివ్యాంగ పెద్దాయన నాకు కాల్ చేసి నా బెంగ తీరిందమ్మ. ఇక నాకు ఇష్టమైనది తినొచ్చు అన్నాడు సంతోషంగా’ అంది శ్రుతి బాబు.

వీల్ చైర్‌కూ ఇష్టమైనది తినడానికీ ఏమిటి సంబంధం అనే సందేహం రావచ్చు. శ్రుతికి కూడా వచ్చింది.

‘అదేంటి అని అడిగాను. అంతే కదమ్మా. ఇంతకు ముందైతే ఏం తింటే ఎప్పుడు టాయిలెట్ వస్తుందోనని భయపడేవాణ్ణి. తగ్గించి తినేవాణ్ణి. ఈ కుర్చీ వల్ల ఎన్ని సార్లయినా తినొచ్చు... ఎన్ని సార్లు వచ్చినా ఇబ్బంది పడకుండా ఉండొచ్చు అన్నాడతను’ అంటుంది శ్రుతి.

శ్రుతి తను తయారు చేసిన వీల్‌చైర్‌కు ‘సహాయత’ అనే పేరు పెట్టింది. టాయిలెట్ పాన్ ఉన్న వీల్‌చైర్లు ఇప్పటికే మార్కెట్‌లో ఉన్నాయి. అయితే వాళ్లు దానిని ఉపయోగించాక లేస్తే తప్ప ఆ పాన్ బయటకు తీసి క్లీన్ చేయడానికి లేదు. శ్రుతి తయారు చేసిన వీల్‌చైర్ అలా కాదు. కూర్చున్నవారు కూర్చున్నట్టు ఉండగానే మల/మూత్ర విసర్జన చేయొచ్చు. బటన్ నొక్కితే కుర్చీకే ఉన్న వాటర్ ట్యాంక్ నుంచి నీళ్లు తీసుకున్న స్ప్రేయర్ క్లీన్ చేస్తుంది. లేచే అవసరం లేకుండానే కుర్చీ వెనుక నుంచి బౌల్‌ను తొలగించి శుభ్రం చేయవచ్చు. ఆటోమేటిక్ క్లీనింగ్ కోసం బ్యాటరీ బటన్ యూజ్ చేయాలి. ఈ బ్యాటరీ ఒక సారి చార్జ్ చేస్తే నెల రోజులు పని చేస్తుంది. అంతే కాదు ఈ వీల్‌చైర్ స్ట్రెచర్‌లా కూడా పని చేస్తుంది.

‘అందుకే నా ప్రాడెక్ట్ షార్క్‌ట్యాంక్ సీజన్2లో కోటి రూపాయల డీల్ గెలుచుకుంది. అప్పటి నుంచి విపరీతంగా ఆర్డర్లు వస్తున్నాయి’ అంటుంది శ్రుతి.

కోయంబత్తూరుకు చెందిన శ్రుతి బాబు బయోమెడికల్ ఇన్‌స్ట్రుమెంట్స్‌లో ఇంజనీరింగ్ చేసింది. తండ్రి కెకె బాబు మెకానికల్ ఇంజనీర్. బి.టెక్ అయ్యాక ‘బయోటెక్నాలజీ ఇండస్ట్రీ రీసెర్చ్ అసిస్టెన్స్ కౌన్సిల్’ (బి.ఐ.ఆర్.ఏ.సి) ఫెలోషిప్ పొందిన శ్రుతి అందులో భాగంగా కోయంబత్తూరులోని గంగా హాస్పిటల్‌కు వెళ్లినప్పుడు ఒక దృశ్యం కదిలించింది.

‘ఒక పెరాలిసిస్ పేషెంట్‌ను అతని ఇద్దరి కూతుళ్లు బాత్‌రూమ్‌కు తీసుకెళ్లడానికి అవస్థ పడుతున్నారు. చేర్చడం ఒక ఇబ్బంది అయితే వాడాక అతన్ని శుభ్రం చేయడం ఇంకో ఇబ్బంది. అతను ఏడుస్తూ ఇలా నా కూతుళ్ల మీద ఆధారపడటం కంటే చచ్చిపోవడం మేలు అన్నాడు. ఆ మాటలు నా మీద ముద్ర వేశాయి. వృద్ధులు, దివ్యాంగులు, యాక్సిడెంట్లకు గురైన వారు, ఆపరేషన్లు చేయించుకున్నవారు, జబ్బుపడి కోలుకుంటున్నవాళ్లు కదల్లేక, బాత్‌రూమ్‌కు తమకు తాము వెళ్లే శక్తి లేక, సొంతగా శుభ్రం చేసుకునేందుకు అవయవాల సాయం లేక ఇబ్బంది పడుతుంటారు. వారు వీల్‌చైర్‌లో ఉన్న చోట ఉండగానే టాయిలెట్ అవసరాలు తీర్చుకునేలా వీల్ చైర్ తయారు చేయాలని నిశ్చయించుకున్నాను’ అంది శ్రుతి.

తండ్రితో కలిసి ఆమె తన ప్రయత్నాలు మొదలెట్టింది. ‘మొత్తం 118 సార్లు ప్రయత్నం చేశాం. ఐదు ప్రోటోటైప్‌లు తయారు చేశాం. రోగుల మీద ప్రయోగించాక చివరకు సంతృప్తికరమైన మోడల్‌కు వచ్చాం’ అంటుంది శ్రుతి బాబు.

నంజుకు తిందాం

వంటిల్లు

ఎండలు మండిపోతున్నాయి.
అందుకే... ఎండబెట్టి వండుకునే వడియాలను చేద్దాం.
ఇంతకీ ఇవి అర్కపక్వాలా? అగ్నిపక్వాలా?
ఎండలో ఎండుతాయి... మంటకు పొంగుతాయి.
వంటకాలకు తోడయ్యి... జిహ్వను సంతోషపరుస్తాయి.
సంతృప్తికరమైన భోజనానికి మినిమమ్ గ్యారంటీనిస్తాయి.



ఆవిరి వడియాలు

కావలసినవి: బియ్యం– అరకేజీ ; పచ్చిమిర్చి – 8 ; జీలకర్ర– 2 టీ స్పూన్‌లు ; అల్లం తరుగు– 2 టేబుల్ స్పూన్‌లు ; ఉప్పు – టేబుల్ స్పూన్ లేదా రుచిని బట్టి ; ఇంగువ– చిటికెడు (ఇష్టమైతేనే) ; నూనె – టేబుల్ స్పూన్.

తయారీ: ● బియ్యాన్ని కడిగి నాలుగు గంటల సేపు నానబెట్టాలి. ఆ తరవాత తగినంత నీటిని వేస్తూ మెత్తగా దోశెల పిండిలా రుబ్బాలి. రుబ్బేటప్పుడు పచ్చిమిర్చి, అల్లం, జీలకర్ర, ఇంగువ, ఉప్పు వేయాలి. ● రెండు లీటర్ల నీరు పట్టే పాత్ర తీసుకుని అందులో ఒకటిన్నర లీటరు నీటిని పోసి మరిగించాలి. పాత్ర మీద కచ్చితంగా అమరే ప్లేట్ పెట్టాలి. ఆ ప్లేట్ పైన రెండు చుక్కల నూనె రాయాలి. ముందుగా రుబ్బి సిద్ధంగా ఉంచిన పిండిని చిన్న గరిటెతో తీసుకుని ప్లేట్ మీద వేయాలి. వెంటనే మరొక ప్లేట్‌ని మూతగా పెట్టాలి. పిండిలో తేమ ఆరిపోతుంది. ఇప్పుడు స్పూన్ లేదా అట్లకాడ సాయంతో ప్లేట్ నుంచి వేరు చేయాలి. ఇలాగే పిండినంతటినీ చేసుకోవాలి. పాత్రలో నీరు అయిపోతే మళ్లీ పోసుకోవాలి. అలాగే ప్లేట్ నుంచి వేరు చేసిన వడియాలను పొడి వస్త్రం లేదా పాలిథిన్ షీట్ మీద వేసి ఐదారు గంటల సేపు ఎండబెట్టాలి. ఇవి ఏడాది వరకు నిల్వ ఉంటాయి. ఎప్పుడు కావాలంటే అప్పుడు వేయించుకోవడమే.



టొమాటో జొన్న అప్పడాలు

కావలసినవి: టొమాటోలు –పావు కేజీ ; జొన్న పిండి– అర కేజీ ; పచ్చిమిర్చి –10 ; వెల్లుల్లి రేకలు– పది ; జీలకర్ర– టేబుల్ స్పూన్ ; ఉప్పు– టేబుల్ స్పూన్ లేదా రుచిని బట్టి ; నూనె – టేబుల్ స్పూన్.

తయారీ: ● టొమాటోలు, వెల్లుల్లి, పచ్చిమిర్చి, జీలకర్ర కలిపి మిక్సీ జార్‌లో గ్రైండ్ చేయాలి. ● వెడల్పాటి పాత్రలో అర టీ స్పూన్ నూనె వేసి ఆ తర్వాత అర లీటరు నీటిని పోసి మరిగించి అందులో ఉప్పు, జొన్నపిండి, టొమాటో పేస్ట్ వేసి కలిపితే అప్పడాల పిండి రెడీ. చపాతీల పిండిలా ముద్దగా ఉండాలి. ● చపాతీల పీట మీద పాలిథిన్ షీట్ పరిచి రెండు చుక్కల నూనె రాయాలి. ఇప్పుడు అప్పడాల పిండిని చిన్న గోళీలుగా చేసి ఒక్కొక్క గోళీని పాలిథిన్ షీట్ మీద వేసి వేళ్లతో వత్తాలి. ఇలా వత్తిన అప్పడాన్ని ఎండలో పలుచటి వస్త్రం మీద వేసి ఎండబెట్టాలి. పిండినంతటినీ ఇలాగే చేసుకోవాలి. ఒకవైపు ఎండిన తర్వాత తిరగేసి రెండో వైపు కూడా బాగా ఎండనివ్వాలి. బాణలిలో అప్పడం మునిగేటట్లు నూనె పోసి మరిగించి ఒక్కొక్క అప్పడాన్ని వేయించాలి. ● వీటిని వడియాల్లాగ డబ్బాలో నేరుగా పోస్తే అప్పడాలు విరిగిపోతాయి. కాబట్టి ఎండిన తర్వాత చక్కగా అమర్చి డబ్బాలో నిల్వ చేసుకోవాలి. ఏడాదిపాటు నిల్వ ఉంటాయి. అప్పడాలు మెత్తబడకుండా ఉండాలంటే నిల్వ చేసిన డబ్బాలో అడుగున గుప్పెడు మినప్పప్పు వేయాలి.



మినప వడియాలు

కావలసినవి: మినప్పప్పు – అర కేజీ ; పచ్చి మిర్చి – 7 లేదా 8 ; జీలకర్ర– టీ స్పూన్ ; అల్లం– రెండు అంగుళాల ముక్క ; ఉప్పు – టేబుల్ స్పూన్.

తయారీ: ● మినప్పప్పు కడిగి మునిగేలా నీటిని పోసి రాత్రంతా నానబెట్టాలి. ఉదయాన్నే గ్రైండర్‌లో మెత్తగా రుబ్బాలి. మినప్పప్పు మెదిగేటప్పుడు అందులో ఉప్పు, అల్లం, పచ్చిమిర్చి, జీలకర్ర వేయాలి. మొత్తం మెత్తగా మెదిగిన తరవాత ఒక గిన్నెలోకి తీసుకుని కలిపితే వడియాల పిండి రెడీ. ● తడి వస్త్రాన్ని లేదా పాలిథిన్ షీట్‌ని ఎండలో పరిచి దాని మీద వడియాలు పెట్టుకోవాలి. ఒక గిన్నెలో నీటిని తీసుకుని అందులో స్పూన్‌ని ముంచి అప్పుడు పిండి తీసుకుంటే పిండి సులువుగా జారుతుంది. చేత్తో పెట్టాలన్నా అంతే... వేళ్లను తడుపుకుంటూ పెట్టాలి. రెండు రోజుల పాటు ఎండనివ్వాలి. మూడవ రోజు వలిచి మళ్లీ ఎండబెట్టాలి. అప్పుడు గలగలలాడుతాయి. ఏడాది పాటు నిల్వ ఉంటాయి. నూనె వేడి చేసి పచ్చి వడియాలను నూనెలో వేసి రెండు వైపులా దోరగా వేగిన తరవాత తీసేయాలి. ఈ వడియాలను పెద్ద మంట మీద వేయించరాదు. మీడియం ఫ్లేమ్‌లో వేయిస్తే చక్కగా వేగి కరకరలాడుతాయి.



రవ్వ-కొత్తిమీర వడియాలు

కావలసినవి: బొంబాయి రవ్వ (ఉప్మారవ్వ)– పావు కేజీ ; కొత్తిమీర తరుగు – వందగ్రాములు ; ఎండు మిర్చి – 2 (పలుకుగా పొడి చేయాలి) ; ఉప్పు – టీ స్పూన్ ; జీలకర్ర– టీ స్పూన్ ; ఇంగువ – చిటికెడు ; నూనె – టీ స్పూన్ ; నీరు – 6 కప్పులు.

తయారీ: ● మందపాటి బాణలిలో రవ్వ, మిరప్పొడి, ఉప్పు, జీలకర్ర, ఇంగువ, నూనె, నీరు పోసి గరిటెతో కలుపుతూ మరిగించాలి. మిశ్రమం దగ్గరగా అయిన తర్వాత కొత్తిమీర తరుగు వేసి కలపాలి. కొత్తిమీర పచ్చిదనం పోయే వరకు ఉడికించి స్టవ్ ఆపేయాలి. ● వేడి తగ్గిన తర్వాత పాలిథిన్ పేపర్ లేదా తడి నూలు వస్త్రం మీద ఈ మిశ్రమాన్ని ఒక్కో గరిటె వేసి దోసెలాగ పలుచగా చేయాలి. ఇవి ఒక్క రోజులోనే ఎండిపోతాయి. ఎండలో పెట్టడం కుదరకపోతే గదిలో కూడా పెట్టుకోవచ్చు. పలుచగా ఉంటాయి. కాబట్టి వాతావరణంలో వేడికే ఆరిపోతాయి. నెల రోజుల పాటు తాజాగా ఉంటాయి.

వైరల్



సైరా స్పైడర్‌మ్యాన్ దోశ


ఇన్‌స్టాగ్రామ్ వీడియో క్లిప్‌లో కనిపించిన ఆ మహిళ పేరేమిటో తెలియదుగానీ ఆమె చేసిన స్పైడర్‌మ్యాన్ దోశ వైరల్ అయింది. చెన్నైలోని అన్నానగర్‌లోని తన హోటల్‌లో నూనె, గుడ్లు, మసాల... మొదలైనవాటిని ఉపయోగించి ఆమె స్పీడ్‌స్పీడ్‌గా స్పైడర్‌మ్యాన్ దోశ వేస్తున్న దృశ్యం నెటిజనులను తెగ ఆకట్టుకోవడమే కాదు నోట్లో నీళ్లూరించేలా చేసింది. కొందరు దీనికి ‘శాండ్‌విచ్ దోశ’ అని కూడా పేరు పెట్టుకున్నారు. రెండు నెలల క్రితం పోస్ట్ అయిన ఈ వీడియోక్లిప్ తాజాగా 16.2 మిలియన్ వ్యూస్‌ను సొంతం చేసుకుంది.

ఇంటిప్

అల్లం పేస్ట్.. ఆవ నూనె...

సాధారణంగా అల్లం పేస్ట్‌ను ఎప్పటికప్పుడు తాజాగా చేయడంతో పాటు కొంత స్టోర్ చేసి కూడా పెట్టుకుంటూ ఉంటాం. ఇది పాడవకుండా ఉండేందుకు అందులో చెంచా ఆవ నూనె వేయాలి. ఇలా చేయడం వల్ల అల్లం పేస్ట్ పాడవకుండా ఎక్కువ కాలం తాజాగా ఉంటుంది.




‘ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి’

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 12+6 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 8

శుక్రవారం 31-3-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



‘పదహారేళ్ల’ పండుగ..

నేటి నుంచి ఐపీఎల్ 16వ సీజన్ టి20 క్రికెట్ టోర్నీ జరగనుంది. అహ్మదాబాద్‌లో జరిగే తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ గుజరాత్ టైటాన్స్ జట్టుతో నాలుగుసార్లు విజేత చెన్నై సూపర్ కింగ్స్ జట్టు తలపడనుంది.

- 4లో



చిన్న షేర్లు కుదేల్!

ఉక్రెయిన్–రష్యా యుద్ధానికి తోడు వడ్డీ రేట్లకు రెక్కలు రావడం, అధిక ద్రవ్యోల్బణం సెగ తగలడంతో చిన్న షేర్లు చితికిపోయాయి.


- వివరాలు 4లో



ట్రావెల్ ఆపరేటర్ల లాభాలకు బూస్ట్

ప్రయాణాలకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో ట్రావెల్, టూర్ ఆపరేటర్ల నిర్వహణ లాభాలు 6-7 శాతం వృద్ధి చెందనున్నాయి.

- వివరాలు 4లో



లక్ష ర్యాంకు దాటినా..

నీట్ పీజీ కటాఫ్ మార్కులు పెరగడంతో లక్ష ర్యాంకు దాటిన వారికి కూడా రాష్ట్రంలో పీజీ మెడికల్ కోర్సుల్లో సీట్లు లభించనున్నాయి.

- వివరాలు 2లో



డేటా చోరీ రెండు సంస్థల నుంచే..

బ్యాంకు ఖాతాదారుల వ్యక్తిగత సమాచారం రెండు ఐటీ కంపెనీల నుంచే చోరీకి గురైనట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.

- వివరాలు 2లో

న్యూస్‌రీల్

డిమాండ్ ఫుల్.. వ్యాక్సిన్ నిల్



దేశంలో కరోనా కేసులు పెరుగుతున్నాయని కేంద్రం రాష్ట్రాలను అప్రమత్తం చేస్తోంది. కానీ రాష్ట్రంలో కరోనా వ్యాక్సిన్ డోసులు మాత్రం అందుబాటులో లేవు. ఇంకా 1.63 కోట్ల మంది బూస్టర్ డోసు వేయించుకోవాల్సి ఉన్నప్పటికీ రాష్ట్రంలో ప్రస్తుతం వైద్య ఆరోగ్యశాఖ వద్ద 1,970 వ్యాక్సిన్లు మాత్రమే ఉన్నాయని వైద్య ఆరోగ్యశాఖ నివేదిక తెలిపింది.

- వివరాలు 2లో ▶

డిగ్రీ సీట్లలో లక్షకుపైగా కోత!



రాష్ట్రంలో వచ్చే విద్యాసంవత్సరం డిగ్రీలో లక్షకుపైగా సీట్లను తగ్గించే అవకాశం ఉంది. అన్ని విశ్వవిద్యాలయాలు ఇప్పటికే ఈ దిశగా కసరత్తు మొదలుపెట్టాయి. డిమాండ్ లేని గ్రూపులు తగ్గించుకోవాలని, వీటిపై అనుబంధ గుర్తింపు ఇచ్చేలోపే స్పష్టత ఇవ్వాలని ప్రైవేటు కాలేజీలకు వర్సిటీలు సూచించాయి.

- వివరాలు 2లో ▶

డిఫాల్ట్ మిల్లర్లకు.. ధాన్యం బంద్

కస్టమ్ మిల్లింగ్ రైస్‌ను గడువులోగా ఇవ్వని మిల్లులపై చర్యలు

- అలాంటి 300 మిల్లులను గుర్తించిన పౌర సరఫరాల సంస్థ
- ఇకపై ఆరు నెలల్లో సీఎంఆర్ పూర్తయ్యేలా మిల్లులకు ధాన్యం కోటా

- ఇప్పటివరకు సీఎంఆర్ తీసుకోని వాటికి ప్రాధాన్యం
- మిగతా ధాన్యం మిడిల్ పాయింట్ గోడౌన్లకు తరలించి ప్రైవేటుగా విక్రయం
- సీఎం ఆమోదం కోసం ప్రతిపాదనలు
- ఈసారి ధాన్యం కొనుగోళ్లు, సీఎంఆర్ బాధ్యతలు కలెక్టర్లకు అప్పగింత

సాక్షి, హైదరాబాద్: రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి బియ్యాన్ని (కస్టమ్ మిల్లింగ్ రైస్ –సీఎంఆర్) ఎఫ్‌సీఐకి అప్పగించకుండా సతాయించే మిల్లులపై కొరడా ఝుళిపించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆరు నెలల్లోగా ధాన్యం మిల్లింగ్ చేసి బియ్యాన్ని పౌరసరఫరాల సంస్థ ద్వారా ఎఫ్‌సీఐకి అప్పగించాల్సి ఉన్నా.. కొందరు మిల్లర్లు ఏడాదిన్నర దాకా జాప్యం చేస్తున్నారు. అప్పటికీ కొన్ని మిల్లుల నుంచి సీఎంఆర్ బియ్యం పెండింగ్‌లోనే ఉంటోంది. ఈ నేపథ్యంలో సకాలంలో బియ్యం ఇవ్వకుండా పౌరసరఫరాల సంస్థకు నష్టం కలిగిస్తున్న మిల్లర్లకు ధాన్యం కేటాయింపులు నిలిపివేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వచ్చే నెల మూడో వారం నుంచి మొదలయ్యే యాసంగి సీజన్ నుంచే దీనిని అమలు చేయనుంది. సీఎంఆర్‌లో జాప్యం చేస్తున్న 300కు పైగా మిల్లులను డిఫాల్ట్ మిల్లులుగా అధికారులు ఇప్పటికే గుర్తించి, జాబితా సిద్ధం చేసినట్టు తెలిసింది. ఈ మిల్లులకు ధాన్యం కేటాయింపులను పూర్తిగా నిలిపేసి.. ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు పౌరసరఫరాల శాఖ అధికారులు మంత్రి గంగుల కమలాకర్ ద్వారా సీఎంకు ప్రతిపాదనలు అందజేసినట్టు సమాచారం.



ఆరునెలల్లోగా ఇవ్వాల్సి ఉన్నా..

వచ్చేనెల నుంచి యాసంగి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కానున్నాయి. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు చేరాక రైతుల ఖాతాలో డబ్బులు జమవుతాయి. మిల్లర్లు ఆ ధాన్యాన్ని తీసుకున్నాక ఆరు నెలల్లోగా మరాడించి బియ్యాన్ని పౌరసరఫరాల సంస్థ ద్వారా ఎఫ్‌సీఐకి అప్పగించాలి. కానీ మిల్లర్ల నుంచి తగిన సమయంలో సీఎంఆర్ రాకపోవడంతో.. రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్‌సీఐను గడువు పెంచాలని కోరడం ఏటా జరిగే తంతుగా మారింది. 2019–20 యాసంగి సీజన్‌కు సంబంధించి 118 మిల్లులు ఇప్పటివరకు సీఎంఆర్ ఇవ్వలేదు. మూడేళ్లుగా పెనాల్టీతో గడువు పెంచుతున్నా ఇప్పటికీ సీఎంఆర్ పెండింగ్‌లోనే ఉండటం గమనార్హం. గడువు ముగిసిన తరువాత ఎఫ్‌సీఐ బియ్యం తీసుకోకపోతే వాటిని రాష్ట్ర అవసరాలకు మళ్లించాల్సిన పరిస్థితి నెలకొంది. అంతేగాకుండా సీఎంఆర్ ఆలస్యంతో ప్రభుత్వంపై ఆర్థిక భారం పడుతోంది. దీనితో ఇకపై మిల్లర్ల ఆగడాలను ఉపేక్షించొద్దని, ధాన్యం కేటాయింపుల్లో కోత విధించాలని.. ఆరునెలల్లో సీఎంఆర్ పూర్తి చేసేంత కెపాసిటీలోనే కేటాయింపులు జరపాలని నిర్ణయించినట్టు తెలిసింది. మిల్లర్లకు కేటాయించగా మిగిలే ధాన్యాన్ని పౌరసరఫరాల సంస్థ ద్వారానే మిడిల్ పాయింట్ స్టోరేజీ గోడౌన్‌లకు తరలించి.. ప్రైవేటు వ్యక్తులకు విక్రయించాలని కూడా యోచిస్తోంది.

గోదాముల స్థలాలు సిద్ధం

పౌర సరఫరాల సంస్థ ఆధ్వర్యంలో జిల్లాల వారీగా మిడిల్ పాయింట్ గోదాములను ఏర్పాటు చేసేందుకు అవసరమైన స్థలాలను ఇప్పటికే

మిగతా 2వ పేజీలో ▶

సీఎంఆర్‌లో లేని మిల్లులకు ధాన్యం

ఇప్పటివరకు సీఎంఆర్‌తో సంబంధం లేకుండా ప్రైవేటుగా ధాన్యం కొనుగోలు చేసి, బియ్యంగా మార్చి అమ్ముకునే మిల్లులను ఈసారి సీఎంఆర్ పరిధిలోకి తేవాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు సమాచారం. మిర్యాలగూడ, నిజామాబాద్, నల్లగొండ వంటి కొన్ని ప్రాంతాల్లో 100కుపైగా మిల్లులు పౌరసరఫరాల శాఖ, సీఎంఆర్‌తో సంబంధం లేకుండా పనిచేస్తున్నాయి. వాటిని గుర్తించి సమాచారం ఇచ్చినట్టు తెలిసింది.

సార్లూ! మీరెక్కడ?

- ఏళ్ల తరబడి కన్పించని వైనం
- విధులకు రాకున్నా నోటీసులు సున్నా

- వందమందికిపైగా గుర్తించామంటున్న అధికారులు
- వెతికితే ఈ సంఖ్య రెట్టింపు
- ఏళ్ల తరబడి గైర్హాజరైనా రెడ్ కార్పెట్
- విద్యాశాఖ వైఫల్యంపై విమర్శల వెల్లువ

సాక్షి, హైదరాబాద్: విద్యాశాఖలో ఏళ్ల తరబడి టీచర్లు స్కూళ్లు ఎగ్గొట్టినా, అసలు కన్పించకుండానే పోయినా అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడం విమర్శలకు దారితీస్తోంది. ఓ ఉపాధ్యాయుడు 20 ఏళ్లు ఉద్యోగమే చేయకపోయినా తిరిగి పోస్టింగ్ ఇవ్వడం తీవ్ర వివాదాస్పదమైంది. ఇలా ఏళ్లకు ఏళ్లు స్కూల్ ముఖమే చూడని టీచర్లు ఒకరిద్దరు కాదు... వంద మందికిపైగా ఉన్నారని అధికార వర్గాలే అంటున్నాయి. 2005 నుంచి ఇలాంటి వాళ్ల కోసం జల్లెడ పడితే వంద మంది వరకూ గుర్తించామని చెబుతున్నారు. అనధికారికంగా ఈ సంఖ్య రెట్టింపే ఉంటుందని తెలుస్తోంది. కొన్ని రోజుల పాటు స్కూల్ ఎగ్గొడితేనే విద్యార్థిని పరీక్షలకు అనుమతించరు. అలాంటిది ఏళ్ల తరబడి టీచర్ స్కూల్‌నే వదిలేస్తే కనీసంగా ఎవరూ పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందని ఉపాధ్యాయ సంఘాలు అంటున్నాయి. పత్తా లేని కాలంలో జీతాలు చెల్లించడం లేదు కదా అని సర్వీసులో ఉన్న మాస్టార్లను అలా

మిగతా 2వ పేజీలో ▶



2003 నుంచి విధులకు గైర్హాజరైన టీచర్‌కు పోస్టింగ్ ఇస్తూ ఇచ్చిన ఆర్డర్ కాపీ

20 ఏళ్లు గైర్హాజరైనా పోస్టింగా?

జగిత్యాల జిల్లాలో ఓ సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ) 2003 నుంచి విధులకు గైర్హాజరయ్యాడు. ఈ విషయాన్ని ఇటీవలే గుర్తించిన అధికారులు ఏ తరహా చర్యలు తీసుకోకపోగా, అతను తిరిగి విధుల్లో చేరతానని పెట్టుకున్న అర్జీని గుట్టు చప్పుడు కాకుండా ఆమోదించారు. ఓ హెచ్ఎంపై క్రమశిక్షణ చర్యలకు నోటీసు ఇవ్వడంతో ఈ విషయం బయటకొచ్చింది. 20 ఏళ్లు విధుల్లోనే లేని వ్యక్తిని ఎలా తీసుకున్నారో అర్థం కావడం లేదని ఉపాధ్యాయ వర్గాలు అంటున్నాయి. జిల్లా అధికారులు మాత్రం రాష్ట్ర కార్యాలయం నుంచి వచ్చిన ఒత్తిడి మేరకు అతనిని తిరిగి విధుల్లోకి తీసుకున్నట్టు చెబుతున్నారు. ఈ విషయమై అధికారులు వింతగా స్పందించడం విశేషం. షోకాజ్ నోటీసు ఇచ్చామని, అతను విధుల్లో చేరతానని చెప్పాడని, చేరిన తర్వాత విచారణ జరిపి 20 ఏళ్లు ఎందుకు గైర్హాజరైందీ తెలుసుకుని చర్యలు తీసుకుంటామని అధికారులు అంటున్నారు. దీనిపై వివరణ కోరేందుకు ప్రయత్నించగా పాఠశాల విద్య డైరెక్టర్ స్పందించలేదు.



ఏడాదిలో రూ.6 లక్షల ఇడ్లీలు!

- ఆన్‌లైన్‌లో ఆర్డర్‌తో హైదరాబాదీ రికార్డు
- దేశవ్యాప్తంగా 3.3 కోట్ల ప్లేట్లు పంపిణీ చేసిన స్విగ్గీ
- బ్రేక్‌ఫాస్ట్ ఐటమ్స్‌లో మసాలా దోశ తర్వాత ఇడ్లీయే..
- టాప్‌లిస్ట్‌లో రెండోస్థానంలో హైదరాబాద్

సాక్షి, హైదరాబాద్: అల్పాహారాల్లో ఇడ్లీకున్న క్రేజే వేరు. ఆ క్రేజే ఓ రికార్డును సృష్టించింది. హైదరాబాద్‌కు చెందిన ఒక వ్యక్తి ఈ రికార్డు సృష్టించినట్లు ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సంస్థ స్విగ్గీ వెల్లడించింది. ఆయన ఇడ్లీపై తన ఇష్టాన్ని ఓ రేంజ్‌లో చూపించాడు. గత ఏడాది కాలంలో రూ.6 లక్షలు కేవలం ఇడ్లీల కోసమే ఖర్చు చేశాడు. తన కోసం, స్నేహితులు, కుటుంబ సభ్యుల కోసం.. ఏడాది మొత్తంలో 8,428 ప్లేట్ల ఇడ్లీలను ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేశాడు. తాను ప్రయాణించిన వివిధ ప్రదేశాల్లో కూడా ఆయన ఇడ్లీ జపమే చేసినట్లు

మిగతా 2వ పేజీలో ▶

ఆరోగ్యశ్రీ బకాయిలు

రూ. 600 కోట్లు

- వైద్య ఆరోగ్య శాఖ తాజా నివేదిక వెల్లడి
- మొత్తం 77.19 లక్షల మంది పేదలకు కార్డులు
- 1,300 ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో సేవలు
- అందుబాటులో 1,376 రకాల శస్త్రచికిత్సలు, 289 రకాల సేవలు
- కొత్తగా 539 వ్యాధులను చేర్చాలని నిర్ణయం
- చికిత్సల ప్యాకేజీ సొమ్ము పెంచే యోచన



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు ఆరోగ్యశ్రీ కింద రూ.600 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఇటీవల విడుదల చేసిన ఓ నివేదికలో వైద్య ఆరోగ్య శాఖ ఈ విషయం వెల్లడించింది. రాష్ట్రంలోని 293 ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రులు, 198 ప్రభుత్వ పెద్దాసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు అందుబాటులో ఉండేవి. అయితే ఇటీవల ప్రభుత్వం 809 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీ)లోనూ ఈ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చింది. దీంతో మొత్తం 1,300 ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు అందుబాటులో ఉన్నట్టయ్యింది. మొత్తం 77.19 లక్షల మంది పేదలకు ఆరోగ్యశ్రీ కార్డులున్నాయి. ఇక ఉద్యోగులు, జర్నలిస్టుల ఆరోగ్య పథకాన్ని కూడా ఆరోగ్యశ్రీ ట్రస్టు ద్వారా అమలు చేస్తున్నారు. రాష్ట్రంలోని లక్షలాది మంది ప్రభుత్వ ఉద్యోగులు, పింఛన్‌దారులు, జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు ఈజేహెచ్ఎస్ కిందకు వస్తారు. లబ్ధిదారుల్లో ఎవరికైనా ఏదైనా జబ్బు వస్తే నగదు రహిత వైద్యం పొందడానికి అవకాశం ఉంది. ఇప్పటివరకు 2013లో నిర్ధారించిన ప్యాకేజీ ప్రకారమే ఆసుపత్రులకు సొమ్ము అందుతోంది. దీంతో ప్యాకేజీలను సవరించాలని సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు వైద్య ఆరోగ్య శాఖ ఆ నివేదికలో పేర్కొంది. ప్రస్తుతం ఆరోగ్యశ్రీ కింద 1,376 రకాల శస్త్రచికిత్సలు, 289 రకాల వైద్య సేవలు ఉన్నాయి. ఆయుష్మాన్ భారత్ కింద 1,949 వ్యాధులకు వైద్యం అందుతుంది. తాజాగా మరికొన్ని కొత్త వ్యాధులను కూడా ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకురావాలని ఆరోగ్యశ్రీ ట్రస్టు నిర్ణయించింది. 611 కొత్త వ్యాధులను తీసుకురావాలని ప్రతిపాదించగా, 539 మాత్రమే ఖరారు చేశారు.

రూ.5 లక్షలకు పెరిగిన కవరేజీ

కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఆయుష్మాన్ భారత్ పథకాన్ని కూడా ఆరోగ్యశ్రీతో కలిపి అమలు చేస్తుండటంతో కవరేజీని పెంచారు. ఈ పథకాల కింద ఏడాదికి ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల వరకు కవరేజీ ఉంటుంది. ఈ పథకాల కోసం ప్రభుత్వం

మిగతా 2వ పేజీలో ▶



‘ఔటర్’పై టోల్‌ట్యాక్స్ పెంపు

- రేపటి నుంచి అమలు.. వచ్చే ఏడాది మార్చి 31 వరకు..
- తాజా పెంపుతో ఏడాదికి రూ.445 కోట్ల ఆదాయం

సాక్షి, హైదరాబాద్: అన్ని జాతీయ రహదారులపై టోల్‌ట్యాక్స్ పెంచిన నేపథ్యంలో హైదరాబాద్ చుట్టూ ఉన్న 158 కిలోమీటర్ల ఔటర్ మార్గంలోనూ హెచ్ఎండీఏ టోల్ చార్జీలను పెంచింది. ఈ చార్జీల పెంపు ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమల్లోకి రానుంది. కారు, జీపు, వ్యాను తదితర తేలికపాటి వాహనాలపై కిలోమీటర్‌కు కనిష్ఠంగా రూ.2.25 నుంచి భారీ వాహనాలకు గరిష్ఠంగా రూ.14.58 వరకు టోల్‌ట్యాక్స్ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రస్తుతం 19 ఇంటర్చేంజ్‌ల నుంచి వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. త్వరలో మరో మూడు చోట్ల ఇంటర్చేంజ్‌లు ఏర్పాటుకానున్నాయి. పెరిగిన టోల్‌చార్జీలు వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకు అమల్లో ఉంటాయి. ఔటర్ నిర్వహణ కోసం హెచ్ఎండీఏ అనుబంధ సంస్థ

మిగతా 2వ పేజీలో ▶

డేటా లీకులో మనీ లాండరింగ్!

రంగంలోకి దిగిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్

- సైబరాబాద్ పోలీసుల ఎఫ్ఐఆర్ ఆధారంగా దర్యాప్తు
- ఏడుగురు నిందితులపై మనీ లాండరింగ్ కేసులు నమోదు



సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించిన 16.8 కోట్ల మంది డేటా లీక్ వ్యవహారంలో మనీ లాండరింగ్ నిగ్గు తేల్చేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగింది. ఈ కేసులో నిందితులు కీలకమైన డేటాను బహిరంగ మార్కెట్లో విక్రయించడం ద్వారా ఆస్తులు కూడబెట్టినట్లు ఈడీ అనుమానిస్తోంది. ఈ నేపథ్యంలో సైబరాబాద్ పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. ఇప్పటికే అరెస్టు అయిన నిందితులు నితీశ్ భూషణ్ కుమార్, పూజా కుమారి, సుశీల్ తోమర్, అతుల్ ప్రతాప్ సింగ్, ముస్కాన్ హసన్, సందీప్ పాల్, జియా ఉర్ రెహ్మాన్‌లపై మనీ లాండరింగ్ చట్టం కింద కేసులు నమోదు చేశారు. వీరి నుంచి మరిన్ని వివరాలు రాబట్టేందుకు వీలుగా ఈ ఏడుగురిని అదుపులోకి తీసుకొని వేర్వేరుగా విచారిస్తున్నారు.

ఉత్తరాది రాష్ట్రాల్లోనే కార్యకలాపాలు

ప్రజల వ్యక్తిగత సమాచారంతో పాటు రక్షణ శాఖ, టెలికం, విద్యుత్, ఇంధనం వంటి సున్నితమైన ప్రభుత్వ సంస్థల కీలక సమాచారాన్ని

మిగతా 2వ పేజీలో ▶



శిథిలమైన బోథ్ తహసీల్దార్ కార్యాలయం



శిథిల భవనంలోనే విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

శిథిల భవనంలో విధులు

బెంబేలెత్తిస్తున్న బోథ్ తహసీల్దార్ ఆఫీసు

పెచ్చులూడిపోయి బెంబేలెత్తించే పైకప్పు.. శిథిలమై ఎప్పుడు కూలుతుందో తెలియని భవనం.. బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తించే యంత్రాంగం.. ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గ కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ భవనం దుస్థితి ఇది. 1932లో అప్పటి నిజాం నిర్మించిన ఈ భవనం ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. వానాకాలంలో పైకప్పు కారుతుండటంతో టేబుళ్లు, ఫైళ్లు, రికార్డులపై కవర్లు కప్పి ఉంచాల్సి వస్తోందని సిబ్బంది వాపోతున్నారు

- బోథ్

‘వందే భారత్’కు సీసీ నిఘా



ఆ రైళ్లకు అదనంగా సీసీ టీవీ కెమెరాలు అమర్చాలని నిర్ణయం

రాళ్ల దాడులు పెరుగుతున్నందుకే..

- ఆయా ప్రాంతాల్లో ఆర్పీఎఫ్ సిబ్బంది ప్రత్యేక దృష్టి
- రాళ్ల దాడి చేస్తే ఐదేళ్ల జైలు శిక్ష తప్పదంటూ హెచ్చరికలు

సాక్షి, హైదరాబాద్: వందేభారత్ రైళ్లకు అదనంగా సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ప్రస్తుతం వాటికి ముందు, వెనక జత సీసీటీవీ కెమెరాలు ఉన్నాయి. కానీ రైళ్లపై వరుసగా జరుగుతున్న రాళ్ల దాడులను నియంత్రించేందుకు అదనంగా మరో నాలుగు సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్టు సమాచారం. దీంతో ఏ ప్రాంతంలో రాళ్ల దాడి జరిగినా, నిందితుల దృశ్యాలను అవి చిత్రిస్తాయి. దీంతో వారిని పట్టుకోవటం సులువవుతుందని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా వందేభారత్ రైళ్ల సంఖ్యను మరింతగా పెంచాలని నిర్ణయించిన రైల్వే బోర్డు, వచ్చే నెలలో దక్షిణ మధ్య రైల్వేకు మరో రైలును కేటాయిస్తోంది. ఇప్పటికే సికింద్రాబాద్–విశాఖపట్నం మధ్య గత సంక్రాంతి రోజున తొలి రైలు ప్రారంభం కాగా, వచ్చే నెలలో రెండో రైలు సికింద్రాబాద్–తిరుపతి మధ్య నడవనుంది. తొలి రైలుపై ఇప్పటికే అరడజను వరకు రాళ్ల దాడులు జరిగాయి. ప్రతిసారీ అద్దాలు ధ్వంసమవుతున్నాయి. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందిన ఈ రైళ్లకు, విశాలమైన అద్దాల కిటికీలు ప్రత్యేకాకర్షణగా నిలుస్తున్నాయి. ఆకతాయిలు ఆ అద్దాలు లక్ష్యంగా రాళ్లతో దాడులకు తెగబడుతుండటం... మళ్లీ కొత్త అద్దాలు బిగించటం ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కావడంతో ఎలాగైనా ఆ దాడులను నియంత్రించాలని నిర్ణయించారు. ఈ మేరకు దాడులకు పాల్పడ్డ వారిని పట్టుకుని కఠిన శిక్షలు విధించటమే పరిష్కారంగా అధికారులు

మిగతా 2వ పేజీలో ▶

సర్పంచుల సాయంతో విలేజ్ మిత్ర బృందాల ఏర్పాటు

రైల్వే ఆస్తులను ధ్వంసం చేసే వారికి సెక్షన్ 153 ప్రకారం గరిష్ఠంగా ఐదేళ్ల జైలు శిక్ష విధించే వెసులుబాటు ఉన్నందున, ఈ రాళ్ల దాడికి పాల్పడే వారికి ఆ గరిష్ఠ శిక్షలు విధించేలా ఏర్పాట్లు చేస్తోంది. ఈమేరకు ఆ దిశగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నిర్ణయించింది. తొలి వందే భారత్ రైళ్లపై దాడులు జరిగిన ప్రాంతాలతోపాటు, గతంలో సాధారణ రైళ్ల మీద దాడులు జరిగిన ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో ఆర్పీఎఫ్ సిబ్బంది తిరుగుతూ, ఐదేళ్ల జైలు శిక్ష అంశాన్ని ప్రధానంగా ప్రస్తావిస్తూ స్థానికులకు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. దాడులు జరిగేందుకు అవకాశం ఉన్న ప్రాంతాల్లోని గ్రామాల సర్పంచుల సహకారంతో గ్రామాల్లో విలేజ్ మిత్ర బృందాలను ఏర్పాటు చేస్తున్నారు.



9 వరకు మహిళా జర్నలిస్టులకు
ఉచిత ఆరోగ్య పరీక్షలు

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మహిళలకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించి సంపూర్ణ ఆరోగ్యం అందించాలని సీఎం కేసీఆర్ సంకల్పించారని, ఇందులో భాగంగా ఏప్రిల్ 9 వరకు మహిళా జర్నలిస్టులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నారని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతి కుమారి తెలిపారు. సమాచార కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఉచిత ఆరోగ్య శిబిరాన్ని సీఎస్ ప్రారంభించారు. ఏప్రిల్ 2న మినహా ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ ఉచిత వైద్య శిబిరం ఉంటుందన్నారు. రాష్ట్ర స్థాయి గుర్తింపు పొందిన మహిళా జర్నలిస్టులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని సీఎస్ సూచించారు. జిల్లాల్లో పనిచేస్తున్న గుర్తింపు పొందిన మహిళా జర్నలిస్టులకు ఆయా జిల్లా కేంద్రాల్లో వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు సమాచార కమిషనర్ అరవింద్ కుమార్ తెలిపారు. ప్రారంభ కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టర్ నాగయ్య కాంబ్లి, కిషోర్‌బాబు, జాయింట్ డైరెక్టర్లు వెంకటరమణ, జగన్, శ్రీనివాస్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలు ఇవీ..

మాస్టర్ హెల్త్ చెకప్‌లో భాగంగా రక్త పరీక్ష (సీబీపీ), బ్లడ్ షుగర్, డయాబెటిక్ పరీక్షలు, లిపిడ్ ప్రొఫైల్, థైరాయిడ్, కాల్షియం, మూత్ర పరీక్షలు, విటమిన్ బీ12, డీ3, ఈసీజీ, ఎక్స్‌–రే, అల్ట్రాసోనోగ్రఫీ, మామోగ్రామ్, పాప్‌స్మెర్ వంటి రోగ నిర్ధారణ పరీక్షలు ఉంటాయి, స్క్రీనింగ్ పరీక్షలు, మెడికల్ ఆఫీసర్ ఎగ్జామినేషన్, ఐ స్క్రీనింగ్, డెంటల్ పరీక్షలు, గైనకాలజీ పరీక్షలు నిర్వహిస్తారు.

డిగ్రీ సీట్లలో లక్షకుపైగా కోత!

- 2023–24 విద్యా సంవత్సరంలో అమలు
- డిమాండ్ లేని గ్రూపులకు ఉద్వాసన
- కాంబినేషన్ ఉంటేనే అనుమతి
- కాలేజీలే స్వచ్ఛందంగా ముందుకు రావాలని సూచన
- దోస్త్ నోటిఫికేషన్ లోపే కార్యాచరణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వచ్చే విద్యాసంవత్సరం డిగ్రీలో లక్షకుపైగా సీట్లను తగ్గించే అవకాశం ఉంది. అన్ని విశ్వవిద్యాలయాలు ఇప్పటికే ఈ దిశగా కసరత్తు మొదలుపెట్టాయి. డిమాండ్ లేని గ్రూపులు తగ్గించుకోవాలని, వీటిపై అనుబంధ గుర్తింపు ఇచ్చేలోపే స్పష్టత ఇవ్వాలని ప్రైవేటు కాలేజీలకు సూచించాయి. డిమాండ్ ఉన్న గ్రూపుల్లో సీట్లు పెంచేందుకు అనుమతించాలని నిర్ణయించాయి. గత ఐదేళ్ల డేటాను పరిశీలించి, జీరో అడ్మిషన్‌లు ఉన్న గ్రూపులు, కాలేజీల జాబితా రూపొందించాలని ఇటీవల జరిగిన వైస్ చాన్స్‌లర్ల సమావేశం తీర్మానించింది. గతేడాది కూడా లక్ష సీట్లను అనధికారికంగా ఫ్రీజ్ చేశారు. వీటిని దోస్త్ (ఆన్‌లైన్ డిగ్రీ ప్రవేశాలు) వెబ్‌సైట్‌లో కన్పించకుండా చేశారు. ఈసారి కాలేజీల నుంచే సీట్లు తగ్గించుకునేలా చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్రంలో దాదాపు 1,080 డిగ్రీ కాలేజీలు, 4.68 లక్షల సీట్లున్నాయి. ఐదేళ్లుగా గరిష్టంగా 2.5 లక్షలు సీట్లు కూడా భర్తీ కావడంలేదు. 2022–23లో 2.20 లక్షల సీట్లు అతికష్టం మీద భర్తీ అయ్యాయి. 53 కాలేజీల్లో ఒక్కరు కూడా చేరలేదు. 108 సెక్షన్లలో ఐదుగురికి మించి విద్యార్థులు చేరలేదు. ఇంటర్ ఉత్తీర్ణులయ్యే విద్యార్థులు 3.20 లక్షలమంది ఉంటున్నారు. వారిలో 75 వేల మంది ఇంజనీరింగ్‌లో చేరుతున్నారు. కొంతమంది ఇతర కోర్సుల వైపు వెళ్తున్నారు. దాదాపు 2 లక్షల మంది మాత్రమే డిగ్రీలో చేరుతున్నారు. దీంతో 2.5 లక్షల సీట్లు మిగిలిపోతున్నాయి.

మారితేనే మంచిది..

డిగ్రీలో మార్పులకు ఉన్నత విద్యామండలి శ్రీకారం చుట్టింది. సంప్రదాయ గ్రూపులు కాకుండా, విద్యార్థి నచ్చిన గ్రూపులో చేరేందుకు మార్పులు చేస్తోంది. బీఏలోనే 68 రకాల గ్రూపులొచ్చాయి. బీఎస్సీలో 73 రకాలు, బీకాంలో 13 రకాల కాంబినేషన్ గ్రూపులు అందుబాటులో ఉన్నాయి. ఇవే కాకుండా బీబీఎం, బీబీఏ, బీసీఏ, బ్యాచిలర్ ఆఫ్ సోషల్



వర్క్, బ్యాచిలర్ ఆఫ్ ఒకేషనల్ (బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, హాస్పిటాలిటీ టూరిజం పరిపాలన) వంటి గ్రూపులు విస్తరించాయి. బీకాంలో మారిన ట్రెండ్‌కు అనుగుణంగా అప్లికేషన్ గ్రూపులు తీసుకొచ్చారు. బీఎస్సీ గణితం, స్టాటిస్టిక్స్, ఎకనామిక్స్ వంటి కాంబినేషన్ గ్రూపులు మార్కెట్ అవసరాలు తీర్చేలా ఉన్నాయి. బీఎస్సీ అభ్యర్థి అడ్మినిస్ట్రేషన్‌ను ఒక సబ్జెక్టుగా తీసుకునే వీలుంది. హైదరాబాద్‌లోని ప్రైవేటు కాలేజీలు కొన్ని కొత్త గ్రూపులతో డిగ్రీలు అందిస్తున్నాయి. ఇక మీదట రాష్ట్రంలోని అన్ని కాలేజీలు మార్పునకు సమాయత్తం చేయాలన్నదే రాష్ట్ర ఉన్నత విద్యామండలి నిర్ణయమని అధికారులు చెబుతున్నారు. 70 కాలేజీల్లో బీఏలో కనీసం 15 శాతం కూడా చేరడం లేదు. ఇలాంటి కాలేజీలు మార్కెట్‌లో ఉపాధి లభించే కోర్సుల మేళవింపుతో వెళితే సీట్లలో కోత పెట్టబోమని అధికారులు అంటున్నారు. 2023–24 సంవత్సరానికి సంబంధించిన ఆన్‌లైన్ అడ్మిషన్ల ప్రక్రియ ఇంటర్ ఫలితాల వెల్లడి తర్వాత మొదలవుతుందని, ఈలోగా అనుబంధ గుర్తింపు పూర్తి చేస్తామని అధికారులు అంటున్నారు. దీనికన్నా ముందు అవసరం లేని సీట్లు తగ్గించడం లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు.

మార్పు సహజం

డిమాండ్ లేని కోర్సులు తగ్గించుకోవాలని కొన్నేళ్లుగా ప్రైవేటు కాలేజీలకు చెబుతున్నాం. విద్యార్థులు కోరుకునే గ్రూపులు, కొత్తగా వస్తున్న గ్రూపులను అందుబాటులోకి తేవాలని చెప్పాం. వచ్చే దోస్త్‌లో దీన్ని కచ్చితంగా అమలు చేయాలని భావిస్తున్నాం. ఈ దిశగా కాలేజీలకు అవగాహన కల్పిస్తున్నాం. ఈ బాధ్యతను యూనివర్సిటీలకు అప్పగించాం.

– ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి, ఉన్నత విద్యామండలి చైర్మన్

గత ఆరేళ్లుగా డిగ్రీ సీట్ల భర్తీ ఇలా.. (మొత్తం సీట్లు 4.68 లక్షలు)

సంవత్సరం	బాలురు	బాలికలు	మొత్తం భర్తీ
2017-18	90,696	1,10,110	2,00,806
2018-19	94,483	1,07,383	2,01,866
2019-20	94,633	1,07,709	2,02,342
2020-21	1,14,408	1,08,212	2,22,620
2021-22	1,29,245	1,25,887	2,55,132
2022-23	1,02,050	1,10,761	2,12,811

బ్యాంకు ఖాతాదారుల డేటా చోరీ
2 ఐటీ సంస్థల నుంచే..!



- ఎస్‌బీఐ, బీఓబీ కస్టమర్ల వివరాలు తస్కరించిన ఇద్దరు ఉద్యోగులు
- నిందితుల విచారణలో గుర్తించిన సైబరాబాద్ పోలీసులు
- మ్యాట్రిక్స్, టెక్‌మహీంద్ర సీఐఓలకు నోటీసులు జారీ

సాక్షి, హైదరాబాద్: గోప్యంగా ఉండాల్సిన బ్యాంకు ఖాతాదారుల వ్యక్తిగత సమాచారం రెండు ఐటీ కంపెనీల నుంచే చోరీకి గురైనట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఎస్‌బీఐ ఖాతాదారుల వివరాలను మ్యాట్రిక్స్ సంస్థ నుంచి, బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) కస్టమర్ల డేటాను టెక్ మహీంద్రా సంస్థ నుంచి అందులో పనిచేసే సిబ్బందే కొట్టేసినట్లు సైబరాబాద్ పోలీసులు గుర్తించారు. దేశవ్యాప్తంగా ఆయా బ్యాంకుల ఖాతాదారుల వివరాలను తస్కరించి సైబర్ మోసాలకు పాల్పడుతున్న తొమ్మిది మంది నిందితులను సైబరాబాద్ పోలీసులు తాజాగా అరెస్టు చేయడం తెలిసిందే. పోలీసుల విచారణలో నిందితులు తమ నేరాన్ని అంగీకరించినట్లు తెలిసింది.

గంట ముందే ఆఫీసుకొచ్చి...

బీఓబీ కార్డుల యాక్టివేషన్, కస్టమర్ల సమస్యల పరిష్కారం వంటి సేవలను నోయిడాలోని టెక్ మహీంద్రా కంపెనీ నిర్వహించేది. ఈ సంస్థలో కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్న వీరేంద్ర సింగ్ బ్యాంకు ఖాతాదారుల వ్యక్తిగత సమాచారాన్ని తస్కరించేవాడు. బహిరంగ మార్కెట్‌లో ఒక్క కార్డుదారుని వివరాలను రూ.10–20లకు విక్రయించేవాడు. ఆఫీసు పని గంటల కంటే ముందే కార్యాలయానికి వచ్చి ఖాతాదారుల డేటాను తన వ్యక్తిగత మెయిల్స్‌కు, వాట్సాప్‌కు పంపించుకొనేవాడని పోలీసుల విచారణలో నిందితుడు వెల్లడించినట్లు తెలిసింది. అలాగే ఎస్‌బీఐ డెబిట్, క్రెడిట్ కార్డుల యాక్టివేషన్, ఇతరత్రా సేవలను హరియాణాలోని మ్యాట్రిక్స్ కంపెనీ నిర్వహించేది. ఇందులో పనిచేసే ప్రదీప్ వాలియా ఆయా ఖాతాదారుల వివరాలను తస్కరించి విక్రయించేవాడని సమాచారం.

కొట్టేసిన సొమ్ము కోసం నకిలీ ఖాతాలు..

కార్డుదారుల డేటాను ప్రధాన నిందితుడు ఖఫీల్ అహ్మద్ కొనుగోలు చేసేవాడు. ఢిల్లీలో నకిలీ కాల్ సెంటర్, బ్యాంకు ఖాతాలు, సిమ్ కార్డులను ఏర్పాటు చేసి టెలికాలర్లను నియమించుకున్నాడు. జనాలను మోసం చేసిన సొమ్మును నోబ్రోకర్.కామ్, హౌసింగ్.కామ్, పేటీఎం, మ్యాజిక్‌బ్రిక్స్.కామ్ వంటి మాధ్యమాల ద్వారా నకిలీ బ్యాంకు ఖాతాలకు మళ్లించేవాడని పోలీసులు గుర్తించారు.

కంపెనీల సీఐఓలకు నోటీసులు..

ఐటీ చట్టంలో ప్రజలకు సంబంధించిన సమాచారాన్ని పర్సనల్ ఐడెంటిటీఫైయింగ్ ఇన్ఫర్మేషన్ (పీఐఐ), ప్రభుత్వరంగ సంస్థల సమాచారాన్ని సెన్సిటివ్ పర్సనల్ డేటా ఇన్ఫర్మేషన్ (ఎస్‌పీడీఐ) అని రెండు విభాగాలుంటాయి. ఎస్‌పీడీఐను నిర్వహించే కార్పొరేట్ కంపెనీలకు కేంద్రం కొన్ని మార్గదర్శకాలను రూపొందించింది. సున్నితమైన సమాచార రక్షణ, దుర్వినియోగాన్ని నిరోధించే బాధ్యత కంపెనీలదేనని స్పష్టం చేసింది. అయితే ఈ కేసులో టెక్ మహీంద్రా, మ్యాట్రిక్స్ సంస్థలు నిబంధనలను ఉల్లంఘించినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో ఐటీ చట్టంలోని సెక్షన్ 72ఏ కింద కేసులు నమోదు చేసి విచారించాలని నిర్ణయించినట్లు ఓ పోలీసు ఉన్నతాధికారి తెలిపారు. ఈ మేరకు ఆయా సంస్థల చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ (సీఐఓ)లకు నోటీసులు జారీ చేశారు.

‘వందే భారత్’కు సీసీ నిఘా

▶ మొదటి పేజీ తరువాయి

భావిస్తున్నారు. దీంతో నిందితులను సులభంగా గుర్తించేందుకు రైళ్ల వెలుపల అదనంగా సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

39 మంది జైలుకు..: కాగా, గత జనవరి నుంచి ఇప్పటి వరకు రైళ్ల మీద రాళ్ల దాడి చేసిన 39 మంది ఆకతాయిలను గుర్తించిన రైల్వే పోలీసులు వారిని అరెస్టు చేసి జైలుకు పంపారు. కొన్ని ప్రాంతాల్లో రైళ్లపై దాడులు చేసిన వారిలో ఆరేళ్ల నుంచి 17 ఏళ్ల మధ్య వయసున్న చిన్నారులు కూడా ఉన్నట్టు అధికారులు గుర్తించారు. మళ్లీ వారు రాళ్ల దాడి జోలికి వెళ్లకుండా చూడాలని, లేని పక్షంలో తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు.

సార్లూ! మీరెక్కడ?

▶ మొదటి పేజీ తరువాయి

ఎలా వదిలేస్తారన్న వాదనలు ఉత్పన్నమవుతున్నాయి.

వాళ్లేం చేస్తున్నట్టు?

సాధారణంగా ప్రభుత్వ ఉపాధ్యాయుడు సెలవు పెట్టాలంటే ముందుగా దరఖాస్తు చేసుకోవాలి. అవసరమైతే మళ్ళీ సెలవును పొడిగించుకోవాలి. లేదంటే గైర్హాజరుగానే భావిస్తారు. నల్లగొండ, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో టీచర్లు మాత్రం సెలవు పెట్టిన దాఖలాల్లేవు. ఆ తర్వాత విద్యాశాఖకు తెలియజేసిన ఆనవాళ్ళూ లేవు. అసలా టీచర్లు స్కూల్‌కు రావడం లేదని మండల, జిల్లా స్థాయి అధికారులు ఉన్నతాధికారులకు చెప్పిందీ లేదు. ఉపాధ్యాయ వర్గాల ద్వారా అందిన సమాచారం మేరకు కొంతమంది టీచర్లు స్కూల్ మానేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటున్నారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో టీచర్లు ఏకంగా దుబాయ్ వంటి గల్ఫ్ దేశాలకు కూడా వెళ్ళినట్టు వెల్లడైంది. ఏడాది కన్పించకుండా పోతే సదరు టీచర్‌కు విద్యాశాఖ అధికారులు షోకాజ్ నోటీసు ఇవ్వాలి. కానీ ఐదేళ్ళు, పదేళ్ళు, ఏకంగా 20 ఏళ్ళు కన్పించకుండా పోయినా ఒక్క షోకాజ్ నోటీసు ఇవ్వలేదు. అసలు ఆ టీచర్ ఉన్నాడని తమకే తెలియదని మండల, జిల్లా అధికారులు అంటున్నారు. దీన్నిబట్టి విద్యాశాఖ నిర్లక్ష్యం ఏమేర ఉందో తెలుస్తోంది.

తూనికల్లో మోసం

- నిబంధనలు అతిక్రమిస్తున్న వ్యాపారులు.. నష్టపోతున్న ప్రజలు
- కార్యాలయాలకే పరిమితమవుతున్న అధికారగణం.. మొక్కుబడిగా తనిఖీలు

సాక్షి, హైదరాబాద్: కొందరు వ్యాపారులు వినియోగదారులను నిండాముంచుతున్నారు. తూకాల్లో మోసం చేస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. తక్కువ తూకం చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కొందరు వ్యాపారులు తూకాల్లో మోసం యథేచ్ఛగా చేస్తుంటే.. మరికొందరు దొడ్డిదారిన చేస్తున్నారు. ఇలా కిలోకు ఏకంగా 100 గ్రాముల నుంచి 200 గ్రాముల వరకు తక్కువ తూకం వేస్తున్నారని వినియోగదారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. వ్యాపారుల మోసాలు పెరుగుతున్నా.. తూనికలు కొలతలు శాఖ తనిఖీలు మొక్కుబడిగా ఉంటున్నాయని విమర్శలు వస్తున్నాయి. కేసుల నమోదు, జరిమానాలు అంతంత మాత్రమేనంటున్నారు.

కటింగ్ బాట్లు... సెట్టింగ్ మిషన్లు

వ్యాపారులు బాట్ల (తూనిక రాళ్ల) కింది భాగంలో కట్ చేస్తారు. కనీసం 100 గ్రాముల నుంచి 200 గ్రామల వరకు అందులో ఉన్న ఇనుము తీసేస్తారు. ముందు భాగంలో భాగానే కనిపించినా.. అడుగు భాగం మాత్రం డొల్లగా ఉంటుంది. చేతిలో పట్టుకుని సరిగ్గా చూస్తే కాని తెలియని పరిస్థితి. కటింగ్ చేసిన భాగంలో ఒక రేకును పెడతారు. ఇలా ఏ మాత్రం అనుమానం రాకుండా వ్యాపారులు జాగ్రత్తలు తీసుకుంటారు. మరో వైపు వెయింగ్ మిషన్ల ద్వారా కూడా తూకంలో మోసం జరుగుతోందని వినియోగదారులు వాపోతున్నారు. ఎలాంటి అనుమానం రాకుండా మిషన్ కింద వైపు ఉన్న బటన్ నొక్కితే సరిపోతుందని, కిలోకు 200 గ్రాముల నుంచి 100 గ్రాముల వరకు తక్కువ తూగేలా సెట్టింగ్ చేయవచ్చని తెలుస్తోంది.

పట్టించుకోని అధికారులు..

తూనికలు, కొలతల శాఖ అధికారుల నిర్లక్ష్యం వ్యాపారులకు కల్పతరువుగా మారిందని విమర్శలు వస్తున్నాయి. వినియోగదారులు ఫిర్యాదు చేస్తేకాని అధికారులు తనిఖీ చేసే పరిస్థితి లేదని, స్పెషల్ డ్రైవ్‌లు సైతం అంతంత మాత్రంగానే ఉంటున్నాయని చెపుతున్నారు. నిబంధనల ప్రకారం.. కాంటాలు, తూకం రాళ్లను రెండేళ్లకోసారి, ఎలక్ట్రానిక్ కాంటాలను ఏడాదికోసారి తూనికలు, కొలతల శాఖ అధికారులు తనిఖీ చేసి స్టాంపింగ్ చేయాలి. తక్కువ తూకం వేసేవారికి జరిమానా విధించాలి. అయితే ఇదంతా మొక్కుబడిగా తయారైందని వినియోగదారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ మోసాలపై అధికారుల వివరణకోసం ప్రయత్నించగా వారు అందుబాటులోకి రాలేదు.

..ధాన్యం బంద్

▶ మొదటి పేజీ తరువాయి

గుర్తించారు. మిల్లర్లకు కేటాయించగా మిగిలిన ధాన్యాన్ని ప్రభుత్వమే మిడిల్ పాయింట్ గోదాముల్లో నిల్వచేసి, ప్రైవేటుగా వేలం వేయడం ద్వారా మిల్లింగ్, సీఎంఆర్‌తో సంబంధం లేకుండా సొమ్ము రికవరీ కానుంది. రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్ల కోసం తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టే బాధతోపాటు 18 నెలల పాటు సీఎంఆర్ ఇవ్వకపోవడంతో ఎఫ్‌సీఐ నుంచి నిధులు రాక ఇబ్బందిపడే పరిస్థితి తప్పుతుందని సర్కారు యోచిస్తోంది.

కొనుగోళ్ల బాధ్యతలు కలెక్టర్లకు..

రాష్ట్రంలో కొన్ని సీజన్లుగా ధాన్యం కొనుగోలు, సీఎంఆర్ ప్రక్రియ అదనపు కలెక్టర్ల నేతృత్వంలో జరుగుతోంది. కొన్ని జిల్లాల్లో అదనపు కలెక్టర్లు, పౌరసరఫరాల సంస్థ అధికారులు, మిల్లర్లు కుమ్మక్కై ప్రభుత్వానికి నష్టం కలిగిస్తున్నట్టు ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో వచ్చే యాసంగి సీజన్‌లో కొనుగోలు ప్రక్రియ పూర్తిగా కలెక్టర్ల నేతృత్వంలో జరపాలని నిర్ణయించారు. దీనిపై ఏప్రిల్ 10న మంత్రుల భేటీలో నిర్ణయాలు తీసుకోనున్నారు.

ఏడాదిలో రూ.6 లక్షల ఇడ్లీలు!

▶ మొదటి పేజీ తరువాయి

స్విగ్గీ తన నివేదికలో వెల్లడించింది. ఇడ్లీ క్రేజ్‌కు సంబంధించిన ఇలాంటి విశేషాలెన్నో స్విగ్గీ వివరించింది. ఇటీవల ప్రపంచ ఇడ్లీ దినోత్సవం పురస్కరించుకుని ఇడ్లీ ఆర్డర్లపై నిర్వహించిన అధ్యయనంతో ఓ నివేదికను సంస్థ విడుదల చేసింది.

చాలాచోట్ల డిన్నర్‌గా కూడా..

గత 12 నెలల్లో దేశవ్యాప్తంగా 3.3 కోట్ల ప్లేట్లను పంపిణీ చేసినట్టు నివేదిక తెలిపింది. వినియోగదారుల్లో ఈ వంటకానికి ఇప్పటికీ ఉన్న విపరీతమైన క్రేజ్‌కు ఇది సూచికగా పేర్కొంది. ఈ నివేదిక ప్రకారం.. అత్యధిక ఇడ్లీలను ఆర్డర్ చేసిన మొదటి మూడు నగరాల్లో బెంగళూరు, హైదరాబాద్, చెన్నై ఉన్నాయి. కోల్‌కతా, కొచ్చి, ముంబయి, కోయంబత్తూర్, పూణే, వైజాగ్, ఢిల్లీ నగరాలు ఆ తర్వాత ఉన్నాయి. కాగా ఉదయం 8 నుంచి 10 గంటల మధ్య ఇడ్లీలను ఆర్డర్ చేయడానికి అత్యధికులు ఇష్టపడుతున్నారు. బ్రేక్‌ఫాస్ట్‌గా మాత్రమే చాలామంది ఇష్టపడే ఇడ్లీని.. చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, కోయంబత్తూర్, ముంబై నగరవాసులు డిన్నర్‌లో తీసుకునేందుకు కూడా ఇష్టపడుతున్నారని నివేదిక వెల్లడించింది.

కారం, నెయ్యి ఇడ్లీకి హైదరాబాద్ జై

బెంగళూరు వాసులు రవ్వ ఇడ్లీలు, చెన్నై వాసులు నెయ్యి, పొడి ఇడ్లీలు ఇష్టపడుతుండగా.. హైదరాబాదీలు కారం పొడి, నెయ్యితో కూడిన ఇడ్లీని ఇష్టపడుతున్నారని తేలింది. ఇక ముంబయి వాసులు ఇడ్లీ..వడ కాంబినేషన్‌కు జై కొడుతున్నారు. అయితే ఇంత క్రేజ్ ఉన్న ఇడ్లీ.. అల్పాహారాల ఆర్డర్స్‌లో అగ్రస్థానాన్ని మాత్రం పొందలేకపోయింది. అత్యధిక ఆర్డర్లతో మసాలా దోశ ఫస్ట్ ప్లేస్ కొట్టేసింది. ఇడ్లీ రెండవ స్థానంలో ఉంది.

డేటా లీకులో మనీ లాండరింగ్?

▶ మొదటి పేజీ తరువాయి

ఈ అంతర్రాష్ట్ర నిందితులు తస్కరించారు. ఈ డేటాను జస్ట్ డయల్, డేటా మార్ట్ ఇన్ఫోటెక్, గ్లోబల్ డేటా ఆర్ట్స్, ఎంఎస్ డిజిటల్ గ్రో, ఇన్‌స్పైరీ డిజిటల్ మాధ్యమాల ద్వారా విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ ముఠా కోల్‌కతా, అలాగే ఢిల్లీ సహా పలు ఉత్తరాది రాష్ట్రాల్లో డేటా విక్రయ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు విచారణలో తేలింది. విక్రయానికి పెట్టిన డేటాలో నీట్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులు, గృహిణులు, వాట్సాప్, ఫేస్‌బుక్ యూజర్ల సమాచారం మాత్రమే కాకుండా ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, డీమ్యాట్ ఖాతాదారులు, హైనెట్‌వర్త్ ఇండివిడ్యువల్స్ (హెచ్‌ఎన్‌ఐ) వంటి 140 కేటగిరీలకు చెందిన వారి డేటా ఉండటం విశేషం. ఈ డేటాలో పేర్లు, ఫోన్ నంబర్లు, చిరునామాలతో పాటు బ్యాంకు ఖాతాల నంబర్లు, సీవీవీ, పిన్, ఆధార్, పాన్‌కార్డు నంబర్లు, రుణాలు, ఇతరత్రా వ్యక్తిగత సమాచారం కూడా ఉండటంతో పోలీసు అధికారులు అప్రమత్తమయ్యారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న డేటాలో రక్షణ శాఖకు చెందిన ఉద్యోగుల పేర్లు, చిరునామాలు, ఫోన్ నంబర్లతో పాటు ర్యాంకులు, ఈ–మెయిల్ ఐడీలు, ప్రస్తుత పోస్టింగ్ వంటి కీలకమైన సమాచారం కూడా దాగి ఉండటం సంచలనం సృష్టించింది. డేటా లీకు కేసును ఈడీకి బదిలీ చేయలేదని సైబరాబాద్ కమిషనరేట్ పోలీసు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఈ కేసు విషయమై ఈడీ అధికారులు తమతో సమావేశం కాలేదన్నారు.

‘ఔటర్’పై టోల్‌ట్యాక్స్ పెంపు

▶ మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్(హెచ్‌జీసీఎల్) పనిచేస్తున్న సంగతి తెలిసిందే. ఔటర్ మార్గంలో పచ్చదనం పెంపు, రహదారుల మరమ్మతులు, సోలార్ విద్యుత్ లైట్ల ఏర్పాటు వంటి పనులను హెచ్‌జీసీఎల్ నిర్వహిస్తోంది. టోల్‌చార్జీల రూపంలో ఏటా సుమారు రూ.400 కోట్ల ఆదాయం లభిస్తుండగా, తాజా పెంపు వల్ల మరో రూ.45 కోట్ల వరకు రాబడి పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఏప్రిల్ 1 నుంచి టోల్‌చార్జీలు కిలోమీటర్‌కు కింది విధంగా ఉండనున్నాయి..

వాహనాలు	టోల్‌ట్యాక్స్(రూ.లో)
కార్లు, వ్యాన్లు తదితర తేలికపాటి వాహనాలు	2.25
మినీబస్సులు, లైట్‌క్యారేజ్ బండ్లు	3.65
బస్సులు, లారీలు తదితర కేటగిరీకి చెందినవి	6.46
కమర్షియల్ గూడ్స్	8.34
భారీ నిర్మాణ సామగ్రి యంత్రాల వాహనాలు	11.99
7 యాక్సెల్స్ కంటే పెద్దవైన భారీ కంటైనర్లు	14.58

లక్ష ర్యాంకు దాటినా.. పీజీ మెడికల్ సీటు

- గతేడాది 1.09 లక్షల ర్యాంకుకు సీటు
- ఈసారి కట్ ఆఫ్ పెరగడంతో మరింతగా పెరిగే అవకాశం
- ఈ ఏడాది మరో 40 కొత్త పీజీ సీట్ల పెరుగుదల
- కాళోజీ ఆరోగ్య వర్సిటీ అధికారుల విశ్లేషణ

సాక్షి, హైదరాబాద్: లక్ష ర్యాంకు దాటిన వారికి కూడా రాష్ట్రంలో పీజీ మెడికల్ కోర్సుల్లో సీట్లు సులువుగానే లభించనున్నాయి. గతేడాది కూడా లక్షకు పైగా ర్యాంకు వచ్చిన విద్యార్థులు పీజీ మెడికల్‌లో సీట్లు పొందారు. గతేడాది కంటే ఈసారి నీట్ పీజీ కటాఫ్ మార్కులు పెరగడంతో మరింతగా సీట్లు పొందే అవకాశం వచ్చింది. ఇటీవల పీజీ మెడికల్ నీట్ ఫలితాలు వెలువడిన సంగతి విదితమే.

- 2022–23లో నీట్ పీజీ మొత్తం మార్కులు 800 కాగా, జనరల్/ ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో 275 మార్కులు కటాఫ్‌గా నిలిచాయి. జనరల్ దివ్యాంగుల్లో 260 కటాఫ్, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ కేటగిరీల్లో 245 కటాఫ్‌గా ఉంది. కాగా, ఈసారి జనరల్/ ఈడబ్ల్యూఎస్ లో కటాఫ్ మార్క్ 291, జనరల్ దివ్యాంగుల్లో 274, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కేటగిరీలో 257 కటాఫ్‌గా నిర్ణయించారు. దీంతో గతేడాది కంటే ఈసారి ర్యాంకు ఎక్కువ వచ్చిన వారికి కూడా సీట్లు వచ్చే అవకాశం ఉంది. అంతేగాక గతేడాది కంటే ఈసారి దేశంలోనూ, రాష్ట్రంలోనూ పీజీ మెడికల్ సీట్ల సంఖ్య పెరిగింది.
- దేశవ్యాప్తంగా 2023–24లో 45,471 పీజీ మెడికల్, 4,997 డీఎన్‌బీ సీట్లున్నాయి. తెలంగాణలో 2,501 పీజీ మెడికల్ సీట్లు ఉన్నాయి. ఈసారి మరో 40 పీజీ సీట్లు పెరుగుతాయని కాళోజీ వర్గాలు వెల్లడించాయి.



- 2022–23లో కొన్ని కాలేజీల్లో ర్యాంకులు, సీట్లు ఇలా
- ఆదిలాబాద్ రిమ్స్‌లో నీట్‌లో 1,09,138 ర్యాంకు వచ్చిన ఎస్సీ విద్యార్థినికి ఎండీ ఫార్మకాలజీలో సీటు వచ్చింది.
- 1,08,083 ర్యాంకు వచ్చిన ఎస్సీ విద్యార్థినికి నిమ్స్‌లో బయో కెమిస్ట్రీలో సీటు వచ్చింది.
- 1,00,622 ర్యాంకు వచ్చిన బీసీ డీ విద్యార్థికి ఉస్మానియాలో ఎండీ ఫిజియాలజీలో సీటు వచ్చింది.
- 1,00,055 ర్యాంకు సాధించిన బీసీ బీ అభ్యర్థినికి ఉస్మానియాలో ఎండీ ఫోరెన్సిక్ మెడిసిన్‌లో సీటు వచ్చింది.
- 1,07,714 ర్యాంకు వచ్చిన ఎస్సీ విద్యార్థినికి మహబూబ్‌నగర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఫార్మకాలజీలో సీటు వచ్చింది.

నాన్ క్లినికల్ పీజీ మెడికల్ సీట్లపై నీలినీడలు

ఎంబీబీఎస్ పూర్తి చేసిన విద్యార్థులు మెడికల్ పీజీ చేయాలని ఉవ్విళ్లూరుతుంటారు. తద్వారా స్పెషలిస్టు వైద్యులుగా తమ కెరీర్‌ను మలుచుకుంటారు. అందువల్ల ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో క్లినికల్ విభాగంలోని సీట్లలో రూ.కోట్లు ఖర్చు చేసి చేరుతుంటారు. ఒక్క సీటు కూడా మిగలదు. కానీ నాన్ క్లినికల్ పీజీ సీట్లను పట్టించుకునే నాథుడే లేడు. ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో ఉండే కన్వీనర్ కోటా సీట్లలోనూ విద్యార్థులు చేరడం లేదంటే పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. లక్ష ర్యాంకు సాధించిన వారికి నాన్ మెడికల్ సీట్లలోనే అవకాశాలున్నాయి. అయితే చాలామంది అనాసక్తి చూపడంతో అవి నిండడం లేదు. దేశ వ్యాప్తంగా 2022–23 వైద్య విద్యా సంవత్సరంలో 1,311 నాన్ మెడికల్ సీట్లు మిగిలిపోయాయని కేంద్రం ఇటీవల వెల్లడించింది. అందులో తెలంగాణలో దాదాపు 150 వరకు నాన్ మెడికల్ సీట్లు మిగిలినట్లు అంచనా వేశారు.

క్లినికల్ సీట్లపైనే అందరి దృష్టి

అనాటమీ, ఫిజియాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, బయో కెమిస్ట్రీ, ఫార్మకాలజీ, పెథాలజీ, మైక్రో బయాలజీ, ఎస్పీఎం, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ వంటివి నాన్ క్లినికల్ కోర్సులు. ఈ కోర్సులు చేసినవారికి ప్రధానంగా మెడికల్ కాలేజీల్లో ఫ్యాకల్టీగా చేయడానికి వీలుంటుంది. ఫోరెన్సిక్ మెడిసిన్ వంటి వాటికి ఇతరత్రా అవకాశాలుంటాయి. కానీ క్లినికల్ కోర్సుల మాదిరి నాన్ క్లినికల్ సబ్జెక్టులకు డిమాండ్ ఉండదు. కొన్నేళ్లుగా ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ఖాళీలను భర్తీ చేయకపోవడంతో ఈ కోర్సులు చేసినవాళ్లు ఖాళీగా ఉంటున్నారు. ఇటీవల ఖాళీల భర్తీ జరుగుతున్నా, వైద్య విద్యార్థులు క్లినికల్ సీట్లపైనే దృష్టిసారిస్తున్నారు.

ఆరోగ్యశ్రీ బకాయిలు రూ. 600 కోట్లు

▶ మొదటి పేజీ తరువాయి

ఏటా రూ. 850 కోట్లకు పైగా ఖర్చు చేస్తోంది. ఇక ఆరోగ్యశ్రీ కోసం రాష్ట్ర ప్రభుత్వం గత ఎనిమిదేళ్లలో రూ.5,817 కోట్లు కేటాయించింది. 2014 నుంచి ఇప్పటివరకు 13.31 లక్షల మందికిపైగా బాధితులు ఆరోగ్యశ్రీ కింద వైద్య చికిత్సలు పొందారు.

ఈహెచ్‌ఎస్‌కు ప్రత్యేకంగా కార్పస్ ఫండ్

ఉద్యోగుల నగదు రహిత ఆరోగ్య పథకాన్ని ప్రత్యేకంగా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఉద్యోగులు కొంత వాటాగా ప్రభుత్వానికి చెల్లిస్తే, దాన్ని ప్రత్యేక ట్రస్టు కింద జమ చేస్తారు. ప్రభుత్వం కూడా తన వాటాగా జమ చేస్తుంది. ఇలా ఏర్పడిన కార్పస్ ఫండ్‌తో ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని అమలు చేస్తారు. అందుకు సంబంధించిన మార్గదర్శకాలు ఖరారు అవుతున్నాయని వైద్యాధికారులు చెబుతున్నారు.

పెద్ద చికిత్సలకు ససేమిరా

బకాయిలు పేరుకుపోవడంతో పలు ప్రైవేట్, ప్రభుత్వ ఆసుపత్రులు కొన్ని రకాల చికిత్సలకు ఆరోగ్యశ్రీ కింద వైద్యం చేయడానికి నిరాకరిస్తున్నాయి. చాలా ఆసుపత్రుల్లో చిన్నపాటి కంటి, పంటి నొప్పుల్లాంటి వాటికి చికిత్సలు చేస్తున్నారే కానీ, పెద్ద చికిత్సలు చేయడం లేదని బాధితులు వాపోతున్నారు. మరోవైపు ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్‌ఎస్) కింద కూడా రాష్ట్రంలో అనేకచోట్ల వైద్య సేవలు అందడం లేదు. ఆస్పత్రుల తీరుపై ఫిర్యాదులు చేస్తున్నా ఫలితం ఉండటం లేదని బాధితులు వాపోతున్నారు. తాము డబ్బులు చెల్లించి వైద్యం చేయించుకోవాల్సి వస్తోందని అంటున్నారు. అయితే ప్రభుత్వం నుంచి ఆరోగ్యశ్రీ బకాయిలు రావడం లేదని, అందుకే నగదు రహిత సేవలు అందించలేకపోతున్నామని ఆస్పత్రుల యాజమాన్యాలు చెబుతున్నాయి.

డిమాండ్ ఫుల్.. వ్యాక్సిన్ నిల్

సాక్షి, హైదరాబాద్: దేశంలో కరోనా కేసులు పెరుగుతున్నాయని కేంద్రం రాష్ట్రాలను అప్రమత్తం చేస్తోంది. వైరస్ నియంత్రణకు పరీక్షలు విరివిగా నిర్వహించాలని ఆదేశాలు జారీచేసింది. ప్రజలు కూడా వ్యాక్సిన్ తప్పనిసరిగా వేసుకోవాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు. కానీ రాష్ట్రంలో కరోనా వ్యాక్సిన్ డోసులు మాత్రం అందుబాటులో లేవు. బూస్టర్ (ప్రికాషన్) డోసు వేసుకోవాల్సిన వారే కోటిన్నర మందికి పైగా ఉండగా, వ్యాక్సిన్లు కేవలం రెండువేల లోపే అందుబాటులో ఉన్నాయి. కరోనా టీకాలు వేసుకునేందుకు ఏ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లినా డోసులు లేవని అధికారులు చెబుతున్నారు. కేంద్రాన్ని అడిగామని అధికారులు చెబుతున్నారే కానీ టీకాలు తెప్పించడంలో విఫలమయ్యారన్న ఆరోపణలున్నాయి.

1.63 కోట్ల బూస్టర్ డోసులు పెండింగ్...

రాష్ట్రంలో 7.75 కోట్ల వ్యాక్సిన్ డోసులు వేశారు. మొదటి, రెండు, బూస్టర్ డోసులు కలిపి ప్రభుత్వమే 7.30 కోట్లు డోసులు అందించింది. అందులో మొదటి డోసు 3.24 కోట్ల మందికి వేయగా, 3.15 కోట్ల మందికి రెండో డోసు వేశారు. అందులోనూ కేవలం 1.35 కోట్ల మంది మాత్రమే ప్రికాషన్ డోసు వేయించుకున్నారు. ఇంకా 1.63 కోట్ల మంది బూస్టర్ డోసు వేయించుకోవాల్సి ఉంది. వారందరికీ ప్రికాషన్ డోసు పెండింగ్‌లో ఉంది. మొదటి డోసు వేసుకోవాల్సిన వారు 2,469 మాత్రమే ఉండగా, రెండో డోసు వేసుకోవాల్సిన వారు 8.88 లక్షల మంది ఉన్నారు. బూస్టర్ డోసు కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు. వారందరికీ కరోనా వ్యాక్సిన్ వేయాలంటే 1.63 కోట్ల డోసులు అవసరం. కానీ రాష్ట్రంలో ప్రస్తుతం వైద్య ఆరోగ్యశాఖ వద్ద 1,970 వ్యాక్సిన్లు మాత్రమే ఉన్నాయని వైద్య, ఆరోగ్యశాఖ నివేదిక తెలిపింది.

1.63 కోట్ల బూస్టర్ డోసులు పెండింగ్

- అందుబాటులో ఉన్నది కేవలం 2 వేలే
- చేతులెత్తేస్తున్న రాష్ట్ర వైద్య యంత్రాంగం



చేతులెత్తేస్తున్న యంత్రాంగం...

కాగా, వ్యాక్సిన్ కోసం ప్రభుత్వ ఆసుపత్రులకు అనేకమంది వెళ్తున్నా టీకాలు లేవన్న సమాధానమే వస్తుంది. ఈ విషయంలో అధికారులు చేతులెత్తేస్తున్నారు. ఒకవైపు కరోనాపై జాగ్రత్తలు తీసుకోవాలని, వ్యాక్సిన్ వేసుకోవాలని చెబుతున్న అధికారులు, టీకాలు అందుబాటులో ఉంచకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. కోటిన్నరకు పైగా డోసులు డిమాండ్ ఉండగా, కేవలం రెండు వేల లోపే స్టాకు ఉంచడం నిర్లక్ష్యానికి పరాకాష్టగా చెబుతున్నారు. కరోనాను నియంత్రించడంలో వ్యాక్సిన్ కీలకపాత్ర పోషించిన విషయం తెలిసిందే.

● ఇంగ్లీష్ ఇడియమ్స్

బాటెన్ డౌన్ ది హ్యాచెస్

ఎదురయ్యే సమస్య, రాబోయే కష్టాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రిపేర్‌గా ఉండమని చెప్పే సందర్భంలో వాడే ఇడియమ్ బాటెన్ డౌన్ ది హ్యాచెస్.



ఉదా: ఆఫ్టర్ మంత్స్ ఆఫ్ ఫీయర్ ఎబౌట్ ది ఎకానమీ కన్జూమర్స్ ఆర్ రెడీ టూ బాటెన్ డౌన్ ది హ్యాచెస్

మూలాల్లోకి వెళితే... వన్స్ అపాన్ ఏ టైమ్ సముద్ర నావికులు ఈ మాటను ఉపయోగించేవారు.

'హ్యాచెస్' అనేది నావకు సంబంధించిన ఓపెనింగ్ డెక్ స్పేస్. వాతావరణం సరిగ్గా లేనప్పుడు చెక్కపలకలతో ఓపెన్ డెక్‌ను మూసివేసేవారు. దీన్ని 'బాటింగ్ డౌన్' అంటారు. వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నప్పుడు హ్యాచెస్‌ను మూసివేయాల్సిందిగా సిబ్బందిని కెప్టెన్ ఆదేశించేవాడు. తరువాత కాలంలో ఈ ఎక్స్‌ప్రెషన్ సముద్రం దాటి రోజు వారి జీవితంలోకి కూడా వచ్చింది.

● టెక్.. టాక్

హువావే పాడ్ 11 (2023)




సైజ్: 11-అంగుళాలు రిజల్యూషన్: 2560×1600 పిక్సెల్స్;
బరువు: 480 గ్రా. బ్యాటరీ: 7,250 ఎంఎహెచ్
ర్యామ్: 8జీబి ఇంటర్నల్ మెమోరీ: 128జీబి
రిఫ్రెష్ రేట్: 120 హెచ్‌జడ్
కలర్స్: బ్లాక్, ఐలాండ్ బ్లూ, క్రిస్టల్ వైట్, పర్పుల్

షియోమి టీవీ స్టిక్



లేటెస్ట్ ఎంట్రీ లెవెల్ 4కే మీడియా స్ట్రీమింగ్ డివైజ్ షియోమి టీవీ స్టిక్. ఈ కొత్త మోడల్ పాపులర్ ఆడియో, వీడియోలను సపోర్ట్ చేస్తుంది ● లెంత్: 106.8ఎంఎం ●విడ్త్: 29.4 ఎంఎం ● బరువు: 42.8 గ్రా. ● కలర్: బ్లాక్ ● 2జీబి ర్యామ్ అండ్ 8జీబి స్టోరేజ్

ఆర్క్ బ్రౌజర్



క్రోమియం బేస్డ్ కొత్త బ్రౌజర్ ఆర్క్. దీనిలోని కమాండ్ బార్ ఫీచర్‌తో బ్రౌజ్ సెట్టింగ్స్‌లో వేగంగా మార్పులు చేసుకోవచ్చు. ఇక 'స్ప్లిట్ వ్యూ' అనేది ఆర్క్ స్పెషల్ ఫీచర్. ఒకేసారి మల్టీపుల్ టాస్క్‌లకు ఉపయోగపడుతుంది. 'ఇట్స్ అవర్ విండో టు ఎవ్రీథింగ్ ఆన్ ది ఇంటర్నెట్' అంటూ 'ఆర్క్'ను తీసుకువచ్చింది న్యూయార్క్‌కు చెందిన 'ది బ్రౌజర్' కంపెనీ. కొలాబరేటివ్ ఫీచర్స్, పవర్‌ఫుల్ ఫంక్షనాలిటీ తన ప్రత్యేకతగా చెబుతోంది ది బ్రౌజర్.

ఇన్‌స్టా 360

పాపులర్ కెమెరా కంపెనీ ఇన్‌స్టా 360 ఏఐ-ట్రాకింగ్ స్మార్ట్‌ఫోన్ స్టెబిలైజర్ గురించి ప్రకటించింది. కంటెంట్ క్రియేటర్‌లకు బాగా ఉపయోగపడే పరికరం ఇది. షేక్-ఫ్రీ షాట్స్ దీని ప్రత్యేకత. గెచ్చర్ కంట్రోల్, ట్రాకింగ్ రికవరీ, డీప్ ట్రాక్... మొదలైన ఫీచర్‌లు ఉన్నాయి. బరువు: 130-300 గ్రా. బ్లూటూత్ 5.0 కనెక్టివిటీ బ్యాటరీ: 2,900 ఎంఎహెచ్



గెలుపు గ్రామర్

విజయం సాధించడంలో ఎంత కిక్ ఉందో.... ఇతరులను విజయం సాధించేలా చేయడంలో అంత కంటే ఎక్కువ కిక్ ఉంది! ఎడ్యుకేషన్ స్టార్టప్ 'ప్రెప్‌ఇన్‌స్టా'తో ఆశయ్ మిశ్రా, కౌశిక్, మనీష్ అగర్వాల్‌లు విజయం సాధించడమే కాదు యువత తమ కలలు సాకారం చేసుకోవడంలో కీలకపాత్ర పోషిస్తున్నారు...


విజయ త్రయం: కౌశిక్, మనీష్ అగర్వాల్, ఆశయ్ మిశ్రా

కౌశిక్, ఆశయ్ మిశ్రా, మనీష్ అగర్వాల్‌లు వెల్లూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(విఐటీ యూనివర్శిటీ, తమిళనాడు)లో కలిసి చదువుకున్నారు. చదువు పూర్తయిన తరువాత బెంగళూరులో వేరు వేరు కంపెనీలలో ఉద్యోగాలు చేసేవారు.

'చాలామంది స్టూడెంట్స్‌లో ప్రతిభ ఉన్నా తమ ఉద్యోగ లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నారు. దీనికి కారణం వారిలో సాంకేతిక నైపుణ్యం లేకపోవడంతో పాటు కోరుకున్న ఉద్యోగాన్ని సాధించడంలో అనుసరించాల్సిన వ్యూహంపై అవగాహన లేకపోవడం...' ఇలాంటి ఆలోచనలను రెగ్యులర్‌గా బ్లాగ్‌లో రాసేవాడు గూగుల్ కంపెనీలో పనిచేస్తున్న కౌశిక్. తన బ్లాగ్ ఎంత హిట్ అయిందంటే సంవత్సరం తిరిగేసరికల్లా నెలకు లక్ష వ్యూలు వచ్చేవి.

ఆ టైమ్‌లోనే కౌశిక్‌కు 'ఫ్లిప్‌కార్ట్' నుంచి మంచి ఉద్యోగ అవకాశం వచ్చింది. అయితే దాన్ని కాదనుకొని ఇద్దరు మిత్రులతో మాట్లాడాడు.

అలా ఈ ముగ్గురి మేధో మథనం నుంచి పుట్టిందే... ప్రెప్‌ఇన్‌స్టా.

ప్రెప్‌ఇన్‌స్టా(ప్రిపేర్ ఫర్ ప్లేస్‌మెంట్స్ ఇన్‌స్టంట్లీ) అనేది వోటీటీ ఫార్మట్ ప్లాట్‌ఫామ్. యూజర్‌లు డబ్బులు చెల్లించి ఫిక్స్‌డ్ టైమ్‌లో(నెలలు లేదా సంవత్సరాలు) 200 కోర్సులతో యాక్సెస్ కావచ్చు. అప్‌స్కిలింగ్ సబ్జెక్ట్‌లు, క్లౌడ్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంటర్వ్యూ ప్రిపరేషన్ (లాజిక్, వెర్బల్ అండ్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్)...మొదలైనవి ఆ కోర్సులలో ఉంటాయి.

> ఎన్నో ప్లాట్‌ఫామ్స్‌లో ఎన్నో కోర్సులు అందుబాటులో ఉన్నాయి. అయితే గ్రామీణ, చిన్న పట్టణాలకు చెందిన వారు ఆ ఖర్చును భరించే స్థితిలో లేరు. దీన్ని దృష్టిలో పెట్టుకొని అందుబాటు ధరల్లో ఉండేలా ప్రిప్‌ఇన్‌స్టా తీసుకువచ్చాం.
> - ఆశయ్ మిశ్రా

'ఎన్నో ప్లాట్‌ఫామ్స్‌లో ఎన్నో కోర్సులు అందుబాటులో ఉన్నాయి. అయితే గ్రామీణ, చిన్న పట్టణాలకు చెందిన వారు ఆ ఖర్చును భరించే స్థితిలో లేరు. దీన్ని దృష్టిలో పెట్టుకొని అందుబాటు ధరల్లో ఉండేలా ప్రిప్ ఇన్‌స్టా తీసుకువచ్చాం. యూత్ తమ డ్రీమ్ జాబ్స్‌ను గెలుచుకునేలా చేయడంలో మా ప్లాట్‌ఫామ్ విజయం సాధించింది' అంటున్నాడు కో-ఫౌండర్ ఆశయ్ మిశ్రా.

నోయిడా(ఉత్తర్‌ప్రదేశ్), బెంగళూరు కేంద్రంగా పనిచేస్తున్న ఈ ప్లాట్‌ఫామ్ యాభైకి పైగా కాలేజీలతో కలిసిపని చేస్తుంది. రాబోయే కాలంలో మూడు వందల కాలేజీలతో కలిసి పనిచేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకుంది.

'మాది సెల్ఫ్-పేస్‌డ్ ప్లాట్‌ఫామ్. స్టూడెంట్స్ తమకు అనుకూలమైన టైమ్, షెడ్యూల్‌లో చదువుకోవచ్చు. బీ2సీ (బిజినెస్-టు-కన్స్యూమర్) మోడల్‌లో ఈ ప్లాట్‌ఫామ్‌కు 2.25 లక్షల పెయిడ్ యాక్టివ్ సబ్‌స్క్రైబర్‌లు ఉన్నారు.

కోవిడ్ కల్లోల కాలంలో మాత్రం ఈ స్టార్టప్ తలకిందులయ్యే పరిస్థితి వచ్చింది. ఆదాయం సగానికి సగం పడిపోయింది. పేరున్న ఎడ్‌టెక్ కంపెనీలు కూడా మూతపడుతున్నాయి. 'నిరాశ' మెల్లిగా దారి చేసుకొని దగ్గరికి వచ్చే ప్రయత్నం చేస్తోంది. అయితే ఆ సమయంలో గట్టిగా నిలబడ్డారు ముగ్గురు మిత్రులు. కంపెనీని రీవ్యాంప్ చేశారు. ఉద్యోగుల సంఖ్యను పెంచారు.

'ఇక కనిపించదు' అనుకున్న కంపెనీ లేచి నిలబడి కాలర్ ఎగరేసింది!

25 కోట్ల క్లబ్‌లో చేరిన ఈ స్టార్టప్ తన విస్తరణలో భాగంగా వెంచర్ క్యాపిటల్, ఏంజెల్ ఇన్వెస్టర్‌లతో చర్చలు జరుపుతోంది.

రిస్క్ అనిపించే చోట 'ప్లాన్ బీ'ను దృష్టిలో పెట్టుకోవడం మామూలే. అయితే 'ప్లాన్ ఏ' పకడ్బందీగా ఉంటే 'బీ'తో ఏంపని? అని ఈ ముగ్గురు అనుకున్నారు. వారి నమ్మకం నిజమైంది!

అవును... ఇది నిజమే!

● శునకాలు సైతం సంగీతానికి దాసోహం అంటాయి అంటున్నారు పరిశోధకులు. సంగీతం వాటి భావోద్వేగాల మీదే కాదు ప్రవర్తన విషయంలోనూ ప్రభావం చూపుతుందని చెబుతుంది 'యూనివర్శిటీ ఆఫ్ గ్లాస్గో' పరిశోధన పత్రం. సాఫ్ట్‌రాక్ వింటున్న సమయంలో వాటిలో పాజిటివ్ బిహేవియర్‌కు సంబంధించిన మార్పులు చోటు చేసుకున్నట్లు పరిశోధకులు తెలియజేస్తున్నారు.



ఇక శాస్త్రీయ సంగీతం వింటున్నప్పుడు చాలా రిలాక్స్‌డ్‌గా కనిపించేవి.

ఏమీ తోచక ఊరకే అరిచే శునకాలు సైతం సంగీతం వినబడగానే చప్పున కూర్చొని శ్రద్ధగా వినడాన్ని పరిశోధకులు గమనించారు!

● కెనడాకు చెందిన కోరి బ్రాండెన్ లాంగెస్ట్ వీడియోగేమ్ మారథాన్‌తో ప్రపంచ రికార్డ్ సృష్టించాడు. 'కాల్ ఆఫ్ డ్యూటీ: వార్‌జోన్' అనే వీడియో గేమ్‌ను 145 గంటల పాటు ఆడి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి ఎంటరయ్యాడు. గతంలో కాలిఫోర్నియాకు చెందిన కెరీ 138 గంటల 34 నిమిషాలు ఆడి రికార్డ్ సృష్టించింది. ఈ రికార్డ్‌ను కోరి బ్రాండెన్ బ్రేక్ చేశాడు.

● గేమింగ్

అంతరిక్ష యుద్ధం

అంతరిక్షం అనేది అంతులేని రహస్యాల వేదిక. ఆ వేదికపై సాహస కవాతు చేయాలని ఉందా? ఏమీ తెలియని ప్రపంచంలో తెలిసిన ఆయుధాలతో యుద్ధం చేయాలని ఉందా? అయితే



'ఎవర్ స్పేస్-2'లోకి పదండి. రకరకాల మలుపులతో ప్లేయర్‌ను ఉక్కిరిబిక్కిరి చేసి అంతలోనే ఉత్సాహం నింపే గేమ్ ఇది.

స్పేస్ కంబాట్ గేమ్ 'ఎవర్ స్పేస్-2' ఏప్రిల్ 6 విడుదల అవుతుంది. రోగ్ లైక్ ఎలిమెంట్స్‌తో కూడిన ఈ త్రీడీ స్పేస్ షూటర్‌ని జర్మన్ స్టూడియో రాక్‌ఫిష్ నిర్మించింది.

2017లో గ్రేటర్ విజువల్స్‌తో ఆకట్టుకున్న 'ఎవర్ స్పేస్'కు సీక్వెల్‌గా వస్తున్న ఈ గేమ్‌పై ఎన్నో అంచనాలు ఉన్నాయి.

ఇంజిన్: అన్ రియల్ ఇంజిన్ 4
మోడ్స్: సింగిల్ ప్లేయర్
ప్లాట్‌ఫామ్: మైక్రోసాఫ్ట్ విండోస్, ఎక్స్‌వన్, ప్లేస్టేషన్ 4, నిన్టెండో స్విచ్, గూగుల్ స్టాడియా, అమెజాన్ లూనా

రెడ్ లైట్

తాత చనిపోయిన దుఃఖం నుంచి భయటపడడానికి లక్నో (ఉత్తర్‌ప్రదేశ్)కు చెందిన ఖుషీకి చాలా కాలమే పట్టింది. ఒక రాత్రిపూట సైకిల్ తొక్కుతూ వెళుతున్న తాతయ్య యాక్సిడెంట్‌లో చనిపోయాడు. ఆ సైకిల్ వెనుక వెలిగే రెడ్‌లైట్ ఉండి ఉంటే ప్రమాదం జరగకపోయేది. దీన్ని దృష్టిలో పెట్టుకొని తమ కుటుంబానికి జరిగిన విషాదం మరే కుటుంబానికి జరగకుండా సైకిలిస్ట్‌లకు ఉచితంగా పదిహేను వందలకు పైగా రెడ్‌లైట్లు పంపిణీ చేసింది ఖుషీ.

'దయచేసి మీ సైకిల్‌కు రెడ్‌లైట్ అమర్చుకోండి' అని రాసి ఉన్న ప్లకార్డుతో రాత్రివేళ రోడ్డు పక్కన నిల్చుంటుంది. ఎవరైనా సైకిలిస్ట్ రెడ్‌లైట్ లేకుండా వెళుతుంటే ఆపి నాలుగు మంచి మాటలు చెప్పడమే కాదు తానే స్వయంగా సైకిల్ వెనకాల రెడ్‌లైట్ బిగిస్తుంది.

ఖుషీ వీడియో క్లిప్‌ను ఐఏఎస్ అధికారి అవనీష్ శరణ్ ట్విట్టర్‌లో పోస్ట్ చేస్తే వైరల్ అయింది. 2.5 లక్షల వ్యూస్ వచ్చాయి.



సినిమా

మంత్రం కన్నా గొప్పది నీ నామం


● ఆదిపురుష్ పోస్టర్

ప్రభాస్ హీరోగా నటించిన మైథలాజికల్ ఫిల్మ్ 'ఆదిపురుష్'. రామాయణం ఇతిహాసం నేపథ్యంలో ఓం రౌత్ దర్శకత్వం వహించిన చిత్రం ఇది. ఇందులో రాముడి పాత్రలో ప్రభాస్, సీతగా కృతీసనన్, లక్ష్మణుడిగా సన్నీసింగ్, హనుమంతుని పాత్రలో దేవదత్తా, రావణుడి పాత్రలో సైఫ్ అలీఖాన్ నటించారు. వంశీ, ప్రమోద్, భూషణ్ కుమార్, క్రిషన్ కుమార్, ఓం రౌత్, ప్రసాద్ సుతార్, రాజేష్ నాయర్ నిర్మించారు. గురువారం శ్రీరామనవమిని పురస్కరించుకుని 'మంత్రం కన్నా గొప్పది నీ నామం జై శ్రీరామ్' అంటూ 'ఆదిపురుష్' నుంచి కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ఈ చిత్రం జూన్ 16న విడుదలకానుంది.

ఇటలీలో సలార్..

ప్రభాస్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'సలార్'. శ్రుతీహాసన్ హీరోయిన్. విజయ్ కిరగందూర్ నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ ఇటలీలోని మాంటేరాలో జరుగుతోంది. 'జేమ్స్‌బాండ్' సిరీస్‌లోని 25వ చిత్రం 'నో టైమ్ టు డై' షూటింగ్ జరిగిన లొకేషన్స్‌లోనే 'సలార్' చిత్రీకరణ జరుగుతోందని తెలిసింది. ప్రభాస్‌పై ప్రధాన సన్నివేశాలతో పాటుగా, భారీ యాక్షన్ సీక్వెన్స్ కూడా చిత్రీకరిస్తున్నారు యూనిట్. ఇటలీ షెడ్యూల్ పూర్తయిన తర్వాత బుడాపెస్ట్‌లో షూటింగ్ ప్లాన్ చేసింది యూనిట్. జగపతిబాబు, పృథ్వీరాజ్ సుకుమారన్ నటిస్తున్న 'సలార్' చిత్రం సెప్టెంబరు 28న రిలీజ్ కానుంది.

మధురం విజయం సాధించాలి

- విశ్వక్ సేన్


● ఉదయ్, విశ్వక్ సేన్, రాజేష్

''మధురం' మూవీ పోస్టర్ చాలా బాగుంది. ఈ సినిమా చూడాలని నేను కూడా ఆత్రుతగా ఎదురు చూస్తున్నా. ఈ చిత్రం మంచి విజయం సాధించాలి. హీరో ఉదయ్, నిర్మాత బంగార్రాజు, డైరెక్టర్ రాజేష్‌కి ఆల్ ది బెస్ట్'' అని హీరో విశ్వక్ సేన్ అన్నారు. ఉదయ్, వెష్ణవి జంటగా రాజేష్ చికిలే దర్శకత్వం వహించిన చిత్రం 'మధురం'. శ్రీ వెంకటేశ్వర ఎంటర్‌టైన్మెంట్ బ్యానర్‌పై బంగార్రాజు నిర్మించిన ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ని విశ్వక్ సేన్ విడుదల చేశారు. బంగార్రాజు మాట్లాడుతూ–''వైవిధ్యమైన కథాంశంతో రూపొందిన చిత్రం 'మధురం'. ఫస్ట్ లుక్ లాంచ్ చేసిన విశ్వక్ సేన్‌గారికి రుణపడి ఉంటాం'' అన్నారు. ''అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా మా చిత్రం ఉంటుంది'' అన్నారు రాజేష్ చికిలే, ఉదయ్. ఈ చిత్రానికి కెమెరా: మనోహర్ కొల్లి, సంగీతం: వెంకీ వీణ, సహ నిర్మాత: ప్రదీప్ కుమార్ సుప్రాణి.

ఓటీటీకి గ్రీన్‌సిగ్నల్

హీరోయిన్ వాణీకపూర్ డిజిటల్ ఎంట్రీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. 'మర్దానీ 2' ఫేమ్ దర్శకుడు గోపీ పుత్రన్, మానవ్ రావత్ కలిసి దర్శకత్వం వహించనున్న వెబ్‌సిరీస్ 'మండల మర్డర్స్'. ఇందులో వాణీకపూర్, వైభవ్ రాజ్ గుప్తా లీడ్ రోల్స్ చేస్తున్నారు. కాగా వాణీ కపూర్‌కు ఇదే తొలి ఓటీటీ ప్రాజెక్ట్. ''యశ్‌రాజ్‌ఫిల్మ్ ఎంటర్‌టైన్మెంట్స్ నిర్మిస్తున్న క్రైమ్‌థ్రిల్లర్ వెబ్‌సిరీస్ ఇది. నా తొలి ఓటీటీ ప్రాజెక్ట్ 'మండల మర్డర్స్' కావడం సంతోషంగా ఉంది'' అని పేర్కొన్నారు వాణీకపూర్. కాగా ఈ వెబ్‌సిరీస్ తొలి షెడ్యూల్ త్వరలో మధ్యప్రదేశ్‌లో ప్రారంభం కానుంది.


● వాణీ కపూర్


● గోపీచంద్, జగపతిబాబు

ఆ ఇద్దరూ నేనే!

'లక్ష్యం, లౌక్యం' వంటి హిట్ సినిమాల తర్వాత హీరో గోపీచంద్, డైరెక్టర్ శ్రీవాస్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న హ్యాట్రిక్ ఫిల్మ్ 'రామబాణం'. డింపుల్ హయతి హీరోయిన్‌గా, జగపతి బాబు, కుష్బూ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిభొట్ల నిర్మిస్తున్నారు. శ్రీరామ నవమి సందర్భంగా 'రామబాణం' నుంచి ఓ పోస్టర్‌ను, వీడియోను రిలీజ్ చేశారు. పంచె కట్టు, బొట్టుతో గోపీచంద్, జగపతి బాబు నడిచి వస్తున్న పోస్టర్ బాగుంది. 'ఆ రాముడుకి లక్ష్మణుడు, హనుమంతుడు అని ఇద్దరు ఉంటారు. ఈ రాముడికి ఆ ఇద్దరూ నేనే' అనే వీడియో ఆకట్టుకుంటోంది. ''క్లాస్, మాస్ అనే తేడా లేకుండా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా శ్రీవాస్ ఈ చిత్రాన్ని తీస్తున్నారు. విక్కీ అనే పవర్ ఫుల్ పాత్రలో గోపీచంద్ సరికొత్తగా కనిపిస్తారు. 'రామబాణం' త్వరలోనే థియేటర్లలోకి దూసుకొస్తుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జె.మేయర్, కెమెరా: వెట్రి పళని స్వామి.

పొన్నియిన్ సెల్వన్ తీయాలంటే ధైర్యం కావాలి

- కమల్ హాసన్


● మణిరత్నం, కమల్ హాసన్

''పొన్నియిన్ సెల్వన్' చిత్రాన్ని తీయాలంటే ధైర్యం కావాలి.. అది డైరెక్టర్ మణిరత్నం, నిర్మాత సుభాస్కరన్‌గార్లకు ఉంది. అందుకే ఈ చిత్రం అద్భుతంగా తెరకెక్కింది'' అని ప్రముఖ నటుడు కమల్ హాసన్ అన్నారు. ఐశ్వర్యా రాయ్, విక్రమ్, 'జయం' రవి, కార్తీ, త్రిష ప్రధాన పాత్రల్లో మణిరత్నం దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'పొన్నియిన్ సెల్వన్ 2'. సుభాస్కరన్, మణిరత్నం నిర్మించిన ఈ సినిమా ఏప్రిల్ 28న తెలుగు, తమిళ్, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదలవుతోంది. ఈ సినిమా ట్రైలర్, ఆడియో విడుదల వేడుకని చెన్నైలో నిర్వహించారు. ఈ మూవీ ఆడియోను కమల్ హాసన్ విడుదల చేసి, మాట్లాడుతూ–''పొన్నియిన్ సెల్వన్' నవల రాసిన కల్కిని చూసి ఇతర రచయితలు అసూయ పడుతున్నట్లుగా, మణిరత్నంగారిని చూసి రచయితలు, దర్శకులు అసూయ పడుతున్నారు.. వారిలో నేనూ ఒకణ్ణి. ఈ మూవీలో నటించే అవకాశం నాకు మిస్ అయ్యింది. తమిళ చిత్ర పరిశ్రమకు ఇది స్వర్ణయుగమే. దీన్ని కాపాడుకోవాలి. 'పొన్నియిన్ సెల్వన్ 2' ఘన విజయం సాధించాలి'' అన్నారు. ఈ వేడుకలో తమిళనాడు రాష్ట్ర మంత్రి దురైమురుగన్, దర్శకుడు భారతీరాజా, నటుడు శింబు, నటి ఐశ్వర్యారాయ్ తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం అందించగా, రవివర్మన్ కెమెరామేన్‌గా పనిచేశారు.

టీజర్ వినోదాత్మకంగా ఉంది

- శేఖర్ కమ్ముల


● శేఖర్ కమ్ముల, సుధాకర్

''నేను తీసిన 'లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్' సినిమాలో నటించిన వారు ప్రస్తుతం మంచి స్థాయిలో ఉన్నారు. సుధాకర్ కూడా బాగా కష్టపడతాడు. తను కోరుకునే స్థాయికి 'నారాయణ అండ్ కో' సినిమా అతన్ని తీసుకెళ్తుందని భావిస్తున్నాను. ఈ మూవీ టీజర్ వినోదాత్మకంగా ఉంది. సినిమా హిట్ సాధించాలి'' అని దర్శకుడు శేఖర్ కమ్ముల అన్నారు. సుధాకర్ కోమాకుల హీరోగా చిన్నా పాపిశెట్టి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'నారాయణ అండ్ కో'. పాపిశెట్టి బ్రదర్స్‌తో కలిసి సుధాకర్ కోమాకుల నిర్మించిన ఈ సినిమా టీజర్‌ని శేఖర్ కమ్ముల విడుదల చేశారు. ''మిడిల్ క్లాస్, క్రైమ్ కామెడీగా రూపొందిన చిత్రమిది. మంచి కంటెంట్ అందివ్వాలనే ఆలోచనతోనే ఈ సినిమాకు ఓ నిర్మాతగా మారాను'' అన్నారు సుధాకర్ కోమాకుల. ''క్లీన్ కామెడీగా రూపొందిన ఈ మూవీని ఫ్యామిలీతో కలిసి చూడొచ్చు'' అన్నారు చిన్నా పాపిశెట్టి. నటి ఆమని మాట్లాడారు. ఈ సినిమాకు సహ నిర్మాత: శ్రీనివాస్ గొర్రెపూడి, అసోసియేట్ నిర్మాత: శరద్ గుమస్తే, రెడ్ సెడార్ ఎంటర్‌టైన్మెంట్, సంగీతం: సురేష్ బొబ్బిలి, జోస్య భట్ల, నాగవంశీ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: విజయ్ రెడ్డి వెన్నపూస.

నిరుద్యోగుల కోసం..


● ఆర్. నారాయణ మూర్తి

ఆర్.నారాయణ మూర్తి ప్రధాన పాత్రలో నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'యూనివర్సిటీ'. స్నేహచిత్ర పిక్చర్స్ బ్యానర్‌పై రూపొందిన ఈ సినిమా సెన్సార్ పనులు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఆర్. నారాయణ మూర్తి మాట్లాడుతూ–''భారతదేశంలోని విద్యార్థులు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలతో 'యూనివర్సిటీ' తీశాను. ఎలాంటి అవకతవకలు లేకుండా అర్హులకు ఉద్యోగాలు ఇవ్వాలని ఈ మూవీలో డిమాండ్ చేస్తున్నాం. త్వరలోనే మా సినిమా రిలీజ్ డేట్ ప్రకటిస్తా'' అన్నారు.

కేరళలో ఖుషి


● విజయ్ దేవరకొండ

విజయ్ దేవరకొండ, సమంత జంటగా నటిస్తున్న చిత్రం 'ఖుషి'. శివ నిర్వాణ దర్శకత్వంలో నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. కాగా ఈ సినిమా లేటెస్ట్ షెడ్యూల్ కేరళలో ప్రారంభం కానుందని సమాచారం. వారం పాటు సాగే ఈ షెడ్యూల్‌లో విజయ్, సమంతలపై కీలక సన్నివేశాలను ప్లాన్ చేసిందట చిత్రయూనిట్. సెప్టెంబరు 1న 'ఖుషి' విడుదల కానుంది.

యాక్షన్ ఎంటర్‌టైనర్


● బెల్లంకొండ శ్రీనివాస్

బెల్లంకొండ సాయిశ్రీనివాస్ హీరోగా 'భీమ్లా నాయక్' ఫేమ్ సాగర్ చంద్ర దర్శకత్వంలో ఓ సినిమా(బీబీఎస్ 10 వర్కింగ్ టైటిల్) తెరకెక్కనుంది. 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మించనున్న ఈ సినిమా ప్రకటన గురువారం వెల్లడైంది. '' మాస్-యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందనున్న చిత్రమిది. ప్రముఖ నటీనటులు, సాంకేతిక నిపుణులు పని చేయనున్నారు.. పూర్తి వివరాలు త్వరలో తెలియజేస్తాం'' అని చిత్రబృందం పేర్కొంది.

మాస్ ఏజెంట్


● కృష్ణ, నిఖిత

కీర్తి కృష్ణ హీరోగా, నిఖిత, మధుబాల హీరోయిన్లుగా నటించిన చిత్రం 'ఏజెంట్ నరసింహా 117'. లక్ష్మణ్ చప్రాల దర్శకత్వంలో బి.నరసింహా రెడ్డి నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ మూవీ రిలీజ్ ట్రైలర్‌ను 'తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్' అధ్యక్షుడు బసిరెడ్డి విడుదల చేశారు. ''మాస్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రమిది'' అన్నారు నరసింహారెడ్డి.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (బుధవారం ముగింపు)	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
346	129
57,960	17,081

విదేశీ సూచీలు (తొలి నాలుగు రాత్రి 9.30 గంటలకు)			
నాస్‌డాక్	12,007	▲	81
డోజోన్స్	32,768	▲	51
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,622	▲	59
డాక్స్	15,523	▲	194
షాంఘై	3,261	▲	21
నికాయ్	27,783	▼	101

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారెట్)	59,335
బంగారం (22 క్యారెట్)	59,097
వెండి (కేజీ)	69,097

11 లక్షల వర్తకులతో మీషో

న్యూఢిల్లీ: ఈ-కామర్స్ కంపెనీ మీషో వేదికపై వర్తకుల సంఖ్య 11 లక్షలు దాటింది. గడిచిన ఏడాదిలో 6 లక్షల పైచిలుకు చిన్న వర్తకులు చేరారని కంపెనీ ప్రకటించింది. ఎనిమిదేళ్లలోనే ఈ మైలురాయికి చేరుకున్నట్టు తెలిపింది. 'విక్రేతల్లో సగం మంది ద్వితీయ శ్రేణి నగరాలు, చిన్న పట్టణాలకు చెందినవారు ఉన్నారు. మొత్తం సెల్లర్స్‌లో 80 శాతం పైచిలుకు మంది ఈ-కామర్స్‌కు కొత్తగా చేరినవారే. మీషో ద్వారానే ఆన్‌లైన్ వ్యాపారంలోకి వీరు అడుగుపెట్టారు. కశ్మీర్‌లోని పుల్వామా, హిమాచల్ ప్రదేశ్ ఉనా, కర్ణాటక నాగమంగళ, మేఘాలయ జోవాయ్, రాజస్తాన్‌లోని మౌంట్ అబు నుంచి సైతం విక్రేతలు నమోదయ్యారు. ఇంటర్నెట్ వాణిజ్యాన్ని మారుమూల ప్రాంతాలకూ చేర్చడం, చిన్న అమ్మకందారులను ఆన్‌లైన్‌లోకి తీసుకురావాలన్న సంస్థ లక్ష్యానికి ఇది నిదర్శనం' అని మీషో వివరించింది. వార్షిక ప్రాతిపదికన 14 కోట్ల మంది కస్టమర్లను సొంతం చేసుకున్నట్టు 2022లో కంపెనీ ప్రకటించింది. విక్రేతల సగటు ఆదాయం మూడింతలు పెరిగిందని తెలిపింది.



చిన్న షేర్లు కుదేల్!

- 2022-23లో స్మాల్‌క్యాప్ సూచీ 6 శాతం డౌన్..
- సెన్సెక్స్, బ్లూచిప్ షేర్లతో పోలిస్తే అధిక పతనం
- అధిక వడ్డీ రేట్లు, ద్రవ్యోల్బణం, ఉక్రెయిన్ యుద్ధ ప్రభావం



న్యూఢిల్లీ: చిన్న షేర్లు చితికిపోయాయి. ఒకపక్క ఉక్రెయిన్-రష్యా యుద్ధానికి తోడు వడ్డీరేట్లకు రెక్కలు రావడం, అధిక ద్రవ్యోల్బణం సెగ వాటికి బాగానే తగిలింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో స్మాల్‌క్యాప్ సూచీ 1,617 పాయింట్లు (5.73%) దిగజారడం దీనికి నిదర్శనం. ఇదే కాలంలో బీఎస్‌ఈ సెన్సెక్స్, బ్లూచిప్ షేర్లతో పోలిస్తే చిన్న షేర్ల పతనం భారీగా ఉండటం గమనార్హం.

తీవ్ర ఒడిదుడుకులు...

2022-23 ఏడాది భారత స్టాక్ మార్కెట్లను తీవ్రంగానే కుదిపేసింది. ప్రధానంగా తొలి క్వార్టర్‌లో ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్రతో దేశీ సూచీలు గడ్డు పరిస్థితులను ఎదుర్కొన్నాయని.. అయితే, రెండు, మూడు త్రైమాసికాల్లో తిరిగి పుంజుకోగలిగాయని మార్కెట్ నిపుణులు విశ్లేషించారు. అయితే, రష్యా-ఉక్రెయిన్ యుద్ధంతో పాటు ధరాభారం, అధిక వడ్డీరేట్ల వల్ల చిన్న షేర్లపై ఇన్వెస్టర్ల ఆసక్తి సన్నగిల్లిందని వారు అంటున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు ఒక్క రోజు మాత్రమే ఉన్న నేపథ్యంలో, గడిచిన ఏడాది కాలాన్ని చూస్తే... మిడ్ క్యాప్ సూచీ 1.12 శాతం (270 పాయింట్లు) మాత్రమే తగ్గగా, సెన్సెక్స్ 1.03 శాతం (608 పాయింట్లు) పడింది.

''ధరల కట్టడే లక్ష్యంగా ప్రపంచవ్యాప్తంగా సెంట్రల్ బ్యాంకులన్నీ వడ్డీరేట్లను జోరుగా పెంచడం మొదలుపెట్టాయి. దీంతో ఇన్వెస్టర్లు రిస్క్ తగ్గించుకోవడంపై దృష్టిపెట్టడంతో మార్కెట్లపై ప్రతికూల ప్రభావం పడింది'' అని మార్కెట్స్‌మోజో చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ సునీల్ దమానియా విశ్లేషించారు. కాగా, 2021-22లో మార్కెట్లు దుమ్మురేపడంతో స్మాల్ క్యాప్ సూచీ ఏకంగా 36.64 శాతం దూసుకెళ్లడం తెలిసిందే. ఇదే బాటలో మిడ్‌క్యాప్స్ 19.45 శాతం సెన్సెక్స్ 18.29 శాతం చొప్పున బలపడ్డాయి. ఏడాది తిరిగేసరికి చిన్న షేర్లు మళ్లీ వేగంగా కరిగిపోవడం గమనార్హం. ప్రధానంగా వడ్డీరేట్ల పెరుగుదలతో చిన్న, మధ్య స్థాయి కంపెనీలకు వడ్డీభారం పెరగడం వల్ల పెద్ద కంపెనీలతో పోలిస్తే అధిక ప్రభావం కనబడుతోందని దమానీ పేర్కొన్నారు.

చిన్న షేర్లకు దూరం...

ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితి నెలకొన్న తరుణంలో ఇన్వెస్టర్లు చిన్న షేర్లను అధిక రిస్క్‌తో కూడినవిగా పరిగణిస్తున్నారని స్వస్తికా ఇన్వెస్ట్‌మెంట్ రీసెర్చ్ హెడ్ సంతోష్ మీనా చెప్పారు. దీంతో వీటిలో పెట్టుబడులకు వెనుకాడటంతో పాటు తమ సొమ్మును వేగంగా వెనక్కి తీసుకోవడం వల్ల స్మాల్‌క్యాప్ సూచీ మిగతా వాటితో పోలిస్తే ఎక్కువగా పడిందన్నారు. ఫెడ్ భారీగా వడ్డీరేట్లను పెంచడం, ఉక్రెయిన్ యుద్ధం, అధిక ద్రవ్యోల్బణంతో మాంద్యం భయాలు నెలకొన్న కారణంగా గడిచిన ఏడాది కాలం మన మార్కెట్లు గడ్డు పరిస్థితులను చవిచూశాయని మాస్టర్ క్యాపిటల్ సర్వీసెస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అర్విందర్ సింగ్ నందా పేర్కొన్నారు. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీఐ) తిరోగమనం, అదానీ గ్రూప్ స్టాక్స్‌లో ఎడాపెడా అమ్మకాల వంటి అనేక అంశాలు కూడా మన మార్కెట్ ప్రతికూల పనితీరుకు కారణమని నందా అభిప్రాయపడ్డారు.

ఆఫీస్ స్పేస్ లీజింగ్ తగ్గింది



న్యూఢిల్లీ: ఈ ఏడాది జనవరి-మార్చిలో ఏడు ప్రధాన నగరాల్లో ఆఫీస్ స్పేస్ నికర లీజింగ్ 76.3 లక్షల చదరపు అడుగులు నమోదైంది. అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 34 శాతం తగ్గదల అని రియల్టీ కన్సల్టెంట్ జేఎల్ఎల్ ఇండియా నివేదిక తెలిపింది. '2023 జనవరి-మార్చిలో నికర లీజింగ్ ఆరు త్రైమాసికాల్లో కనిష్ట స్థాయికి పడిపోయింది. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితి, కొనసాగుతున్న హైబ్రిడ్ పని విధానం కారణంగా కార్పొరేట్ కంపెనీలు విస్తరణపై ఆచితూచి వ్యవహరించడమే ఇందుకు కారణం. రియల్ ఎస్టేట్ ఖర్చులకు తగ్గించుకోవడానికి కంపెనీలు కసరత్తు చేస్తున్నాయి. నికర లీజింగ్ చెన్నై 50 శాతం పడిపోయి 6 లక్షల చదరపు అడుగులు, హైదరాబాద్ 85 శాతం తగ్గి 5.2 లక్షలు, ముంబై 39% క్షీణించి 8.8 లక్షలు, పుణే 44% తగ్గి 12.8 లక్షల చదరపు అడుగులుగా ఉంది. ఢిల్లీ ఎన్‌సీఆర్ 47% దూసుకెళ్లి 19.6 లక్షల చదరపు అడుగులు, బెంగళూరు 14% పెరిగి 19.1 లక్షలు, కోల్‌కతా రెండింతలై 4.6 లక్షల చదరపు అడుగుల నికర లీజింగ్ నమోదైంది. ఈ నగరాల్లో నికర లీజింగ్ 2022 జనవరి-మార్చిలో 1.15 కోట్ల చదరపు అడుగులు ఉంది. సాంకేతిక పరిశ్రమలో మందగమనం ఉన్నప్పటికీ ఆఫీస్ స్పేస్ కోసం డిమాండ్ స్థిరంగా ఉంటుంది. 2022 మాదిరిగా ఈ ఏడాది 3.6-4 కోట్ల చదరపు అడుగులు అంచనా వేస్తున్నాం. మరో త్రైమాసికం తర్వాత ఆఫీస్ డిమాండ్ ఎలా ఉంటుందనే అంశంలో స్పష్టత వస్తుంది' అని జేఎల్ఎల్ వివరించింది.

భారత్ వృద్ధికి సంస్కరణల ఊతం

- ప్రపంచ బ్యాంక్ విశ్లేషణ
- ప్రపంచ ఆర్థిక వృద్ధిపై ఆందోళన
- 2030 నాటికి మూడు దశాబ్దాల కనిష్టానికి పడిపోతుందని అంచనా



న్యూఢిల్లీ: భారత్ ఇప్పటికే అమలు చేస్తున్న ప్రతిష్టాత్మకమైన సంస్కరణల ఎజెండాను మరింత వేగవంతంగా అమలు చేయడం వల్ల దేశ వృద్ధి వేగం మరింత పెరిగే అవకాశం ఉంటుందని ప్రపంచ బ్యాంక్ తాజా నివేదిక పేర్కొంది. ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలు ప్రపంచ ఆర్థికాభివృద్ధిపై తీవ్ర ప్రతికూలతకు దారితీసిందని బహుళ జాతి బ్యాంకింగ్ దిగ్గజం స్పష్టం చేసింది. ఆయా పరిస్థితులు ఎకానమీ పురోగతికి సంబంధించి ప్రపంచం ఒక 'దశాబ్దాన్ని' కోల్పోయే పరిస్థితిని సృష్టిస్తున్నాయని హెచ్చరించింది. 2030 నాటికి ప్రపంచ ఆర్థిక పురోగతి మూడు దశాబ్దాల కనిష్టానికి పడిపోయే అవకాశం ఉందని విశ్లేషించింది. 2000-2010 మధ్య ప్రపంచ స్థూల వృద్ధి రేటు దాదాపు 6.5 శాతం ఉంటే, 2020-30 మధ్య కాలానికి ఈ రేటు 2.2 శాతానికి పడిపోవచ్చని తెలిపింది. అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల విషయానికొస్తే, ఎకానమీ క్షీణత 2000- 2010 మధ్య సంవత్సరానికి సగటున 6 శాతం ఉంటే, ఈ దశాబ్దంలో మిగిలిన కాలంలో సంవత్సరానికి 4 శాతానికి పడిపోతుందని అభిప్రాయపడింది. ప్రపంచ ఆర్థిక సంక్షోభం- మాంద్యం పరిస్థితులు తలెత్తితే ఈ పతనం మరింత తీవ్రంగా ఉంటుందని హెచ్చరించింది. 'దీర్ఘకాలిక వృద్ధి అవకాశాలు తిరోగమనం -పోకడలు, అంచనాలు-విధానాల' పేరుతో విడుదలైన నివేదికలోని మరికొన్ని ముఖ్యాంశాలు.

- భారత్ తోటి దేశాల కంటే వేగవంతమైన పురోగతి సాధిస్తున్నప్పటికీ, సంస్కరణ ఎజెండాను ముఖ్యంగా తయారీ, మౌలిక రంగంలో వేగవంతంగా అమలు చేయడం ద్వారా మరింత ప్రయోజనం పొందవచ్చు. ముఖ్యంగా ఫైనాన్షియల్ రంగంలో ఒత్తిడులను తొలగించాల్సి ఉంది. ఈ విభాగంలో సవాళ్లు దేశ పురోగతికి బ్రేకులు వేస్తున్నాయి.
- 2000-10లో భారత్ పెట్టుబడుల సగటు వార్షిక వృద్ధి 10.5 శాతం అయితే, 2011-21లో ఈ రేటు 5.7 శాతానికి పడిపోయింది.
- విద్యుత్, రోడ్లు, రైలు నెట్‌వర్క్, వ్యాపారాలకు ఎదురవుతున్న అవరోధాలు, బ్యాంకింగ్ రంగంలో మొండిబకాయిల వంటి బలహీనతలు వంటి అంశాలు భారత్ ఎకానమీకి అవరోధాలుగా ఉన్నాయి.
- కోవిడ్-19తో ఎదురవుతున్న పరిణామాలు ప్రపంచ దీర్ఘకాలిక వృద్ధి అవకాశాలను తీవ్రంగా దెబ్బతీస్తోంది.
- భౌగోళిక ఉద్రిక్తతలూ ప్రపంచ వృద్ధి తిరోగమనానికి దారితీస్తున్నాయి.
- పెట్టుబడుల్లో వృద్ధి క్షీణిస్తోంది. ప్రపంచ శ్రామిక శక్తి మందకొడిగా పెరుగుతోంది. కరోనావైరస్ మహమ్మారి వల్ల మానవ వనరుల నైపుణ్య కొరత ఎదురవుతోంది. అంతర్జాతీయ వాణిజ్యంలో వృద్ధి.. జీడీపీ పురోగతికి తగిన విధంగా సరిపోవడం లేదు.

ట్రావెల్ ఆపరేటర్ల లాభాలకు బూస్ట్

రెండు ఆర్థిక సంవత్సరాల్లో 7 శాతం వరకు వృద్ధి: క్రిసిల్ నివేదిక



ముంబై: ప్రయాణాలకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో ప్రస్తుత, కొత్త ఆర్థిక సంవత్సరాల్లో ట్రావెల్, టూర్ ఆపరేటర్ల నిర్వహణ లాభాలు 6-7 శాతం వృద్ధి చెందనున్నాయి. అలాగే కోవిడ్ పూర్వ స్థాయితో పోలిస్తే 90 శాతం ఆదాయాన్ని రికవర్ చేసుకోనున్నాయి. క్రిసిల్ రేటింగ్స్ ఒక నివేదికలో ఈ అంశాలు వెల్లడించింది. కోవిడ్‌పరమైన ఆంక్షల వల్ల ప్రయాణాలు నిలిచిపోవడంతో రెండేళ్ల పాటు నష్టపోయిన ట్రావెల్, టూర్ ఆపరేటర్ల నిర్వహణ లాభదాయకత .. 2023, 2024 ఆర్థిక సంవత్సరాల్లో 6-7 శాతం మేర పుంజుకోవచ్చని పేర్కొంది. కార్పొరేట్, విహార ప్రయాణాలు మెరుగుపడటంతో ఆదాయాలూ పెరగగలవని క్రిసిల్ తెలిపింది. కోవిడ్ సమయం నుంచి అమలు చేస్తున్న ఆటోమేషన్, వ్యయ నియంత్రణ విధానాలు ఇందుకు దోహదపడగలవని పేర్కొంది. దీంతో వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఆదాయాలు తిరిగి మహమ్మారి పూర్వ స్థాయిని (2020 ఆర్థిక సంవత్సరం) దాటేయొచ్చని తెలిపింది. 2021, 2022 ఆర్థిక సంవత్సరాల్లో ట్రావెల్, టూర్ ఆపరేటింగ్ సంస్థలు వరుసగా 25.8%, 2.7% మేర నిర్వహణ నష్టాలు ప్రకటించాయి. నివేదికలోని మరిన్ని అంశాలు.

- నిర్వహణ పనితీరు, లిక్విడిటీ మెరుగ్గా ఉండటం, నికర రుణ రహితంగా ఉండటం వంటి అంశాలు ఆయా సంస్థలకు సహాయకరంగా ఉండనున్నాయి.
- స్వల్పకాలిక విహార యాత్రలకు.. (ముఖ్యంగా భారత్, ఆసియా ప్రాంతాలకు) ప్రాధాన్యం పెరుగుతోంది. యూరోపియన్ దేశాల వీసాల జారీ పుంజుకోవడంతో రాబోయే వేసవి సెలవుల కోసం బుకింగ్‌లు పెరుగుతున్నాయి. అయితే, విహార యాత్రల కోసం అమెరికాకు వెళ్లే ధోరణులు రికవర్ కావడానికి మరింత సమయం పట్టనుంది.
- అంతర్జాతీయ మందగమనం సుదీర్ఘంగా కొనసాగవచ్చన్న ఆందోళనలు తగ్గుముఖం పడుతుండటంతో రాకపోకలు మెరుగుపడనుండటం.. ఆదాయాల వృద్ధికి తోడ్పడనుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

31-3-2023	
విశాఖ	420-00
చిత్తూరు	458-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	408-00
విజయవాడ	408-00
రిటైల్ ధర (డజను)	66.00
30-3-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	390-00
వరంగల్	392-00
రిటైల్ ధర	4.50



సెమీస్‌లో రిత్విక్ చౌదరీ జోడీ

అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మైసూర్ ఓపెన్ పురుషుల టోర్నీలో డబుల్స్ విభాగంలో హైదరాబాద్‌కు చెందిన బొల్లిపల్లి రిత్విక్ చౌదరీ తన భాగస్వామి, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నిక్కీ పునాచాతో కలిసి సెమీఫైనల్లోకి అడుగు పెట్టాడు. మైసూర్‌లో గురువారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో టాప్ సీడ్ రిత్విక్-నిక్కీ ద్వయం 6-3, 7-6 (7/3)తో ఫ్లోరెంట్ బాక్స్ (ఫ్రాన్స్)-నితిన్ కుమార్ సిన్హా (భారత్) జంటపై గెలిచింది. 70 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రిత్విక్-నిక్కీ నాలుగు ఏస్‌లు సంధించడంతోపాటు ప్రత్యర్థి సర్వీస్‌ను ఒకసారి బ్రేక్ చేశారు. పురుషుల సింగిల్స్ విభాగంలో హైదరాబాద్‌కు చెందిన విష్ణువర్ధన్, రిషబ్ అగర్వాల్ పోరాటం ముగిసింది. ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో 'లండన్ ఒలింపియన్' విష్ణువర్ధన్ 3-6, 6-7 (6/8)తో ప్రజ్వల్ దేవ్ (భారత్) చేతిలో, రిషబ్ 1-6, 7-5, 4-6తో ఒర్లోవ్ వ్లాదిస్లావ్ (ఉక్రెయిన్) చేతిలో ఓడిపోయారు.

'పదహారేళ్ల' పండుగ...

నేటి నుంచి ఐపీఎల్ 16వ సీజన్ • మే 28న ఫైనల్ మ్యాచ్

తొలి పోరులో చెన్నైతో గుజరాత్ 'ఢీ' • రాత్రి గం.7:30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

ధోని చెన్నైలో ఆఖరిసారిగా ఆడి ఇక గుడ్‌బై చెబుతాడా? ఎన్నో రికార్డులు అందుకున్నా, ఇంకా చెంత చేరని ఐపీఎల్ ట్రోఫీని ఈ సారైనా కోహ్లి టచ్ చేయగలడా? ఐదుసార్లు చాంపియన్‌గా నిలిచిన తర్వాత గత ఏడాది అనూహ్యంగా ఆఖరి స్థానానికి పరిమితమైన ముంబైని ఈసారి రోహిత్ ఎంతవరకు తీసుకెళ్లగలడు? వరుసగా రెండో ఏడాది గుజరాత్ సత్తా చాటగలదా? పదిహేనేళ్లు ఆడినా టైటిల్ అందని ద్రాక్షగానే ఉన్న ఉత్తరాది టీమ్‌ల ఢిల్లీ, పంజాబ్ టీమ్‌ల అదృష్టం ఎలా ఉంటుంది? రేసులో మిగిలిన నాలుగు జట్లు హైదరాబాద్, కోల్‌కతా, లక్నో, రాజస్తాన్‌లు ఏమాత్రం పోటీనివ్వగలవు? ఈ అన్నింటికి సమాధానం అందించే ధనాధన్ పండుగకు మళ్లీ రంగం సిద్ధమైంది. వేసవి వినోదంలో ప్రపంచంలోనే అత్యుత్తమ క్రీడా సంబరంగా నిలిచిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) టి20 క్రికెట్ టోర్నమెంట్ 16వ సీజన్ వచ్చేసింది. క్రికెట్ అభిమానులంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్న లీగ్-2023కి నేడు అహ్మదాబాద్‌లో గుజరాత్ టైటాన్స్, చెన్నై సూపర్ కింగ్స్ జట్ల మధ్య మ్యాచ్‌తో తెర లేవనుంది.



ఐపీఎల్ ట్రోఫీతో తొమ్మిది జట్ల కెప్టెన్‌లు

అహ్మదాబాద్: ఐపీఎల్ కొత్త సీజన్‌కు విజిల్ మోగింది. మే 28 వరకు జరిగే ఈ టోర్నీలో మొత్తం 74 మ్యాచ్‌లు అభిమానులను అలరించనున్నాయి. అన్నింటికి మించి 2019 తర్వాత అన్ని జట్లకూ సొంతగడ్డపై మ్యాచ్‌లు ఆడే అవకాశం లభిస్తోంది. కరోనా కారణంగా గత మూడు సీజన్ల పాటు వేదికల విషయంలో షరతుల కారణంగా అందరికీ తమ సొంత మైదానాల్లో ఆడే అవకాశం రాలేదు. ఇప్పుడు భారీ స్థాయిలో, స్థానిక అభిమానుల మద్దతుతో పది జట్లూ హంగామాకు సిద్ధమయ్యాయి. మారిన ఆటగాళ్లు, నిబంధనల్లో స్వల్ప మార్పులతో పదహారో సీజన్ లీగ్ కాస్త కొత్తగా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. జాతీయ జట్లకు ఆడుతున్న కారణంగా దక్షిణాఫ్రికా, శ్రీలంకలకు చెందిన ఆటగాళ్లు కాస్త ఆలస్యంగా తమ ఐపీఎల్ టీమ్‌లతో చేరతారు. గురువారం అహ్మదాబాద్‌లో ఐపీఎల్ ట్రోఫీతో అన్ని జట్ల కెప్టెన్‌ల ఫొటో సెషన్ నిర్వహించారు. అస్వస్థత కారణంగా ఈ కార్యక్రమానికి ముంబై ఇండియన్స్ జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ హాజరుకాలేదు.

కొన్ని మార్పులు...

'ఇంపాక్ట్ ప్లేయర్' పేరుతో కొత్త నిబంధనను లీగ్ కౌన్సిల్ తీసుకొచ్చింది. దీని ప్రకారం తాము ముందుగా ప్రకటించిన నలుగురు సబ్‌స్టిట్యూట్ ఆటగాళ్లలో ఒకరిని మ్యాచ్ మధ్యలో 'ఇంపాక్ట్ ప్లేయర్'గా బరిలోకి దిగవచ్చు. అంటే బ్యాటింగ్ ఒకరు చేసిన తర్వాత అతని స్థానంలో తర్వాతి ఇన్నింగ్స్‌లో మరో బౌలర్‌ను తీసుకునే అవకాశం జట్టుకు ఉంది. అంటే పరిస్థితులను బట్టి ప్లేయర్‌ను మార్చుకునే ఈ సౌకర్యం జట్టుకు అదనపు ప్రయోజనాన్ని ఇస్తుంది. టాస్ తర్వాత తుది జట్టును ప్రకటించడం కూడా తొలిసారి అమలు చేస్తున్నారు. ఇటీవల దక్షిణాఫ్రికా టి20 లీగ్‌లో దీనిని వాడారు. అంటే టాస్ గెలిస్తే ఒక రకమైన టీమ్, టాస్ ఓడితే మరో రకమైన టీమ్‌తో సిద్ధమై కెప్టెన్ టాస్‌కు వెళ్లవచ్చు. అలాగే మహిళల ప్రీమియర్ లీగ్ తరహాలో వైడ్‌లు, నోబాల్స్ కోసం కూడా డీఆర్‌ఎస్‌ను వాడుకోవచ్చు.

ఫార్మాట్ ఇలా...

లీగ్ దశలో ప్రతీ టీమ్ 14 మ్యాచ్‌లు ఆడుతుంది. అయితే పది జట్లు ఉండటంతో గత ఏడాదిలాగే కాస్త భిన్నమైన ఫార్మాట్‌ను అమలు చేస్తున్నారు. 10 టీమ్‌లను రెండు గ్రూప్‌లుగా విభజించారు. ప్రతీ టీమ్‌లో తమ గ్రూప్‌లోని మిగిలిన నాలుగు జట్లతో ఒక్కో మ్యాచ్ చొప్పున... మరో గ్రూప్‌లోనే ఐదు జట్లతో రెండేసి మ్యాచ్‌లు ఆడుతుంది. గ్రూప్ 'ఎ'లో ముంబై, కోల్‌కతా, రాజస్తాన్, ఢిల్లీ, లక్నో ఉన్నాయి. ఉదాహరణకు ముంబై తమ గ్రూప్‌లోనే కోల్‌కతా, రాజస్తాన్, ఢిల్లీ, లక్నోలతో ఒకేసారి తలపడుతుంది. గ్రూప్ 'బి'లో ఉన్న చెన్నై, బెంగళూరు, గుజరాత్, పంజాబ్, సన్‌రైజర్స్ హైదరాబాద్ టీమ్‌లను రెండేసి సార్లు ఎదుర్కొంటుంది. అయితే ఎలా ఆడినా ప్రతీ టీమ్‌కు సొంతగడ్డపై 7 మ్యాచ్‌లు ఆడే అవకాశం లభిస్తోంది.

డిజిటల్ మీడియా మారింది...

గత సీజన్ వరకు మొబైల్‌లో ఐపీఎల్ మ్యాచ్‌లు చూసేందుకు స్టార్ స్పోర్ట్స్‌కే చెందిన 'హాట్ స్టార్'లో అవకాశం ఉండేది. అయితే ఈసారి మీడియా హక్కులు మారాయి. టీవీ ప్రసారాలు స్టార్ స్పోర్ట్స్‌లోనే వస్తాయి. డిజిటల్ హక్కులు మాత్రం అంబానీకి చెందిన వయాకామ్ 18 గ్రూప్ కొనుక్కుంది. దాంతో ఈసారి మొబైల్‌లో 'జియో సినిమా'లో ఐపీఎల్ మ్యాచ్‌లు చూడవచ్చు.

ప్రారంభోత్సవ వేడుకలు...

ఐపీఎల్‌లో 2018లో తర్వాత మళ్లీ ప్రారంభోత్సవ వేడుకలు జరగనున్నాయి. నేడు ప్రముఖ గాయకుడు అరిజిత్ సింగ్ పాటతో పాటు కత్రినా కైఫ్, టైగర్ ష్రాఫ్, రష్మిక మంధాన, తమన్నా డ్యాన్స్‌లతో అలరిస్తారు.

బుమ్రా మినహా...

ఈసారి లీగ్‌లో భారత రెగ్యులర్ ఆటగాళ్లతో పాటు అంతర్జాతీయ స్టార్లు బరిలోకి దిగుతున్నారు. స్టోక్స్, జోఫ్రా ఆర్చర్, కాన్వే, రూట్, హ్యారీ బ్రూక్ తదితరులు సత్తా చాటేందుకు సిద్ధమయ్యారు. అయితే గాయంతో అనూహ్యంగా దూరమైన వారిలో బుమ్రా అందరికంటే కీలక ఆటగాడు. అతను లేకుండా ముంబై బరిలోకి దిగుతుండగా, గాయంతో శ్రేయస్ అయ్యర్ కూడా తప్పుకున్నాడు.

క్వార్టర్ ఫైనల్లో సింధు, శ్రీకాంత్

స్పెయిన్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ





మాడ్రిడ్: ఈ ఏడాది తొలి టైటిల్ కోసం వేచి చూస్తున్న భారత స్టార్ షట్లర్స్ పీవీ సింధు, కిడాంబి శ్రీకాంత్ స్పెయిన్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 11వ ర్యాంకర్ సింధు 21-14, 21-16తో ప్రపంచ 38వ ర్యాంకర్ పుత్రి కుసుమ వర్దిని (ఇండోనేసియా)పై 36 నిమిషాల్లో విజయం సాధించింది. ఈ గెలుపుతో గత వారం స్విస్ ఓపెన్‌లో కుసుమ వర్దిని చేతిలో ఎదురైన ఓటమికి సింధు బదులు తీర్చుకుంది. ఇతర ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో భారత్‌కే చెందిన అష్మిత చాలిహా 15-21, 15-21తో యో జియా మిన్ (సింగపూర్) చేతిలో ఓడిపోగా... గాయం కారణంగా మాళవిక బన్సోద్ తన ప్రత్యర్థి కరోలినా మారిన్ (స్పెయిన్)కు వాకోవర్ ఇచ్చింది. పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో శ్రీకాంత్ 21-15, 21-12తో భారత్‌కే చెందిన సాయిప్రణీత్‌పై గెలుపొందాడు. భారత్‌కే చెందిన కిరణ్ జార్జి 17-21, 12-21తో జొహాన్సెన్ (డెన్మార్క్) చేతిలో, ప్రియాన్షు 14-21, 15-21తో తొమా జూనియర్ పొపోవ్ (ఫ్రాన్స్) చేతిలో, సమీర్ వర్మ 15-21, 14-21తో కాంటా సునెయామ (జపాన్) చేతిలో పరాజయం పాలయ్యారు. మహిళల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో సిక్కి రెడ్డి-ఆరతి (భారత్) జోడీ 12-21, 13-21తో రుయ్ హిరోకామి-యునా కాటో (జపాన్) ద్వయం చేతిలో... పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ఎం.ఆర్. అర్జున్-ధ్రువ్ కపిల (భారత్) జంట 16-21, 20-22తో షున్‌టారో మెజకి-హరుయ నిషిద (జపాన్) జోడీ చేతిలో ఓడిపోయాయి.

సన్‌రైజర్స్ తొలి మ్యాచ్‌కు కెప్టెన్‌గా భువనేశ్వర్



న్యూఢిల్లీ: ఐపీఎల్ టి20 క్రికెట్ టోర్నీలో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు తమ తొలి మ్యాచ్‌ను భారత పేస్ బౌలర్ భువనేశ్వర్ కుమార్ నాయకత్వంలో ఆడనుంది. ఈ సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు కొత్త కెప్టెన్‌గా నియమితుడైన దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ మార్క్‌రమ్ ఏప్రిల్ 3న భారత్‌కు రానున్నాడు. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 2న హైదరాబాద్‌లో రాజస్తాన్ రాయల్స్‌తో జరిగే తమ తొలి మ్యాచ్‌లో సన్‌రైజర్స్ జట్టుకు భువనేశ్వర్ సారథ్యం వహిస్తాడు. నెదర్లాండ్స్ జట్టుతో మార్చి 31న, ఏప్రిల్ 2న దక్షిణాఫ్రికా రెండు వన్డేలు ఆడనుంది. ఈ మ్యాచ్‌ల్లో మార్క్‌రమ్ బరిలోకి దిగనున్నాడు. 2013 నుంచి సన్‌రైజర్స్ జట్టుతో ఉన్న 33 ఏళ్ల భువనేశ్వర్ 2019లో ఆరు మ్యాచ్‌ల్లో, 2022లో ఒక మ్యాచ్‌లో కెప్టెన్‌గా వ్యవహరించాడు. భువనేశ్వర్ కెప్టెన్సీలో సన్‌రైజర్స్ రెండింటిలో గెలిచి, ఐదు మ్యాచ్‌ల్లో ఓడిపోయింది.

అమెరికాను గెలిపించిన సాయితేజ రెడ్డి



విండ్‌హోక్ (నమీబియా): వన్డే ప్రపంచ కప్ క్వాలిఫయింగ్ ప్లే ఆఫ్ టోర్నీలో అమెరికా జట్టు రెండో విజయం నమోదు చేసింది. యూఏఈతో గురువారం జరిగిన మ్యాచ్‌లో అమెరికా 5 వికెట్ల తేడాతో నెగ్గింది. భారత సంతతికి చెందిన 18 ఏళ్ల సాయితేజ రెడ్డి ముక్కామల (114 బంతుల్లో 120 నాటౌట్; 12 ఫోర్లు) అజేయ సెంచరీతో అమెరికాను గెలిపించాడు. ముందుగా యూఏఈ 50 ఓవర్లలో 9 వికెట్లకు 279 పరుగులు చేసింది. అనంతరం అమెరికా 49 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 281 పరుగులు చేసి విజయం సాధించింది.

హంపికి తొలి విజయం

న్యూఢిల్లీ: మహిళల గ్రాండ్‌ప్రి చెస్ టోర్నీలో భారత గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి తొలి విజయం సాధించింది. ఐదో రౌండ్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన హంపి 59 ఎత్తుల్లో నానా జాగ్‌నిడ్జె (జార్జియా)పై గెలిచింది. ఆంధ్రప్రదేశ్‌కే చెందిన హారిక 62 ఎత్తుల్లో బిబిసారా (కజకిస్తాన్) చేతిలో ఓడింది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.